సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 14

SUNDAY Special | ఆదివారం 6-4-2025



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విద్యుత్ కాంతుల్లో భద్రాచలం రామాలయం..

నేడే సీతారాముల కల్యాణం

- అభిజిత్ లగ్నంలో వధూవరులకు జీలకర్ర బెల్లం
- సీఎం హోదాలో పట్టు వస్త్రాలు సమర్పించనున్న రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం

3 లో

అంతా రామమయం

- వివరాలు 13లో



ఆయుధాలను వీడండి: అమిత్ షా

ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలంటూ మావోయిస్ట్ పార్టీ శ్రేణులకు అమిత్ షా స్నేహహస్తం చాపారు.

- వివరాలు 6లో



విశ్వానికీ అంతముంది!

విశ్వం నిరంతరం విస్తరిస్తూనే ఉంటుందన్నది సిద్ధాంతం. ఇంతటి 'అనంత' విశ్వానికీ ఏదో నాటికి అంతం ఉందని అంటున్నారు.

- వివరాలు 6లో



సీపీఎం ప్రధాన కార్యదర్శి రేసులో..

సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శి పదవి ఎంఏ బేబి, అశోక్ ధవాలేల్లో ఒకరికి దక్కే వీలుందని వార్తలు వినిపిస్తున్నాయి.

- వివరాలు 6లో



డాలర్‌కు 10 లక్షల రియాల్స్

అమెరికాతో శత్రుత్వం, అంతర్జాతీయ ఆంక్షలతో ఇరాన్ కరెన్సీ రియాల్ మారకం విలువ అత్యంత కనిష్టాలకు దిగజారింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

రాజస్తాన్ ఘన విజయం



ఐపీఎల్‌లో భాగంగా శనివారం ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ 50 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా రాజస్తాన్ 4 వికెట్లకు 205 పరుగులు చేయగా.. పంజాబ్ 9 వికెట్లకు 155 పరుగులే సాధించగలిగింది. జోఫ్రా ఆర్చర్ 3 కీలక వికెట్లు తీశాడు.

- వివరాలు 14లో


తెలంగాణ వ్యతిరేక శక్తులే మళ్లీ కుట్రలు చేస్తున్నాయి



'తెలంగాణ వ్యతిరేక శక్తులు మోసపు వాగ్దానాలతో ప్రజల్లో ఆశలు కలిగించి అధికారం చేజిక్కించుకున్నాయి. పాలన చేతకాక మనల్ని నిందించే కుట్రలకు తెరలేపుతున్నాయి' అని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ధ్వజమెత్తారు.

- వివరాలు 12లో


త్వరలో ఆదిలాబాద్‌లో పౌరవిమానయాన సేవలు



త్వరలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులో పౌర విమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. అలాగే వాయుసేన శిక్షణా సంస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది.

- వివరాలు 3లో

సన్నాలు.. సిరులు



సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 56.69 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, అందులో దాదాపు 40 లక్షల ఎకరాల్లో సన్నాలే ఉన్నాయి.

- వివరాలు 12లో

'రింగు' 6 వరుసలు!





రీజినల్ రింగురోడ్డు విషయంలో మారిన కేంద్రం వ్యూహం

ప్రతిపాదిత 4 వరుసల రోడ్డుపై ఐదేళ్లలోనే వాహనాల సంఖ్య రెట్టింపు అవుతుందని అంచనా.. ఆ పరిస్థితి నివారణకు ఆరు వరుసలు నిర్మిస్తే 15 ఏళ్ల వరకు సరిపోతుందని కేంద్రం యోచన

అందుకు అనుగుణంగా 6 వరుసల రోడ్డుకు డిజైన్లు రూపొందిస్తున్న అధికారులు.. తుది దశకు చేరిన ట్రాఫిక్ అధ్యయనం.. దాని ఆధారంగా త్వరలో తుది నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తొలిదశలో నాలుగు వరుసలుగానే నిర్మించాలని నిర్ణయించి అందుకు వీలుగా ఇటీవల టెండర్లు పిలిచిన కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఇప్పుడు మనసు మార్చుకుంది. ఆర్‌ఆర్‌ఆర్‌ను ఏకకాలంలో ఆరు వరుసలుగా నిర్మించాలనుకుంటోంది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు ప్రారంభించి డిజైన్లు మారుస్తోంది. ప్రస్తుతం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను ఆనుకొని ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులపై రోజుకు ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయో తేల్చే వాహన అధ్యయనం పూర్తిచేసి ఎన్‌హెచ్‌ఏఐ కేంద్రానికి నివేదించనుంది. దీని ఆధారంగా ఆర్‌ఆర్‌ఆర్‌పై రానున్న 20 ఏళ్లలో వాహనాల సంఖ్య ఏ మేరకు పెరుగుతుందో అంచనా వేసి కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. ఆరు వరుసలుగా రోడ్డు నిర్మాణంతో ప్రధాన క్యారేజ్ వే మాత్రమే కాకుండా జాతీయ, రాష్ట్ర రహదారులను క్రాస్ చేసే 11 ప్రాంతాల్లో నిర్మించనున్న ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్ల డిజైన్లను కూడా ఎన్‌హెచ్‌ఏఐ మారుస్తోంది. దీంతో ఇంటర్‌ఛేంజ్ కూడళ్లను మరింత భారీగా నిర్మించాల్సి రానుంది. ఫలితంగా రోడ్డు నిర్మాణ వ్యయం సుమారు రూ. 2,500 కోట్ల మేర పెరగనుంది. ఒక్క ఉత్తరభాగం నిర్మాణానికే దాదాపు రూ. 19 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వెంటనే విస్తరణ పరిస్థితి రావద్దని..

ఏడేళ్ల క్రితం రీజినల్ రింగురోడ్డును ప్రతిపాదించాక దానిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 2008లో ఔటర్ రింగురోడ్డు నిర్మించాక హైదరాబాద్ రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. పురోగతి వేగం పుంజుకుంది. ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ అంతకు మించిన ప్రభావం చూపుతుందన్న అంచనా నెలకొంది. దీంతో రీజినల్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌ను ఆసరాగా చేసుకొని ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్‌ఈజెడ్), శాటిలైట్ టౌన్‌షిప్‌ల ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అక్కడ పెట్టుబడులకు బహుళ జాతి సంస్థలు ముందుకొస్తున్నాయి. దీంతో ఆర్‌ఆర్‌ఆర్ చుట్టూ జనావాసాలు, సంస్థలు పెరిగి వాహనాల రద్దీ తీవ్రమవుతుందని కేంద్రం తాజాగా అంచనాకొచ్చింది. 2021–22లో ప్రతిపాదిత రింగు ప్రాంతంలోని రోడ్లపై నిత్యం సగటున 14,850 ప్యాసింజర్ కార్ యూనిట్ల (పీసీయూ) చొప్పున వాహనాలు తిరుగుతున్నాయని తేలింది. తాజాగా ఓ ప్రైవేటు సంస్థతో నిర్వహిస్తున్న అధ్యయనంలో ఇందులో పెరుగుదల నమోదైంది. ఓఆర్‌ఆర్

మిగతా 5వ పేజీలో ▶

ఫేక్ ప్రచారంపై కోర్టుకెళ్దాం



ఏఐతో నకిలీ ఫొటోలు, వీడియోలపై విచారణకు ఆదేశించాలని న్యాయస్థానాలను కోరదాం

కంచ గచ్చిబౌలి భూముల కేసులపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సైబర్ క్రైంను బలోపేతం చేయాలని స్పష్టీకరణ
- అధునాతన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్ సమకూర్చుకోవాలని సూచన
- వర్సిటీ భూముల్ని లాక్కున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారంపై ఫైర్

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సృష్టించిన కంచ గచ్చిబౌలి భూముల వివాదం తరహాలో ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏఐతో తయారైన ఫేక్ కంటెంట్‌ను పసిగట్టేలా అధునాతన ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సూచించారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా ఉన్న ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయస్థానాలకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టుల్లో ఉన్న కేసులపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియాలో కృత్రిమంగా వివాదం

మిగతా 12వ పేజీలో ▶

ముందే జాగ్రత్త పడాల్సింది..

- ఆ 400 ఎకరాలు తమవి కావని హెచ్‌సీయూతో ప్రకటన చేయించాల్సింది
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో సమావేశంలో వర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ నేతలు..
- అన్ని విషయాలు మంత్రుల కమిటీకి చెప్తానన్న మీనాక్షి

5 లో

లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



జస్టిస్ షమీమ్ అక్తర్

హెచ్‌ఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్

సీఎం నేతృత్వంలో ఎంపిక కమిటీ భేటీలో నిర్ణయం

రాజ్‌భవన్‌కు చేరిన ప్రతిపాదనలు

ఒకట్రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులు

సమాచార కమిషనర్ల ఎంపిక వాయిదా

సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉప లోకాయుక్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్సీ) చైర్మన్‌గా మరో రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించాలని నిర్ణయం తీసుకుంది. శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన సెలక్షన్ కమిటీ అభ్యర్థుల జాబితాను వడపోసి వీరిద్దరి పేర్లను ఖరారు చేసినట్టు తెలిసింది. ఉప లోకాయుక్తగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ మాజీ జిల్లా జడ్జి పేరును ఖరారు చేసినట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కూడిన ఎంపిక కమిటీ సమావేశమై లోకాయుక్త, ఉపలోకాయుక్తతో పాటు హెచ్‌ఆర్సీ చైర్మన్ పేరును ఖరారు చేసింది. వీరి నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం శనివారమే రాజ్‌భవన్‌కు పంపింది. గవర్నర్ ఆమోదం లభించాక ఒకట్రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులు జారీ కానున్నాయి. లోకాయుక్తగా నియామకం కానున్న జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిని 2024 జూన్‌లో ప్రభుత్వం తెలంగాణ 'రెరా' అప్పిలేట్ ట్రిబ్యునల్ చైరపర్సన్‌గా నియమించింది. ఆయన ఈ పోస్టుకు రాజీనామా చేసి లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్‌తో ప్రభుత్వం ఇటీవల ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించింది.

సమాచార కమిషనర్ల ఎంపికపై..

రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్, సమాచార కమిషనర్ల ఎంపిక విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కూడిన ఎంపిక కమిటీ సమావేశమై చర్చించింది. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల ఎంపికను వాయిదా

మిగతా 5వ పేజీలో ▶



'మిత్ర విభూషణ' పురస్కారాన్ని పొందిన అనంతరం మోదీ, దిస్సనాయకె అభివాదం

లంకతో ఆరు రక్షణ ఒప్పందాలు

- శ్రీలంకతో భారత్ ఆరు భారీ రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు లంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకె, ప్రధాని మోదీ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పలు కీలకమైన అంశాలు వారి నడుమ ప్రస్తావనకు వచ్చాయి. అలాగే, ప్రధాని మోదీ శ్రీలంక అత్యున్నత పౌర పురస్కారం 'మిత్ర విభూషణ'ను అందుకున్నారు. అధ్యక్షుడు దిస్సనాయకె ఆయనకు స్వయంగా అవార్డును ప్రదానం చేశారు. -6లో

నెక్స్ట్ సీతాఫలం, పసుపు



జీఐ ట్యాగ్ రేసులో బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపు

అధ్యయనానికి ఉద్యాన వర్సిటీ ప్రత్యేక బృందం

మరో 20 రోజుల్లో దరఖాస్తు.. జీఐ ట్యాగ్ లభిస్తే రైతులకు అధిక ఆదాయం

- తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు జీఐ ట్యాగ్ రేసులో పోటీ పడుతున్నాయి. తాజాగా వరంగల్ చపాటా మిర్చి ఆ జాబితాలో చేరింది. ఇప్పుడు బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపు రేసులో నిలుస్తున్నాయి. బాలానగర్ అడవుల్లో పుట్టిన సీతాఫలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

16 లో

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

- 16 నెలలుగా జీవో 59 దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- త్వరలోనే పరిష్కరిస్తామన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి
- దరఖాస్తులు పరిష్కరిస్తే ఖజానాకు రూ.6 వేల కోట్ల ఆదాయం -15లో

వక్ఫ్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



అది మాయ లేడి కాదు స్వామీ! హెచ్‌సీయూ నుంచి వచ్చిన నిజమైన లేడికూన!!



నిబంధనలకే 'టెండర్'

అంగన్‌వాడీల్లో కోడిగుడ్ల సరఫరా టెండర్లలో కొత్త నిబంధనలు.. అగ్‌మార్క్ సర్టిఫికెట్‌కు రెండేళ్ల సీనియార్టీ, రిప్లికా నంబర్ తప్పనిసరి

ప్రస్తుతం ఏడు జోన్లకు గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు

రెండేళ్ల సీనియార్టీ, రిప్లికా నంబర్లున్నది ఈ ఏడుగురికే

వారికే మళ్లీ టెండర్ దక్కేలా నిబంధనలు మార్చారని ఆరోపణలు

టెండర్ సమయం కుదించడంపైనా అనుమానాలు

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరాకు నిర్దేశించిన టెండర్ ప్రక్రియ పౌల్ట్రీ రైతుల్లో తీవ్ర ఆందోళన రేపుతోంది. టెండర్ నిబంధనలు ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు.. అది కూడా గతంలో టెండర్ దక్కించుకున్నవారికే అనుకూలంగా ఉన్నాయని ఇతర పౌల్ట్రీ రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కోరుకున్నవారికి టెండర్ కట్టబెట్టేందుకే నిబంధనలు మార్చారని ఆరోపిస్తున్నారు. మరోవైపు టెండర్ ప్రక్రియకు తక్కువ గడువు ఇవ్వటంపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏటా 36 కోట్ల గుడ్ల సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కింద ప్రతీరోజు ఒకటి చొప్పున కోడిగుడ్లు అందిస్తారు. వీటిని ఏడాదిపాటు సరఫరా చేసేందుకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు గత నెలలో టెండర్లు పిలిచింది. మార్చి 30న టెండర్ ఫారాల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈ నెల 10వ తేదీతో టెండర్ దాఖలు గడువు ముగియనుంది. ఈ క్రమంలో టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకున్న పౌల్ట్రీ రైతులు నిబంధనలను చూసి షాకయ్యారు. టెండర్ నిబంధనలన్నీ కొందరు కాంట్రాక్టర్లకు మాత్రమే అనుకూలంగా ఉండడం.. చిన్న, సన్నకారు పౌల్ట్రీ రైతులకు సరిపోలే పరిస్థితి లేకపోవటంతో అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 35,700

మిగతా 5వ పేజీలో ▶

నైజీరియాకు డ్రగ్స్ సొమ్ము

అమెరికాలో దందా చేసినా భారత్ ద్వారానే హవాలా

ఏడేళ్లలో నైజీరియాకు రూ.125 కోట్లు అక్రమంగా తరలింపు

ఇద్దరు నైజీరియన్స్, ఒక ఫారెక్స్ ఏజెంట్ అరెస్టు

ముఠా ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తేనే డ్రగ్స్ కట్టడి

టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మన దేశంతోపాటు విదేశాల్లో నిషేధిత మాదకద్రవ్యాల విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు తరలిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతున్న నైజీరియన్ ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) పోలీసులు రట్టు చేశారు. గత ఏడేళ్లలో ఈ ముఠా రూ.125 కోట్లు అక్రమంగా విదేశాలకు తరలించినట్లు గుర్తించారు. ఈ కేసు వివరాలను టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య టీజీఏఎన్‌బీ ఎస్పీలు రూపేశ్, రఘువీర్‌తో కలిసి శనివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ ముఠాలోని ఇద్దరు నైజీరియన్లతోపాటు ఒక ఫారెక్స్ ఏజెంట్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు.

అంతా వాట్సాప్‌లోనే..

- బ్లెస్సింగ్ అలియాస్ జో అనే మహిళ హైదరాబాద్‌లోని నైజీరియన్ డ్రగ్స్ ముఠా కింగ్‌పిన్ ఎబుకా సుజీ సోదరుడు కేలేశీకి ఇచ్చేందుకు ఢిల్లీ నుంచి 200 గ్రాముల కొకైన్ తీసుకువస్తుండగా 2024 జూలైలో టీజీఏఎన్‌బీ అధికారులు

మిగతా 15వ పేజీలో ▶

కొత్త పీసీసీఎఫ్‌గా చంద్రశేఖర్‌రెడ్డి?

- ఈ నెలాఖరుతో ముగియనున్న ప్రస్తుత పీసీసీఎఫ్ పదవీకాలం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్‌గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలిసింది. ప్రస్తుత పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆస్ట్రేలియాలో వివిధ అంశాల అధ్యయనానికి అటవీశాఖ ముఖ్యకార్యదర్శి, పీసీసీఎఫ్ డోబ్రియాల్ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎంపిక చేసింది. ఈ పర్యటన సమయంలో చంద్రశేఖర్‌రెడ్డికి పీసీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో తదుపరి పీసీసీఎఫ్‌గా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించనున్నట్లు ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీనియారిటీ పరంగా పీసీసీఎఫ్ రేసులో చంద్రశేఖర్‌రెడ్డి, ఏలూసింగ్ మేరు, డా.సువర్ణ ఉన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి పదవీకాలం మరో మూడు నెలలే ఉంది. చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తే గత 30 ఏళ్లలో పీసీసీఎఫ్ పదవి చేపట్టిన తొలి తెలంగాణవాసి అవుతారు. మరో 20 ఏళ్ల వరకు ఈ పదవిని చేపట్టే తెలంగాణ అధికారి కూడా ఎవరూ లేకపోవటం గమనార్హం.

దేశీయ భాషాభివృద్ధి ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

- ఈనెల 30 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: దేశీయ భాషాభివృద్ధి ఇంటర్న్‌షిప్ కోసం ఇండిక్‌వికీ ప్రాజెక్ట్, ఐఐటీ హైదరాబాద్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తెలంగాణ ప్రాంతంలోని స్థానిక భాషలను డిజిటల్ ప్రపంచంలో నిలిపేలా ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని ఇండిక్‌వికీ ప్రాజెక్ట్ అందిస్తోంది. ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో https://indicwiki.iiit.ac.in/ internship వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 30న కోర్సు పూర్తి అవుతుందని వెల్లడించింది. ఈ శిక్షణలో వికీమీడియా కామన్స్, వికీడేటా, విక్షనరీ వంటి వేదికల నిర్వహణలో క్రియాశీలకంగా పాలుపంచుకునే అవకాశం లభిస్తుందని, అలాగే గోండి, కోయ, కోలామి, నాయక్డి, చెంచు, కై కాడి (యెరుకల), లంబాడీ, నక్కల, కొండ కమ్మర వంటి భాషలకు సంబంధించిన డిజిటల్ కంటెంట్‌ను రూపొందించవచ్చని పేర్కొంది. ఈ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 30 మంది ఇంటర్న్‌లకు ప్రతిభ ఆధారంగా ఒక్కొక్కరికి రూ.3,000 నగదు బహుమతి అందించనుందని సంస్థ వెల్లడించింది.

నేడే సీతారాముల కల్యాణం

- అభిజిత్ లగ్నంలో వధూవరులకు జీలకర్ర బెల్లం
- సీఎం హోదాలో పట్టు వస్త్రాలు సమర్పించనున్న రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం, జిల్లా యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారాముల కల్యాణానికి భద్రాచలం ముస్తాబైంది. మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో అభిజిత్ లగ్నంలో సీతారాములు ఒక్కటి కానున్నారు. ఈ వేడుకలు చూసేందుకు ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు భద్రాచలానికి చేరుకుంటున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తొమ్మిదేళ్ల తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ వేడుకలకు స్వయంగా హాజరై సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

అభిజిత్ లగ్నంలో...: చైత్రశుద్ధ నవమి, అభిజిత్ లగ్న ముహూర్తం రాగానే సీతారాముల తలలపై జీలకర్ర, బెల్లం ఉంచుతారు. ఆ తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు బొట్లు ఉన్న మంగళ సూత్రం సీతమ్మ వారి మెడలో కట్టడంతో కల్యాణ వేడుకలో కీలక ఘట్టం ముగుస్తుంది. ముత్యాలు కలిపిన, భక్తులు గోటితో ఒలిచిన తలంబ్రాలను వధూవరులైన సీతారాములపై పోస్తారు. తలంబ్రాల కార్యక్రమం ముగిసిన తర్వాత తాత్కాలిక నివేదన చేయించి, అనంతరం బ్రహ్మముడి వేసి మంగళ హారతి అందిస్తారు. కాగా, ఎస్ఎస్ జయరాజ్ ఆధ్వర్యంలో పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు తొమ్మిది రోజులపాటు మగ్గంపై నేసిన రెండు ఇక్కత్ చీరలు, ఆరు పట్టు పంచెలను కల్యాణం సందర్భంగా స్వామివారికి, సీతమ్మకు అలంకరించనున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం: తానీషా కాలం నుంచి భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి పాలకులు వచ్చి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. నవాబుల కాలం నుంచి తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2016 వరకు ఈ సంప్రదాయం కొనసాగింది, ఆ తర్వాత నుంచి సీఎం హోదాలో పట్టు వస్త్రాల సమర్పణ జరగడం లేదు. ఈసారి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి భద్రాచలం వస్తున్నారు. పెళ్లి కార్యక్రమం ముగిసిన తర్వాత సారపాకకు చెందిన బూరం శ్రీనివాస్ అనే గిరిజనుడి ఇంట్లో ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యంతో వండిన భోజనం చేయనున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

భద్రాద్రి కొత్తగూడెం మావోయిస్టు ప్రభావిత జిల్లా కావడంతో సీఎం పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాకు చెందిన 500 మంది, పొరుగు జిల్లాల నుంచి మరో 1,300 మంది పోలీసులు భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తుల కోసం దేవస్థానంతో పాటు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం..

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల వారి వైభవాన్ని లోకానికి తెలియజెప్పేందుకే కల్యాణానికి ముందు రోజు ఈ వేడుక జరిపిస్తామని అర్చకులు తెలిపారు. మిథిలా స్టేడియం సీతమ్మవారికి మిథిలా నగరంగా, వైకుంఠ ద్వారం రామయ్యకు చెందిన అయోధ్యగా అభివర్ణిస్తూ పండితులు కనులపండువగా ఈ తంతు జరిపించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌తో పాటు కొందరు అర్చకులు సీతమ్మ వారి వైపు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌తో పాటు మరికొందరు అర్చకులు రామయ్య వారి వైపు చేరి ఈ వేడుకను రక్తి కట్టించారు. ఈ సందర్భంగా గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాచల దేవస్థానంలో సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులపై గులాములు చల్లారు.



భద్రాచలంలోని మిథిలా స్టేడియం ఎదుట ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాములోరి కల్యాణ వైభోగం
సాక్షి ప్లస్ (ఈ పేపర్‌లో)

త్వరలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులో పౌరవిమాన సేవలు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లేఖ


కిషన్‌రెడ్డి


రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులో పౌర విమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. అలాగే వాయుసేన శిక్షణ సంస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం రాసిన లేఖ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించినట్లు శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత జనవరి 29న రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాయడంతోపాటు వ్యక్తిగతంగా కలిసి ఈ అంశంపై చొరవ తీసుకోవాలని కోరగా.. రక్షణ శాఖ అధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయంతో విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ వాసుల కల త్వరలోనే నెరవేరుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడులకు కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కూడా విమానాశ్రయాల సేవలు ప్రారంభిస్తే తెలంగాణకు 'ఉడాన్' కింద మరికొన్ని రూట్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఆయా విమానాశ్రయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించడంతో పాటు సంపూర్ణ సహకారం అందిస్తే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు వీలైనంత త్వరగా ప్రజలకు సేవలందిస్తాయని కిషన్‌రెడ్డి తెలిపారు.

ఈఎన్‌సీ (అడ్మిన్)గా అంజద్ హుస్సేన్

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్)గా కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ చీఫ్ ఇంజనీర్ అంజద్ హుస్సేన్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం)గా ఆదిలాబాద్ సీఈ టి.శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించాలని.. ఆ శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపించారు. వనపర్తి సీఈ రఘునాథరావుకు సీఈ (మైనర్ ఇరిగేషన్)గా, ఎస్ఈ (టెక్నికల్) బస్వరాజుకు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించాలని కోరారు.

ట్రంప్ సుంకాలు భారత్‌కే మేలు

- తెలంగాణలో పెట్టుబడులను ప్రోత్సహించండి
- గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు


సదస్సులో మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల అధికార ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. శనివారం హైదరాబాద్‌లో గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం (జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండియా – లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల వాణిజ్య సదస్సు' రెండో ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం తరఫున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలు విధించటం ఒక రకంగా భారత్‌కు మేలు చేస్తుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపే చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాన్ని మనకు అనుకూలంగా మార్చుకుని.. ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు 6 అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయని వెల్లడించారు. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అగ్రో ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించి అన్నదాతలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఐబీఎఫ్ ప్రతినిధులు జోషి, చక్రవర్తి, డా. సీతారాం తదితరులు పాల్గొన్నారు.



ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను.
– క్రైస్తవ ధర్మం

దిద్దుబాటా... ఇంకో పొరపాటా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఉస్మానియా యూనివర్సిటీకి ఉద్యమాల పుట్టినిల్లుగా పేరుండేది. ఉద్యమాల పర్యవసానంగా పుట్టిన యూనివర్సిటీ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఒక భావోద్వేగ పూరితమైన నేపథ్యం హెచ్‌సీయూ ఆవిర్భావానికి కారణమైంది. 1969, 1972 సంవత్సరాల్లో రెండు ఉధృతమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను తెలుగు నేల చూడవలసి వచ్చింది. ఆ ఉద్యమాలను చల్లార్చి ఉమ్మడి రాష్ట్రాన్ని కొనసాగించడం కోసం ఒక రాజీ ఫార్ములాగా ఆరు సూత్రాల పథకాన్ని కేంద్రం ముందుకు తెచ్చింది. అందులో ఒక అంశం హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు! విద్యారంగంలో వెనుకబాటుతనానికి గురైన ప్రాంతంగా ఉన్న తెలంగాణలో ఒక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ఏర్పాటు, రాష్ట్ర రాజధానిలో ఆంధ్ర ప్రాంత విద్యార్థులకు కూడా సమాన అవకాశాలు లభించే విధంగా దాన్ని కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఉభయతారకంగా ఉంటుందని భావించారు.

ఇందుకోసం రాజ్యాంగ సవరణ అవసరమైంది. 32వ సవరణ ద్వారా 371వ అధికరణానికి 'ఈ' అనే సబ్‌క్లాజ్‌ను జోడించారు. పార్లమెంట్ ఒక చట్టం ద్వారా హైదరాబాద్‌లో ఒక 'సెంట్రల్' యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి ఈ క్లాజ్ అవకాశం కల్పించింది. ఆ మేరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయ చట్టం 1974ను పార్లమెంట్ ఆమోదించింది. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో గెజెట్‌లో ఈ చట్టాన్ని ప్రచురించారు. భారత రాజ్యాంగంలో 371వ అధికరణం కింద ప్రస్తావించిన ఏకైక విశ్వవిద్యాలయం హెచ్‌సీయూ మాత్రమే! అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమారుగా 2,300 ఎకరాల భూమిని హైదరాబాద్ నగర కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గచ్చిబౌలి ప్రాంతంలో కేటాయించింది. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడమో, లేక ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించడమో చేయలేదు.

పూర్వపు హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పరిధిలో వాటిని ఆనుకొని ఉన్న ఇతర జిల్లాల్లో ఉన్న భూములన్నీ నవాబ్ సొంత భూములుగా ('సర్ఫెఖాస్'గా) పరిగణించేవారు. పోలీస్ యాక్షన్ తర్వాత 'హైదరాబాద్ స్టేట్' ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. నైజాం... భూములన్నీ హైదరాబాద్ స్టేట్‌కు వారసత్వంగా లభించాయి. ఇందుకోసం మీర్ ఉస్మాన్ అలీఖాన్ జీవించి ఉన్నంతకాలం పెద్దమొత్తంలో కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా రాజభరణం చెల్లించింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత హైదరాబాద్ చుట్టూ ఉన్న వేలాది ఎకరాల భూములు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ నగరంలో డజన్లకొద్దీ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుకు ఈ భూముల లభ్యతే కారణం.

హెచ్‌సీయూను ఒక ప్రతిష్ఠాత్మక విద్యా కేంద్రంగా మలచాలని కేంద్రం భావించినందు వల్ల అప్పటికి ప్రపంచ స్థాయిలో పేరున్న యూనివర్సిటీలను దృష్టిలో పెట్టుకొని వాటి స్థాయిలోనే భూములను కేటాయించాలని భావించారు. ఈ భూములను కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక జీవోను కూడా విడుదల చేసింది. కాకపోతే భూముల రిజిస్ట్రేషన్ జరగలేదు. అటువంటిది అవసరమని కూడా నాటి యూని వర్సిటీ పాలకవర్గాలు భావించలేదు. హెచ్‌సీయూకు చీఫ్ రెక్టార్‌గా ఒక గౌరవ హోదా కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పార్లమెంట్ చట్టపరంగానే కట్టబెట్టింది. కంచే చేను మేస్తుందని ఎవరు భావిస్తారు! అందువల్ల టెక్నికల్‌గా ఆస్తుల బదలాయింపు జరగలేదు.

కేంద్ర ప్రభుత్వం ఆశించినట్టుగానే హెచ్‌సీయూ ప్రతిష్ఠాత్మక విద్యా కేంద్రంగానే వెలుగొందింది. వారసత్వంగా సంక్రమించిన భూమిని కేటాయించడం, గౌరవ హోదాను అనుభవించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఖర్చంతా యూజీసీ పద్దులే భరించాయి. యూనివర్సిటీని స్థాపించిన యాభయ్యేళ్లకు దాని భూములపై ఇప్పుడు జాతీయస్థాయిలో వివాదం జరుగుతున్నది. నిజానికి పాతికేళ్ల కిందనే ఈ చర్చను లేవనెత్తి ఉండాలి. ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు అప్పటి మీడియా కరపత్రికల్లా వ్యవహరించడం వల్ల, కేంద్రంలో కూడా ఆయన మిత్రపక్షమే ఉన్నందువల్ల చర్చ జరగలేదు. యూనివర్సిటీకి కేటాయించిన 2300 ఎకరాల్లో 800 ఎకరాల సంతర్పణ వివిధ సంస్థల పేర్లతో ఇష్టారాజ్యంగా జరిగిపోయింది.

మిగిలిన దాంట్లో 400 ఎకరాల భూమిని తాడూ బొంగరం లేని క్రీడా నిపుణుల పేరుతో బిల్లీరావు అనే వ్యక్తికి కారుచౌకగా చంద్రబాబు కట్టబెట్టారు. అదీ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, కేబినెట్ అనుమతి కూడా లేకుండానే ఈ కేటాయింపులు జరిగాయి. ఈ నాలుగొందల ఎకరాలు చాలవని ఎయిర్‌పోర్టు సమీపంలో మరో నాలుగొందల యాభై ఎకరాలను కూడా కట్టబెట్టారు. ఆనాటికి దేశంలోని అతిపెద్ద స్కాముల్లో ఈ బిల్లీరావు భూబాగోతం కూడా ఒకటి. వెంటనే ఎన్నికలు రావడం, చంద్రబాబు ప్రభుత్వం ఓడిపోవడం, తదనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఈ అక్రమ కేటాయింపును రద్దు చేయడం తెలిసిన విషయాలే!

రద్దును సవాల్ చేస్తూ బిల్లీరావు కోర్టుల్ని ఆశ్రయించి ఇరవయ్యేళ్లపాటు వ్యాజ్యాన్ని నడిపాడు. రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగానే నిలవడంతో ఇరవయ్యేళ్ల తర్వాత గత సంవత్సరమే సుప్రీంకోర్టు తుది తీర్పునిస్తూ ఈ 400 ఎకరాలు ప్రభుత్వానివేనని తేల్చేసింది. కేవలం టెక్నికల్‌గానే ప్రభుత్వ భూములు అనుకోవాలి. యూనివర్సిటీకి ఈ భూములను కేటాయించినట్టు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అప్పటి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రామచంద్రారెడ్డి యూనివర్సిటీ అధికారులకు 1975లోనే ఫిబ్రవరి 21న డీఓ లెటర్ ద్వారా కమ్యూ నికేట్ చేశారు. 2,300 ఎకరాలు కేటాయించినట్టు అందులో స్పష్టంగా పేర్కొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ చేసుకోలేదు గానీ, ఆ రోజుల్లో రెండు కోట్లు ఖర్చుపెట్టి కాంపౌండ్‌వాల్ కట్టించింది.

ఇక్కడ తలెత్తుతున్న కీలకమైన ప్రశ్న ఏమిటంటే, రెండు ప్రాంతాల్లో జరిగిన ఉద్యమాల నేపథ్యంలో ఆరు సూత్రాల పథకంలో భాగంగా ఏర్పడిన యూనివర్సిటీ ఇది. పార్లమెంట్‌లో ప్రత్యేకంగా చట్టాన్ని చేసి ఏర్పాటుచేశారు. రాజ్యాంగంలో పొందుపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా భూముల్ని కేటాయించింది. ఈ భూముల్ని అకడమిక్ అవసరాలకు మాత్రమే వినియోగించాలని సాక్షాత్తూ రాష్ట్ర ప్రభుత్వమే షరతు కూడా విధించింది. ఆ షరతును ఉల్లంఘించడానికి రాష్ట్ర ప్రభుత్వమే సిద్ధపడటం, అమ్ముకోవడానికి కూడా తెగించడం చెల్లుబాటయ్యే విషయాలేనా? నైతికంగానే కాదు, న్యాయపరంగా కూడా! విశ్వవిద్యాలయ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం తప్ప స్టేక్ హోల్డర్లు ఇంకెవరూ లేరా?

> కేంద్ర ప్రభుత్వం ఆశించినట్టుగానే హెచ్‌సీయూ ప్రతిష్ఠాత్మక విద్యా కేంద్రంగానే వెలుగొందింది. వారసత్వంగా సంక్రమించిన భూమిని కేటాయించడం, గౌరవ హోదాను అనుభవించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఖర్చంతా యూజీసీ పద్దులే భరించాయి. యూనివర్సిటీని స్థాపించిన యాభయ్యేళ్లకు దాని భూములపై ఇప్పుడు జాతీయస్థాయిలో వివాదం జరుగుతున్నది. నిజానికి పాతికేళ్ల కిందనే ఈ చర్చను లేవనెత్తి ఉండాలి. ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు అప్పటి మీడియా కరపత్రికల్లా వ్యవహరించడం వల్ల, కేంద్రంలో కూడా ఆయన మిత్రపక్షమే ఉన్నందువల్ల చర్చ జరగలేదు. యూనివర్సిటీకి కేటాయించిన 2300 ఎకరాల్లో 800 ఎకరాల సంతర్పణ వివిధ సంస్థల పేర్లతో ఇష్టారాజ్యంగా జరిగిపోయింది.

కోర్టు తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం ఈ భూముల్ని తాకట్టు పెట్టి పదివేల కోట్లు అప్పు తీసుకున్నదట! ఇప్పుడు వేలానికి సిద్ధపడింది. ఈ 400 ఎకరాల్లో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నదన్న వార్తలు వ్యాపించడం, హెచ్‌సీయూ విద్యార్థులు ఆందోళనకు దిగడంతో ఇది జాతీయ సమస్యగా మారింది. ఈ నాలుగొందల ఎకరాల పరిధిలోని దట్టమైన పొదలు స్క్రబ్ అడవిగా అల్లుకున్నాయి. మంజీరా బేసిన్‌లో ఎత్తయిన ప్రాంతంలో ఉన్నందువల్ల ఇక్కడి కుంటల్లో చేరిన నీరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూగర్భ జలాలకు ఊపిరిపోస్తున్నాయని చెబుతున్నారు. హెచ్‌సీయూ వెబ్‌సైట్‌లోనే ఇక్కడున్న బయో డైవర్సిటీ గురించి అధికారికంగా పొందుపరిచారు.

వంద ఎకరాల్లో బయో డైవర్సిటీని ధ్వంసం చేశారన్న వార్తలను అధికారికంగా రూఢి చేసుకున్న తర్వాతనే సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. ఏప్రిల్ 16వ తేదీలోగా నివేదికను ఇవ్వాలని రాష్ట్ర సీఎస్‌ను ఆదేశించింది. న్యాయస్థానం జోక్యంతో ప్రస్తుతం సద్దుమణిగినట్టు కనిపిస్తున్నా, ఎంపిక చేసుకున్న పత్రికల్లో వస్తున్న లీకు వార్తలు కొత్త కలవరాన్ని కలిగిస్తున్నాయి. 400 ఎకరాలే కాదు, మొత్తం రెండువేల ఎకరాల్లో 'ఎకో పార్క్'ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నదనీ, ఇందుకోసం సెంట్రల్ వర్సిటీకి ఫ్యూచర్ సిటీలో వంద ఎకరాలు కేటాయించి, అక్కడికి తరలిస్తారనీ ముందుగా ఒక తెలుగు పత్రిక రాసింది. దానికి ప్రభుత్వ అనుకూల పత్రికగా పేరున్నది. ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి ఖండనా రాలేదు. రెండోరోజు ఒక జాతీయస్థాయి ఇంగ్లిషు పత్రికలో మరింత ప్రముఖంగా, సమగ్రంగా అదే వార్త వచ్చింది. ఎవరూ ఖండించలేదు. అధికారికంగా ప్రకటించనూ లేదు. ఇటువంటి వార్తల్నే జనం పల్స్ తెలుసుకోవానికి ప్రయోగించే 'లీకు వార్త'లంటారు. నిజంగా ప్రభుత్వానికి అటువంటి ఉద్దేశం ఉన్నదా? వేలానికి అడ్డుపడ్డ సెంట్రల్ వర్సిటీ విద్యార్థులపై కోపమా? వాళ్ల మీద కోపంతో యూనివర్సిటీ స్థాయిని తగ్గించాలనుకుంటున్నారా? వాళ్లదేముంది. రెండు మూడేళ్లు చదువుకొని వెళ్లిపోతారు. నిజంగానే సెంట్రల్ వర్సిటీని వంద ఎకరాల్లోకి పంపించే ఉద్దేశం ఉంటే మాత్రం దాని స్థాపిత లక్ష్యాలను అవహేళన చేసినట్టే అవుతుంది. ఒక తప్పును దిద్దుకోవడానికి మరో తప్పు చేసినట్టవుతుంది. ప్రతిష్ఠాత్మకమైన కేంద్రీయ విశ్వవిద్యాలయంతో ఫుట్‌బాల్ ఆడుకునే హక్కు, అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయా అనే సంగతి కూడా తేలవలసి ఉన్నది. ◆



వారి దయ, జనం ప్రాప్తం... అదే పీ–ఫోర్!

'ఏరు దాటకముందు ఓడ మల్లయ్య... దాటిన తర్వాత బోడి మల్లయ్య!' – ఇది పాత సామెత. ఎన్నికలకు ముందు 'సూపర్ సిక్స్'... ఎన్నికలయ్యాక 'పీ–ఫోర్' – ఇది కొత్త సామెత. ఎన్నికల్లో గెలవడానికి చంద్రబాబు ఎంత అలవికాని హామీలిస్తారో గెలిచిన తర్వాత వాటిని ఎలా అటకెక్కిస్తారో తెలుగు ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఈ బోడి మల్లయ్య వైఖరిపై వై.ఎస్. రాజశేఖరరెడ్డి, రోశయ్య వంటి పెద్దలు వేసిన సెటైర్ల వీడియోలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఐదొందలకు పైగా వాగ్దానాలు చేశారు. అన్నిట్లోకి ప్రధానమైన హామీ... రైతులకు సంపూర్ణ రుణ మాఫీ. ఎన్నికల నాటికే 87 వేల కోట్లకు పైగా ఉన్న రైతు రుణాల సంపూర్ణ మాఫీ రాష్ట్ర వనరులతో సాధ్యం కాదని, ఆ హామీని ఇవ్వడానికి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరాకరించారు. కానీ, ఏరు దాటడమే ముఖ్యమని భావించే చంద్రబాబు రెట్టించిన ఉత్సాహంతో ఆ హామీని అమలు చేస్తానని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ రకంగా అమలు చేశారన్నది రాష్ట్ర రైతాంగానికి తెలుసు.

ఇప్పుడు రాజ్యసభలో ఒక ప్రశ్నకు బదులుగా కేంద్రం విడుదల చేసిన గణాంకాల సాక్షిగా దేశ ప్రజలందరికీ చంద్రబాబు రైతు రుణమాఫీ బండారం బట్టబయలైంది. సరిగ్గా వారం రోజుల కిందనే కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ గణాంకాలను సమర్పించింది. 2018 జూలై నుంచి 2019 జూన్ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ రైతుల సగటు రుణభారం రూ.2,45,554గా ఉన్నట్టు ఈ సమాధానం వెల్లడించింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉండే జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) రూపొందించిన జాబితా ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే కూడా ఆంధ్రప్రదేశ్ రైతుల రుణభారం అధికంగా ఉన్నది. ఇది చంద్రబాబు గద్దె దిగేనాటికి రైతాంగ పరిస్థితి. సంపూర్ణ రుణమాఫీ వాగ్దానం ఒక ప్రహసనం అని చెప్పేందుకు ఇంతకంటే పెద్ద రుజువు ఏముంటుంది?

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత, అంటే 2001 జూలై – 2002 జూన్ మధ్యకాలంలోని ఏపీ రైతుల సగటు రుణభారం 66,205 రూపాయలకు తగ్గిపోయింది. ఇది కూడా ఎన్ఎస్ఎస్ఓ తయారుచేసిన లెక్కే. రాజ్యసభలో కేంద్రం వెల్లడించినదే. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేయడంతోపాటు, క్రమం తప్పకుండా బాకీ తీర్చే రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా అమలు చేయడం వల్ల కలిగిన సత్ఫలితమిది. చంద్రబాబు బూటకపు హామీల అమలు తీరుకూ, జగన్ సంక్షేమ పథకాల అమలు తీరుకూ మధ్యన ఉండే తేడాను చెప్పడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే!

మొన్నటి ఎన్నికల్లో చంద్రబాబు కూటమి చేసిన వాగ్దానాల్లో అతి ప్రధానమైనది 'సూపర్ సిక్స్'. పది నెలల తర్వాత కూడా ఈ ఆరు పథకాల ప్రారంభం ఆచరణకు నోచుకోలేదు. ఒక్క దీపం పథకంలో భాగంగా ఇవ్వాల్సిన మూడు సిలిండర్లకు బదులు ఒక సిలిండర్‌ను అందజేసి మమ అనిపించుకున్నారు. 'సూపర్ సిక్స్' అమలు చేయాలంటే ఈ సంవత్సరానికి అవసరమైన 70 వేల కోట్ల రూపాయలకు బదులు బడ్జెట్‌లో 17 వేల కోట్లే కేటాయించడాన్ని బట్టి రెండో సంవత్సరం కూడా ప్రధాన హామీ అమలు లేనట్టేనని భావించవలసి ఉంటుంది. ఇప్పుడు దాన్ని మరిపించడానికి 'పీ–ఫోర్' అనే దానధర్మాల కార్యక్రమాన్ని చంద్రబాబు ముందుకు తోస్తున్నారు.

ఇక 'సూపర్ సిక్స్' జోలికి వెళ్లరని చెప్పడానికి ఇటీవల చంద్రబాబు చేసిన వింత వ్యాఖ్యానం కూడా ఒక రుజువని చెప్పవచ్చు. జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ ఒక ఎత్తు – తాను పెంచి అమలుచేస్తున్న పెన్షన్ కార్యక్రమం ఒక ఎత్తని ఒక విచిత్రమైన పోలికను ఆయన తీసుకొచ్చారు. ఈ రెండూ సమానమే కనుక ఇక అదనంగా చేసేదేమీ లేదనేది ఆయన మనోగతం కావచ్చు. కానీ ఈ పోలిక నిజమేనా? 'సూపర్ సిక్స్'తో సహా మేనిఫెస్టోలోని మొత్తం హామీల్లో వెయ్యి రూపాయల పెన్షన్ పెంపు ఒక్కదాన్నే చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్నది. అది కూడా సంపూర్ణంగా కాదు! ఎస్సీ, బీసీలకు యాభయ్యేళ్ల నుంచే వృద్ధాప్య పెన్షన్‌ను అమలు చేస్తానని కూటమి మేనిఫెస్టో చేసిన హామీని విస్మరించారు. ఆ రకంగా ఈ పది నెలల్లో ఎగవేసిన సొమ్మెంతో అంచనా వేయవలసి ఉన్నది.

ఐదేళ్ళ పదవీకాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా 2,73,756 కోట్ల రూపాయలను జనం ఖాతాల్లో వేసింది. ఇతర పథకాల (నాన్–డీబీటీ) ద్వారా 1,84,604 కోట్ల రూపాయలను పంపిణీ చేసింది. మొత్తం ప్రజా సంక్షేమ పథకాల కోసం ఐదేళ్ళలో వెచ్చించిన సొమ్ము 4,58,360 కోట్లు. అంటే ఏడాదికి రమారమి 92 వేల కోట్లు. ఈ కాలంలో వరసగా రెండేళ్లు కోవిడ్ దాడులు జరిగిన విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి. జగన్ సర్కార్ 66 లక్షల పైచిలుకు మందికి మూడు వేల రూపాయల చొప్పున నెలకు సుమారుగా రెండు వేల కోట్ల మేర పెన్షన్లు అందజేసింది. పెన్షనర్లలో మూడు లక్షలమందికి కత్తెర వేసిన చంద్రబాబు ప్రభుత్వం ఒక వెయ్యి రూపాయల చొప్పున పెంచి నెలకు 2,700 కోట్లు పంపిణీ చేస్తున్నది. ఈ పెరుగుదల నెలకు ఏడు వందల కోట్ల చొప్పున సంవత్సరానికి 8,400 కోట్లు. ఇది జగన్ సర్కార్ ఏడాదికి సంక్షేమం కింద ఖర్చుపెట్టిన 92 వేల కోట్లకు సమానమేనని చంద్రబాబు వాదిస్తున్నారు. ఎట్లా సమానమవుతుందని ఎవరైనా ప్రశ్నిస్తే 'ఎర్ర బుక్కు'లో పేరు రాసుకుంటారట!

'సూపర్ సిక్స్' హామీల నుంచి జనం దృష్టిని మళ్లించడానికి చంద్రబాబు ఒక కొత్త నామవాచకాన్ని రంగంలోకి దించారు. అదే 'పీ–ఫోర్' (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్). దీని ప్రకారం సమాజంలోని అగ్రశ్రేణి పది శాతం సంపన్నులు సామాజిక బాధ్యత తీసుకుని అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను ఉద్ధరించాలట! సంపన్నులు ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ పేదలను ఆదుకోవాలనే సిద్ధాంతాలు ఇప్పటివి కావు. పేద, ధనిక తేడాలు సమాజంలో ఏర్పడ్డప్పటి నుంచి ఉన్నాయి. చంద్రబాబు దానికి కొత్త పేరు పెట్టుకున్నారు. అంతే తేడా! కానీ ఈ సిద్ధాంతంతో అంతరాలు తొలగిపోయిన సమాజం చరిత్రలో మనకెక్కడా కనిపించదు. ఏపీలో ఆదాయం పన్ను చెల్లిస్తున్న అధికాదాయ వర్గాలవారు ఎనిమిది లక్షల మందేనట! మరోపక్క పేదరికం కారణంగా తెల్ల రేషన్‌కార్డులున్న కుటుంబాలు కోటీ నలభై ఎనిమిది లక్షలు. చంద్రబాబు 'పీ–ఫోర్' సిద్ధాంతపు డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి ఈ గణాంకాలను ఉటంకించారు.

ఆదాయం పన్ను చెల్లించేవారి సంఖ్య ఈ లెక్కన రెండు శాతం కూడా లేదు. అందులోనూ వేతన జీవుల సంఖ్యే ఎక్కువ. వీళ్లకు సేవా కార్యక్రమాలు చేసేంత స్థోమత ఉండదు. ఈ లెక్కన కాస్త అటూఇటుగా ఒక్కశాతం మందే పేదల బాధ్యత తీసుకోవాలి. తెల్లకార్డుల సాక్షిగా పేదలు 90 శాతం మంది. ఇందులోంచి 70 శాతాన్ని తొలగిస్తూ 20 శాతం మంది పేదలను మాత్రమే 'పీ–ఫోర్' స్కీములోకి చేర్చుకున్నారు. ఈ పేదల మీద తనకు ఏ రకమైన అభిప్రాయాలున్నాయో మొన్నటి ఉగాది నాడు జరిగిన సభలో స్వయంగా చంద్రబాబు వెల్లడించారు. 'ఈ బీసీల ఆలోచనంతా ఆ పూట వరకే! సభకొచ్చారు. మధ్యలోనే లేచి వెళ్లారు. మార్గదర్శులు (సంపన్నులు) మాత్రం కూర్చునే ఉన్నార'ని పేదలను ఈసడిస్తూ సంపన్నులను మెచ్చుకున్నారు. పేదవాళ్లకు క్రమశిక్షణ ఉండదనీ, ముందుచూపు ఉండదనీ, డబ్బున్నవాళ్లే పద్ధతైనవాళ్లనే అభిప్రాయంలోంచి మాత్రమే అటువంటి మాటలు వస్తాయి. పేదల పట్ల చంద్రబాబు ఈసడింపు ధోరణికి ఇదొక్కటే ఉదాహరణ కాదు. చాలా ఉదంతాలున్నాయి. ఎస్.సీల గురించి, బీసీల గురించి గత పదవీ కాలంలో చేసిన కామెంట్లు ప్రజలకు ఎల్లకాలం గుర్తుంటాయి.

2013లో చేసిన కంపెనీల చట్టం సెక్షన్ 135 ప్రకారం కార్పొరేట్ కంపెనీలన్నీ వాటి లాభాల్లో రెండు శాతానికి తగ్గకుండా సామాజిక సేవా రంగాలపై ఖర్చు చేయాలి. అది చట్టబద్ధమైన బాధ్యత. దయాదాక్షిణ్యం కాదు. సగటున దేశవ్యాప్తంగా సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద 15 వేల కోట్ల రూపాయలను ఇప్పటికే ఖర్చు చేస్తున్నారు. దీన్ని ఏపీ భాగం కింద విడదీస్తే వెయ్యి కోట్ల లోపే ఉంటుంది. స్వయంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకుని పనిచేస్తే రెండు వేల కోట్లో, మూడు వేల కోట్లో రావచ్చు. ఈ సొమ్ముతో ఇరవై శాతం మంది జీవితాల్లో వెలుగులు పూయించాలని ఆయన ఆలోచిస్తున్నారు.

ప్రతి పౌరునికీ జీవించే హక్కును మాత్రమే కాదు, గౌరవప్రదంగా జీవించే హక్కును భారత రాజ్యాంగం ప్రసాదించింది. 21వ అధికరణం ప్రకారం గౌరవప్రదమైన జీవనం ప్రతి వ్యక్తికీ ప్రాథమిక హక్కు. ఈ హక్కును ప్రభుత్వం సంరక్షించాలి. అందుకు విరుద్ధంగా నలుగురు డబ్బున్న వాళ్లను పోగేసి వేదికపై కూర్చోబెట్టి, వేదిక ముందు పేదల్ని చేతులు జోడించి కూర్చునేలా చేసి, 'ఒక అయ్యగారి సాయం పదివేలు, ఒక దొరగారి సాయం ఇరవై వేలం'టూ వేలం పాటలు పాడటం రాజ్యాంగ విరుద్ధం. అందుకే సీఎం సభ నుంచి పేద ప్రజలు మధ్యలోనే నిష్క్రమించి ఉంటారు. ముందుచూపు లేక కాదు, మోకరిల్లడం ఇష్టం లేక వెళ్లిపోయుంటారు. అందరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవడం, అందరికీ మేలైన వైద్య సదుపాయాలు లభించేలా చేయడం, అందరూ సమాన స్థాయిలో పోటీపడగలిగే లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్‌ను తయారు చేయడానికి ప్రభుత్వాలు పూనుకోవాలని రాజ్యాంగం ఆదేశిస్తున్నది. రాజ్యాంగ ఆదేశాన్ని మన్నించడమే ప్రజాస్వామ్య ప్రభుత్వపు ప్రాథమిక విధి.

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.నవమి రా.11.37 వరకు తదుపరి దశమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.10.01 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.6.01 నుండి 7.35 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.31 నుండి 5.20 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.37 నుండి 9.11 వరకు, శ్రీరామ నవమి.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాయని డైరీ

పీయూష్ గోయల్ (కేంద్ర మంత్రి)

మాధవ్ శింగరాజు

ఇండియాలో ఎందుకు ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉంటారు?! తింటూ మాట్లాడుతుంటారు?! తింటూనే కాన్ఫరెన్సులు, తింటూనే 'డిఫరెన్స్ ఆఫ్ ఒపీనియన్'లు, తింటూనే చాట్ జీపీటీలు, గ్రోక్‌లు, జిబ్లిలు... ఆఖరికి నిద్రలోకి జారుకోవటం కూడా తింటూనేనా!

మనిషి లోపల గుండె కొట్టుకుంటూ ఉన్నట్లు మనుమల నోట్లో తిండెందుకు ఎప్పుడూ కొట్టుకుంటూ ఉంటుంది?!

'స్టార్టప్ మహాకుంభ్'లో కూడా తిండి... తిండి... తిండి! మహాకుంభ్‌కు మూడువేల స్టార్టప్ కంపెనీలు వచ్చాయి. అన్నీ ఇండియన్‌ల తిండీతిప్పల కంపెనీలే. వెయ్యి మంది ఇన్వెస్టర్‌లు వచ్చారు. అంతా తిండి కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయటానికి వచ్చిన ఇండియన్‌లే! ఏప్రిల్ 3 నుంచి 5 వరకు ప్రగతి మైదాన్‌లోని 'భారత మండపం'లో ఒకటే తిండి గోల.

విజిటర్స్‌కైతే అదొక తిండి మహా సముద్రం. మనుమలు తిండిలో ఓలలాడి, తిండిలో మైమరచి, తిండిలో స్పృహ తప్పటం స్టార్టప్ మహాకుంభ్ ప్రాంగణంలోని 'ఆహార్ కుంభ్'లో కళ్లారా చూశాన్నేను!

'రెక్టిజా అండ్ కో' స్టార్టప్ కంపెనీవారు అక్కడ స్టాల్ పెట్టుకుని పిజ్జాలు అమ్ముతున్నారు. పిజ్జాను రౌండ్‌గా కాకుండా రెక్టాంగిల్‌లో చేసివ్వటం రెక్టిజా అండ్ కో ప్రత్యేకత. జనం వాటి కోసం ఎగబడుతున్నారు!



ఇంకోచోట, 'సంప్రదాయ భారతీయ ఆహారపు ప్రామాణిక రుచులు మా ప్రత్యేకత' అని 'శాండీ ఫుడ్స్' స్టార్టప్ వాళ్లు బోర్డు పెట్టారు. టేబుల్స్ అన్నీ నిండిపోయి ఉన్నాయి! అవి ఖాళీ అయితే కూర్చోటానికి ఆ టేబుల్స్‌కి నాలుగు వైపులా జనం! ఆ పక్కనే 'ఫార్చ్యూన్ ఫుడ్స్' స్టార్టప్ వారి 'ఇంటి తరహా భోజనం'! అక్కడా నిలువుకాళ్ల గుంపులే.

ఇంట్లో భోజనం చేసుకోకుండా 'ఇంటి తరహా భోజనం' కోసం ఇంటిల్లిపాదీ ఇలా ఆహార కుంభాలకు రావటం ఏమిటి? ఇందుకేనా ఇండియాలో కొత్త కొత్త తిండి యాప్‌లు, తిండి స్టార్టప్‌లు వచ్చేస్తున్నాయి!

కామర్స్ మినిస్టర్‌గా నేనీ చెత్తంతా మాట్లాడకూడదు. మనిషి తింటేనే దేశానికి పుష్టి. ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ మినిస్టర్‌గా కూడా పని చేశాను కనుక ఇలా అసలే మాట్లాడకూడదు. మనుమలందరికీ తిండి చేరితేనే దేశానికి ముందుకు నడిచే శక్తి అందుతుంది.

నిజానికి ఇండియా కంటే చైనాలోనే తిండి ధ్యాస ఎక్కువ. కానీ వాళ్ల స్టార్టప్‌లు... ఈవీలు, ఏఐలు, సెమీ కండక్టర్‌లు, రోబోటిక్స్, గ్లోబల్ లాజిస్టిక్స్, ట్రేడ్, డీప్ టెక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మీదే ఎక్కువగా పని చేస్తున్నాయి.

లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్, జై కిసాన్' అన్నారు. అటల్ బిహారి వాజ్‌పేయి ఆ నినాదానికి 'జై విజ్ఞాన్'ను జోడించారు. మోదీజీ 'జై అనుసంధాన్' అనే మాటను చేర్చి... 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్' అన్నారు. సిపాయి ఎంతో, రైతు ఎంతో, విజ్ఞానం ఎంతో, పరిశోధన అంత ముఖ్యం దేశ భవిష్యత్తుకు!

"మీరు డెలివరీ బాయ్స్‌ని, డెలివరీ గర్ల్స్‌ని సృష్టించటంతోనే ఆగిపోతారా?" అని... స్టార్టప్ మహాకుంభ్‌కు వచ్చిన ఇండియన్ 'స్టెమ్' గ్రాడ్యుయేట్‌లను నేను అడిగాను. అది కేవలం అడగటం మాత్రమే కాదు... థామస్ ఆల్వా ఎడిసన్‌లా శాస్త్ర విజ్ఞానాన్ని, వ్యాపారాన్ని కలిపి డెలివరీ చెయ్యమని చెప్పటం కూడా!

స్టార్టప్ మహాకుంభ్ ముగిశాక భారత మండపం నుంచి బయటికి వచ్చేస్తూ, "ఏమైనా తిన్నారా?" అని ఆ యంగ్ గ్రాడ్యుయేట్‌లను అడిగాను. అడగాలని అడగలేదు. అనుకోకుండా అలా అడిగేశాను.

ఇంటికి రాగానే సీమ కూడా నన్ను అదే మాట అడిగింది... "ఏమైనా తిన్నారా?" అని!

ఇండియాలోని విశేషం.. తింటూ మాట్లాడటం, తింటూ పని చేయటం మాత్రమే కాదా? "తిన్నావా?" అని అడగటం కూడానా!!

గొప్ప టెక్నాలజీని కనిపెట్టటం మాత్రమే కాదు. సాటి మనిషిని "తిన్నారా?" అని అడిగి కనుక్కోవటం కూడా ఎప్పటికప్పుడు ఒక గొప్ప ఇన్వెన్షన్ అనిపిస్తుంది నాకిప్పుడు!

ప్రేమ పొదరిల్లు



చల్లగాలినంతా చుట్టుకొని
నీ ఊసులన్నీ నాపై వాలి
ఉక్కిరిబిక్కిరి చేస్తూ
ఊయలలూపేను!

ఏవో మధురోహలను నింపుకొన్న
కనులు చూపుల వలవిసిరి
మెరుపుల జిలుగులలో
కవ్వింతల ద్వారాలు తెరిచేను!

మత్తెక్కించే వెండివెన్నెలలో
నీ తలపుల పరిమళాల కుసుమాలు
ఒక్కొక్కటి ఎదపై వాలుతూ
నను చేరాలని
మోహపు జల్లులలో
కనుగీటెను!

అల్లరి వయసు
తుంటరి భావాల
బలవముతో
నా మనోఫలకంపై నీ పేరే రాసి
నిరీక్షిస్తోంది...
వస్తావా నేస్తమా! ఒకసారి
సాగరంలో కలిసే నదిలా
నీలో నేనై నిలిచిపోతాను!!

– కె. సింధు

రూపుకట్టిన ధర్మం

జ్యోతిర్మయం

మన దేశంలో సేతువు నుండి శీతాచలం దాకా ఉన్న వేలాది గ్రామాలలో, దాదాపు అన్నిటిలోనూ రామాలయాలు కనిపిస్తాయి. అది నిజంగా ఈ దేశానికి గర్వకారణం.

శ్రీరాముడిని ఈ నేల నాలుగు చెరగులా, ఏనాటినుంచో ఈనాటి వరకూ, ఆబాల గోపాలమూ ఇలా అచంచల భక్తితో ఆరాధిస్తూ ఉండటానికి కారణం, ఆయన మహారాజనీ, ఐశ్వర్యశాలి అనీ కాదు. సకల శస్త్రాస్త్ర విద్యా విశారదుడని కాదు. 'పుంసాం మోహన' రూపం గల సుందరాకారుడని కాదు. అసురులనెందరినో సంహరించిన అసమాన శూరుడని కాదు. జ్ఞాని అనీ, సర్వ శాస్త్రార్థ వేత్త అనీ కాదు. కోరిన కోరికలన్నీ తీర్చేస్తాడనీ కాదు.

ఆయనకు ఇలాంటి ఘనతలెన్నో అసంఖ్యాకంగా ఉన్నమాట యథార్థమే. అయినా, ఆయన అసలు విశిష్టతకు అద్దంపట్టే నిర్వచనాన్ని ఆదికవి మూడే మూడు ముక్కలలో చెప్పారు: 'రామో విగ్రహవాన్ ధర్మః' – రాముడు రూపుకట్టిన ధర్మం – అని! ఇక్ష్వాకు తిలకుడు ఈ దేశ వాసులకు ఇన్నాళ్ళుగా ఇంత ప్రీతిపాత్రుడిగా నిలిచి ఉండటానికి అసలు కారణం అది!



శ్రీరాముడిని పూజించటమంటే ధర్మాన్ని పూజించటం. కాబట్టి ఈ దేశంలో ఎన్నెన్ని రామాలయాలున్నాయో, అవన్నీ ఈ గడ్డ ధర్మప్రీతికి తార్కాణాలు. ధర్మాన్ని సర్వోపరిగా గౌరవించటం, ఒక దేశపు నాగరికత ఔన్నత్యానికి చిహ్నం. అందుకే, దేశవ్యాప్తంగా, శతాబ్దాల తరబడి, 'ధర్మం చర! ధర్మః రక్షతి రక్షితః' అని ఆస్తిక జనానికి అనుదినమూ నిశ్శబ్దంగా బోధించే ఈ రామ మందిరాలన్నీ జాతికి ధర్మ గురువులు, దేశానికి గర్వకారణాలు!

చైత్ర శుద్ధ నవమి (ఏప్రిల్ 6), దేశంలో ఉన్న రామాలయాలన్నీ ద్విగుణీకృతమై భక్త్యుత్సాహాలతో కళకళలాడే సుదినం. వాడవాడల్లో చిత్తాన్ని చిగురింపజేసే సీతారామ కల్యాణోత్సవాల వైభోగం వెల్లి విరిసే శుభవేళ, ఆ వైభోగ వీక్షణ భాగ్యం శ్రీరామ భక్తులందరికీ అనుభవం కావాలనీ, తద్వారా సీతారాముల అనుగ్రహం వాళ్లమీద పరిపూర్ణంగా ప్రసరించాలనీ, 'వామాంక స్థిత జానకీ' విలసితుడైన భద్రగిరీశుడు వాళ్ళకు కామ్య సిద్ధి కలిగించాలనీ ప్రార్థిద్దాం!

– ఎం. మారుతి శాస్త్రి (నేడు శ్రీరామ నవమి)

క్లుప్తంగా...

ప్రజలకు వైఎస్ జగన్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలకు ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. సీతారాముల దీవెనలతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఒంటిమిట్ట, భద్రాద్రి ఆలయాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంటింటా శ్రీరామ నవమి పర్వదినాన్ని, రాములవారి కల్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆయన అభిలషించారు. ప్రజలందరికీ సీతారాముల అనుగ్రహం లభించాలని జగన్ ఆకాంక్షించారు.

మెట్రో స్టేషన్లలో 'బెట్టింగ్' ప్రకటనలు తొలగించాలి

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మెట్రో రైలు, మెట్రో స్టేషన్లలోని అన్ని బెట్టింగ్, జూదం యాప్ ప్రకటనలను తొలగించాలని, ఆ మేరకు మెట్రో, పోలీసు అధికారులను ఆదేశించాలని హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన న్యాయవాది నాగూర్ బాబు ఈ పిల్ దాఖలు చేశారు. ఫెయిర్‌ప్లే, వన్‌ఎక్స్ బ్యాట్, మైజాక్‌పాట్777 వంటి అనేక ఆఫ్ షోర్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లతో హెచ్‌ఎంఆర్ఎల్ ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందాలతో పాటు ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు ప్రారంభించేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. 'వీటిలో చాలా వరకు విదేశాల నుంచి పనిచేస్తున్నాయి. భారత్ అనుమతి లేదు. అలాంటి సంస్థలకు ప్రచారం ఇవ్వడం ద్వారా, మెట్రో రైలులో ప్రయాణించే వారు మోసపూరిత యాప్ ఉచ్చులో పడే ప్రమాదం ఉంది. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి ఈడీ ఇప్పటికే కేసులు నమోదు చేసి, రూ.399 కోట్లు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సీబీఐ దర్యాప్తు నిర్వహించేలా ఆదేశించాలి' అని విజ్ఞప్తి చేశారు. మెట్రో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చారు.

కుక్కల దాడిలో మరో జింక మృతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) క్యాంపస్ సమీపంలో మరో జింకను కుక్కలు చంపేశాయి. ఇటీవలే ఓ జింకను చంపిన కుక్కలు.. శనివారం రాత్రి జింకపిల్లను చంపి కళేబరాన్ని కొంతవరకు పీక్కుతిన్నాయి. ఇటీవల బుల్డోజర్లతో చెట్లు, పొదలను తొలగించిన ప్రాంతంలో ఈ దాడి జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది కుక్కలను తరిమికొట్టి జింక పిల్ల కళేబరాన్ని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఆవాసం కోల్పోయిన జింకలను కాపాడాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

అటవీ అధికారుల ఆస్ట్రేలియా పర్యటనలో మార్పు

సాక్షి, హైదరాబాద్: అటవీ అధికారుల బృందం ఆస్ట్రేలియా పర్యటనలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. శనివారం రాత్రి నుంచి 15వ తేదీ వరకు వీరు ఆస్ట్రేలియాలో వివిధ అంశాలపై అధ్యయనానికి వెళ్లాల్సి ఉండగా.. మంగళ లేదా బుధవారాల్లో ఈ బృందం బయల్దేరి వెళ్లొచ్చునని తెలుస్తోంది. ఆస్ట్రేలియాలోని బొగ్గుగనుల ప్రాంతాల్లో 'ఎకో రిస్టోరేషన్' నిమిత్తం చేపడుతున్న చర్యలు, పర్యావరణ పరిరక్షణకు అమలుచేస్తున్న కార్యక్రమాల అధ్యయనానికి ఈ బృందం వెళ్లాల్సి ఉంది. ఈ బృందంలో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్ (కాంపా) సి.సువర్ణ, ఇంకా కొందరు డీఎఫ్‌వో అధికారులున్నారు. అయితే పర్యటనకు అనుమతినిస్తూ గురువారం సీఎస్ శాంతకుమారి ఉత్తర్వులిచ్చారు. ఆస్ట్రేలియాలో అధ్యయనానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతితోపాటు, ఈ అధికారులకు వీసా సకాలంలో అందలేదని తెలుస్తోంది. దీంతో వీరు మంగళవారం లేదా బుధవారం బయల్దేరి పదిరోజుల పాటు అక్కడ పర్యటిస్తారని అధికారులు చెబుతున్నారు.

ముందే జాగ్రత్త పడాల్సింది

ఆ 400 ఎకరాలు తమవి కావని హెచ్‌సీయూతో ప్రకటన చేయించాల్సింది

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో భేటీలో వర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ నేతలు
- బెంగళూరు వర్సిటీ తరహాలో హెచ్‌సీయూలోనూ బయోపార్కు అభివృద్ధి చేయాలని సూచన
- అన్ని విషయాలు మంత్రుల కమిటీకి చెప్తానన్న మీనాక్షి..
- వర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ విభాగం అధ్యక్షురాలికి షోకాజ్ సరికాదని వ్యాఖ్య



సమావేశంలో హెచ్‌సీయూకి చెందిన ఎన్‌ఎస్‌యూఐ నేతలతో మాట్లాడుతున్న మీనాక్షీ నటరాజన్. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వంశీచంద్ రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'ఆ 400 ఎకరాల భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంది. మార్చి రెండో వారంలోగా ఆ భూమిపై హక్కుల్లేవని యూనివర్సిటీ చేత అధికారికంగా చెప్పించి ఉంటే ఇంత అలజడి రేగేది కాదు. ఇప్పుడు పరిస్థితి చేయి దాటినందున విద్యార్థుల వాదనను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకెళ్తే బాగుంటుంది' అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌ఎస్‌యూఐ నేతలు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు సూచించారు. అలాగే పోలీసులు అత్యుత్సాహంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టడం, కేసులు పెట్టడంతోపాటు ప్రభుత్వ వాదనను యూనివర్సిటీ రిజిస్టర్ వ్యతిరేకించడంతోనే సమస్య మొదలైందన్నారు. శనివారం గాంధీ భవన్‌లో హెచ్‌సీయూకు చెందిన ఎన్‌ఎస్‌యూఐ నేతలతో మీనాక్షీ నటరాజన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, సెంట్రల్ వర్సిటీ అధ్యక్షురాలు నేహా జయరాజ్, రచనారెడ్డి, ప్రభాకర్, షరీఫ్, శ్రీరామ్, మాజీ విద్యార్థి నేత బైకాని లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ వాదనలను మీనాక్షికి వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని వర్సిటీ వర్గాల నుంచి అధికారిక ప్రకటన చేయించాలని కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు సమర్పించారు. అన్ని విషయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ దృష్టికి తీసుకెళ్తానని.. విద్యార్థులు ఆందోళన చెందొద్దని మీనాక్షి భరోసా ఇచ్చారు. ఆదివారం ఉదయం ఆమె ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలతో భేటీకానున్నారు.

కాజ్ కోసం పోరాడుతుంటే షోకాజ్ ఇవ్వడమేంటి?

వర్సిటీకి చెందిన ఎన్‌ఎస్‌యూఐ విభాగం 'నో టైగర్స్, నో డీర్స్... నో సెన్స్' పేరుతో పోస్టర్ వేయడం సంచలనం కలిగిస్తోంది. పోస్టర్‌లోని అంశాలు, సీఎంను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు పరుషంగా ఉండటం, విషయం అధిష్టానం దృష్టికి వెళ్లడంతో హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌యూఐ విభాగం అధ్యక్షురాలు నేహా జయరాజ్‌కు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవెల్లి వెంకటస్వామి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ వ్యవహారంపై 48 గంటల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే ఈ షోకాజ్‌కు హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌యూఐ విభాగం కూడా తీవ్రంగానే స్పందించిందని, వర్సిటీలో ఎన్‌ఎస్‌యూఐని కాపాడేందుకే తాము విద్యార్థుల పక్షాన ఉండాలని నిర్ణయించామని బదులిచ్చినట్లు సమాచారం. మరోవైపు మీనాక్షితో భేటీలో ఈ వ్యవహారం చర్చకొచ్చింది. విద్యార్థుల కోసం పోరాడుతున్న తనకు సంజాయిషీ నోటీసు ఎందుకు ఇచ్చారని నేహా జయరాజ్ ఆవేదన వ్యక్తం చేయగా కాజ్ కోసం పోరాడుతుంటే షోకాజ్ ఇవ్వడమేంటని మీనాక్షి తప్పుబట్టారు. నోటీసును ఉపసంహరించుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామిని ఆదేశించారు.

మీనాక్షికి హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌యూఐ నేతల డిమాండ్లు

- వర్సిటీ విద్యార్థులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తేయాలి.
- పోలీసులు అరెస్టు చేసిన ఎర్రం నవీన్, రోహిత్‌లను విడుదల చేయాలి. క్యాంపస్ నుంచి పోలీసులను బయటకు పంపాలి.
- ఆ 400 ఎకరాల ప్రాంతంలో మళ్లీ చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలి.
- వర్సిటీ భూములను అధికారికంగా బదిలాయించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి.
- వర్సిటీకి ఉన్న మొత్తం భూవిస్తీర్ణం.. గత 30 ఏళ్ల భూకేటాయింపులపై వర్సిటీ వర్గాలతో ప్రకటన చేయించాలి.
- ఈ ప్రాంతంలో పర్యావరణ ప్రభావం ఎంత మేర ఉంటుందన్న దానిపై సమగ్ర అధ్యయనం జరిపించాలి.
- బెంగళూరు యూనివర్సిటీ తరహాలో హెచ్‌సీయూలోనూ పర్యావరణహిత బయోపార్కును అభివృద్ధి చేయాలి.

బాబోయ్ ఈ-స్కూటర్లు!

- 98% ఎలక్ట్రిక్ స్కూటర్లలో సమస్యలు
- పెట్రోల్ వేరియంట్లతో పోలిస్తే రెండింతలు
- జె.డి.పవర్ తాజా అధ్యయనంలో వెల్లడి



సాక్షి, స్పెషల్ డెస్క్: పెట్రోల్ ఖర్చు తప్పుతుందని, నిర్వహణ వ్యయం తక్కువ అని, పర్యావరణ హితం అనే కారణాలతో ముచ్చటపడి కొంటున్న ఎలక్ట్రిక్ స్కూటర్లు.. కొనుగోలు చేసిన కొన్నాళ్లకే ముందుకు కదలక మొరాయిస్తున్నాయి. పెట్రోల్‌తో నడిచే స్కూటర్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ స్కూటర్లలో సమస్యలు దాదాపు రెండింతలు ఉన్నాయని జె.డి.పవర్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో తేలింది. 100లో 98 ఈ-స్కూటర్లలో సమస్యలు తలెత్తాయని గుర్తించారు. సంప్రదాయ స్కూటర్ల విషయంలో ఇది 53 మాత్రమే నమోదైంది. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన 6,500 మందికిపైగా యజమానుల స్పందనల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది.

అధ్యయనంలోని అంశాలివీ..

- పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాల్లో ఇంజిన్ పనితీరు, బ్రేకింగ్, రైడ్ నాణ్యత, విద్యుత్ వ్యవస్థలతో సహా కీలక అంశాలను ఈ అధ్యయనం విశ్లేషించింది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విషయంలో బ్యాటరీ పనితీరు, ఛార్జింగ్, వేగం తీరును ప్రమాణికంగా తీసుకున్నారు. నాణ్యత పరంగా అతి తక్కువ సమస్యలతో ఈవీ విభాగంలో బజాజ్ చేతక్, అన్ని విభాగాల్లో బెస్ట్ బ్రాండ్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ నిలిచాయి.
- ఎక్కువ కిలోమీటర్లు ప్రయాణించే కొద్దీ సమస్యలు పెరుగుతున్నాయి. వాహనం కొనుగోలు చేసిన మొదటి ఆరు నెలల్లో 2,500 కిలోమీటర్లకు మించి నడిపిన కస్టమర్లు, తక్కువ ప్రయాణం చేసినవారితో పోలిస్తే సగటున 9 శాతం ఎక్కువ సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ ధోరణి ము ఖ్యంగా ఎలక్ట్రిక్ స్కూటర్లలో స్పష్టంగా కనిపిస్తోంది. బ్రేక్స్, లైట్స్, ఎలక్ట్రికల్ విడిభాగాలతోపాటు వాహన పటుత్వం, ఫినిషింగ్ సమస్యలు అత్యంత సాధారణమయ్యాయి.
- దేశంలో 86% ద్విచక్ర వాహనాల్లో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. యజమానులు వెల్లడించిన అత్యంత సాధారణ సమస్యల్లో ఇంజన్‌కు సంబంధించినవి 18% ఉన్నాయి. ఎలక్ట్రికల్ విడిభాగాలు, లైటింగ్ 15%, బ్రేకింగ్ సిస్టమ్స్ 15% ఉన్నాయి.
- గత సంవత్సరంతో పోలిస్తే 2025లో కస్టమర్ సంతృప్తి మెరుగుపడింది. తమ వాహనాలకు ఊహించిన దానికంటే తక్కువ సమస్యలు ఉన్నాయని 58% మంది పేర్కొన్నారు. 2024లో ఈ సంఖ్య 44% ఉంది. ఊహించిన దానికంటే తక్కువ సమస్యలను ఎదుర్కొన్నామని 61% మంది ఈ-స్కూటర్స్ ఓనర్స్ చెప్పారు.

లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

వేసినట్టు తెలిసింది. ఈ సమావేశానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ రావాల్సి ఉండగా, ఆయన దూరంగా ఉన్నారు.

దీర్ఘకాలంగా ఖాళీలు

తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ బి.సుభాషణ్ రెడ్డి 2017 అక్టోబర్ 11న పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఉప లోకాయుక్త టి.గంగిరెడ్డి 2017 డిసెంబర్ 16న పదవీ విరమణ చేయగా, నాటి నుంచి పోస్టును భర్తీ చేయలేదు. హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, సభ్యులు (జ్యుడీషియల్) ఆనంద రావు, సభ్యులు (నాన్ జ్యుడీషియల్) ముహమ్మద్ ఇర్ఫాన్ మొయినుద్దీన్ 2022 డిసెంబర్ 22న పదవీ విరమణ చేయగా, నాటి నుంచి ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన సమాచార కమిషనర్ పోస్టు 2022 సెప్టెంబర్ నుంచి, సమాచార కమిషనర్ల పోస్టులు 2023 ఫిబ్రవరి నుంచి ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను సుదీర్ఘ కాలంగా భర్తీ చేయకపోవడంతో సమాచార కమిషన్‌లో గతేడాది చివరి నాటికి 10,688 అప్పీల్స్ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ పోస్టులను సత్వరంగా భర్తీ చేయాలని గతంలో హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు సైతం మొట్టికాయలు వేసింది.

జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి...

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సిర్సనగండ్ల గ్రామంలో ఓ వ్యవసాయ కుటుంబంలో 1960, మే 4న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జయప్రద, రామానుజరెడ్డి. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీ నుంచి పట్టభద్రులైన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బంగారు పతకం పొందారు. 1985, ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. తొలుత మహమూద్ అలీ వద్ద ప్రాక్టీస్ చేశారు. నాలుగేళ్ల తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలెట్టారు. 2004లో హైకోర్టు న్యాయవాదుల సంఘం (హెచ్‌సీఏఏ) ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, 2005లో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ టాక్స్‌కు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా కూడా పనిచేశారు. 2013, ఏప్రిల్ 12న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022, ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు.

జస్టిస్ షమీమ్ అక్తర్...

1961, జనవరి 1న నల్లగొండలో రహీమున్నీసా బేగం, జాన్ మహమ్మద్‌కు జన్మించారు. నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివారు. నాగ్‌పూర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా నుంచి న్యాయపట్టా పొందారు. 1996లో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీజీ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2006లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 2002లో నల్లగొండ జిల్లా, సెషన్స్ జడ్జిగా నియమితులయ్యారు. తర్వాత పలు కోర్టుల్లో పనిచేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ ట్రిబ్యునల్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. హైకోర్టులో రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా పనిచేశారు. 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2022 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు.

11 మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు

పాడేరు: మావోయిస్టు పార్టీ గాలికొండ ఏరియా కమిటీకి చెందిన 11 మంది మిలీషియా సభ్యులు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఎస్పీ అమిత్‌బర్దర్ ఎదుట లొంగిపోయారు. జీకే వీధి మండలం చెరుకుంపాకలు గ్రామానికి చెందిన వంతాల భాస్కర్‌రావు, జర్తా రమేష్, నైనా గోపాల్, చీడిగొంది గ్రామానికి చెందిన తాంబేలు సుబ్బారావు, కుండలయిగొంది గ్రామానికి చెందిన కొర్రా కృష్ణ, గెమ్మెలి పెంటయ్య, కొయ్యూరు మండలం జెర్రిగొంది గ్రామానికి చెందిన పాంగి సత్తిబాబు, జి.కొత్తపాలెం గ్రామానికి చెందిన కొర్ర కామేష్, అన్నవరం గ్రామానికి చెందిన కూడా బొంజుబాబు, కిల్లో బుద్ధుడు, పెట్రాయి గ్రామానికి చెందిన కొర్రా చిన్నారావు లొంగిపోయినట్లు ఎస్పీ విలేకరులతో చెప్పారు. 39 నేరాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వీరు.. స్ఫూర్తి, ప్రేరణ, నిర్మాణ్, సరళ్, సంకల్పం వంటి కార్యక్రమాలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వీరు స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ధీరజ్, చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం ఆయన శ్రీవారిని దర్శించుకుంటారు. అంతకుముందు ఆయనకు రేణిగుంట విమానాశ్రయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, చిత్తూరు జిల్లా ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఇ.భీమారావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్వాగతం పలికారు. – రేణిగుంట/తిరుపతి రూరల్

హెచ్‌సీయూలో ఏబీవీపీ సంతకాల సేకరణ

సేకరణ పూర్తయ్యాక రాష్ట్రపతికి సమర్పిస్తాం: ఏబీవీపీ



హెచ్‌సీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టిన దృశ్యం

రాయదుర్గం: హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం ఏబీవీపీ హెచ్‌సీయూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. శనివారం ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్ ఇతర సీనియర్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌సీయూలో ఇంచు భూమినీ కాపాడుకుంటామని, అందులో భాగంగా విద్యార్థుల సంతకాల సేకరణ చేసి దాన్ని రాష్ట్రపతికి సమర్పిస్తామని వెల్లడించారు. హెచ్‌సీయూ చుట్టూరా ప్రహరీగోడ ఉండగా, నడిబొడ్డున 400 ఎకరాలు మావే అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒక జాతీయ ఉన్నత విద్యా సంస్థ పట్ల వ్యవహరించే వైఖరి ఇలా ఉండటం అన్యాయమని తెలిపారు. 50 ఏళ్లుగా ఈ భూమి హెచ్‌సీయూ క్యాంపస్‌లోనే కొనసాగుతూ వస్తోందన్నారు. అభివృద్ధి పేరిట భూములు తీసుకుంటామని, అవి రాష్ట్ర ప్రభుత్వానివేనని హెచ్‌సీయూకి సంబంధం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ నుంచి పోలీసులను ఉపసంహరించండి

యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ నుంచి వెంటనే పోలీసులను ఉపసంహరించాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. యూనివర్సిటీని ఆనుకొని ఉన్న 400 ఎకరాల బయోడైవర్సిటీ భూముల కోసం వట ఫౌండేషన్, మానవహక్కుల ఫోరం, పౌర సమాజం, పర్యావరణవేత్తలు, విద్యార్థులు ఉద్యమించి ఆ భూముల వేలాన్ని అడ్డుకున్నందుకు అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు భాంగ్య భూక్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించడమేకాక, రోహిత్ వేముల సంఘటన సమయంలో విద్యార్థులపై నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని, యూనివర్సిటీకి 1975లో కేటాయించిన మొత్తం 2,300 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, యూనివర్సిటీలోని భూములను బయోడైవర్సిటీ హెరిటేజ్ జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

86 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టుకు రివార్డు అందజేస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

కొత్తగూడెంటౌన్:తెలంగాణలో మావోయిస్టులు 95 మంది లోపే ఉన్నారని, వారు కూడా హింసను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆపరేషన్ చేయూతలో భాగంగా మావోయిస్టు పార్టీకి చెందిన 86 మంది సభ్యులు శనివారం ఐజీ సమక్షంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ముందు లొంగిపోయారు. కొత్తగూడెం పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా పోలీసులు కూడా పాల్గొన్నారు. కాగా, లొంగిపోయిన మావోయిస్టుల్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 66 మంది పురుషులు, 20 మంది మహిళలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన ముచ్చాకి సోందాల్, పెద్దగెల్లూరుకు చెందిన శ్యామల దూలే, బుస్సాపూర్ గ్రామానికి చెందిన సవులం భీమీ, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన మాడవి సోమిడి ఏరియా దళ కమాండర్లు కాగా.. వారికి ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున రివార్డు అందజేశారు. మిగిలిన వారికి హోదాను బట్టి రూ.25 వేల నుంచి రూ.లక్ష చొప్పున ప్రభుత్వం తరఫున పునరావాసం కింద పంపిణీ చేశారు. సమావేశంలో ములుగు ఏఎస్పీ శివరాం ఉపాధ్యాయ, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ కమల్ వీర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకే 'టెండర్'

మొదటి పేజీ తరువాయి

అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు 4,57,643 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 10,34,562 మంది, 3 సంవత్సరాల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 6,67,783 మంది ఉన్నారు. వీరందరికీ కలిపి ఏటా 36,96,80,897 కోడిగుడ్ల సరఫరా కోసం టెండర్లు పిలిచింది.

పంపిణీ విధానంలో మార్పులు

కోడిగుడ్ల సరఫరాకు గతంలో జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ)ల ద్వారా కాంట్రాక్టర్ల ఎంపిక జరిగేది. రెండేళ్ల క్రితం ఈ విధానాన్ని మార్చి, కొత్తగా ఏర్పాటైన జోన్ పరిధిని ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ విధానంలో ఏడు జోన్లకు ఏడుగురు కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ఏడుగురు కాంట్రాక్టర్లు గుడ్లు సరఫరా చేస్తున్నారు. గత మార్చితో వారి పంపిణీ గడువు పూర్తయింది. కానీ, కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక పూర్తికాకపోవడంతో నెలరోజులపాటు వారి కాంట్రాక్టును పొడిగించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేశారు.

నిబంధనలు... మార్చారిలా..

- కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు విషయంలో 12 రకాల నిబంధనలున్నాయి. ఈ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న కాంట్రాక్టర్‌కే టెండర్ దక్కుతుంది. ఒక జోన్ భౌగోళిక పరిధిలో ఉన్నవారే ఆ జోన్ టెండర్‌లో పాల్గొనాలి. అది కూడా పౌల్ట్రీ యజమానికి మాత్రమే అర్హత ఉంటుంది. లీజు పద్ధతిలో కొనసాగే రైతుకు అవకాశం లేదు. రాష్ట్రంలో 650 మంది పౌల్ట్రీ రైతులు (లేయర్) ఉన్నట్లు తెలంగాణ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ గణాంకాలు చెబుతున్నాయి.
- టెండర్ నిబంధనల్లో ఈసారి రెండు మార్పులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాటిపైనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పౌల్ట్రీ రైతుకు అగ్‌మార్క్ ధ్రువీకరణ పత్రం ఉండాలనే నిబంధన ఉండేది. తాజాగా ఈ ధ్రువీకరణ పత్రం టెండర్ తేదీకి కనీసం రెండేళ్ల ముందు నుంచే చెల్లుబాటు అయ్యేలా ఉండాలని నిబంధన పెట్టారు. దీంతో కొత్తగా అగ్‌మార్క్ ధ్రువీకరణ తీసుకున్న వారికి ఈసారి టెండర్‌లో పాల్గొనే అవకాశం లేకుండా పోయింది. ఈ నిబంధన గతంలో టెండర్ దక్కించుకున్నవారికే మళ్లీ టెండర్ దక్కేలా ఉందని పౌల్ట్రీ రైతులు ఆరోపిస్తున్నారు.
- అగ్‌మార్క్ ధ్రువీకరణతోపాటు అగ్‌మార్క్ రిప్లికా సీరియల్ నంబర్ కూడా కలిగి ఉండాలని తాజా టెండర్‌లో కొత్త నిబంధన పెట్టారు. ఇది కూడా గత టెండర్‌లో ఎంపికైన కాంట్రాక్టర్లకే అనుకూలంగా ఉంది. మరోవైపు అగ్‌మార్క్ రిప్లికా నంబర్ టెండర్ ప్రారంభమైన తేదీ కంటే ముందే ఉండాలని నిబంధన పెట్టారు. దీంతో కొత్తగా ఈ నంబర్ తీసుకునే అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.
- అగ్‌మార్క్ అనేది వ్యవసాయ ఉత్పత్తుల ప్రామాణిక నాణ్యతను ధ్రువీకరిస్తుంది. అగ్‌మార్క్ రిప్లికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రామాణికతతోపాటు ఆ ఉత్పత్తి గ్రేడు ప్రమాణాలను నిర్ధారిస్తుంది.

గడువుపైనా గందరగోళం

టెండర్ ప్రక్రియ గడువుపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రక్రియ మార్చి 30న ప్రారంభమై ఏప్రిల్ 10న ముగుస్తుంది. అయితే, మార్చి 30, 31, ఏప్రిల్ 1, 5, 6వ తేదీలు ప్రభుత్వ సెలవుదినాలు. టెండర్ గడువు మొత్తం 12 రోజులు కాగా... ఇందులో ఏకంగా 5 రోజులు సెలవు దినాలే. ఇక మిగిలింది ఏడు రోజులు మాత్రమే. గతంలో 17 రోజులపాటు సమయం ఇవ్వగా.. ఈసారి 12 రోజులకు కుదించారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యూహాత్మకంగానే ఈ తేదీలను ఖరారు చేశారని మండిపడుతున్నారు. ఈ టెండర్ విషయంలో భారీ మొత్తంలో నగదు చేతులు మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'రింగు' 6 వరుసలు!

మొదటి పేజీ తరువాయి



నిర్మాణానికి ముందున్న అంచనాకు.. రోడ్డు నిర్మించాక వాస్తవంగా తిరుగుతున్న వాహనాల సంఖ్యకు పొంతన లేకుండా పోయింది. ఆర్ఆర్ఆర్‌ను నాలుగు వరుసల్లో నిర్మించి మరో 15–20 ఏళ్ల తర్వాత దాన్ని 8 వరుసలకు విస్తరించాలనేది ఇప్పటి వరకు ఉన్న ప్రణాళిక. కానీ కేవలం ఐదేళ్లలోనే ఆర్ఆర్ఆర్‌పై రద్దీ రెట్టింపై నాలుగు వరుసల రోడ్డు ఇరుకుగా మారి దాన్ని వెంటనే విస్తరించాల్సిన పరిస్థితి వస్తుందన్న అభిప్రాయం నెలకొంది. ఒకవేళ ఐదేళ్లలోనే ఆర్ఆర్ఆర్‌ను విస్తరించాల్సి వస్తే నిర్మాణ వ్యయం పెరగనుంది. ఈ నేపథ్యంలో ఒకేసారి 6 వరుసలుగా ఆర్ఆర్ఆర్‌ను నిర్మిస్తే కనీసం 15 ఏళ్ల వరకు దాన్ని విస్తరించాల్సిన అవసరం ఉండదన్నది కేంద్రం ఆలోచన. వాహనాల రాకపోకలు 30 వేల పీసీయూల లోపు ఉంటే 4 వరుసలు సరిపోతాయని... అంతకంటే పెరిగితే రోడ్డు ఇరుకు అవుతుందని నిర్ధారిత ప్రమాణాలు చెబుతున్నాయి. కానీ ఐదేళ్లలోనే ఈ సంఖ్య 40 వేలకు మించుతుందని కేంద్రం తాజాగా అంచనా వేసింది.

రోడ్డు నిర్మాణానికి రూ. 8,800 కోట్లు!


నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ. 6,300 కోట్ల వరకు ఖర్చవుతుందని టెండర్ నోటిఫికేషన్ లో ఎన్‌హెచ్‌ఏఐ అంచనా వేసింది. ఇప్పుడు దాన్ని 6 వరుసలుగా నిర్మిస్తే ఆ మొత్తం రూ. 8,800 కోట్ల వరకు అవుతుందని భావిస్తోంది. అయితే ఒకేసారి 8 వరుసలకు సరిపడా భూసేకరణ జరుగుతున్నందున దాని వ్యయంలో ఎలాంటి మార్పు ఉండదు.

తొలుత రెండు వరుసలు చాలనుకొని..

రీజనల్ రింగురోడ్డును ప్రతిపాదించాక నాలుగు వరుసల రోడ్డుకు సరిపడా ట్రాఫిక్ ఉండదని భావించి కేంద్రం తొలుత రెండు వరుసలకే పరిమితమవుదామని పేర్కొంది. కానీ కనీసం నాలుగు వరుసలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఒప్పించింది. అయినప్పటికీ ఈ విషయంలో అనుమానం తీరకపోవడంతో ఉత్తర-దక్షిణ భాగాలను ఏకకాలంలో చేపట్టకుండా తొలుత ఉత్తర భాగాన్ని నిర్మించి తర్వాత దక్షిణ భాగం సంగతి చూద్దామనుకుంది. అలాంటి స్థితి నుంచి కేంద్రం ఏకకాలంలో ఆరు వరుసలను నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా తాజాగా ఆదేశించడం విశేషం. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ట్రాఫిక్ స్టడీ నివేదిక అందాక దాన్ని నిపుణుల సమక్షంలో విశ్లేషించి కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. తుది నిర్ణయం ఆధారంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అప్పటికప్పుడు నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే పిలిచిన టెండర్లను త్వరలో తెరిచి నిర్మాణ సంస్థను ఖరారు చేయనున్నారు.

విశ్వానికి అంతముంది!

కృష్ణ పదార్థంలో క్షీణతే కారణం ● వెల్లడించిన తాజా అధ్యయనం



అనంత విశ్వం మనిషికి ఎప్పుడూ మిస్టరీయే. దాని పుట్టుక, వికాసం, విస్తరణ తదితరాలు ఎప్పుడూ అబ్బురపాటు కలిగించే విషయాలే. సైంటిస్టులు ఎంతగా ప్రయత్నిస్తున్నా వాటి గుట్టుమట్లను నేటికీ విప్పలేకపోయారు. విశ్వం నిరంతరం విస్తరిస్తూనే ఉంటుందన్నది ఇప్పటిదాకా అంతా విశ్వసిస్తూ వస్తున్న సిద్ధాంతం. అది తప్పని, ఇంతటి 'అనంత' విశ్వానికీ ఏదోనాటికి అంతం కచ్చితంగా ఉందని తాజా అధ్యయనం ఒకటి అంటోంది! కృష్ణపదార్థంపై జరిగిన విశ్లేషణలో వెలుగులోకి వచ్చిన కొత్త వివరాల ఆధారంగా ఈ మేరకు తేల్చింది! కృష్ణ పదార్థం ఎలాంటి మార్పుచేర్పులకూ ఆస్కారం లేకుండా స్థిరంగా ఉంటుందన్నది శాస్త్రవేత్తల భావన. అందుకే దాన్ని అంతరిక్ష స్థిరాంకమనీ అంటారు. కానీ ఆ భావన నిజం కాదని, కృష్ణపదార్థం నానాటికీ విస్తరిస్తోందని అధ్యయనంలో తేలింది! దీనిపై ఖగోళ శాస్త్రవేత్తల్లో సంభ్రమాశ్చర్యాలు వ్యక్తమవుతున్నాయి. ''విశ్వావిర్భావపు గుట్టును కనిపెట్టేందుకు, పలు అంతరిక్ష రహస్యాల చిక్కుముళ్లను విప్పేందుకు ఇది అత్యంత కీలక ఆధారం కానుంది. అంతేగాక మొత్తంగా విశ్వానికి సంబంధించి ఇప్పటిదాకా ఉన్న అవగాహననే సమూలంగా మార్చేయగలదు'' అని వారంటున్నారు.

ఏమిటీ పదార్థం?

డార్క్ ఎనర్జీ. కృష్ణపదార్థం. అనంత విశ్వంలో మూడొంతులకు పైగా విస్తరించిన పదార్థం. అయినా ఇప్పటికీ మనిషికి అంతు చిక్కని, అతని మేధకు అందని దృగ్విషయం. దాని ఉనికి వాస్తవమే అయినా నిజానికి అదేమిటో, ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. విశ్వ విస్తరణను వేగవంతం చేసే శక్తిగా కృష్ణపదార్థాన్ని సైంటిస్టులు నిర్వచిస్తారు. దాని ఆనుపానులను కనిపెట్టేందుకు డార్క్ ఎనర్జీ స్పెక్ట్రోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ కొలాబరేషన్ (దేశీ) పేరుతో నాలుగేళ్ల క్రితం 900 మంది అంతర్జాతీయ స్థాయి సైంటిస్టులు బృందంగా ఏర్పడ్డారు. అరిజోనాలోని టక్సన్ అబ్జర్వేటరీలో మేయల్ టెలిస్కోప్ తాలూకు దాని 5,000 ఫైబర్ ఆప్టిక్ లెన్సుల సాయంతో అంతరిక్షాన్ని ఆమూలాగ్రం వడపోస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఏకంగా 5 వేలకు పైగా గెలాక్సీల నుంచి వెలువడే కాంతిని ఏకకాలంలో పరిశీలిస్తున్నారు. ఆ లెక్కన వచ్చే ఏడాది సర్వే పూర్తయ్యేనాటికి దేశీ ఏకంగా 5 కోట్ల గెలాక్సీల నుంచి వచ్చే కాంతిని 'దేశీ' లెక్కగట్టనుంది! 1,180 కోట్ల ఏళ్ల పై చిలుకు వికాస క్రమంలో విశ్వాన్ని కృష్ణపదార్థం ఎలా ప్రభావితం చేస్తూ వచ్చిందో తేల్చడమే ఈ అధ్యయన లక్ష్యం. మూడేళ్ల 'దేశీ' డేటాను సైంటిస్టులు తాజాగా విశ్లేషించారు. అది అందజేసిన 1.5 కోట్ల గెలాక్సీల కాంతికి సంబంధించిన గణాంకాలను అధ్యయనం చేశారు. ఫలితంగా ఆశ్చర్యపరిచే అంశాలు వెలుగులోకి వచ్చినట్టు దేశీ సహ సారథి, డాలస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఆస్ట్రోఫిజిక్స్ ప్రొఫెసర్ ముస్తఫా ఇషాక్ బౌషాకీ తెలిపారు. ''కృష్ణపదార్థం ఎలాంటి మార్పుచేర్పులకూ లోనవదన్నది వాస్తవం కాదు. అది విస్తరిస్తోందని, అంతేగాక అప్పుడప్పుడూ అనూహ్యంగా కూడా ప్రవర్తిస్తోందని వెల్లడైంది. ఆ క్రమంలో కృష్ణపదార్థం కొన్నిసార్లు బలహీనపడుతోంది కూడా. ఆ లెక్కన అంతిమంగా విశ్వంపై దాని ప్రభావం క్రమంగా క్షీణిస్తూ ఏదో ఒకనాటికి సున్నా అవుతుంది. మరోలా చెప్పాలంటే విశ్వ విస్తరణ వేగం క్రమంగా తగ్గుతూ చివరికి పూర్తిగా నిలిచిపోతుంది. అక్కడినుంచి విశ్వం కుంచించుకుపోయే ప్రక్రియ మొదలవుతుంది. అది క్రమంగా వేగం పుంజుకుని ఒకనాటికి ఈ విశ్వపు ఉనికే లేకుండా పోతుంది'' అని అభిప్రాయపడ్డారు. కాకపోతే ఇదంతా జరిగేందుకు కనీసం కొన్ని వందల కోట్ల ఏళ్లకు పైగా పట్టవచ్చని ఆయన చెప్పుకొచ్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



వినువీధిలో వింత వలయాలు

- గతవారం యూరప్‌లో కనువిందు
- 'ఫాల్కన్' వాహకనౌక శకలాలే కారణం

ఈ ఫొటోలోని వింత వలయాలను చూశారుగా! ఎస్ ఆకారంలో మొదలై క్రమంగా వలయాలుగా మారుతూ కొట్టొచ్చినట్టుగా కన్పించాయి. గత వారం యూరప్‌లో పలు ప్రాంతాల నుంచి ఆకాశ వీధిలో కనువిందు చేశాయి. జనమంతా వాటిని ఆసక్తిగా వీక్షించారు. ఇందులో వింతేమీ లేదని సైంటిస్టులు చెబుతున్నారు. ''ఉపగ్రహ ప్రయోగాల సందర్భంగా ఇలాంటివి మామూలే. గత వారం యూరప్‌లో కన్పించిన ఆ వలయాలకు స్పేస్ ఎక్స్ తాలూకు ఫాల్కన్ 9 ఉపగ్రహ ప్రయోగమే కారణం'' అని వారు వివరించారు. ''అమెరికా సైనిక నిఘా ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన అనంతరం ఫాల్కన్ వాహకనౌక తాలూకు శకలాలు భూ వాతావరణంలోకి ప్రవేశించి సురక్షితంగా సముద్రంలో పడిపోయాయి. అంతరిక్షం నుంచి భూ వాతావరణంలోకి ప్రవేశించే క్రమంలో వాహక నౌక తనలో మిగిలిపోయిన ఇంధనాన్ని భద్రతా కారణాల రీత్యా విడుదల చేసేస్తుంది. ఆ క్రమంలో అది ఒక్కసారిగా వలయాకృతిలో సుడులు తిరుగుతుంది. ఫాల్కన్ వాహకనౌక విషయంలోనూ అదే జరిగింది'' అని నాసా సైంటిస్ట్ మెక్‌డొవెల్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

వక్ఫ్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

న్యూఢిల్లీ: వక్ఫ్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందిన వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 (ఉమీద్)పై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం సంతకం చేశారు. శనివారం రాత్రి ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతో వక్ఫ్ బిల్లు చట్టరూపం దాల్చింది. తీవ్ర వాదోపవాదాలు, విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో వక్ఫ్ బిల్లుపై ఉభయ సభల్లోనూ ఓటింగ్ జరగడం, లోక్‌సభలో 288–232, రాజ్యసభలో 128–95 ఓట్ల తేడాతో బిల్లు గట్టెక్కడం తెలిసిందే..

లంకతో ఆరు రక్షణ ఒప్పందాలు

దిస్సనాయకెతో మోదీ చర్చలు

- భారత వ్యతిరేక కార్యకలాపాలకు లంకను వాడుకోనీయం
- ప్రధానికి అధ్యక్షుని హామీ
- మత్స్యకారులను విడిచిపెట్టండి: మోదీ
- లంకకు అండగా ఉంటామని వెల్లడి



ప్రధాని మోదీతో దిస్సనాయకె

కొలంబో: పొరుగు దేశం శ్రీలంకతో భారత్ ఆరు భారీ రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుంది. లంకలోని ట్రింకోమలీని ఇంధన హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు పవర్ గ్రిడ్ కనెక్టివిటీపై కూడా ఒప్పందాలు కుదిరాయి. శనివారం లంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకెతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చల అనంతరం ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. సంపూర్ సౌర విద్యుత్కేంద్రాన్ని నేతలిద్దరూ వర్చువల్‌గా ప్రారంభించారు. భద్రత విషయంలో ఇరుదేశాలు పరస్పరం ఆధారపడి ఉన్నాయని ఈ సందర్భంగా మోదీ అభిప్రాయపడ్డారు. ''దిస్సనాయకె అధ్యక్షునిగా ఎన్నికయ్యాక తొలి విదేశీ పర్యటనకు భారత్‌నే ఎన్నుకున్నారు. ఆయన హయాంలో లంకను సందర్శించిన తొలి విదేశాధినేతను నేనే. ద్వైపాక్షిక బంధానికి ఇరు దేశాలూ ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనం'' అన్నారు. అనంతరం జరిగిన చర్చల్లో పలు కీలకమైన అంశాలు వారి నడుమ ప్రస్తావనకు వచ్చాయి. లంక జైళ్లలో మగ్గుతున్న భారత మత్స్యకారులను విడిచిపెట్టాల్సిందిగా మోదీ కోరారు. ఈ విషయంలో ఇరు దేశాలూ మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలన్నారు. ''ఆర్థిక సాయంలో భాగంగా లంకకు ఇచ్చిన రుణాలను పునర్ వ్యవస్థీకరిస్తున్నాం. వాటిపై వడ్డీరేటును మరింత తగ్గిస్తున్నాం. లంకకు ఇచ్చిన 10 కోట్ల డాలర్ల మేరకు రుణాలను గ్రాంట్లుగా మార్చాం. శ్రీలంక ప్రజలకు భారత్ అన్నివిధాలా అండగా నిలుస్తుంది'' అని పునరుద్ఘాటించారు. లంక తూర్పు ప్రాంతాల ఆర్థికాభివృద్ధి నిమిత్తం 240 కోట్ల శ్రీలంక రూపాయల సాయాన్ని ప్రకటించారు. చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగినట్టు దిస్సనాయకె తెలిపారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు లంక భూభాగాన్ని వాడుకునేందుకు ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. శ్రీలంకలోని కీలక నౌకాశ్రయాలు, భూభాగాలను నిఘా తదితర కార్యకలాపాలకు వాడుకునేలా చైనా పథక రచన చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గుజరాత్‌లో ఆరావళి ప్రాంతాల్లో 1960లో దొరికిన బుద్ధుని పవిత్ర అవశేషాలను లోతైన పరిశోధనల నిమిత్తం లంకకు పంపుతున్నట్టు మోదీ ఈ సందర్భంగా ప్రకటించారు.

మోదీకి అత్యున్నత పురస్కారం

ప్రధాని మోదీ శ్రీలంక అత్యున్నత పౌర పురస్కారం మిత్ర విభూషణను అందుకున్నారు. అధ్యక్షుడు దిస్సనాయకె ఆయనకు స్వయంగా అవార్డును ప్రదానం చేశారు. ద్వైపాక్షిక బంధాన్ని పటిష్టపరచడంలో మోదీ కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. దీన్ని 140 కోట్ల పై చిలుకు భారతీయులకు లభించిన గౌరవంగా ప్రధాని అభివర్ణించారు.

ఘనస్వాగతం

అంతకుముందు రెండు రోజుల థాయ్‌లాండ్ పర్యటన ముగించుకున్న మోదీ శుక్రవారం రాత్రి బ్యాంకాక్ నుంచి కొలంబో చేరుకున్నారు. నగరంలోని చారిత్రక ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద శనివారం ఆయనకు అత్యంత ఘనస్వాగతం లభించింది. అధ్యక్షుడు దిస్సనాయకె స్వయంగా ఆయనకు స్వాగతం పలికారు. ఒక విదేశీ నేతలకు ఈ స్థాయి స్వాగతం లభించడం శ్రీలంక చరిత్రలో ఇదే తొలిసారి.


తమిళులకు న్యాయం చేయండి

శ్రీలంక తమిళుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు, వారికి న్యాయం జరిగేలా చూసేందుకు భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. శ్రీలంక పర్యటన సందర్భంగా శనివారం స్థానిక తమిళ నేతలతో సమావేశమయ్యాక ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అధ్యక్షుడు దిస్సనాయకెతో చర్చల సందర్భంగా కూడా ఈ అంశాన్ని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ''లంక తమిళుల ఆకాంక్షలను గౌరవించండి. హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం రాజ్యాంగంలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేర్చండి. ప్రొవిన్షియల్ కౌన్సిళ్లకు తక్షణం ఎన్నికలు జరిపించండి'' అని సూచించారు. అనంతరం మోదీ మీడియాతో మాట్లాడారు. లంక తమిళుల ఆకాంక్షలను దిస్సనాయకె సర్కారు నెరవేరుస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. భారత మూలాలున్న తమిళులకు 10 వేల ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తవుతుందని తెలిపారు. రాజ్యాంగంలో పేర్కొన్న మేరకు తమకు కూడా అధికారంలో భాగస్వామ్యం కావాలని తమిళులు చిరకాలంగా కోరుతున్నారు.

ఆయుధం వీడి..

అభివృద్ధిలో భాగస్వాములు కండి

మావోయిస్టులకు అమిత్ షా పిలుపు



దంతెవాడ(ఛత్తీస్‌గఢ్): మావోయిస్ట్ పార్టీ శ్రేణులకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్నేహ హస్తం చాపారు. ఆయుధాలను వదిలేసి, జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని అమిత్ షా వారికి పిలుపునిచ్చారు. నక్సలైట్ చనిపోతే ఎవరూ హర్షించరన్న ఆయన.. 2026 మార్చి కల్లా వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. బస్తర్ ప్రాంత గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోగల సత్తా మావోయిస్టులకు నేడు లేదని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'బస్తర్ పాండుమ్' ఉత్సవం ముగింపు కార్యక్రమంలో శనివారం మంత్రి షా ప్రసంగించారు. 'బస్తర్‌లో తుపాకీ కాల్పులు, బాంబుల మోతలు వినిపించే రోజులు పోయాయి. ఇకనైనా ఆయుధాలను విడనాడి, ప్రధాన జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్ట్ సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నా. మీరూ ఈ దేశ పౌరులే. నక్సలైట్ చనిపోతే ఎవరూ సంతోషపడరు. మీ ఆయుధాలను అప్పగించండి. ఆయుధాలు చూపి బస్తర్ ప్రాంత గిరిజన సోదరసోదరీమణుల పురోభివృద్ధిని ఆపలేరు'అని ఆయన స్పష్టం చేశారు. లొంగిపోయి అభివృద్ధి ప్రక్రియలో పాలుపంచుకునే మావోయిస్ట్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి భద్రత కల్పిస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు. 'బస్తర్ గత 50 ఏళ్లుగా ఎంతో వెనుకబాటుకు గురైంది. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇందుకోసం అవసరమైనవన్నీ సమకూర్చేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా ఉన్నారు. ఇవన్నీ సుసాధ్యం కావాలంటే బస్తర్ ప్రజలు తమ గ్రామాలను నక్సలైట్ రహితంగా మార్చాలని నిర్ణయించుకోవాలి. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్య బీమా సమకూర్చడంతోపాటు చిన్నారులు స్కూలుకు వెళ్లగలిగి, ఆరోగ్య కేంద్రాలు పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యం'అని అమిత్ షా అన్నారు.

మావోయిస్ట్ విముక్త గ్రామాలకు రూ. కోటి

నక్సలైట్లు లొంగుబాట పట్టేలా కృషి చేసి, మావోయిస్ట్ రహితంగా ప్రకటించుకునే గ్రామాలకు రూ.కోటి చొప్పున అందజేస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అమిత్ షా గుర్తు చేశారు. రూ.కోటి అందుకునేందుకు ప్రతి గ్రామం తీవ్రంగా కృషి చేయాలని కోరారు. నక్సలిజాన్ని తుదముట్టించేందుకు ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నామంటూ ఆయన...'అభివృద్ధికి ఆయుధాలు, గ్రనేడ్లు, మందుపాతరలతో అవసరం లేదు, కంప్యూటర్లు, పెన్నులు ఉంటే సరిపోతుందని అర్థం చేసుకునే వారు లొంగిపోయారు. 2024లో 881 మంది, 2025లో ఇప్పటివరకు మొత్తం 521 మంది మావోయిస్ట్‌లు ఆయుధాలను అప్పగించారు. లొంగిపోయిన వారు జన జీవన స్రవంతిలో కలుస్తారు, మిగిలిన వారి పనిని భద్రతా బలగాలు చూసుకుంటాయి. వచ్చే ఏడాది మార్చి కల్లా రెడ్ టెర్రర్ నుంచి దేశానికి విముక్తి కలుగనుంది'అని అమిత్ షా అన్నారు.

రహస్యంగా జస్టిస్ వర్మ ప్రమాణ స్వీకారం

ప్రయాగ్‌రాజ్: నివాసంలో భారీగా డబ్బుల కట్టలు బయటపడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు నుంచి బదిలీ అయిన జస్టిస్ యశ్వంత్ వర్మ శనివారం అలహాబాద్ హైకోర్టు జడ్జిగా ప్రమాణం చేశారు. రహస్యంగా జరిగిన ఈ కార్యక్రమంపై హైకోర్టు అధికారికంగా స్పందించలేదు. ఈ పరిణామాన్ని హైకోర్టు బార్ అసోసియేషన్(హెచ్‌సీబీఏ) ఖండించింది. ఢిల్లీ హైకోర్టు నుంచి తిరిగి తమ వద్దకు పంపించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న హెచ్‌సీబీఏ.. న్యాయమూర్తి వర్మ ప్రమాణ స్వీకారంపై తమకు సమాచారం ఎందుకివ్వలేదని ప్రశ్నించింది. జస్టిస్ వర్మ బదిలీతో న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయిందని వ్యాఖ్యానించింది. అంతేకాదు, అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ బన్సాలీని ఉద్దేశించి అలహాబాద్ హెచ్‌సీబీఏ కార్యదర్శి విక్రాంత్ పాండే శనివారం ఒక లేఖ రాశారు. జస్టిస్ వర్మతో రహస్యంగా ప్రమాణం చేయించడం చట్టబద్ధంగా, సంప్రదాయకంగా తమకు ఆమోదయోగ్యం కాదని అందులో పేర్కొన్నారు. ఆయనకు పరిపాలనా పరంగా గానీ, న్యాయపరంగా గానీ ఎటువంటి విధులను అప్పగించవద్దని కోరారు. గత నెలలో జస్టిస్ వర్మ ఇంట్లో సంభవించిన అగ్ని ప్రమాదంలో నాలుగైదు కట్టల సగం కాలిన కరెన్సీ నోట్లు బయటపడిన ఘటనపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) అంతర్గత విచారణకు ఆదేశించారు. ఈ నోట్ల కట్టల విషయం తనకు గానీ, తన కుటుంబసభ్యులకు గానీ తెలియదని జస్టిస్ వర్మ అంటున్నారు.

డాలర్‌కు 10 లక్షల రియాల్స్

చరిత్రలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయిన ఇరాన్ కరెన్సీ


టెహ్రాన్: అగ్రరాజ్యం అమెరికాతో శత్రుత్వం, అంతర్జాతీయ ఆంక్షలు మరింత ముదరడంతో ఇరాన్ కరెన్సీ రియాల్ మారకం విలువ అత్యంత కనిష్టాలకు దిగజారింది. శనివారం అంతర్జాతీయ మార్కెట్లో ఒక అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఒక ఇరాన్ రియాల్ మారకం విలువ ఏకంగా 10,43,000కు పడిపోయింది. అంటే ఇరాన్ ప్రజలు ఒక్క అమెరికన్ డాలర్‌ను తమ సొంతం చేసుకోవాలంటే ఏకంగా 10,43,000 రియాల్ కరెన్సీలను కుమ్మరించాల్సిందే. ఇరాన్ రియాల్ మారకం విలువ ఇంతటి అత్యల్ప స్థాయికి పడిపోవడం చరిత్రలో ఇదే తొలిసారి. పర్షియా నూతన సంవత్సరం నౌరూజ్ సందర్భంగా కరెన్సీ మారకం దుకాణాలను మూసేశారు. కానీ వీధుల్లో అనధికారికంగా దుకాణాలు నడిచాయి. దీంతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో రియాల్ విలువ మరింత దిగజారింది. శనివారం దుకాణాలు తెరిచాక విలువ మరింత పతనమై చివరకు 10,43,000 వద్ద ఆగింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఫిర్దౌసీ మనీ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో కొందరు వ్యాపారులు తమ ఎలక్ట్రానిక్ సైన్‌బోర్డులను స్విచ్ఛాఫ్ చేశారు. ఆన్‌లైన్‌లో ఉంటే ఇంకెంత పతనమవుతోందోనన్న భయంతో వాటిని ఆఫ్ చేశామని రేజా షరీఫ్ అనే ఎక్స్ఛేంజ్ వ్యాపారి చెప్పారు.

రియాల్ శక్తిని మరింత పీల్చేసిన పరిస్థితులు

2018లో తొలిసారిగా అమెరికా అధ్యక్షునిగా ఉన్నకాలంలో ఇరాన్‌తో అణ్వాయుధ ఒప్పందం నుంచి ట్రంప్ సర్కార్ వైదొలిగాక ఇరాన్‌పై అమెరికా ఆంక్షల ఒత్తిడి మరింత పెరిగింది. 2015లో తొలిసారిగా అమెరికాతో అణ్వాయుధ ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని తగ్గించుకుంది. యురేనియం నిల్వలను పెంచుకునే వేగానికి కళ్లెం వేసింది. ఆ కాలంలో డాలర్‌తో రియాల్ మారకం విలువ 32,000 స్థాయిలో కొనసాగేది. ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా గెలిచాక ఆంక్షల చట్రంలో ఇరాన్‌ను బంధించారు. దీంతో మారకం జారుడుబల్లపై రియాల్ మరింత కిందకు జారింది. నేరుగా చర్చలకు సిద్ధమని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయాతొల్లా అలీ ఖమేనీకి ట్రంప్ లేఖ రాయడం, దానిని ఖమేనీ తిరస్కరించడం తెల్సిందే. మధ్యవర్తిత్వ చర్చలకే తాము మొగ్గు చూపుతామని ఖమేనీ స్పష్టంచేశారు. ఇరాన్ దన్నుతో చెలరేగుతున్న యెమెన్ హౌతీలను అమెరికా వాయుసేనలు లక్ష్యంగా చేసుకోవడంతో ఇరాన్, అమెరికా బంధంలో బీటలు మరింత పెద్దవయ్యాయి.

ఇక చర్చిల ఆస్తులపై గురి!

'ఆర్గనైజర్' కథనంపై రాహుల్ గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తదుపరి లక్ష్యం క్రైస్తవ సంస్థల ఆస్తులేనని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాజాగా పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ బిల్లులోని అనేక అంశాలు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించి రాహుల్ గాంధీ శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో నడిచే 'ఆర్గనైజర్'లోని కథనాన్ని ఉదహరించారు. కాథలిక్ సంస్థలకు దేశవ్యాప్తంగా 7 కోట్ల హెక్టార్ల భూములున్నాయని, ఇంత భారీగా భూములున్న ప్రభుత్వేతర సంస్థ ఇదేనంటూ అందులో పేర్కొన్నారని రాహుల్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ కన్ను ఇప్పుడిక కాథలిక్ భూములపై పడినట్లు ఈ కథనంతో అర్థమవుతోందని ఆరోపించారు. ముస్లిం వర్గం ఆస్తులే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లు ఇతర వర్గాలకు లక్ష్యంగా చేసుకోవడానికి ఒక ఉదాహరణగా ఉంటుందని రాహుల్ శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అతి త్వరలోనే క్రైస్తవుల ఆస్తులపై ఆర్‌ఎస్‌ఎస్ దృష్టి పడనుందని ఆయన జోస్యం చెప్పారు. 'ఇటువంటి దాడుల నుంచి మనకు రక్షణ కల్పించే ఏకైక సాధన రాజ్యాంగం. రాజ్యాంగాన్ని మనం కలిసికట్టుగా పరిరక్షించుకుందాం'అని పిలుపునిచ్చారు. ఇండియన్ చర్చ్ యాక్ట్–1927 ప్రకారం బ్రిటిషర్ల పాలనలో కాథలిక్ సంస్థలు అత్యధికంగా భూములు సంపాదించుకున్నట్లు ఆర్గనైజర్ కథనం పేర్కొంది. అయితే, వలస పాలనలో లీజుకిచ్చిన భూములను చర్చి ఆస్తులుగా పరిగణనలోకి రావంటూ 1965లో భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది.

టారిఫ్‌లు సబబే: ట్రంప్

ఫలితాలు చరిత్రాత్మకంగా ఉంటాయని వ్యాఖ్య

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. వాటి ఫలితాలు చరిత్రాత్మకంగా ఉంటాయని చెప్పుకున్నారు. అమెరికాపై చైనా ప్రతీకార సుంకాల నేపథ్యంలో శనివారం ఆయన ఈ ప్రకటన చేశారు. అమెరికా ఇక ఎంతమాత్రమూ మౌనంగా, నిస్సహాయంగా ఉండబోదని కుండబద్దలు కొట్టారు. ''అమెరికాను చైనా సుంకాలతో గట్టిగా దెబ్బ కొట్టింది. నిజానికి మాపై చైనా సుంకాలతో పోలిస్తే ఆ దేశంపై నేను విధించిన టారిఫ్ ఏ మూలకూ కాదు. చాలా దేశాలు అమెరికా పట్ల ఇంతకాలం ఇలాగే వ్యవహరించాయి. ఇది ఇకపై సాగదు. మునుపెన్నడూ లేని విధంగా ఉద్యోగాలు, వ్యాపారాలను అమెరికాకు తిరిగి తీసుకొస్తున్నాం. ఇప్పటికే ఐదు లక్షల డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. అవి మరింత వేగంగా పెరుగుతున్నాయి. ఈ ఆర్థిక విప్లవంలో మనం గెలుస్తాం. అయితే ఈ ప్రక్రియ అంత సులువు కాదు. ఈ పునరుద్ధరణకు అమెరికన్లు సహకరించాలి. సమస్యలను తట్టుకొని నిలబడగలగాలి. అమెరికాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దుతాం''అని తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలపై చైనా ఘాటుగా స్పందించింది. తమ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి, ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

నిపుణులతో చర్చిస్తున్నాం: భారత్

న్యూఢిల్లీ: అమెరికా తాజా విధించిన టారిఫ్‌లపై ఏ స్థాయిలో స్పందించాలనే విషయమై నిపుణులతో చర్చిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఎగుమతులకు రక్షణ కల్పించడం, వాణిజ్యంపై ప్రభావం పడకుండా చూసుకోవడం సహా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ద్వైపాక్షిక వాణిజ్యం ఒప్పందంలో భాగంగా పన్నుల తగ్గింపు వంటి వాటిని త్వరలోనే ఖరారు చేయనున్నామని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వంతో నేరుగా వ్యవహారాలను నడుపుతున్నందున ఇతర దేశాలతో పోలిస్తే టారిఫ్‌ల విషయంలో భారత్ పరిస్థితి మెరుగ్గానే ఉందని పరిశీలకులు అంటున్నారు. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో ఇతర దేశాలతో కొత్తగా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునేందుకు భారత ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

రేసులో ఎంఏ బేబి, అశోక్ ధవాలే

సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంపికకు రంగం సిద్ధం



ఎంఏ బేబి / ధవాలే


మదురై(తమిళనాడు): దేశంలోనే అతిపెద్ద వామపక్ష పార్టీగా కొనసాగుతున్న సీపీఎం పార్టీకి నూతన ప్రధాన కార్యదర్శిని ఎన్నుకోనున్న నేపథ్యంలో ఆ పదవిలో ఎవరు కూర్చోబోతున్నారన్న చర్చ మొదలైంది. పార్టీ వర్గాలు ప్రధానంగా ఎంఏ బేబీ, అశోక్ ధవాలేల్లో ఒకరికి దక్కే వీలుందని వార్తలు వినవస్తున్నాయి. ఎంఏ బేబీ గత 13 సంవత్సరాలుగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా సేవలందిస్తున్నారు. ఎంఏ బేబికి ముఖ్యంగా కేరళ రాష్ట్ర నాయకత్వం నుంచి దాదాపు సంపూర్ణ మద్దతు లభిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత విస్తరించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి గత కొన్నేళ్లుగా రైతాంగ సమస్యలు దేశవ్యాప్తంగా పతాక శీర్షికలకెక్కాయి. ముఖ్యంగా పంటలకు కనీస మద్దతు ధర అంశంపై రైతు ఉద్యమం ఉధృతంగా కొనసాగిన నేపథ్యంలో ఆలిండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ ధవాలేను తమ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంటే పార్టీ గ్రామీణ ప్రాంతాల్లో బలపడుతుందని ముఖ్యనేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార బీజేపీ విధానాలపై పోరాటంలో భాగంగా వామపక్ష పార్టీల మధ్య సఖ్యత సాధించే, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఏకతాటి మీదకు తెచ్చే బలమైన నేతను పార్టీ ప్రధాన కార్యదర్శి పీఠంపై కూర్చోబెట్టాలని పార్టీ ముఖ్యులు యోచిస్తున్నారు. ధవాలేకు పశ్చిమబెంగాల్ ప్రాంతం నుంచి బలమైన మద్దతు ఉంది. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లగల సత్తా ధవాలేకు ఉందని తెలుస్తోంది. బీజేపీకి వ్యతిరేకంగా తాజా లోక్‌సభ ఎన్నికల వేళ విపక్షాలు 'ఇండియా'కూటమిగా ముందుకొచ్చి ఘోర వైఫల్యాన్ని చవిచూసిన నేపథ్యంలో మళ్లీ పార్టీల మధ్య సఖ్యత సాధించడంలో కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కొనసాగించడంలో నిష్ణాతుడైన నేత కోసం పార్టీ వేట మొదలెట్టడం తెల్సిందే.

తెరమీదకు బీవీ రాఘవులు పేరు

తెలంగాణ రాష్ట్రం నుంచి అత్యంత సీనియర్ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సైతం ప్రధాన కార్యదర్శి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ ఫైర్ బ్రాండ్ నాయకురాలు బృందా కారత్‌ను జనరల్ సెక్రటరీగా చూడాలని మరికొందరు నేతలు భావిస్తున్నారు. 75 ఏళ్లు దాటిన నేతను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోకూడదనే నిబంధనను పార్టీ అమల్లోకి తెచ్చింది. అయితే అరుదైన, అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనను పక్కనబెట్టే వీలుందని తెలుస్తోంది. అగ్రనేతను ఎన్నుకునే క్రమంలో గతంలో కేరళ, పశ్చిమబెంగాల్ వర్గాల నుంచి గట్టి పోటీ ఎదురైంది. 1996లో పశ్చిమబెంగాల్ నుంచి జ్యోతిబసు ప్రధానమంత్రి పదవికి అర్హుడని భావించినవేళ కేరళ వామపక్ష వర్గం ఈ నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకించింది. 2007లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకునే విషయంలోనూ పార్టీలో ఈ రెండు వర్గాల మధ్య ఏకాభిప్రాయం సాధ్యపడలేదు. 2015లో సీతారాం ఏచూరిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంటే ఆనాడు కేరళ ముఖ్య నేతలు ఎస్ఆర్ పిళ్లైకు మద్దతు పలికారు. తర్వాత ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. పార్టీ 24వ మహాసభలు మదురైలో జరుగుతున్న తరుణంలో ఆదివారం పార్టీ కేంద్ర కమిటీ తదుపరి పార్టీ ఎన్నికల కోసం అభ్యర్థుల పేర్లను ప్రకటించే వీలుంది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం, 6, ఏప్రిల్, 2025



శోభాయాత్రకు సర్వం సిద్ధం

శ్రీరామ నవమి శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం చారిత్రక సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభం కానుంది. -8లో



సమ్మర్ సీజన్‌లో.. 'స్టార్' ఫ్యాషన్..

సీజన్ మార్పులే కొత్త ఫ్యాషన్లకు రీజన్‌గా మారుతోంది. బాలీవుడ్ స్టార్స్ ఈ ట్రెండ్స్‌ను తారా పథంలోకి చేరుస్తున్నారు. - సిటీప్లస్‌లో



వాతావరణం

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





సన్‌డే.. ఐపీఎల్ సందడే!

ఐపీఎల్‌లో మరో ఆదివారం క్రికెట్ అభిమానులను అలరించేందుకు వచ్చింది. నేడు ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఈ సీజన్‌లో నగరంలో జరగనున్న మూడో మ్యాచ్ ఇది. సన్‌రైజర్స్‌కు ఈసారి విజయం కీలకం కానుంది. హైదరాబాదీ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ప్రత్యర్థి జట్టు గుజరాత్ తరఫున తన సొంత నగరంలో బరిలోకి దిగబోతున్నాడు. శనివారం రెండు జట్లు ఉప్పల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేశాయి.

డెడ్ స్టోరేజీకి చేరువలో

సాగర్ జలాశయం

నాగార్జున సాగర్ జలాశయం	
మొత్తం నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత మట్టం	517.10 అడుగులు

ఈ నెలాఖరులోగా అత్యవసర పంపింగ్‌కు సన్నాహాలు



నాగార్జున సాగర్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను అందించే నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరువతోంది. శనివారం నాటికి సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 517.10 అడుగులకు చేరింది. మరో ఏడు అడుగులు నీటిమట్టం దిగువకు చేరితే డెడ్ స్టోరేజీకి చేరుతుంది. శ్రీశైలం నుంచి దిగువకు నీరు నిలిపివేయడం, సాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీరు వదులుతుండటంతో హైదరాబాద్ తాగునీటి అవసరాల దృష్ట్యా కనీసం సాగర్ నీటి మట్టం 515 అడుగులు మెయింటెన్ చేయాలని ఇటీవల జలమండలి నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. వ్యవసాయ అవసరాల దృష్ట్యా ఈ నెల 15 వరకు నీరు విడుదల చేసే అవకాశం ఉండటంతో సాగర్ నీటి మట్టం మరింత పడిపోయే అవకాశం కనిపిస్తోంది. అక్కంపల్లి రిజర్వాయర్ నీటి నిల్వలు వారం రోజుల పాటు సరిపోయినా.. ఈ నెలాఖరులోగా డెడ్‌స్టోరేజీ నుంచి అత్యవసర పంపింగ్ తప్పదని అధికారులు భావిస్తున్నారు.

మూడోసారి..

నాగార్జు సాగర్ జలాశయంలో మూడోసారి అత్యవసర పంపింగ్‌కు జలమండలి సిద్ధమవుతోంది. మొదట 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో అత్యవసరంగా మోటార్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. గతేడాది కూడా నాగార్జున సాగర్‌లో అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించారు. ప్రస్తుతం మూడోసారి అత్యవసర పంపింగ్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి.

పెద్దమ్మా.. గెలిపించమ్మా!



పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ఎస్‌ఆర్‌హెచ్ ప్లేయర్లు నితీష్‌కుమార్‌రెడ్డి, అభిషేక్ శర్మ

బంజారాహిల్స్: సన్ రైజర్స్ జట్టు ఆటగాళ్లు నితీష్ కుమార్‌రెడ్డి, అభిషేక్ శర్మలు శనివారం ఉదయం జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్ చేరుకున్న ప్లేయర్లు నేరుగా పెద్దమ్మ దేవాలయానికి వెళ్లి అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు వీరికి పెద్దమ్మ తల్లి చిత్రపటాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఎస్‌ఆర్‌హెచ్ జట్టు వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు కీలక ఆటగాళ్లు అమ్మవారిని దర్శించుకున్నారు. జట్టును విజయ తీరాల వైపు నడిపించాలంటూ వీరు పూజలు నిర్వహించారు. ఇందుకోసమే అమ్మవారి ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అనంతరం వీరు ధ్వజస్తంభం వద్ద నాణేన్ని నిలబెట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆదివారం సాయంత్రం గుజరాత్ జట్టుతో ఎస్‌ఆర్‌హెచ్ తలపడనుంది.

రేపటి నుంచి చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు



చిలుకూరు బాలాజీ ఆలయం

మొయినాబాద్: వీసాల దేవుడిగా పేరొందిన చిలుకూరు బాలాజీ స్వామివారు బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యారు. చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రతి ఏటా శ్రీరామనవమి తర్వాత దశమి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 7న సెల్వర్ కూత్తుతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 14న చక్రతీర్థం, ధ్వజావరోహణంతో వేడుకలు ముగుస్తాయి. ఈ నేపథ్యంలో బాలాజీ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. ఇప్పటికే స్వామివారి రథం ఉత్సవాలకు ముస్తాబైంది. వాహన సేవలకు ఉపయోగించే వాహనాలను సిద్ధం చేశారు. ఆలయానికి రంగులు, సున్నం వేయించే పనులు చివరి దశకు చేరుకున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో..

మయూరం మాయం!

ప్రశ్నార్థకంగా మారిన నెమళ్ల మనుగడ

ఓఆర్‌ఆర్, లింకు, ప్రధాన రోడ్ల నిర్మాణంతో గుట్టలు నేలమట్టం

- శివారులో రోజుకో ప్రాంతంలో వీటి స్థావరాలకు గండి
- తాజాగా హెచ్‌సీయూలో పరిస్థితి మరింత దయనీయం
- జాతీయ పక్షి పరిరక్షణకు చర్యలు అవశ్యం
- ప్రభుత్వమూ ప్రత్యేక దృష్టి సారించాలని పక్షి ప్రేమికుల సూచన

రాయదుర్గం: జాతీయ పక్షి నెమలి మనుగడ ప్రమాదంలో పడింది. వాటి ఆవాస ప్రాంతాల్లో మనుగడ కష్టసాధ్యంగా మారుతోంది. నగర శివారులో ఒకప్పుడు పచ్చని పొలాలు.. రాతి, మట్టి, పొదలతో కూడిన భారీ గుట్టలన్నీ మాయమైపోవడంతో మయూరాల జీవనం దయనీయమవుతోంది. మైదాన ప్రాంతాల్లో ఆకాశ హర్మ్యాలు ఏర్పడడంతో నెమళ్ల పాలిట యమపాశమే అవుతున్నాయి. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీల ఏర్పాటు, ఔటర్ రింగురోడ్డు, లింకురోడ్లు, కొత్త ప్రధాన రోడ్ల నిర్మాణంతో గుట్టలను తొలచాల్సి రావడంతో వీటికి స్థావరాలు కనుమరుగయ్యే దుస్థితి దాపురించింది. కాగా.. ఇటీవల హెచ్‌సీయూలో చోటు చేసుకున్న పరిస్థితి కూడా నెమళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందనే భయాందోళన అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా నెమళ్ల పట్ల శ్రద్ధ వహించి ఉన్న స్థావరాలను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పక్షి ప్రేమికులు సూచిస్తున్నారు.

భారీ గుట్టల్ని తొలచడంతో..

- రాయదుర్గం, ఖాజాగూడ, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి వంటి ప్రాంతాలలోని భారీ గుట్టలను తొలచి ప్రధాన రోడ్లు, లింకురోడ్ల నిర్మాణం, ఐటీ, ఇతర సంస్థల అద్దాల మేడల నిర్మాణంతో నెమళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ వంటి ప్రాంతాల ఏర్పాటుతో నెమళ్ల స్థావరాలు మాయమవడం ఆరంభమైంది. ఆ తర్వాత ఓఆర్‌ఆర్ నిర్మాణంతో పాటు అనువైన చోటికి నెమళ్లు వలస వెళ్లాల్సి వచ్చింది.

మయూరాల స్థావరాలు ఇవే..

- గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ
- టెలికామ్ నగర్‌లోని ఉర్దూ విశ్వవిద్యాలయం
- నానక్‌రాంగూడలోని ఎమ్మార్ ప్రాపర్టీస్
- కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్ ప్రాంగణం

నెమళ్లు పదుల సంఖ్యలో ఉన్న ప్రాంతాలివే..

- టెలికామ్‌నగర్‌లోని నిథమ్ క్యాంపస్
- గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్
- ట్రిపుల్ ఐటీ క్యాంపస్
- బయోడైవర్సిటీ పార్కు ప్రాంగణం
- రాయదుర్గం సర్వే నెంబర్ 83లోని కొద్ది ప్రాంతం
- జీఎంసీ బాలయోగి స్టేడియం
- రాయదుర్గంలోని వైకుంఠ మహా ప్రస్థానం పరిసరాలు
- రాయదుర్గంలోని మల్లన్నగుట్ట, లిడ్‌క్యాప్ క్యాంపస్‌లో కూడా నెమళ్ల స్థావరాలలో ముఖ్యమైనవి.

ఇవేకాకుండా కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్, మాదాపూర్‌లోని శిల్పారామం వంటి ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో మయూరాల స్థావరాలు ఉన్నాయి.





పరిరక్షణ చర్యలిలా..

నెమలి మన జాతీయ పక్షి. దీనిని పరిరక్షించేందుకు అందరూ చొరవ తీసుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

- నెమళ్ల స్థావరాలను గుర్తించి వాటిని కొనసాగించేలా చేయాలి.
- బ్లడ్‌ఫ్లూ సోకకుండా తగిన చర్యలు చేపట్టాలి.
- నెమళ్ల స్థావరాలున్న చోట వాహనాల రాకపోకలను పరిమితం చేయాలి.
- నెమళ్ల స్థావరాలుండే చోట మితిమీరిన శబ్దాలు, వాహనాల హారన్ మోతను తగ్గించాలి.
- నెమలి సంతతి వృద్ధి చెందటానికి అవసరమైన చెట్ల పెంపకం మరింత పెంచాలి.
- ఇటీవల హెచ్‌సీయూ, నిథమ్, సైబరాబాద్ కమిషనరేట్‌లలో చిట్టడవుల పెంపకం చేపట్టిన విధంగానే అన్ని చోట్లా వీటి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి.
- నెమళ్లు ఉండే చోట విద్యుత్ తీగలు సాధ్యమైనంతగా భూగర్భంలో నిర్మించాలి.
- కుక్కలు, ఇతర జంతువుల నుంచి వీటికి పూర్తి రక్షణ కల్పించాలి.
- వేటగాళ్ల బారిన నెమళ్లు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- వేసవిలో హెచ్‌సీయూ, ఐఎస్‌బీల తరహాలో నెమళ్లు ఉండే చోట నీటి తొట్లను ఏర్పాటు చేయాలి
- నెమళ్ల కోసం శివారులో ప్రత్యేకంగా ఓ పార్కును ఏర్పాటు చేయాలి.
- ఆకు రాలే కాలంలో వీటి పట్ల మరింత ప్రత్యేక శ్రద్ధ అవసరం.

- సీసీ కెమెరాల ఏర్పాటుకు కసరత్తు
- మహిళలకు అవగాహన కార్యక్రమాలు
- బోగీల్లో సీసీ కెమెరాల బిగింపునకు కసరత్తు



రైల్వే భద్రత కట్టుదిట్టం!

ఎంఎంటీఎస్‌ల్లో నిరంతర నిఘా

సికింద్రాబాద్– మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలులో అత్యాచార యత్నం ఘటన రైల్వే పోలీసుల డొల్లతనాన్ని బట్టబయలు చేసింది. ఘటన జరిగి 15 రోజులు గడిచినా ఈ కేసు మిస్టరీ వీడనేలేదు. అధునాతన సాంకేతికతను సొంతం చేసుకున్నామంటూ గొప్పలు చెప్పే నగర పోలీసులు.. అత్యాచార యత్నం కేసు గుట్టు విప్పలేకపోయారు. కాగా.. ఈ ఘటన రైల్వే పోలీసులకు కనువిప్పు కలిగించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలకు సంబంధించి కసరత్తు చేస్తున్నారు. ఇటు జీఆర్‌పీ, అటు ఆర్‌పీఎఫ్ పోలీసు బాస్‌లు మహిళలే ఉండడంతో ఎంఎంటీఎస్ రైళ్లు, రైల్వేస్టేషన్లలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. – సికింద్రాబాద్

తనపై లైంగిక దాడికి యత్నించడంతో ఓ యువతి బోగీ నుంచి కిందకు దూకిన ఘటనతో ఎంఎంటీఎస్ రైళ్లలో నిరంతర పోలీసు భద్రత అందుబాటులోకి వచ్చింది. ఉదయం 5 మొదలు అర్ధరాత్రి 12 గంటల వరకు రైల్వే పోలీసులు ఎంఎంటీఎస్ రైళ్లలో పహారా కాసేలా చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల పరిధిలోని అన్ని మార్గాల్లో రాకపోకలు సాగించే ఎంఎంటీఎస్ రైళ్లలో ఒక్కో రైలుకు ఇద్దరు ఆర్‌పీఎఫ్ సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. ఇందుకోసం వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేసిన ఆర్‌పీఎఫ్ ఆఫీసర్లు ఏ రూటు ఎంఎంటీఎస్‌లో ఎవరు డ్యూటీలో ఉన్నారు? ఆ రైలులో మహిళల బోగీల పరిస్థితి ఏంటన్న విషయాన్ని వీడియో కాల్స్, ఫొటోల పోస్టింగ్‌ల ద్వారా ఆరా తీస్తున్నారు.

రైలు బోగీల్లో సీసీ కెమెరాలు..

నగరంలో నడుస్తున్న నాలుగైదు ఎంఎంటీఎస్ రైళ్లలో మాత్రమే సీసీ కెమెరాలు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. సత్వరమే అన్ని ఎంఎంటీఎస్‌లలోని మహిళల బోగీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే అంశాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు పరిశీలిస్తున్నారు. మహిళలు వారికి కేటాయించిన బోగీల్లో మాత్రమే ఎక్కాలని అవగాహన కలిగిస్తున్నారు.

స్టేషన్లలో భద్రత పెంపు..

30 స్టేషన్ల నుంచి సుమారు 92 వరకు ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తున్నాయి. ఇందులో 40 నుంచి 60 వేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నట్టు అంచనా. అత్యాచార ఘటనకు ముందు కేవలం 9 ఎంఎంటీఎస్ స్టేషన్లలో మాత్రమే ఒక్కో స్టేషన్‌లో ఒక్కో కానిస్టేబుల్ చొప్పున విధుల్లో ఉండేవారు. ఘటన అనంతరం ప్రయాణికుల రద్దీ ఎక్కువ ఉండే 15 రైల్వేస్టేషన్లలో ఆర్‌పీఎఫ్ పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆర్‌పీఎఫ్ పోలీసుల్లో కూడా సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో జీఆర్‌పీ పోలీసులతో సమన్వయం చేసుకుని క్రమేణా అన్ని స్టేషన్లలో పోలీసు పహారా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అత్యాచార యత్నం ఘటన నేపథ్యంలో రైల్వే పోలీసులు తీసుకుంటున్న రక్షణ చర్యల పట్ల మహిళా ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైలు బోగీల్లోనే కాకుండా ఎంఎంటీఎస్ స్టేషన్లలోనూ భద్రత పెంచాలని చెబుతున్నారు. ఇది నిరంతర కొనసాగించాలని కోరుతున్నారు.



ఎంఎంటీఎస్ రైలులో మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం

రైల్వే ప్రయాణికులకు రక్షణ కల్పించడం కోసం ప్రత్యేక మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామని జీఆర్‌పీ సికింద్రాబాద్ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. మహిళలు ప్రమాదకర పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో 139 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు ఒక్కో రైలుకు ఇద్దరేసి గార్డులను ఎస్కార్టు డ్యూటీలో నియమించామని ఆర్‌పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబాస్మిత ఛటోపాధ్యాయ బెనర్జీ తెలిపారు.

సమ్మర్ టూర్.. షాన్‌దార్!

ఉత్తరాది పర్యటనకు త్వరలో గురుకృప ప్రత్యేక రైలు

- అన్ని సదుపాయాలతో భారత్ గౌరవ్ రైళ్ల నిర్వహణ
- ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించిన ఐఆర్‌సీటీసీ



సాక్షి, సిటీబ్యూరో: వేసవి పర్యటనలకు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ప్రయాణికుల రద్దీ మేరకు చర్లపల్లి టెర్మినల్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయడంతో పాటు ఐఆర్‌సీటీసీ టూర్‌ల కోసం భారత్ గౌరవ్ రైళ్ల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. సాధారణంగా హైదరాబాద్ నుంచి ప్రతి రోజు సుమారు 2.5 లక్షల మంది ప్రతిరోజూ రైలు ప్రయాణం చేస్తుండగా.. వేసవిలో రద్దీ పెరగనుంది. సుమారు 3 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లను నడిపేందుకు చర్యలు చేపట్టారు. సికింద్రాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల మీదుగా ఇప్పటికే భారత్‌గౌరవ్ రైళ్లు ఉత్తర, దక్షిణ భారత యాత్రల కోసం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే తాజాగా వేసవి టూర్‌లను దృష్టిలో ఉంచుకొని ఉత్తరాది పర్యటన కోసం గురుకృప భారత్ గౌరవ్ రైలును నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఈ రైలు ఈ నెల 23న బయలుదేరనుంది. మొత్తం 9 రాత్రులు, 10 పగళ్లు ఈ పర్యటన ఉంటుందని పేర్కొన్నారు.

గురుకృప టూర్ ఇలా..

గురుకృప రైలు ఈసారి విజయవాడ నుంచి బయలుదేరి గుంటూరు, నల్లగొండ, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్ నగర్, బల్లార్షా, వార్ధా, నాగ్‌పూర్ స్టేషన్‌ల మీదుగా హరిద్వార్, రిషికేశ్, ఆనంద్‌పూర్ సాహిబ్, నైనాదేవి మందిరం, అమృత్‌సర్, శ్రీ మాతా వైష్ణోదేవి కాత్ర పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల సందర్శన అనంతరం తిరిగి నగరానికి చేరుకోనుంది. ఈ పర్యటనలో హరిద్వార్‌లో సాయంత్రం గంగా హారతి, మానసాదేవి మందిరం సందర్శన ఉంటుంది. రిషికేష్‌లో రామ్ ఝూలా, లక్ష్మణ ఝూలా దర్శనం, ఆనంద్‌పూర్ సాహిబ్‌లో సిక్కుల పుణ్య క్షేత్రం గురుద్వార దర్శనంతో పాటు నైనాదేవి మందిరం సందర్శన ఉంటాయి. అమృతసర్‌లో సిక్కుల పవిత్ర స్థలం స్వర్ణదేవాలయంతో పాటు గురుద్వార దర్శనం, శ్రీ మాతా వైష్ణో దేవి కాత్రలో వైష్ణో దేవి ఆలయ సందర్శన ఉంటాయి. కాత్రలో 26 కిలోమీటర్ల పర్వతారోహణకు హెలికాప్టర్, డోలీ తదితర సదుపాయాలు ఉంటాయి. ఐఆర్‌సీటీసీ ప్యాకేజీలో రైలు ప్రయాణం, రోడ్డు రవాణా, హోటల్, భోజన వసతి తదితర సదుపాయాలు ఉంటాయి. ఆలయాల సందర్శనకు ప్రవేశ రుసుము, సైట్‌సీయింగ్ ఖర్చులు, డోలి, హెలికాప్టర్, బ్యాటరీ కారు వంటి సదుపాయాలకయ్యే ఖర్చులను టూరిస్టులే భరించాలి. గురుకృప రైలులో మొత్తం 718 బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

బెర్తులు- ప్యాకేజీ చార్జీ..

కేటగిరీ	బెర్తుల సంఖ్య	చార్జీ (రూపాయలలో)
స్లీపర్	460	18,510
థర్డ్ ఏసీ	206	30,730
సెకండ్ ఏసీ	52	40,685

అదనపు సదుపాయాలివీ..

పర్యాటకులకు పూర్తి భద్రతతో కూడిన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. రైలులో టూరిస్ట్ ఎస్కార్ట్‌లతో పాటు పర్యటన సమయంలో టూర్ మేనేజర్లు ఉంటారు. ప్రయాణికులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తారు. ఈ పర్యటన కోసం బుక్ చేసుకున్నవారికి ప్రయాణ సమయానికి 3 రోజుల ముందు బెర్తులను ఖరారు చేస్తారు. పర్యటన సమయంలో ఉదయం టీ, కాఫీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, వాటర్ బాటిల్ వంటి సదుపాయాలు, త్రీస్టార్ హోటల్ వసతిని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి




నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బషీర్‌బాగ్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేషన్ల చైర్మన్‌లు ప్రీతమ్, శివసేనా రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు హాజరై బాబూ జగ్జీవన్‌రామ్‌కు పుష్పాంజలి ఘటించారు.

మజ్లిస్‌కు బానిసలుగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు మజ్లిస్‌కు బానిసలుగా మారాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు పోటీ చేస్తాయనుకున్నాం.. కానీ రాష్ట్రంలో పరిస్థితులు చూశాకా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనన్న విషయం బహిర్గతమైందన్నారు. శనివారం ఆయన బషీర్‌బాగ్ చౌరస్తాలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు సీఎం తదితరుల నివాళి

ఐఏపీబీ ఆగ్నేయాసియా ప్రాంతీయ అధ్యక్షుడిగా డాక్టర్ రోహిత్ ఖన్నా

బంజారాహిల్స్: ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ప్రజారోగ్య డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రోహిత్ ఖన్నా ఐఏపీబీ (ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్) ఆగ్నేయాసియా ప్రాంతీయ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు. దృష్టి లోపాన్ని అరికట్టడంతో పాటు ప్రాంతీయ, జాతీయ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు ఆయన పని చేస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

కన్న తండ్రిపై కత్తితో దాడి

విజయనగర్‌కాలనీ: టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో కన్న తండ్రిపై ఓ యువకుడు కత్తితో దాడిచేశాడు. ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపిన మేరకు.. జిర్రా మహబూబ్ కాలనీలో మహ్మద్ ఇంతియాజ్ (50) అతని కుటుంబ సభ్యులతో నివసిస్తూ ఆటోడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. అతని కుమారుడు మహ్మద్ పర్వేజ్(22) ఆటో నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పర్వేజ్ స్వల్ప విషయమై తండ్రితో గొడవపడి ఇంట్లో వస్తువులను విసిరి వేయగా అడ్డుకోబోయిన తండ్రిపైకి కోపంతో తన వద్ద ఉన్న కత్తితో దాడిచేశాడు. ఈ సంఘటనలో అతని గొంతుకు గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

బాలికపై లైంగిక దాడి.. నిందితుడి రిమాండ్


సంతోష్ కుమార్

సికింద్రాబాద్: రైలులో మైనర్‌బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈనెల 2న రక్సెల్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ బాలిక (12) రైలు బోగీలోని టాయ్‌లెట్‌కు వెళ్లింది. ఓ ఆగంతకుడు ఆమెను లైంగిక వేధింపులకు గురిచేయడంతోపాటు, వీడియోలు చిత్రీకరించాడు.దీంతో బాలిక తండ్రి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు బీదర్ మన్నాడ్ జిల్లా ఖజోలి గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ (22)ను అదుపులోకి తీసుకున్న సికింద్రాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మహారాష్ట్ర రాష్ట్రం కెల్బార్ ప్రాంతంలో ఘటన జరిగిన నేపథ్యంలో కేసు తదుపరి విచారణ నిమిత్తం ఇత్వారి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

టీవీ చూసేందుకు వచ్చిన బాలికపై..


నిందితుడు కిషన్

మల్కాజిగిరి: టీవీ చూసేందుకు వచ్చిన చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన మేరకు.. పీఎస్ఆర్ కాలనీకి చెందిన కిషన్(55) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటి ఎదురుగా ఓ మహిళ పిల్లలతో కలిసి ఉంటోంది. ఈ నెల 3న రాత్రి కిషన్ ఇంట్లో టీవీ చూడడానికి వెళ్లిన బాలిక (11) పై కిషన్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బయటకు వెళ్లిన తల్లి రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత బాలిక ఏడుస్తుండడంతో ఆరా తీయగా జరిగిన దారుణం చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పరారీలో ఉన్న నిందితున్ని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శోభాయాత్రకు సర్వం సిద్ధం

- 20 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు
- ప్రారంభించనున్న గవర్నర్
- సీతారామ్‌బాగ్ నుంచి హనుమాన్ టేక్డీ వరకు కొనసాగనున్న శోభాయాత్ర


శోభాయాత్రలో ప్రదర్శనకు సిద్ధమైన భారీ శ్రీరాముడి విగ్రహం

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రకు పలు శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా చారిత్రాత్మక సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభమవుతుంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించనున్నారు. సీతారామ్‌బాగ్ నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర కోఠి హనుమాన్‌టేక్డీ వరకు కొనసాగుతుంది. సీతారామ్‌బాగ్ నుంచి భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుక నిర్వహించనున్నారు. ధూల్‌పేట మాగ్రా నుంచి ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పాల్కీ యాత్ర నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ధూల్‌పేట్ గంగాబౌలి నుంచి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర కొనసాగుతుంది. మూడు ప్రాంతాల నుంచి కొనసాగే శోభాయాత్రలు మంగళ్‌హాట్ ప్రధాన రోడ్డులోని అనిత టవర్ వద్ద కలుస్తాయి.

పాల్కీ యాత్రకు ఎమ్మెల్సీ కవిత పూజలు

ధూల్‌పేట మాగ్రా నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ నవమి పాల్కీ యాత్రను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 12 గంటలకు పూజలు నిర్వహించి యాత్రలో పాల్గొంటారని నిర్వాహకులు ఆనంద్‌సింగ్, పప్పుమాత్రేలు తెలిపారు.

రాజాసింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర

గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి శోభాయాత్ర ఆదివారం ఒంటి గంటకు ప్రారంభమవుతుంది. గంగాబౌలి నుంచి రాజాసింగ్ ఈ శోభాయాత్రను ప్రారంభిస్తారు.

శోభాయాత్ర కొనసాగే రూట్..

శ్రీరామ నవమి శోభాయాత్ర, పాల్కీ శోభాయాత్ర, రాజాసింగ్ శోభాయాత్రలు మంగళ్‌హాట్‌లో కలుసుకొని పురానాపూల్, జుమ్మేరాత్‌బజార్, చుడీబజార్, భేగంబజార్ ఛత్రి, సిద్దిఅంబర్‌బజార్, గౌలిగూడ, పుత్లీబౌలి, కోఠి హనుమాన్ టేక్డీ వరకు కొనసాగుతాయి. ఊరేగింపులో శ్రీరాముడితో పాటు పలు దేవుళ్ల విగ్రహాలుంటాయి.

సీసీ కెమెరాలతో పోలీసుల నిరంతర పర్యవేక్షణ

నగర పోలీసులు 20 వేల మంది పోలీసులతో శోభాయాత్రకు భారీ ఎత్తున బందోబస్తు చేస్తున్నారు. సీతారామ్‌బాగ్ నుంచి యాత్ర కొనసాగే హనుమాన్ టేక్డీ వరకు వేలాది మంది పోలీసులతో బందోబస్తు చేపడుతారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, నగర జాయింట్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్‌లు బందోబస్తును స్వయంగా పర్యావేక్షిస్తారు. సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్, ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లీలు శోభాయాత్రకు తమ తమ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, అదనపు బలగాలతో బందోబస్తు చేపడుతున్నారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా శోభాయాత్రను పర్యావేక్షిస్తారు.

పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు..

శ్రీరామ నవమి శోభాయాత్రకు పోలీస్ శాఖతో పాటు జీహెచ్ఎంసీ, ఆర్ అండ్‌బీ, విద్యుత్, వాటర్ బోర్డు, ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మూడు లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు వాటర్‌బోర్డు జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు

శ్రీరామ నవమి శోభాయాత్ర కొనసాగే ప్రాంతాల్లో వాహనాలను ఇతర ప్రాంతాల మీదుగా పోలీసులు దారిమళ్లిస్తున్నారు. సీతారామ్‌బాగ్‌కు వచ్చే వాహనాలను మల్లేపల్లి, నాంపల్లి మీదుగా దారిమళ్లిస్తారు. బోయిగూడ కమాన్ నుంచి దారుసలాం ఆగాపూరా మీదుగా, పురానాపూల్ నుంచి వాహనాలను జియాగూడ కార్వాన్ వైపు, బేగంబజార్ నుంచి వచ్చే వాహనాలను గోషామహల్, ఇతర ప్రాంతాలకు దారిమళ్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడిగిన పాట వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా..

ఛానల్ సిబ్బందిని విసిగిస్తున్న యువతి..

బంజారాహిల్స్: తాను కోరిన పాటను ప్రసారం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ యువతి బెదిరించడంతో ఛానల్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లోని ఓ టీవీ ఛానెల్ రోజూ మ్యూజిక్ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రసారం చేస్తుంది. ఓ యువతి ఈ కార్యక్రమానికి ప్రతిరోజూ ఫోన్ చేస్తూ ఒకే పాటను కోరుకుంటుంది. ఒకసారి ప్రసారం చేసిన తర్వాత కూడా మళ్లీ ఫోన్ చేసి అదే పాట కావాలంటూ పట్టుబడుతూ నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఫోన్‌లో అడిగిన దానికి సమాధానం చెప్పకపోతే బాగుండదంటూ హెచ్చరించేది. తాజాగా శనివారం ఫోన్ చేసిన ఆమె నేను కోరిన పాటను వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించింది. దీంతో ఆందోళన చెందిన టీవీ నిర్వాహకులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడున్నారో?

- ఇంకా లభించని ఆ ఆరుగురి ఆచూకీ
- విజయవాడ వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు


మహేశ్- ఉమ దంపతులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గల్లంతైన ఆరుగురు కుటుంబ సభ్యులు విజయవాడ వెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వారి ఆచూకీ కనిపెట్టేందుకు బోయిన్‌పల్లి పోలీసులు ప్రత్యేక బృందాన్ని విజయవాడ పంపించారు. ఆరుగురిలో ఒక్కరి వద్దే సెల్‌ఫోన్ ఉండగా అది కూడా స్విచ్ఛాఫ్ కావడంతో వారి ఆచూకీ కనుక్కోవడం కొంత కష్టంగా మారినట్లు తెలుస్తోంది. బోయిన్‌పల్లికి చెందిన మహేశ్ తన భార్య ఉమ, ముగ్గురు పిల్లలు రిషి, చైతు, శివన్, మరదలు సంధ్యతో కలిసి ఈ నెల 1న ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయారు. రెండు రోజుల అనంతరం మహేశ్ బావమరిది భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ మొదలు పెట్టారు. మహేశ్ కుటుంబం 1వ తేదీన బోయిన్‌పల్లి నుంచి నేరుగా, ఇమ్లీబన్‌కు చేరుకుని అక్కడ విజయవాడకు వెళ్లే గరుడ బస్సు ఎక్కినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. మరుసటి రోజు ఉదయం విజయవాడలో దిగినట్లు కూడా సీసీ కెమెరాల్లో రికార్డయింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బాలంరాయి పంప్‌హౌజ్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న మహేశ్, తోటి ఉద్యోగులతో ముభావంగానే ఉండేవాడని తెలుస్తోంది. మహేశ్ కుమారుడు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో తీర్థయాత్రలకు వెళ్లి ఉండచ్చొని మహేశ్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వీరి గల్లంతుకు గల ఇతరత్రా కారణాలు ఏవైనా ఉంటాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఇతర కుటుంబ సభ్యుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. గల్లంతయిన వారి ఆచూకీ తెలిశాకే పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: మానసిక స్థితి సరిగా లేని గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆదిల్ల కృష్ణ భార్య ఆదిల్ల నర్సమ్మ(48)కు మానసిక స్థితి సరిగా లేక పోవడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఎటువంటి పని చేయవద్దని.. ఇంట్లోని ఉండమని గత నెల 20వ తేదీన ఆమెకు భర్త చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురై ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- నిందితుడి అరెస్ట్


నిందితుడు కొర్రా రాజ్‌చౌహాన్

చిలకలగూడ : మ్యాట్రిమోనియల్ యాప్ ద్వారా పరిచయం చేసుకొని యువతిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన మేరకు.. చిలకలగూడ ఠాణా పరిధికి చెందిన ఓ యువతి జీవన్‌సాథీ యాప్‌లో తన వివరాలను నమోదు చేసింది. నల్గొండ జిల్లా బీటీఎస్ శ్రీనివాసకాలనీకి చెందిన కొర్రా రాజా అలియాస్ కొర్రా రాజ్‌చౌహాన్ (34) సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తూ బండ్లగూడ నాగోల్‌లో నివాసముంటున్నాడు. యాప్‌లో యువతి వివరాలు తెలుసుకుని సంప్రదించాడు. ఆ తరువాత ఫేక్ వివరాలను ఆమెకు పంపించాడు. అవన్నీ చూసిన ఆమె అతనితో వివాహానికి అంగీకరించింది. మూడు నెలల పాటు ఆమెతో చనువుగా ఉండి వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు సేకరించి, బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. తాను మోసపోయానని గ్రహించిన ఆమె అతన్ని వదిలించుకునేందుకు రూ. 1.50 లక్షలు చెల్లించింది. వేధింపులు పెచ్చుమీరడంతో ఈనెల 1న చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు నిందితుడు కొర్రా రాజ్‌చౌహాన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చేసిన తప్పు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిల నేతృత్వంలో కేసును ఛేదించినట్లు చిలకలగూడ సీఐ అనుదీప్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన చిలకలగూడ పోలీసులకు ఉన్నతాధికారులు అభినందించి రివార్డులు ప్రకటించారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య



సికింద్రాబాద్: క్రికెట్ బెట్టింగ్ బారిన పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపిన మేరకు.. సుచిత్ర బీహెచ్ఈఎల్ కాలనీలో ఉంటున్న రజ్వీర్‌సింగ్ ఠాకూర్ (25) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నతనంలోనే తల్లితండ్రులు ప్రమాదంలో మృతి చెందడంతో రజ్వీర్‌సింగ్, ఇతని సోదరుడు చిన్నాన్న ఇంట్లో ఉంటున్నారు. మద్యానికి బానిస కావడంతో స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిన రజ్వీర్‌సింగ్ ఇటీవలి ఐపీఎల్ మ్యాచుల్లో క్రికెట్ బెట్టింగుల కోసం తలకు మించిన అప్పులు చేశాడు. అయితే అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఇంట్లోంచి వెళుతున్నానని ఇంట్లో వారికి చెప్పి బైక్‌పై బయలుదేరాడు. రజ్వీర్‌సింగ్ నేరుగా సనత్‌నగర్-అమ్ముగూడ రైల్వేస్టేషన్ల మధ్య వేగంగా వస్తున్న గూడ్స్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 35, క్యాప్సికం 43, పచ్చికాకరకాయ 35, పందిరి బీర 38, క్యాబేజీ 08, క్యారెట్ 15, దొండకాయ 28, గుండు బీన్సీస్ 65, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 38, మొరంగడ్డ 18, కందగడ్డ 60, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, మునగకాయ 4, మామిడికాయ 30, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 23 ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

శ్రీరామనవమి వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్యే దానంకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీ పర్వతాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించబోయే శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలంటూ ఆలయ కమిటీతో పాటు బస్తీ కమిటీ నేతలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఫిలింనగర్‌లో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని బస్తీవాసులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ఆలయ భూమి కబ్జాకు యత్నం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–10లోని ఇబ్రహీంనగర్‌లోని దేవాలయ భూమిని కొంత మంది దర్జాగా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు నెలల క్రితం చెత్త వేయడంతో ప్రారంభమైన తతంగం మెల్లగా కబ్జాకు తెర తీసినట్లు సమాచారం. మూడు రోజులుగా అక్కడ చిన్న చిన్న తడికలతో గుడిసె వేయడం ప్రారంభించారని శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఆ తడికలను అడ్డం పెట్టుకుని వెల్డింగ్ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని బస్తీవాసులు గుర్తించి ఈ వ్యవహారాన్ని గమనించి పనులు చేస్తున్న వారిని ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఈ భూమి మాది ఎవరేం చేస్తారో చేసుకోండి అంటూ ఎదురు తిరుగుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని దేవాలయానికి చెందిన ఈ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

మహిళా బిల్లులో సబ్ కోటా అమలు చేయాలి



సునీతను గజమాలతో సన్మానిస్తున్న భాగ్యలక్ష్మి

హిమాయత్‌నగర్: మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోటాను అమలు చేయాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. బలహీన వర్గాల మహిళలను నేటి పాలకులు కేవలం ఓటు బ్యాంకు వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఓబీసీ మహిళా సెమినార్ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, దానకర్ణ చారీ అధ్యక్షతన జరిగింది. ఓబీసీ మహిళా సెంట్రల్ కమిటీ అధ్యక్షురాలిగా డాక్టర్ పోశం సునీత శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆమెను గజమాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా బిల్లు పాస్ కావడం కోసం రెండు దశాబ్దాలుగా జాతీయ ఓబీసీ మహిళా సమాఖ్య పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. సమావేశంలో యు.చిన్నయ్య, కె.పరమేష్, సుజాత, శిరీష, శ్రీనిధి, రాము తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సీనియర్ సిటిజన్స్ చేయూత

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ ది నెస్ట్ వృద్ధాశ్రమానికి చేయూతనందించారు. కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.54,350ల విలువైన రెండు ఇన్వెర్టర్లు, 5 సీలింగ్ ఫ్యాన్లను శనివారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, సెక్రటరీ ఉమామహేశ్వరరావు, ఈసీ సభ్యులు వేణుగోపాలారావు, ఎంఎస్ఆర్‌మూర్తితో పాటు ఆశ్రమ నిర్వాహకులు అరుణ కుమారి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం..

అందరికీ ఆహ్వానం



నందినగర్‌లో ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం



సోమాజిగూడ కుమ్మరిబస్తీలో షామియానాలు

బంజారాహిల్స్: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి ఆలయాలన్నీ అత్యంత సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ వేడుకను ఆదివారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆలయాలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో కళకళలాడుతున్నాయి. భక్తుల కోసం ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఆలయాలు, బహిరంగ మైదానాల్లో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు, బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.

అన్నదానాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు..

జూబ్లీహిల్స్ రోడ్డు నెం.18/15లో ఉన్న శ్రీసీతారామస్వామి దేవాలయం సముదాయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఉదయం 9 నుంచి శ్రీసీతారాముల కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో, బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో, బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని రామాలయంలో, ఆనంద్‌నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో, ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీలో, ఫిలింనగర్ పర్వతాంజనేయ స్వామి ఆలయంలో, శ్రీకృష్ణానగర్‌లోని హనుమాన్ దేవాలయంలో, శ్రీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా జరగనున్నాయి. ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో..

బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో ఉదయం 11గంటలకు, బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీనగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో, ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్ నగర్ బస్తీలో అభయాంజనేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌లో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్ ఆక్రమణలు



బంజారాహిల్స్ రోడ్ నెం.1 తాజ్‌కృష్ణా ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు

బంజారాహిల్స్: పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. స్థానిక నేతల సహకారంతో సదరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా డబ్బాలు, నిర్మాణాలు చేపడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ఆక్రమణలు తొలగించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ డబ్బాల చాటున రాత్రి పూట కొంత మంది ఆవారా యువకులు సిగరెట్లు, గంజాయి తాగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు.

పిల్లలను గ్యాడ్జెట్లకు దూరంగా ఉంచండి



హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: పిల్లలు గ్యాడ్జెట్లకు దూరంగా ఉండేవిధంగా చూడాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. బంజారాహిల్స్ రెయిన్‌బో పిల్లల ఆస్పత్రిలో ఆటిజంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులు చాలా కీలకమని తెలిపారు. ప్రతిరోజూ పిల్లలు కనీసం పది వేల పదాలు వినేవిధంగా చూడాలని సూచించారు. ఆటిజం అనేది దీర్ఘకాలిక వ్యాధి అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో పిల్లల ఆస్పత్రి వైద్యులు బీవీ రామ్‌కుమార్, లోకేష్ లింగప్ప, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీడియాట్రిక్ న్యూరాలజిస్టులు, చైల్డ్ సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, థెరపిస్టులు, స్పెషల్ ఎడ్యుకేటర్లు సుమారు 250 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకులు



రహమత్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌కు చెందిన బోరబండ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. డివిజన్‌లోని వీకర్స్ సెక్షన్స్‌కు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ యూసుఫ్ తన అనుచరులతో కలిసి శనివారం పార్టీలో చేరారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అశోక్, నాయకుడు కాసుల మహేష్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీషర్టు దొంగిలించావంటూ యువకుల దాడి

బంజారాహిల్స్: టీషర్టు దొంగిలించాడని దారి కాచిన ఇద్దరు యువకులు ఓ యువకుడిని తీవ్రంగా కొట్టిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. సుంకరి సదానంద్‌గౌడ్ అనే వ్యక్తి బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని ఇందిరానగర్ అమృత బార్ ఎదురుగా డార్మిటరీలో ఉండేవాడు. నాలుగు రోజుల క్రితం ఖాళీ చేసి వెళ్లిపోయాడు. అయితే అదే డార్మిటరీలో ఉంటున్న ముగ్గురు వ్యక్తులు శనివారం ఉదయం గ్రీన్ బావర్చి హోటల్ వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న సదానంద్‌ను అడ్డగించారు. డార్మిటరీలో మా టీ షర్టు దొంగిలించావంటూ తీవ్రంగా కొట్టారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సదానంద్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

వ్యక్తిపై అకారణంగా దాడి

వెంగళరావునగర్: అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వైజాగ్ ప్రాంతానికి చెందిన జి.శ్రావణ్‌కుమార్, శ్రీకాకుళం ప్రాంత నివాసి కల్యాణ్ ఇరువురూ కొంతకాలంగా యాదగిరినగర్‌లో ఒకే రూంలో ఉంటున్నారు. ఇద్దరూ సినిమా షూటింగ్స్‌లో బస్సు డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో 4వ తేదీన శ్రావణ్‌కుమార్ తన సమయం అయిపోయిందని సామాన్లు తీసుకుని రూం ఖాళీ చేసి షూటింగ్‌కు వెళ్లాడు. అయితే కల్యాణ్ రూమ్ ఖాళీ చేయలేదని తెలుసుకుని సారథి స్టూడియో వద్ద అదే రోజు అర్ధరాత్రి అడిగాడు. దాంతో ఆగ్రహించిన కల్యాణ్ ఒక్కసారిగా శ్రావణ్‌పై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాల్లో ఉన్నాడని ఉద్యోగమిస్తే..

వెంగళరావునగర్: కష్టాల్లో ఉన్నాడని ఉద్యోగమిస్తే నగదు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కాజేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం కేవీ సుబ్బారావు వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బి.సంతోష్‌కుమార్ తనకు ఉద్యోగం కావాలని కోరగా అతడి పరిస్థితిని అర్థం చేసుకుని సుబ్బారావు సూపర్‌వైజర్‌గా ఉద్యోగమిచ్చాడు. సంతోష్‌కుమార్ జనవరి 21న ఉద్యోగంలో చేరాడు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థుల వద్ద ఫీజు వసూలు చేసి ఓనర్‌కు ఇవ్వడం లేదు. మార్చి 15వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు దాదాపు రూ.1.21 లక్షలు ఫీజులు వసూలు చేసి ఓనర్‌కు ఇవ్వకుండా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టాడు. దాంతో అతడిపై చర్యలు తీసుకోవాలని హాస్టల్ యజమాని సుబ్బారావు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

వెంగళరావునగర్: కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అనిత, సంజీవకుమార్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గత నెల 31వ తేదీన తల్లికి చిన్న కుమార్తెకు వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో తనకు ప్రైవేట్ జాబ్ వచ్చిందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం తన సోదరికి ఫోన్ చేసి మధురానగర్ హాస్టల్‌లో ఉంటున్నట్లు చెప్పి ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ చేసింది. ఐదు రోజులైనా కుమార్తె ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ చేసి ఉండటంతో తల్లి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రామ్‌జానకీ రథయాత్ర

రహమత్‌నగర్: శ్రీరామనవమిని పురస్కరించుకుని హైందవ సేన ఆధ్వర్యంలో ఎస్పీఆర్ హిల్స్‌లో రామ్ జానకీ రథయాత్రను ఆదివారం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఎస్పీఆర్‌హిల్స్ రామాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ రథయాత్ర బోరబండ బంజారా నగర్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగనుంది. బోరబండ పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

ఏసీ కోసం ఓఎల్‌ఎక్స్‌ను సంప్రదిస్తే..

రహమత్‌నగర్: ఏసీ కోసం ఓఎల్‌ఎక్స్‌ను సంప్రదిస్తే.. డబ్బులు కాజేసిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బోరబండ డివిజన్ సాయిబాబానగర్‌కు చెందిన సీమ తనకు ఏసీ కావాలని ఓఎల్‌ఎక్స్ యాప్‌ను ఆశ్రయించింది. తమ వద్ద ఏసీ ఉందని, రూ.12 వేలకు అమ్మకానికి ఉందని ఓ వ్యక్తి పోస్టును చూసి నమ్మిన ఆమె ఓ వ్యక్తి ఫోన్‌కు రెండు విడతలుగా రూ.12 వేలు పంపించింది. ఆ తర్వాత అవతలి వ్యక్తి ఫోన్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన శుక్రవారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

సనత్‌నగర్: అల్లంతోట బావి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫౌండర్ అధ్యక్షుడిగా గౌరపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా భట్టి శివకుమార్, ఎం.శ్రీరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జక్కుల కృష్ణ, జనరల్ సెక్రటరీగా కొమ్మిడి పద్మారెడ్డి, కోశాధికారిగా బూరుగు నర్సింగ్‌రావు, జాయింట్ ట్రెజరర్‌గా శరత్‌చంద్ర, లీగల్ అడ్వైజర్‌గా జయబాబురావు, జాయింట్ సెక్రటరీగా డేవిడ్‌రాజ్, మురళీకృష్ణ, సమీవుద్దీన్‌తో పాటు 12 మంది ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా, ఇద్దరు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లుగా ఎన్నికయ్యారు.

హిందూ మహిళా కళాశాలలో ఫేర్‌వెల్ డే

సనత్‌నగర్: స్థానిక హిందూ మహిళా కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థినులకు వీడ్కోలు పలుకుతూ జూనియర్స్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థినులు మహిళా లోకానికే వన్నె తీసుకువచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతి నిధులు చంద్రకళాయాదవ్, హెచ్ఎస్ త్రిపాఠి, హిందూ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, డైరెక్టర్లు తదితరులు



బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

బంజారాహిల్స్: అంబేడ్కర్ యూనివర్సిటీలో బడుగు వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్వీకే రెడ్డి, పలువురు డైరెక్టర్లు, డీన్‌లు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ చక్రపాణి మాట్లాడుతూ దేశంలో అణగారిన ప్రజల అభ్యున్నతి, విద్యా వికాసానికి, దేశ సమైక్యత, సమగ్రతకు దిశానిర్దేశం చేసిన మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని సామాజిక సాధికారత వారోత్సవాలు నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమాలు మాజీ ఉప ప్రధాని, బడుగు వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలతో మొదలై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలతో ముగుస్తాయన్నారు. అనేక అసమానతలకు నిలయంగా ఉన్న దేశంలో సమాన అవకాశాల కోసం అణగారిన వర్గాల సాధికారత కోసం కృషి చేసిన మహనీయుల్లో మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అగ్రగణ్యులన్నారు. కార్యక్రమాలు జూబ్లీహిల్స్‌లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయ ప్రాంగణంతో పాటు తెలంగాణలోని విశ్వవిద్యాలయ ప్రాంతీయ కేంద్రాల్లో కూడా జరుగుతాయని ఆయన వివరించారు.

బంజారాహిల్స్: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, పరిపాలనాదక్షుడు, దేశానికి విశేష సేవలందించిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుల, మతాలు, పార్టీలకతీతంగా నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు తదితరులు నివాళులర్పించారు. ఫిలింనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, పంజగుట్ట, సోమాజిగూడ తదితర ప్రాంతాల్లో వేడుకను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఫిలింనగర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



దేవరకొండ బస్తీలో అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఫిలింనగర్‌లో ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు



మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, రవిగౌడ్



బీజేపీ హైదరాబాద్ వైస్‌ప్రెసిడెంట్ కీర్తిరెడ్డి



ఫస్ట్ బెటాలియన్‌లో నివాళులర్పిస్తూ..



ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్

చెట్టు కొట్టేస్తున్నారంటూ కాలనీవాసుల ఆందోళన



ఫిలింనగర్‌లో విగ్రహాల చౌరస్తాలో చెట్టును కొట్టేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఫిలింనగర్: పది మందికి నీడనిచ్చే చెట్టు.. నిత్యం ఎంతో మంది ఆ చెట్టు నీడలో సేద తీరేవారు.. అలాంటి చెట్టును డీఆర్ఎఫ్ సిబ్బంది పూర్తిగా తొలగించడాన్ని ఫిలింనగర్ కాలనీవాసులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఫిలింనగర్ విగ్రహాల చౌరస్తాలో రోడ్డుకు చివరలో ఉన్న చెట్టు అడ్డంగా ఉందంటూ దాన్ని తొలగించాలంటూ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు లేఖ రాశారంటూ డీఆర్ఎఫ్ సిబ్బంది శనివారం చెట్టును పూర్తిగా తొలగించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేని ఈ చెట్టును ఎందుకు తొలగిస్తున్నారంటూ పలువురు కాలనీవాసులు ప్రశ్నిస్తున్నా డీఆర్ఎఫ్ సిబ్బంది పట్టించుకోకుండా చెట్టును పూర్తిగా తొలగించారు.

ముగిసిన రెజ్లింగ్ పోటీలు

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌లో హైదరాబాద్ డిస్ట్రిక్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ ఇంటర్నేషనల్ రెజ్లర్ కిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో అండర్–15, 17, 19, 20 విభాగాల్లో నిర్వహిస్తున్న రెజ్లింగ్ పోటీల ముగింపు వేడుకలు శనివారం ముగిశాయి. నాలుగు రోజులపాటు జరిగిన రెజ్లింగ్ పోటీల్లో సుమారు 100మంది క్రీడాకారులు పాల్గొనగా 20మంది మహిళలు పాల్గొన్నారు. ఒక్కో విభాగం నుంచి ఫైనల్, సెమీఫైనల్ చేరిన క్రీడాకారులను, మాజీ రెజ్లర్లు, పలు సంఘాల నేతలు అభినందించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లో జరిగే నేషనల్స్‌లో పాల్గొంటారని అంపైర్లు విశ్వంబర్ సింగ్, దుర్గేష్‌సింగ్, వీరాచారి, కుమార్ తెలిపారు. నేతలు గొంటి శ్రీనివాసయాదవ్, సంతోష్‌గౌడ్, హరి వడ్డెర, శరత్‌గౌడ్, చిన్న ముదిరాజ్, గొంటి సాయినాథ్‌యాదవ్, మోహన్, ప్రసాద్‌యాదవ్, గని, మహేష్ ముదిరాజ్, పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

సాక్షి ఆదివారం, 6, ఏప్రిల్, 2025

బెంగాల్ టైగర్‌కు చికిత్స



వరంగల్ నుంచి నెహ్రూ జూపార్కుకు తరలింపు

బహదూర్‌పురా: వరంగల్‌లోని కాకతీయ జూపార్కులో అనారోగ్యం పాలైన కరీనా అనే రాయల్ బెంగాల్ టైగర్‌ను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ జూపార్కుకు తరలించి వైద్యం అందించారు. 22 ఏళ్ల వయసు కలిగిన కరీనా వృద్ధాప్యం, ఇతర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటోంది. హైదరాబాద్ జూపార్కులోని రెండు వేల పైచిలుకు ఉన్న జంతువుల వైద్యసేవల కోసం ఇద్దరు వైద్యులే ఉన్నారు. ఇప్పటికే వీరికి పనిభారం పెరగగా, అదనంగా బయటి ప్రాంతాల జంతువులను కూడా ఇక్కడికి తీసుకొస్తుండటంతో మరింత ఇబ్బందికి గురవుతున్నారు. వరంగల్ జూపార్క్‌లో పెద్ద సంఖ్యలో జంతువులు ఉన్నప్పటికీ, వాటికి వైద్యసేవలు అందించేందుకు వైద్యులను అందుబాటులో ఉంచకపోవడం విచారకరమని జంతు ప్రేమికులు అంటున్నారు.

వందేళ్ల వృక్షానికి పునరుజ్జీవం



చెట్టును తరలించే ముందు పూజలు చేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

అది అత్యంత రద్దీ మార్గం.. నడిరోడ్డుపై వందేళ్ల నాటి భారీ వృక్షం.. వాహనాల రాకపోకలకు అవరోధంగా మారింది.. తరచూ ట్రాఫిక్ జాం అవుతుండటంతో ట్రాఫిక్ ఏసీపీ సొంత ఖర్చులతో దానిని యథావిధిగా తీసుకెళ్లి వేరేచోట నాటి పునరుజ్జీవం పోశారు. ఆర్బీరోడ్‌లోని బాటా నుంచి ప్యాట్నీ వెళ్లే దారిలో వందేళ్ల నాటి ఓ భారీ వృక్షం ఉంది. అయితే ఇలాంటి భారీ వృక్షాన్ని కొట్టివేయకుండా మరోచోట నాటి ప్రాణం పోయాలని అనుకున్నారు ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు. చెట్టును తరలించేందుకు అటు జీహెచ్ఎంసీ, ఇటు అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. వట ఫౌండేషన్ ప్రతినిధులను కూడా సంప్రదించారు. ఏసీపీ సొంతంగా డబ్బులు వెచ్చించి శనివారం ఉదయంభారీ క్రేన్ సహాయంతో చెట్టును అక్కడి నుంచి పెకిలించి మహబూబ్ కళాశాలలో ఉండే ఖాళీ ప్రదేశంలో తిరిగి నాటారు. ఏసీపీ శంకర్‌రాజు గతంలో బేగంపేటలో కూడా ఓ భారీ వృక్షానికి ప్రాణం పోసి పర్యావరణ ప్రేమికుల మన్ననలు పొందారు. ట్రాఫిక్ ఏసీపీ చేసిన ఈ పనికి ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. -రాంగోపాల్‌పేట్



చెట్టును క్రేన్ సహాయంతో తరలిస్తున్న దృశ్యం



చెట్టును తిరిగి నాటిన దృశ్యం

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

ఘనంగా నివాళి అర్పించిన జీహెచ్ఎంసీ కమిషనర్



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: సామాజిక న్యాయం, సమానత్వ సాధనకు కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. శనివారం జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా నవ భారత నిర్మాణంలోనూ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల బాధ్యతలు చేపట్టి సమర్థవంతమైన నేతగా గుర్తింపు పొందారని అన్నారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో ఆయన పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనలతో ఉద్యోగులు, యువత సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం పెంపొందేలా పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వాంటెడ్స్ వేలల్లో!

డ్రగ్ కేసుల్లో పరారీలో ఉన్న నిందితులు 8,822 మంది

- ఐదుగురు నైజీరియన్లు అత్యంత కీలకమని గుర్తింపు
- గత ఏడాది రాష్ట్రంలో రూ.148 కోట్ల సరుకు స్వాధీనం
- రాష్ట్ర వ్యాప్తంగా కేసులపై దృష్టి పెట్టిన టీజీఏఎన్‌బీ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా 2020–24 మధ్య నమోదైన మాదకద్రవ్యాల కేసుల్లో 8,822 మంది ఇప్పటికీ పరారీలోనే ఉన్నారు. వీరిలో ఐదుగురు నైజీరియన్లు అత్యంత కీలకమని, దేశవ్యాప్తంగా డ్రగ్స్ సిండికేట్‌ను వాళ్లే నడిపిస్తున్నారని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు గుర్తించారు. 2023లో పోలీసులు రూ.94.39 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేయగా, అది ఇది గత ఏడాది నాటికి రూ.148.09 కోట్లకు చేరింది. ఈ కేసుల్లో సూత్రధారులు కంటే పాత్రధారులు మాత్రమే చిక్కుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా నమోదైన డ్రగ్స్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టిన టీజీఏఎన్‌బీ అధికారులు వాంటెడ్‌గా ఉన్న వారి కోసం గాలిస్తోంది.

● అప్పట్లో నేరుగా వచ్చి...

మాదకద్రవ్యాల క్రయవిక్రయాలన్నీ సోషల్ మీడియా, డార్క్ వెబ్ కేంద్రంగా సాగుతున్న విషయం తెలిసిందే. వీటిలోనే పెడ్లర్లు, సప్లయర్లు, కన్స్యూమర్ల మధ్య బేరసారాలు పూర్తవుతున్నాయి. ఒకప్పుడు ఆన్‌లైన్‌లో డబ్బు డిపాజిట్ చేయించుకునే పెడ్లర్లు సిటీకి వచ్చి డ్రగ్స్ అందించి వెళ్లే వాళ్లు. అయితే టీజీఏఎన్‌బీ, హెచ్–న్యూ వంటి ప్రత్యేక విభాగాలు ఏర్పడిన తర్వాత డ్రగ్స్ దందాపై నిఘా పెరిగింది. వరుస పెట్టి డెకాయ్ ఆపరేషన్లు చేసిన అధికారులు, సిబ్బంది జాతీయ, అంతర్జాతీయ పెడ్లర్స్‌ను పట్టుకున్నారు. దీంతో తెలంగాణకు వచ్చి డ్రగ్స్ సరఫరా చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు.

● కొరియర్స్, డెడ్ డ్రాప్ విధానాల్లో...

సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుంటున్న పెడ్లర్లు ఆన్‌లైన్‌లోనే నగదు చెల్లింపులు అంగీకరిస్తున్నారు. ఆపై కొరియర్ పార్శిల్ చేయడం లేదా సప్లయర్‌ను పిలిపించుకొని మాదకద్రవ్యాలను అందిస్తున్నారు. ఈ సప్లయర్లు సైతం నేరుగా కన్స్యూమర్‌ని కలవట్లేదు. దీనికోసం డెడ్ డ్రాప్ విధానం అవలంబిస్తున్నారు. మాదకద్రవ్యాన్ని ఓ ప్రాంతంలో ఉంచి ఆ ప్రాంతం ఫొటో, లోకేషన్‌లను వారికి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అధిక కేసుల్లో కన్స్యూమర్లు, కొన్ని కేసుల్లో సప్లయర్లు చిక్కుతున్నారు. పెడ్లర్స్ మాత్రం దొరక్కపోవడంతో ఆయా కేసుల్లో వాంటెడ్స్ పెరుగుతున్నారు.

● గత ఏడాది భారీగా పెరిగిన కేసులు...

మాదకద్రవ్యాల కేసులు, అరెస్టు అయిన నిందితుల సంఖ్య 2023 కంటే 2024లో గణనీయంగా పెరిగింది. 2023లో రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీపీఎస్ యాక్ట్ కింద నమోదైన కేసుల సంఖ్య 1487గా, అరెస్టు అయిన నిందితుల సంఖ్య 2170గా ఉంది. గత ఏడాది ఇవి 3074, 5205కు పెరిగాయి. 2020–24 మధ్య ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 7131 కేసులు నమోదు కాగా, వీటిలో 23,547 మంది పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 14,725 మంది మాత్రమే అరెస్టు కాగా, ఇప్పటికీ 8822 మంది పరారీలోనే ఉన్నారు. ఈ వాంటెడ్స్ కోసం టీజీఏఎన్‌బీ, హెచ్–న్యూ, టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీలతోపాటు స్థానిక పోలీసులూ గాలిస్తున్నారు.

ఈ ఐదుగురూ అత్యంత కీలకం

రాష్ట్రంలోనే కాదు... దేశ వ్యాప్తంగా వివిధ మెట్రో నగరాల్లో విస్తరించి ఉన్న డ్రగ్ నెట్‌వర్క్‌లో నైజీరియన్లే కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రధాన పెడ్లర్స్, సర్లయర్స్‌లో వీళ్లే ఎక్కువగా ఉంటున్నారు. తెలంగాణకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిలో ఐదుగురు నైజీరియన్లు కీలకమని టీజీఏఎన్‌బీ గుర్తించింది. వీరిలో డివైన్ ఎబుక సుజీపై ఎనిమిది, పీటర్ న్వాబున్వన్నా ఒకాఫర్, నికోలస్ ఒలుసోలా రోటిమీ, మార్క్ ఒవలబిలపై నాలుగు చొప్పున, అమోబి చుక్వుడి మూనాగోలుపై ఒక కేసు నమోదై ఉన్నాయి. ఈ కేసుల్లో ఆధారాలు లభించడంతో నిందితులుగా చేర్చామని అధికారులు చెప్తున్నారు. 2023–24ల్లో డ్రగ్స్ దందాలో ప్రమేయం ఉందనే ఆరోపణల నేపథ్యంలో సూడాన్, కెన్యా, నైజీరియా, సోమాలియా, టాంజానియా, లైబీరియాలకు చెందిన 11 మందిని పోలీసులు నగరంలో గుర్తించి ఆయా దేశాలకు తిప్పిపంపారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సాధన పేరిట పరిచయ్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వ సాంస్కృతిక శిక్షణ(కథక్ శిక్షణ తరగతులు) కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉదయం 11.30గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వక్ఫ్ బిల్లు ఆమోదంపై నిరసన



హెచ్‌సీయూలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లు పార్లమెంటులో ఆమోదించడంపై పలువురు విద్యార్థులు హెచ్‌సీయూ క్యాంపస్‌లో నిరసన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి హెచ్‌సీయూ విద్యార్థి సంఘం 2024–25 పిలుపుపై పలు విద్యార్థి సంఘాల మద్దతుతో ప్లకార్డులు పట్టుకొని బిల్లును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం వక్ఫ్ బిల్లులో మార్పులు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు విద్యార్థులు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కుట్రతోనే మున్నూరు కాపుల జనాభా తగ్గింపు

ప్రభుత్వంపై ధ్వజమెత్తిన దేవయ్య పటేల్



పటేల్ యూత్ ఫోర్స్ వార్షికోత్సవంలో మున్నూరు కాపు సంఘం నాయకులు

పంజగుట్ట: రాబోయే కాలంలో మున్నూరు కాపులు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్ని కులగణనలో తమ జనాభాను తక్కువ చేసి చూపించిందని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పటేల్ యూత్ ఫోర్స్ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఫోర్స్ వ్యవస్థాపకుడు కొత్త లక్ష్మణ్ పటేల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవయ్య పటేల్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి ఒక్కరోజులో జరిపిన సమగ్ర కుటుంబ సర్వేలో తమ జనాభా 28 లక్షలు 18 శాతమని చూపించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణనలో కేవలం 13 లక్షలు ఉన్నట్లు చూపించడం దారుణమన్నారు. తెలంగాణలో మున్నూరు కాపులు 40 లక్షల మంది, కాపులు 20 లక్షలు మొత్తం 60 లక్షల జనాభా ఉందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 8 మంది ఎమ్మెల్యేలు, ఒక మంత్రి, కార్పొరేషన్ చైర్మన్‌లు ఉండేవారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారని అన్నారు. మే నెలలో పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో మున్నూరు కాపు గర్జన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చందు జనార్దన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఆర్.వి.మహేందర్, శ్రీనివాస్, వెంకట్, మురళి పటేల్, బండి పద్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సెట్స్–2025 అడ్మిషన్స్ కన్వీనర్‌గా పాండురంగారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్స్–2025(లాసెట్, ఎడ్‌సెట్, పీజీసెట్, ఐసెట్ తదితర) అడ్మిషన్స్ రాష్ట్ర కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సైన్స్ కాలేజీ భూ విజ్ఞాన శాస్త్రం(జియాలజీ) విభాగానికి చెందిన ప్రొ.పాండురంగారెడ్డి గతంలో పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్‌గా, సైఫాబాద్ పీజీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్‌గా, ఓయూ పరీక్షల విభాగం కాన్ఫిడెన్షియల్ అడిషనల కంట్రోలర్‌గా, టీజీ సీపీజీఈటీ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న పాండురంగా రెడ్డిని సెట్స్–2025 అడ్మిషన్స్ కన్వీనర్‌గా రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి నియమించినట్లు పేర్కొన్నారు.

నోటరీ అడ్వొకేట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు యాదగిరి

బన్సీలాల్‌పేట్: తెలంగాణలోని నోటరీ అడ్వొకేట్లకు గెజిటెడ్ ర్యాంక్ హోదా కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంజి యాదగిరి డిమాండ్ చేశారు. బోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమైన దస్తావేజుల జిరాక్స్ కాపీల పేజీలపై నోటరీ అడ్వొకేట్ల అటస్టేషన్ ఉండేటట్టు నిబంధనలు పెట్టాలని కోరారు. రిజిస్ట్రేషన్ శాఖలో అధికారికంగా నమోదైన అడ్వొకేట్ నోటరీలకు ప్రతి 5 ఏళ్లకు ఒకసారి ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. 60 ఏళ్లు దాటిన అడ్వొకేట్ నోటరీలకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఇళ్లస్థలాలను కేటాయించాలని కోరుతూ త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డిజిటల్ ఆన్‌లైన్ నోటరీ విధానాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయబ్రహ్మ నర్సింహ్మా, సలహాదారు ఎం.ఎం. బేగ్, అనిల్‌కుమార్ యాదవ్, నరసింహారావు, నర్సింగ్‌రావు, మురళీధర్ పాల్గొన్నారు.

నీట్ కోచింగ్‌కు ఏఐ టెక్నాలజీ అనుసంధానం

శ్రీ చైతన్య సీఈఓ సుష్మ



సాక్షి, సిటీబ్యూరో: ఆత్రేయ నీట్ కోచింగ్‌ను కొత్త దిశలో తీసుకెళుతున్నామని శ్రీ చైతన్య గ్రూప్ సీఈఓ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత గైడెన్స్‌కు ఆధునిక ఏఐ టెక్నాలజీని అనుసంధానం చేయడం వల్ల విద్యార్థుల అభ్యసనా పద్ధతులను విప్లవాత్మకంగా మార్చుతున్నామని తెలిపారు. ఈ ప్లాట్‌ఫాంలో రియల్ టైం అనలిటిక్స్, టాప్ నీట్ ఫ్యాకల్టీతో విద్యార్థుల ప్రగతికి తక్షణ పరిష్కారాలు అందించగలుగుతున్నామని వివరించారు. విద్యార్థి ఎంబీబీఎస్ కలను సాకారం చేయడంలో సాయపడుతుందన్నారు. నీట్ సంసిద్ధత అంటే చదువు మాత్రమే కాదు, భావోద్వేగాలను స్థిరంగా ఉంచుకోవడం కూడా అని అన్నారు. తమ సంస్థ ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థి సంపూర్ణ అభివృద్ధికి ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు.

పోరుగర్జనతో కేంద్రంలో వణుకు

జాజుల శ్రీనివాస్ గౌడ్



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: బీసీ పోరుగర్జన విజయవంతం కావడంతో కేంద్ర ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గర్జనకు 29 రాష్ట్రాల ఓబీసీ ప్రతినిధులు, 16 రాజకీయ పార్టీల నాయకులు, 18 రాష్ట్రాల నుంచి 32 మంది పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. గర్జనతో దేశవ్యాప్తంగా బీసీల చర్చ మొదలైందని పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ మినహా అన్ని పార్టీల నాయకులు పోరు గర్జనలో పాల్గొన్నారని తెలిపారు. గర్జన ఒక ట్రయల్ మాత్రమే అని, వెంటనే బీజేపీ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేయకపోతే పూర్తి సినిమా చూపిస్తామని హెచ్చరించారు. బీసీలలో ముస్లింలు ఉన్నందున ఆ బిల్లును ఆమోదించబోమని బీజేపీ అంటోందని, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వమే ఉందికదా అక్కడ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ నెల చివరివారంలో 29 రాష్ట్రాల ప్రతినిధులతో హైదరాబాద్ కేంద్రంగా బీసీల రాజకీయ ప్లీనరీ నిర్వహిస్తామని, మే రెండో వారంలో పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో బీసీల సింహగర్జన నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్ కురుమ, దుర్గయ్య గౌడ్, తాటికొండ విక్రమ్ గౌడ్, స్వర్ణ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మే 8న 'తెలుగు భాషకు పట్టాభిషేకం'

నాంపల్లి: తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మే 8న నగరంలోని త్యాగరాయ గానసభలో 'తెలుగు భాషకు పట్టాభిషేకం పేరిట'అంతర్జాతీయ కవి సమ్మేళనం, సదస్సు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు బడేసాబ్ ఒక ప్రకటనలో తెలిపారు. మాధ్యమిక విద్యలో సైతం తెలుగును తప్పనిసరి చేయడం, అధికారిక వ్యవహారాల్లో తెలుగు భాష సక్రమంగా అమలు జరిగేలా చూడటం వంటి అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనదలచిన వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 91606 07662లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మూడు నెలల్లో 56 బ్రెయిన్ డెడ్ కేసులు

అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న జీవన్‌దాన్



మహేష్

లక్డీకాపూల్: అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో తెలంగాణ జీవన్‌దాన్ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ ఏడాది మూడు నెలల వ్యవధిలోనే 56 బ్రెయిన్ డెడ్ కేసుల్లో అవయవ దానాలను నమోదు చేసుకుని జీవన్‌దాన్ సరికొత్త స్ఫూర్తిని నింపిందని రాష్ట్ర జీవన్‌దాన్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు. ఈ సంఖ్య శనివారం బ్రెయిన్ డెడ్‌కు గురైన 15 ఏళ్ల మహేష్ అవయవదానంతో 57కి చేరిందని, అతడి నుంచి రెండు కిడ్నీలు, కాలేయం, రెండు కళ్లను సేకరించామని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దుప్పల్లికి చెందిన నైరి మహేష్ బైక్‌ని అతివేగంగా నడిపి చెట్టుకు ఢీకొని బ్రెయిన్ డెడ్ అయినట్టు తెలిపారు. అతడి తండ్రి గోవర్ధన్ సహృదయంతో తనయుడి అవయవాలను జీవన్‌దాన్‌కు దానం చేయడానికి ముందుకు వచ్చారని పేర్కొన్నారు. అవయవ దానం అనేది ఒక గొప్ప దాతృత్వ చర్య, ఇది అనేక మందికి ప్రాణాలను కాపాడటానికి, వారి జీవితాలను మెరుగుపరచడానికి సహాయపడుతుందని శ్రీభూషణ్‌రాజు స్పష్టం చేశారు.

అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయి

మాజీ మంత్రి హరీశ్ రావు



గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

గచ్చిబౌలి: అవార్డులతో సామాజిక గుర్తింపు వస్తుందని, అదో అనుభూతి మిగులుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో ఎఫ్ఆర్ఆర్‌సీ (ఫెడరల్ రీసెర్చ్ అండ్ రికగ్నిషన్ కౌన్సిల్) ఆధ్వర్యంలో పలు రంగాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చినవారికి గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. అవార్డులు తీసుకోవడం వల్ల బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. కష్టపడి పని చేసేవారి విజయం వరిస్తుందన్నారు. సెయింట్ జాన్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు సూరం రాంరెడ్డి, ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, యంగెస్ట్ పీహెచ్‌డీ హోల్డర్ అరిపర్ల రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ , స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ డాక్టర్ భవ్య సంతెనపల్లి , వెవెజ్జీస్ బెస్ట్ ఫౌండర్ నిహారిక యాదవ్ తదితరులు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఆర్‌సీ సీఈఓ షేక్ ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

నగరంలో ఆహార పరీక్ష కేంద్రాలు

జోన్‌కొకటి చొప్పున ఆరింటి ఏర్పాటుకు కసరత్తు ● త్వరితంగా కల్తీ పరీక్షల నివేదికల కోసమే..

సాక్షి, సిటీబ్యూరో: హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో కల్తీ కట్టడికి అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మొత్తం ఆరుజోన్లకుగాను జోన్‌కు ఒకటి చొప్పున ఆరు ఆహార పరీక్షలు, విశ్లేషణల కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. కొంతకాలంగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు నగరంలో చేస్తున్న దాడులు, తనిఖీల్లో ఎక్కడ చూసినా ఆహార కల్తీ, అధ్వానంగా ఆహార పదార్థాల నిల్వ వంటి విషయాలు వెలుగు చూస్తున్నాయి. ప్యాకేజ్డ్ ఫుడ్, వాటర్ బాటిళ్లలోనూ నాణ్యత లేమి వెల్లడవుతోంది. అయినప్పటికీ సదరు కేంద్రాల నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోలేకపోతున్నారు. సేకరించిన ఆహార పదార్థాల శాంపిల్స్ రిపోర్టులు రావడంలో తీవ్ర జాప్యమే దీనికి కారణం. రాష్ట్రమంతటికీ నాచారంలో ఒకే ఒక ఆహార పరీక్షల కేంద్రం ఉంది. మరో వైపు నగరంలో రిజిస్ట్రేషన్ ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లే దాదాపు 55 వేలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ లేనివాటికి లెక్కేలేదు. గ్రేటర్ నగరం పరిధి రోజురోజుకూ



విస్తరిస్తున్న నేపథ్యంలో నగరం అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. తనిఖీలతో బయట పడుతున్న కల్తీల బాగోతం నగరానికి మాయని మచ్చగా కనిపిస్తోంది. బిర్యానీ వంటి వాటికి నగరం ఎంతో ప్రసిద్ధి. దీనితోపాటే కల్తీలోనూ అదే స్థాయిలో చెడ్డ పేరొచ్చేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కల్తీ కట్టడికి జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో జోన్‌కొకటి వంతున ఆహార పరీక్షల కేంద్రాల ఏర్పాటు అవసరమని ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయించారు.

◆ భవనాల కోసం అన్వేషణ...

ఆరు ఆహారపరీక్షల కేంద్రాల ఏర్పాటుకు దాదాపు పదివేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనాలను చూపించాల్సిందిగా, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు ఒక్కో దానికి రూ. 5 కోట్ల వంతున రూ. 30 కోట్ల నిధులు కూడా అందజేయాల్సిందిగా ఫుడ్‌సేఫ్టీ విభాగం జీహెచ్ఎంసీని కోరింది. ఈ మేరకు అధికారులు భవనాల అన్వేషణలో ఉన్నారు. ఈ కార్యక్రమం పూర్తికాగానే నిధులు కూడా అందజేసి, ఆహార పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

◆ 14 రోజుల్లో పరీక్షలు పూర్తి కావాలి

ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాల మేరకు శాంపిల్స్ పరీక్షలు, విశ్లేషణలు 14 రోజుల్లో పూర్తిచేయాలి. పరీక్షలు చేయాల్సిన శాంపిల్స్ 13 వేలున్నాయి. నాచారం ల్యాబ్‌లో సిబ్బంది కొరతతోనూ ఇది సాధ్యం కావడం లేదు.

చౌ మహల్లా.. సంగీత హోరు..



చౌ మహల్లా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమం

బహదూర్‌పురా: కోవిడ్ అనంతరం సంగీతం, గజల్, కథక్ నృత్యం వాయిద్యాల సందడి లేక మూగబోయిన చౌమహల్లా ప్యాలెస్ శనివారం పూర్వవైభవం సంతరించుకుంది. చౌమహల్లా ప్యాలెస్, పరిచయ ఆర్ట్స్ ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో శనివారం ఒక్కరోజు గజల్, మ్యూజిక్, కథక్ నృత్య ఉత్సవాన్ని ఇక్కడ ఘనంగా నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డీ పండిట్ రాజేంద్ర గంగనీ కథక్ నృత్య ప్రదర్శనలో సందర్శకులను కట్టిపడేశారు. హైదరాబాద్ వాస్తవ్యులు ప్రముఖ గజల్ సింగర్ కుమారి జ్యోతి శర్మ, పండిట్ అఖిలేష్ గుండెచ, అనంత్ గుండెచ, పండిట్ ఉమాకాంత్ గుండెచ హిందూస్తానీ గాత్రంతో ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశారు. చౌమహల్లా ప్యాలెస్ డైరెక్టర్ కిషన్ రావు మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెలా సంగీతం, గజల్, కూచిపూడి నృత్యం, వాయిద్యాల సంగీతం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పరిచయ ఆర్ట్స్ ఫౌండేషన్ స్థాపకుడు జయవంత్ నాయుడితో కలిసి ఆయన కళాకారులను సత్కరించారు.



సీజన్‌ మార్పులే కొత్త ఫ్యాషన్లకు రీజన్‌గా మారుతోంది. బాలీవుడ్‌ స్టార్స్‌ ఈ ట్రెండ్స్‌ను తారా పథంలోకి చేరుస్తున్నారు. కాటన్‌ నుంచి లినిన్‌ వరకూ ఫ్యాబ్రిక్స్‌తో తయారైన సీజనల్‌ దుస్తులను బాలీవుడ్‌ స్టార్స్‌ తరచూ సోషల్‌ మీడియాలో ప్రదర్శిస్తుండడం నగరంలో ఫ్యాషన్‌ ప్రియులకు స్ఫూర్తినిస్తోంది. స్టార్స్‌ తరహాలో తమకూ కావాలంటూ డిజైనర్లను ఆశ్రయించే నగరవాసులు పెరుగుతున్నారంటూ నగరానికి చెందిన హామ్‌స్టెక్‌ ఫ్యాషన్‌ డిజైనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఫ్యాకల్టీ అంటున్నారు. ప్రస్తుత సీజన్‌ ప్రకారం నగరవాసులను ఆకట్టుకుంటున్న స్టార్‌ స్టైల్స్‌ గురించి పలు విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో



సమ్మర్‌ సీజన్‌లో.. స్టార్‌ ఫ్యాషన్‌..

- వైవిధ్యభరిత స్టైల్స్‌కు వేదికగా వేసవి
- ప్రత్యేక ఫ్యాబ్రిక్స్‌, డిజైన్లతో సీజనల్‌ సమస్యలకు చెక్‌
- సౌకర్యం, ఫ్యాషన్‌ మేళవింపుతో ఆకట్టుకుంటున్న డిజైనర్‌ దుస్తులు
- సీజన్‌కు తగ్గ డ్రెస్సింగ్‌ శైలిని పంచుకుంటున్న సెలబ్రిటీలు



ఈ సీజన్‌లో విహారయాత్రలు, ఇంట్లో ఎక్కువ సమయం గడపడం వంటివి లాంజ్‌వేర్‌ డిమాండ్‌కు మరింతగా ఆజ్యం పోశాయి. మీరా రాజ్‌పుత్‌, తమన్నా భాటియా వంటి ఫ్యాషన్‌ ప్రియులందరూ రిచ్‌ రంగుల లెహంగాల నుంచి వైవిధ్యభరిత షేడ్స్‌లో ఉన్న చీరలను ఎంచుకుంటున్నారు. దీంతో బోల్డ్‌, బ్రైట్‌టోన్‌ లను ఆ'ధరించడం' నగర ఫ్యాషన్‌ ప్రియుల ఎంపికగా మారింది.

- తారా సుతారియా, ప్రియాంక చోప్రా తదితర ప్రముఖులు పాప్సికల్‌ షేడ్స్‌, ఉత్తేజభరిత ప్రింట్‌లతో చెమటల నుంచి విముక్తిని అందిస్తూ హాయిగా అనిపించే జాగర్‌ల ద్వారా అందిస్తున్న సౌకర్యం, స్టైల్‌ కలయికల ప్రదర్శన ఆకట్టుకుంటోంది.
- ఇన్‌స్టా వేదికగా కత్రినా కైఫ్‌ ప్రదర్శిస్తున్న ఫ్యాషన్‌ సెన్స్‌, వేసవి దుస్తులకు నగరం జై కొడుతోంది.
- దీపికా పదుకొనే తరహాలో క్లాసిక్‌ ఫార్ములా అయిన డెనిమ్‌– అందమైన వేసవి టాప్‌తో హాట్‌ సమ్మర్‌ను అధిగమించడానికి ఆరాటపడుతోంది నగరయువత.
- రకుల్‌ ప్రీత్‌ సింగ్‌ ఆకుపచ్చ ఫ్లేర్డ్‌ డ్రెస్‌ చాలా మందిని ఆకట్టుకుంటోంది. బోట్‌ నెక్‌లైన్‌, ఆకర్షణీయమైన పూల నమూనాలతో చక్కదనం, సౌలభ్యాల పరిపూర్ణ సమ్మేళనంగా ఇది ఆకట్టుకుంటోంది.
- సారా అలీ ఖాన్‌ అద్భుతమైన నీలిరంగు జంప్‌సూట్‌లో నగర ఫ్యాషన్‌ ప్రియులను ఆకర్షించింది. ఈ స్టార్‌ ఫ్యాషన్‌ ఎంపికలు ఎల్లప్పుడూ చర్చనీయాంశం, ఈ వేసవి లుక్‌ కూడా దీనికి మినహాయింపు కాదు.

యువకులకు.. మేన్లీ స్టైల్స్‌ తో..

- షాహిద్‌ కపూర్‌ తన ఆల్‌–వైట్‌ ఎంసెట్‌తో మోనోక్రోమ్‌ మ్యాజిక్‌కు వెల్‌కమ్‌ చెప్పాడు. తెల్లటి రంగు దుస్తులనే వివిధ షేడ్స్‌తో ధరించడం ఎలాగో చూపిస్తున్నాడు. యుటిలిటీ జాకెట్‌, క్రిస్ప్‌ జీన్స్‌, చెల్సియా బూట్‌లతో సీజనల్‌ లుక్‌తో నగరవాసులను ఆకర్షిస్తున్నాడు.
- బోల్డ్‌, ఫియర్‌లెస్‌ ఫ్యాషన్‌ అనగానే మొదట గుర్తుకు వచ్చే పేరు రణ్‌వీర్‌ సింగ్‌. ప్రస్తుత సీజన్‌లో ప్రింట్లు, కలర్స్‌తో ప్రయోగాత్మక శైలి అతని సిగ్నేచర్‌ స్టైల్స్‌ని కొత్తగా నిర్వచిస్తాయి.
- వేసవిలో వెరైటీలుక్‌ కోసం, విక్కీ కౌశల్‌ టైలర్డ్‌ ప్యాంటుకు ఎరుపు కుర్తాను జత చేయడం కూడా నగర కుర్రకారుకు క్రేజీగా మారింది. అదే విధంగా ఆయుష్మాన్‌ ఖురానా కూడా తనదైన వేసవి లుక్స్‌తో నగర యువతకు ట్రెండీ స్టైల్స్‌ పరిచయం చేస్తున్నారు. ఇలా ఉత్సాహభరితమైన దుస్తుల నుంచి రిలాక్స్‌డ్‌ లాంజ్‌వేర్‌, వేసవి స్టైల్స్‌ వరకూ, బాలీవుడ్‌ తారలు ఈ సీజన్‌లో నగరవాసుల ఫ్యాషన్‌ థాట్స్‌ను నిర్దేశిస్తుండడంతో నగర డిజైనర్లు బాలీవుడ్‌ స్టార్స్‌ సోషల్‌ ఖాతాలను నిర్విరామంగా అనుసరించక తప్పడం లేదు.

పోలీస్‌ అధికారి కావాలన్నదే ధ్యేయం

- గ్రూప్‌-1లో 53వ ర్యాంకర్‌ దొంతిరెడ్డి రోహిల
- సేవా భావం, లక్ష్యమే విజయానికి ప్రేరణ



చిక్కడపల్లి : పోలీస్‌ శాఖలో రాష్ట్ర స్థాయి సర్వీస్‌ అయిన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టాలన్నదే ధ్యేయమని దొంతిరెడ్డి రోహిల అన్నారు. గ్రూప్స్‌ పరీక్షలకు రోజుకు 10 గంటలు చదివానని, మొదటి ప్రయత్నంలోనే 53వ ర్యాంక్‌ సాధించానని చెప్పారు. కష్టపడి లక్ష్య సాధనతో కృషి చేస్తే తప్పకుండా అనుకున్న రంగంలో విజయం సాధిస్తామని సాక్షితో చెప్పారు. 'పోలీస్‌ విభాగం ద్వారా ప్రజలకు సేవ చేయడమే నా ఆశయం' అన్నారు రోహిల. హైదరాబాద్‌కు చెందిన రోహిల రెడ్డి, గ్రూప్‌-1లో 499.50 మార్కులు సాధించారు. రాష్ట్ర స్థాయిలో 53వ ర్యాంకు, మహిళల్లో 11వ ర్యాంకు సాధించారు. ర్యాంకు ఆధారంగా ఆమెకు డీఎస్పీ పోస్టు వచ్చే అవకాశాలున్నాయి. నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ వరంగల్‌ (ఎన్‌ఐటీ)లో ఆమె సివిల్‌ ఇంజినీరింగ్‌ చదివారు. ఆమె తండ్రి దొంతిరెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా జాయింట్‌ లేబర్‌ కమిషనర్‌గా, తల్లి రజిత తెలంగాణ సచివాలయంలో ఎఎస్‌ఓగా పనిచేస్తున్నారు. ఎటువంటి ప్రత్యేక కోచింగ్‌ లేకుండా తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో విజయాన్ని సాధించారు. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం వచ్చినప్పటికీ పోలీస్‌ సేవే లక్ష్యంగా దానిని వదులుకున్నారు.



శిల్పారామంలో సాంస్కృతిక సందడి

అలరించిన శ్రీరామనవమి కీర్తనలు, నృత్యరూపకాలు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శ్రీరామనవమిని పురస్కరించుకుని రామకీర్తనలతో మారుమోగింది. అభినయవాణి నృత్యానికేతన్‌ నాట్యగురువులు బాలాత్రిపుర సుందరి శిష్యబృందం భజరామం శ్రీరామచంద్రమూర్తిపై వివిధ వాగ్గేయకారులు రచించిన రామకీర్తనలను ఆలాపించి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. రామాయణశబ్దం, తక్కువేమి మనకు, నగుమోము, మా రామచంద్రునికి, శ్రీరామజయరామ తదితర సంకీర్తనలను ఆలపించి అలరించారు. కళాకారులు శశికళ, దీక్షితులు, నేత్ర, ప్రియ హాసిని, అంబికా, చరణ్‌ అనన్య, సంజన, ఇషిత, ఐశ్వర్య, తదితరులు వీక్షకులను మెప్పించారు. నటువాంగం బాలాత్రిపురసుందరి, గాత్రం శాస్త్రి, మృదంగం రాజగోపాలచారి, వయోలిన్‌ శివకృష్ణస్వరూప్‌, వేణువు మురళి, ఎఫెక్ట్‌లు జయకుమారాచార్యులు సంగీత సహకారాన్ని అందించారు.



ఆర్ట్‌గ్యాలరీలో కథక్‌ శిక్షణ..

స్థానిక చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో సాధన పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న కథక్‌ శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. పరిచయ్‌ ఆర్ట్స్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీపాంజలి ఫౌండర్‌ దీపికారెడ్డి శిక్షణా తరగతులను ప్రారంభించారు. పండిట్‌ ఉమాకాంత్‌ గుండెచ్చ, కథక్‌ పండిట్‌ రాజేంద్రగంగాని విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. చివరి రోజు సర్టిఫికెట్‌లను అందజేయనున్నారు.



మూగజీవాలకు అండగా..

జంతువుల పట్ల ఔన్నత్యాన్ని చాటుతున్న కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి

వీధి కుక్కలకు ఆహారం పంపిణీ చేస్తూ



అతనో ప్రభుత్వ ఉద్యోగి.. నోరులేని మూగజీవాలు పడుతున్న అవస్థలు చూడలేక చలించిపోయాడు.. తనకు చేతనైన మేరకు సాయం చేయడం ప్రారంభించాడు. రోడ్లపై తిరిగే మూగజీవాలైన కోతులు, కుక్కలు, ఇంతర జంతువులకు అండగా నిలుస్తున్నాడు.. ఆయనే టీజీ ట్రాన్స్‌పోర్టు అకౌంట్స్‌ అధికారి కళ్లెం శ్రీనివాస్‌ రెడ్డి. - మోతీనగర్‌



మనుషులకే ఆహారం పెట్టడానికి ఆలోచించే ఈ రోజుల్లో.. రోడ్ల వెంబడి ఆహారం కోసం అవస్థలు పడుతున్న మూగజీవాలకు అండగా నిలుస్తున్నాడు కళ్లెం శ్రీనివాస్‌ రెడ్డి. కరోనా సమయంలో ప్రారంభించిన ఈ సేవా కార్యక్రమం ఇప్పటి వరకూ నిరంతరాయంగా సాగుతోంది. ఆహారం కోసం రోడ్ల వెంబడి తిరుగుతూ ప్రమాదాలకు గురైన జీవాలను చూసి చలించిపోయాడు.. దీంతోపాటు కరోనా సమయంలో అడవులు వదలి బయటకు వచ్చిన కోతులను కొందరు యువకులు ఇచ్చిన సమాచారం మేరకు నర్సాపూర్‌ అడవుల్లో వదిలిపెట్టాడు. వాటి ఆకలి తీర్చడానికి జామ, బత్తాయి, యాపిల్‌ ఇతర పళ్లను, ఇతర ఆహార పదార్థాలను వ్యాన్‌లో మిత్రబృందంతో కలిసి తీసుకెళ్లి నరసాపురం అడవిలో జంతువులకు వేశారు. దీంతోపాటు కరోనా సమయంలో షాపులు, హోటళ్లు మూసి ఉండటంతో వీధుల్లో తిరిగే కుక్కలకు ఆహారం లభించక అల్లాడిపోయాయి. అప్పటి నుంచి మోతీనగర్‌ పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలకు రోజూ ఆహారం వండి పెట్టడం ప్రారంభించాడు. ప్రస్తుతం ట్రాన్స్‌పోర్టు గ్రౌండ్‌ జీటీఎస్‌ కాలనీలో ఉన్న వీధి కుక్కలకు ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో ఆహారం అందిస్తున్నాడు. మిగతా రోజుల్లో అక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు, మిత్రుల సహకారంతో ఆహారాన్ని అందిస్తున్నాడు.

షెల్టర్‌ ఏర్పాటు చేయాలనుంది..

మూగజీవాలైన కోతులు, కుక్కలకు లాక్‌డౌన్‌ సమయం నుంచి ఆహారం అందించడం ప్రారంభించాను. నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఆదివారం, పండుగ, సెలవు దినాల్లో మూగజీవాలకు ఆహారం అందిస్తున్నాను. రానున్న రోజుల్లో ఉద్యోగ విరమణ అనంతరం మూగజీవాలకు ప్రత్యేక షెల్టర్‌ ఏర్పాటు చేయాలనుంది. - కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్‌ అకౌంట్స్‌ అధికారి



ట్రాఫిక్‌ మెన్‌ లోకేంద్ర సింగ్‌

- ఆరేళ్లుగా ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ
- సామాజిక మాధ్యమాల్లో మిలియన్‌ వ్యూస్‌

పుట్టింది రాజస్థాన్‌లో .. చదువుకున్నది తిరుపతిలో.. ట్రాఫిక్‌ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నది హైదరాబాద్‌లో.. సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఇంజనీర్‌గా స్థిరపడిన లోకేంద్ర సింగ్‌ నగరంలోని ట్రాఫిక్‌ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కంకణం కట్టుకున్నాడు. ట్రాఫిక్‌ రూల్స్‌ను అందరూ పాటించాలి, వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలని ఆసక్తిగలిగిన వారిని ఒకచోటకు చేర్చి సామాజిక మాధ్యమాల వేదికగా ఒక గ్రూప్‌ క్రియేట్‌ చేసుకున్నాడు. ముగ్గురితో ప్రారంభమైన ఈ గ్రూప్‌ ప్రస్తుతం 150 మందికి చేరింది. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌, పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్‌ కార్యాలయాలు, ఇతర సంస్థల్లో అవగాహన కల్పిస్తున్నాడు. ఆయనే లోకేంద్ర సింగ్‌. నగరంలో ఆయన ప్రయాణంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. - సాక్షి, సిటీబ్యూరో





ట్రాఫిక్‌ నియమాలంటే మోటారు సైకిల్‌ నడిపించే సమయంలో హెల్మెట్‌ ధరించడం, కారు నడిపే వ్యక్తి సీటు బెల్టు పెట్టుకోవడం, సిగ్నల్‌ పాయింట్‌ దగ్గర ఎర్ర లైటు, పచ్చలైటుకే పరిమితం కాదు.. అంతకు మించి ఎన్నో అంశాలు ఉన్నాయి. నీతి ఆయోగ్‌ లెక్కల ప్రకారం దేశంలో సుమారు 80 శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. అయితే ఓ కార్ల సంస్థ చేపట్టిన సర్వేలో మాత్రం 1.5 శాతం మంది మాత్రమే పూర్తి స్థాయిలో ట్రాఫిక్‌ రూల్స్‌ తెలిసిన వారు ఉన్నారని స్పష్టమయ్యింది. నాకు ముందు నుంచి ట్రాఫిక్‌ నిబంధనలు తెలుసుకోవాలని, అందరికీ తెలియజేయాలని పాఠశాల స్థాయి నుంచే ఆసక్తి ఉండేది. 2019 కోవిడ్‌ సమయం నుంచి అవగాహన కల్పిస్తున్నాను. హైదరాబాద్‌ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌ ట్రాఫిక్‌ విభాగంలో వాలంటీర్‌గా చేరాను. దీనికిగాను హైదరాబాద్‌ ట్రాఫిక్‌ మెన్‌గా పేరు తెచ్చుకున్నాను.

క్షేత్ర స్థాయిలో ప్రచారం..

పోలీసు విభాగం వారు చేపట్టే కార్యక్రమాలకు ఆహ్వానించేవారు. అక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ప్రచారం చేసేవాడిని. 2021లో చాలా మంది రిజిస్టర్‌ చేసుకున్నారు. రోడ్డు సేఫ్టీపై ఆసక్తి ఉన్న వారితో ఒక గ్రూప్‌ క్రియేట్‌ చేశాం. ఏ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నామనే సమాచారం ముందుగానే గ్రూప్‌లో పెడతాం. ఆయా ప్రాంతాలకు సమీపంలోని వాలంటీర్లంతా అక్కడకు చేరుకుని వాహదారులకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. నగరంలో 85 లక్షల వాహనాలు ఉన్నాయి. రోజుకు 1500 వాహనాలు రిజిస్ట్రేషన్‌ అవుతున్నాయి. ఇతర దేశాల్లో ప్రజా రవాణా వ్యవస్థకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. మన దగ్గర ఆ తరహా ఆలోచన చేయాలి. అప్పుడే ట్రాఫిక్‌ ఇబ్బందులు అధిగమించగలం.

మిలియన్ల వ్యూస్‌..

మేం చేపట్టే కార్యక్రమాలను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌ చేస్తున్నాం. వాటిని లక్షల మంది చూస్తున్నారు. కొన్ని వీడియోలు మిలియన్ల కొద్దీ వ్యూస్‌ పొందుతున్నాయి. ప్రజలకు రూల్స్‌ తెలుసుకోవాలనే ఆసక్తి ఉందని గుర్తించాను.. ఇది ఆశ్చర్యం అనిపించింది. వారి అభిప్రాయాలు మాతో పంచుకుంటున్నారు. చాలా సంతోషం అనిపిస్తుంది.



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన లింగం యలమంద 2024–25 వానాకాలం సీజన్‌లో 10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. వివిధ రకాల తెగుళ్లు, వర్షాలు, వరదల కారణంగా 200 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన బోనస్‌తో కొంత ప్రయోజనం చేకూరింది. ఈ యాసంగిలో 10 ఎకరాల విస్తీర్ణంలో మళ్లీ సన్నాలు సాగు చేశాడు. ఈసారి 260 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నాడు. ధాన్యాన్ని విక్రయించేందుకు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న డీసీఎంఎస్ కేంద్రానికి వచ్చాడు. బోనస్ భరోసా, పెరిగిన దిగుబడితో ఆనందంగా ఉన్నాడు.

సన్నాలు.. సిరులు

- ఆశాజనకంగా యాసంగి సన్నాల సాగు
- ఈసారి తప్పిన చీడపీడల బెడద..బోనస్ భరోసా
- రాష్ట్రవ్యాప్తంగా ఈ యాసంగిలో 56.69 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఇందులో 60 శాతం వరకు సన్నధాన్యం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈ యాసంగిలోనూ సాగు చేసే సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 56.69 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, అందులో దాదాపు 40 లక్షల ఎకరాల్లో సన్నాలే ఉన్నాయి. నీటివనరులు అందుబాటులో ఉండటం, తెగుళ్ల లేకపోవడంతో దిగుబడి ఎక్కువగా వస్తుందన్న ఆశలో రైతులు ఉన్నారు.

వానాకాలంలో 66.77 లక్షల ఎకరాల్లో...

2024–25 వానాకాలం సీజన్‌లో 66.77 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అందులో 40.44 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగయ్యాయి. ప్రభుత్వం అప్పుడే సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రకటించింది. అయితే కొన్నిచోట్ల అధిక వర్షాలు, మరికొన్ని చోట్ల వర్షాభావ పరిస్థితులు, దోమకాటు, అగ్గి, ఎర్ర తెగుళ్ల కారణంగా దిగుబడి అనుకున్న స్థాయిలో రాలేదు. సన్నధాన్యం సాగుతో మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వస్తుందనుకున్న రైతులకు కొంత నిరాశ మిగిల్చింది.

ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో సాగు

యాసంగి సీజన్ అంటే.. సహజంగా ఆరుతడి పంటలను సాగు చేస్తారు. గత కొన్నేళ్ల పంటల సాగును పరిశీలిస్తే యాసంగిలో సన్నధాన్యం సాగు 15 శాతంలోపే ఉండేది. అయితే రూ.500 బోనస్, వాతావరణం అనుకూలించడం, నీటివసతి కూడా ఉండటంతో ఈ యాసంగిలో వరిసాగు విస్తీర్ణం 56.69 లక్షల ఎకరాలు కాగా, అందులో 60 శాతం వరకు (40 లక్షల ఎకరాలే) విస్తీర్ణంలో సన్నాలు సాగయ్యాయి. యాసంగిలో సన్న రకాలు సాగు చేయడం ఇదే రికార్డు. గత ఏడాది యాసంగిలో మొత్తం 51.92 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ యాసంగిలో 54.83 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, గతేడాది కంటే అధికంగా 1.86 లక్షల ఎకరాల్లో సాగైంది.

ఈసారి రైతులకు కలిసొచ్చింది

ఈ యాసంగిలో వరిసాగు చేసిన రైతులకు కలిసొచ్చింది. ఎక్కువగా అకాల వర్షాలు, గాలిదుమ్ము లేకపోవడంతో పంట నష్టం వాటిల్లలేదు. ప్రతి ఏటా ఇబ్బందికరంగా మారుతున్న తెగుళ్ల ఈసారి ఎక్కువగా పంటలకు సోకలేదు. దీంతో మందులు పిచికారీ చేయడం, పంట దెబ్బతినడం వంటి ఆందోళన ఈసారి లేదు. ఈ క్రమంలో వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈసారి అనుకూలంగా ఉన్నట్టు రైతులు పేర్కొంటున్నారు. దిగుబడి ఆశించిన మేరకు రావడం, సన్నాలకు బోనస్ ఇవ్వనుండటంతోపాటు మద్దతు ధర లభించడంతో రైతులకు కలిసి రానుంది. వానాకాలం ఎకరాకు సగటున 20 క్వింటాళ్ల నుంచి 23 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా..ఈసారి సగటున 26 క్వింటాళ్ల నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్న ఆనందం రైతుల్లో వ్యక్తమవుతోంది.



ఖమ్మం జిల్లా కూసుమంచి ఐకేపీ కేంద్రంలో ఆరబోసిన సన్నరకం ధాన్యం

ఈసారి ఖర్చులు తక్కువే



ఈ యాసంగిలో నాకున్న ఎకరం విస్తీర్ణంలో సన్నరకం సాగు చేయగా.. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వానాకాలంలో 24 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వర్షాలు, వరదలతోపాటు తెగుళ్ల ఇబ్బంది పెట్టడం వల్ల దిగుబడి తగ్గడంతోపాటు ఖర్చులు కూడా అధికమయ్యాయి. అయితే ఈ యాసంగిలో వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండటం, తెగుళ్ల లేకపోవడంతో 6 క్వింటాళ్లు అధికంగా దిగుబడి వచ్చింది. ఖర్చులు కూడా అంతగా లేవు.

–అర్వపల్లి నరేష్, కూసుమంచి

క్లుప్తంగా...



ఎల్లారెడ్డిగూడెంలోని మేడి అరుణసోములు ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

పేదల ఆత్మగౌరవ పథకం సన్నబియ్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకమని.. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం దళిత కాలనీలో సన్నబియ్యం పథకం లబ్ధిదారు మేడి అరుణసోములు ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ జయంతి రోజు పేద దళిత మహిళ ఇంట్లో భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో రాజీవ్ యువశక్తి పథకం ద్వారా నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కింద రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఫూలే విగ్రహం ఏర్పాటులో జాప్యమెందుకు?

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ వద్ద మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహ ఏర్పాటులో జాప్యమెందుకో చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నామని ఆమె తెలిపారు. శనివారం కవిత తన నివాసంలో బీసీ సంఘాల నాయకులతో కలిసి ఫూలే విగ్రహ సాధన దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహ ఏర్పాటు అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసి గౌరవించుకుందామని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి పెంచేందుకే విగ్రహ సాధన దీక్ష చేపడుతున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా వక్ఫ్ చట్టసవరణ బిల్లుపై లోక్ సభలో చర్చ సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ మాట్లాడలేదని, ప్రియాంకా అసలు సభకే హాజరు కాకుండా డుమ్మా కొట్టారని కవిత మండిపడ్డారు. దేశంలోని 30 కోట్ల మంది మైనార్టీలపై తమది కపట ప్రేమేనని గాంధీలు నిరూపించుకున్నారని ధ్వజమెత్తారు.

హరీశ్.. నీ లేఖల పురాణం ఆపు

- ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, రామచంద్రు నాయక్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖలు చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేసింది. రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆయన రాసిన లేఖపై ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, రామచంద్రునాయక్ స్పందించారు. శనివారం బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకున్న హరీశ్ ఇప్పుడు సుద్ద పూస మాటలు మాట్లాడుతున్నాడని, రేవంత్ ప్రజాపాలన చేస్తుంటే హరీశ్‌రావు లేఖల పేరుతో నీతిమాలిన చర్యలకు పాల్పడుతున్నాడని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీకి, కేసీఆర్ కుటుంబానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, అసలు రాహుల్‌గాంధీకి లేఖ రాసే నైతిక హక్కు హరీశ్ రావుకు లేదన్నారు. రామచంద్రునాయక్ మాట్లాడుతూ హరీశ్ రావు లేఖల పురాణం ఆపాలని సూచించారు. పదేళ్లలో వేల ఎకరాలను అమ్ముకుని, లక్షల ఎకరాల అడవులను మాయం చేసిన హరీశ్ రావు రాజ్యాంగం గురించి మాట్లాడటం, రేవంత్‌రెడ్డి గురించి లేఖలు రాయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.

డిసెంబర్‌లోగా 50 టీఎంసీల నిల్వ!

- ఆలోగా 'పాలమూరు'తొలి విడత పనులు పూర్తి చేయాలి
- సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశాలు
- నేడు సీతారామ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తొలి దశను ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుని వచ్చే డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ (6.40టీఎంసీలు), ఏదుల (6.55 టీఎంసీలు), వట్టెం (16.7 టీఎంసీలు), కరివేన (19 టీఎంసీలు) రిజర్వాయర్‌ల పనులు పూర్తి చేసి డిసెంబర్ నాటికి 50 టీఎంసీల కృష్ణా జలాలను నిల్వ చేసుకునేందుకు సర్వం సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్యాకేజీ–3 కింద నార్లాపూర్–ఏదుల రిజర్వాయర్ల మధ్య కాల్వల పనులను తక్షణమే ప్రారంభించి అక్టోబర్‌లోగా పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల శాఖపై శనివారం ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రియదర్శిని జూరాల జలాశయంలో పూడికను తొలగించి నిల్వ సామర్థ్యాన్ని 12 టీఎంసీలకు పునరుద్ధరించాలని ఆదేశించారు.

సెక్రటరీ ఇంటికి వెళ్లి సంతకం చేయించండి

'శ్రీరామనవమి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం భద్రాచలంలో పర్యటించనున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం–సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు అంచనా వ్యయం సవరణకు పరిపాలనాపర అనుమతులతో తక్షణమే జీవో జారీ చేయండి'అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్షలో ఆదేశించారు. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకి ఫోన్ చేసి ఈ విషయాన్ని తెలిపేందుకు అధికారులు ప్రయత్నించగా, ఆయన స్పందించలేదు. సెక్రటరీ ఫోన్ ఎత్తడం లేదని అధికారులు చెప్పగా.. సెక్రటరీ ఇంటికి వెళ్లి ఫైల్‌పై సంతకం చేయించి ఈ రోజే జీవో ఇవ్వాలని ఉత్తమ్ ఆదేశించినట్టు తెలిసింది. శనివారం సెలవు కావడంతో సమావేశానికి సెక్రటరీ రాలేకపోయారని సమాచారం. భద్రాచలం పర్యటనలో సీతారామ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ సమీక్ష చేసే అవకాశం ఉంది.

ఇన్‌లెట్‌వైపు నుంచే బ్లాస్టింగ్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ఇన్‌లెట్‌వైపు నుంచి మాత్రమే డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలకు అనుమతిస్తామని, మన్నెవారిపల్లి (అచ్చంపేట) వద్ద ఉన్న అవుట్‌లెట్ వైపు నుంచి ఎట్టి పరిస్థితిలో అనుమతించబోమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. సొరంగాన్ని రెండు వైపుల నుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు జరిపేందుకు అనుమతించాలని నిర్మాణ సంస్థ జయప్రకాశ్ అసోసియేట్స్ చేసిన విజ్ఞప్తిని మంత్రి తోసిపుచ్చారు. ఇన్‌లెట్ వైపు నుంచి టీబీఎంతో సొరంగంలో తవ్వకాలు జరుపుతుంటే పైకప్పుకూలి 8 మంది కూలీలు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌లెట్‌వైపు నుంచే డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలకు అనుమతిస్తున్నట్టు మంత్రి స్పష్టం చేశారు.

ఫేక్ ప్రచారంపై కోర్టుకెళ్దాం

▶ మొదటి పేజీ తరువాయి

సృష్టించడంపై ఈ భేటీలో ఆందోళన వ్యక్తమైంది.

ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా...

'ఏఐ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయడంతో కంచ గచ్చిబౌలి భూముల వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. వాస్తవాలు వెల్లడించేలోగా అబద్ధాలు సోషల్ మీడియాలో దేశమంతా వైరల్ కావడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లు ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీసినట్లు నకిలీ ఫొటోలు, వీడియోలు తయారు చేశారు. ప్రముఖులు సైతం వాటిని నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వాళ్లంతా ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టులను చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారు. ఈ భూములపై తొలుత నకిలీ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ ఝా కాసేపటికే పోస్టును తొలగించి క్షమాపణ చెప్పారు. మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారు'అని అధికారులు సీఎంకు వివరించారు.

ఏఐతో ప్రజాస్వామ్య వ్యవస్థలకు ముప్పు: పోలీసులు

'కంచ గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాల్ విసిరింది. భారత్–పాక్, భారత్–చైనా సరిహద్దుల్లో వివాదాలు, ఘర్షణలకు దారితీసేలా ఇదే తీరిలో సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తులో యుద్ధాలు జరిగే ప్రమాదం ఉంటుంది. ఏఐతో తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారి లాంటివి'అని పోలీసు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అప్పుడు లేని వివాదం ఇప్పుడెందుకు?

'కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లోని భూముల్లో గత 25 ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతోపాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు భవంతులు, అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలు నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదు' అని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అప్పుడు వన్య ప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందన్న అంశం సమావేశంలో చర్చకు వచ్చింది.



బీఆర్ఎస్ నేతలతో భేటీ అయిన కేసీఆర్. చిత్రంలో నిరంజన్‌రెడ్డి, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణ వ్యతిరేక శక్తులే మళ్లీ కుట్రలు చేస్తున్నాయి

- తెలంగాణను విఫల ప్రయోగంగా చూపాలనుకున్నాయి: కేసీఆర్
- అందులో భాగంగానే బీఆర్ఎస్ పాలనపై నిందలేశాయి
- మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేజిక్కించుకున్నాయి
- హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటం అభినందనీయం
- ఎర్రవల్లి నివాసంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలతో భేటీ

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్ఎస్ పాలనను వైఫల్యంగా చిత్రీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఒక విఫల ప్రయోగంగా నిరూపించేందుకు తెలంగాణ వ్యతిరేక శక్తులు మూకుమ్మడిగా కుయుక్తులను అమలు చేశాయి. ఈ కుట్రలను నేను తిప్పికొట్టడంతో ఆ శక్తులు తోక ముడిచాయి. కానీ మోసపూరిత వాగ్దానాలతో ప్రజల్లో ఆశలు కలిగించి తిరిగి అధికారం చేజిక్కించుకున్నాయి. కానీ పాలన చేతకాక తిరిగి బీఆర్ఎస్ పాలనను తప్పుపడుతూ మనల్ని నిందించే కుట్రలకు తెరలేపుతున్నాయి'అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఎర్రవల్లి నివాసంలో శనివారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు.

బీఆర్ఎస్‌ను ఆడిపోసుకుంటున్నారు

'పాలన చేత కాక బీఆర్ఎస్‌ను ఆడిపోసుకుంటూ కాంగ్రెస్ నాయకులు దిగజారి వ్యవహరించినా పార్టీ నేతలు ఆవేశానికి గురి కావద్దు. ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లించే కుయుక్తులను ప్రజలు అర్థం చేసుకుని తిప్పికొడుతున్నారు. తెలంగాణ ఇతరులకు ఒక రాజకీయ క్రీడ కానీ బీఆర్ఎస్‌కు ఒక టాస్క్. ప్రజల పట్ల బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే చిత్తశుద్ధి ఉంటుంది. 15 నెలలుగా ప్రజా సమస్యలపై శాంతియుత పద్ధతిలో చేస్తున్న పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి'అని కేసీఆర్ చెప్పారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు అభినందనలు

'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై విద్యార్థులు చూపిన పోరాట పద్ధతి అభినందనీయం. అధికారం చేతిలో ఉందని ఇష్టారీతిన వ్యవహరిస్తే న్యాయస్థానాలు, సభ్య సమాజం, విద్యార్థిలోకం తిప్పి కొడతాయనేందుకు హెచ్‌సీయూ ఉదంతమే ఒక ఉదాహరణ. ఆర్థికంగా రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూములపై దుందుడుకు చర్యలతో దేశవ్యాప్తంగా పరువు తీసింది. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాది కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారు. సభకు బయలుదేరే ముందు అన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేయాలి. కార్యకర్తలకు అవసరమైన జెండాలు, పోస్టర్లు, కండువాలు, ప్రచార సామగ్రి పంపిణీ చేస్తాం. సభ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించాలి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీలు వేసి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల్లో శిక్షణ తరగతులు నిర్వహిద్దాం'అని కేసీఆర్ పేర్కొన్నారు. కాగా, వరంగల్ సభను విజయవంతం చేసేందుకు కేసీఆర్ ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సన్నాహక భేటీలు శనివారం ముగిశాయి.

మీరే సైనికులు.. కొట్లాడి గెలవాలి

- సోషల్ మీడియాలో కాదు ప్రజల్లోకి వెళ్లండి.. ప్రతిపక్షాల అవాస్తవాలను తిప్పి కొట్టండి
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: యూత్ కాంగ్రెస్ నాయకులే సైనికులని...పార్టీని రక్షణ కవచంలా కాపాడాల్సింది వారేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. యూత్ కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి పార్టీ మంచి అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. శనివారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ నాయకత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన స్థానం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి ప్రచారం చేయడంలో యూత్ కాంగ్రెస్ తగిన పాత్ర పోషించలేకపోతోందన్నారు. సోషల్‌మీడియా మీద యూత్‌కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్ చేయాలని, మరింత ఉత్తేజపూరితంగా ముందుకెళ్లాలని సూచించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రతిపక్షాలు ఏఐ టెక్నాలజీతో అనైతికంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

నేను, మహేశ్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి ఎదిగిన వాళ్లమే: మంత్రి పొన్నం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తనతోపాటు మహేశ్‌గౌడ్ కూడా ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్ నుంచి ఎదిగిన వారమేనని చెప్పారు. ఓపికగా కష్టపడి పనిచేయాలని, కొట్లాడి గెలవాలని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. ప్రజల్లోకి వెళ్లేందుకు సోషల్‌మీడియా ఒక్కటే అస్త్రం కాదని, ప్రజల్లోకి నేరుగా వెళ్లడం ద్వారా వారికి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. అవాస్తవ ప్రచారాలను తిప్పికొట్టాలని, రాజీవ్ యువవికాసం లాంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సురభి ద్వివేది, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రవణ్‌రావు, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెలగద్దర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో పొన్నం తదితరులు

హైదరాబాద్ ఎమ్మెల్సీ గెలుస్తాం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధీమా



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా గెలుస్తుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఈ ఎన్నికల్లో ఎంఐఎంను వ్యతిరేకించే వారంతా కూడా తమ పార్టీ వైపు నిలబడాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటేయాలని బీఆర్ఎస్ ఓటర్లనే కాకుండా ఎంఐఎంకు వ్యతిరేకంగా వ్యవహరించే కాంగ్రెస్ ఓటర్లను కూడా ఓటేయాలని కోరుతున్నామన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ మూడు పార్టీలు ఒక్కటేనన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని, తాము సంఖ్యాబలంతో సంబంధం లేకుండా తమ పార్టీ అభ్యర్థిని బరిలో దింపామని చెప్పారు. ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం తర్వాత రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తవుతుందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

సన్నబియ్యంలో కేంద్రం వాటా ఎంత?

- రేషన్ షాపుల వద్ద వివరాలు ప్రదర్శించాలి: కేంద్రమంత్రి బండి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌కు దమ్ముంటే సన్న బియ్యం పంపిణీలో కేంద్రం వాటా ఎంత? రాష్ట్రం వాటా ఎంత? అనే అంశంపై రేషన్ షాపుల వద్ద వివరాలు ప్రదర్శించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. ఇంత ఖర్చు చేసి మోదీ ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే.. కనీసం ప్రధాని ఫొటో ఎందుకు పెట్టరని ప్రశ్నించారు. రేషన్ షాపుల వద్ద బీజేపీ కార్యకర్తలు ప్రధాని ఫొటోలు పెడితే చించివేయించడం ఎంత వరకు కరెక్ట్ అని నిలదీశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని ఫొటో పెడితే మీకున్న అభ్యంతరమేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే రేషన్ షాపుల వద్ద ప్రధాని మోదీ ఫొటో పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తోంది కేంద్రమేనని, అయినప్పటికీ సన్న బియ్యం పేరుతో సొంతంగా పంపిణీ చేస్తున్నట్లు కాంగ్రెస్ నేతలు డ్రామాలాడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ బియ్యం తీసుకుంటున్న పేదల ఇళ్ల వద్ద భోంచేసి, వారి సమస్యలు తెలుసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షులకు పిలుపునిస్తున్నామని సంజయ్ అన్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసే కార్పొరేటర్లు దేశభక్తి పార్టీ అభ్యర్థికి ఓటేస్తారా? లేక దేశద్రోహ పార్టీకి ఓటేస్తారా? అనేది ఆలోచించాలని ఆయన కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీపడి హైదరాబాద్‌ను మజ్లిస్‌కు అప్పగించేందుకు సిద్ధమయ్యాయని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, డీలిమిటేషన్ పేరుతో రెండు పార్టీలు కలిసే చెన్నై మీటింగ్‌లో పాల్గొన్నాయని గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశాయన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

చట్టసభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయి: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ బయట విమర్శించుకుంటూ.. పార్లమెంట్, అసెంబ్లీ వేదికలుగా కలిసి పనిచేస్తున్నాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. శనివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు పేరుతో కొందరు పేదల భూములు దోచుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలతో ముస్లింలను మోసం చేస్తోందన్నారు. వక్ఫ్‌బిల్లు చరిత్రాత్మకమైనదని ఈ చట్టం అమల్లోకి వచ్చాక బడాబాబులు వక్ఫ్ ఆస్తులను ఎలా దోచుకున్నారో వెల్లడవుతుందని లక్ష్మణ్ చెప్పారు. బీజేపీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని, మిగతా పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నాయన్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చాల్సిన అవసరం లేదని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ముస్లింలను బీసీల్లో చేర్చి బీసీలకు అన్యాయం చేస్తే బీజేపీ ఊరుకోదని లక్ష్మణ్ హెచ్చరించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా పరోక్షంగా మజ్లిస్ గెలిచేందుకు కాంగ్రెస్, బీజేపీ తోడ్పాటునందిస్తున్నాయన్నారు. ఈ మూడు పార్టీల కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పి కొడతారని లక్ష్మణ్ చెప్పారు.

24 గంటలూ లేకుంటే రాజీనామా చేయండి

- పని విషయంలో రాజీ లేదు..పార్టీ సమావేశంలో ఎంపీ ఈటల



సాక్షి, హైదరాబాద్: 'పదవిని పొందేటప్పుడు ఉండే ఆరాటం పనిచేసేటప్పుడు కూడా ఉండాలి. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. డివిజన్ అధ్యక్షుడు ఆపైస్థాయి నాయకులు 24 గంటలూ అందుబాటులో ఉండాలి. అలా ఉండలేని వారు రాజీనామా చేయండి' అని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని.. దానిని అందిపుచ్చుకోడానికి మనం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'పార్టీని నడపడంలో రాజీపడే ప్రసక్తే లేదు. పార్టీ కన్న తల్లి.. గౌరవాన్ని పెంచుతుంది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. రాబోయే కాలంలో ఇక్కడ కూడా అధికారంలోకి రావాలి. దానికి తగ్గట్టు మన ప్రవర్తన, పని విధానం, ప్రజలను ప్రేమించే తత్వం ఉండాలి'అని పేర్కొన్నారు. శనివారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ

అనంతరం ఈటల సచివాలయంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఈటల మీడియాతో మాట్లాడుతూ... 'మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై మంత్రిని కలిశాం. మల్కాజిగిరిలో తాగునీటి ఇబ్బంది ఉంది, రోడ్లు సక్కగా లేవు, డబుల్ బెడ్‌రూంలు కేటాయించినా వేరే వాళ్లు ఉంటున్నారు. చెరువులు మురికి కూపాలుగా మారాయి. ఈ సమస్యలపై దృష్టి పెట్టి బాగు చేయాలని కోరాం' అని ఈటల చెప్పారు.



శ్రీరామ చంద్రుడు అఖిల ప్రపంచానికీ ఆరాధ్య దైవం. ఆదర్శ పురుషుడు. మన తెలుగువారికి మరీ మరీ ప్రీతిపాత్రుడు. శ్రీరామనామ స్మరణతోనే మనకు తెల్లవారుతుంది. రాముడి పేరు లేని తెలుగు ఇల్లు ఉండదు.రామాలయం లేని ఊరు ఉండదు. నిరంతరం రామనామ ధ్యానమే తెలుగువారి శ్వాస. ఆదికవి వాల్మీకి మహర్షి భూమి జనుల కోసం అత్యంత రమణీయంగా చెప్పిన ఆ రామ కథనే ఈ శ్రీరామ నవమి శుభ సమయాన మనం మళ్ళీ చెప్పుకుంటున్నాం.

బొమ్మలు : బాపు

శ్రీరామ రామ రక్ష-సర్వ జగద్రక్ష !

శ్రీరామ జననం, శ్రీ సీతారామ కల్యాణం, శ్రీ రామ పట్టాభిషేకం –ఈ మూడింటికీ కూడా చైత్ర శుద్ధ నవమే శుభ ముహూర్తం. ఆంధ్రదేశంలో ఊరూరా శ్రీరామ నవమికి పందిళ్ళు వేస్తారు. అరటి స్తంభాలతో, మామిడి తోరణాలతో, పూలమాలలతో పందిళ్లను అలంకరిస్తారు. ఊరి ప్రజలంతా తమ ఇంటి పెళ్ళికి లాగానే ఇళ్ళను అలంకరించుకుంటారు. ఊరి రామాలయంలో కళ్యాణ వేదిక ఏర్పాటు చేస్తారు. ఊరివారంతా ఉమ్మడి బాధ్యతతో సీతారామ కల్యాణం వైభవంగా జరుపుతారు. పానకం, వడపప్పు, కొబ్బరి ముక్కలు, చెరుకు ముక్కలు, అరటి పళ్ళు, ఇతర పిండి వంటలను సీతారాములకు నివేదించి, ఆ ప్రసాదం భక్తులందరికీ పంచి పెడతారు.

అంతా రామ మయం



భూమి మీద రాక్షసుల దుర్మార్గాలు మితిమీరి పోయి, సాధువులకూ సన్మార్గులకూ నిలువ నీడ లేకుండా పోతోంది. దేవతలూ భూదేవీ బ్రహ్మదేవుడి సలహాతో శ్రీ మహావిష్ణువు వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నారు. దుష్ట రాక్షస సంహారానికీ, ధర్మ రక్షణకూ భూమికి దిగి రమ్మని వేడుకున్నారు. వారి వేడుకోలును మన్నించాడు మహా విష్ణువు. తన పరివారంతో కూడా భూమికి బయలు దేరాడు. అనంతమైన తన శక్తులన్నిటికీ వేర్వేరు రూపాలు కల్పించి వారితో పాటు భూమి మీదకు అవతరించాడు.

***

అయోధ్య రాజు దశరథుడు పుత్ర సంతానం కోరి తన ముగ్గురు భార్యలతో కూడా పుత్ర కామేష్టి చేశాడు. యజ్ఞఫలంగా మహావిష్ణువు దశరథుడికి నలుగురు పుత్రులుగా జన్మించాడు. ఆనాడు చైత్ర శుద్ధ నవమి. అదే శ్రీరామ నవమి పుణ్యదినం.



రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురూ కులగురువు వశిష్ట మహర్షి వద్ద సకల విద్యలూ నేర్చారు. ధనుర్వేదం అభ్యసించారు. పురాణ ఇతిహాసాలు చెప్పుకున్నారు. లౌకిక వ్యవహార జ్ఞానం సంపాదించారు. నలుగురూ లోకహితాచరణ పరాయణులు. సర్వజన మనోహరులు. తేజోవంతులు. పితృసేవా తత్పరులు.


***



కడుపులో చల్ల కదలకుండా ఇంట్లో కూర్చుంటే దుష్ట సంహారం ఎలాగ? బయటి ప్రపంచంలో నువ్వు చెయ్య వలసిన పని చాలా ఉంది. రా నాతో --అని విశ్వామిత్ర మహర్షి దశరథ మహారాజు అనుమతితో తను తలపెట్టిన యాగానికి విఘ్నం కలిగిస్తున్న రాక్షసులను కట్టడి చేయటానికి రామలక్ష్మణు లను తనతో అడవులకు తీసుకువెళ్ళాడు. తపస్సు చేసి తను సంపాదించుకున్న శస్త్రాస్త్ర సంపదనం తటినీ రామ లక్ష్మణులకు ధారపోశాడు. యాగానికి ఆటంకం కలిగిస్తున్న రాక్షసులను సంహరించి విశ్వామిత్రుడి ఆశీస్సులు పొందారు రామ లక్ష్మణులు.



మిథిలాధిపతి జనక మహారాజు చేస్తున్న ధనుర్యాగం చూపించటానికి రామ లక్ష్మణులను మిథిలకు తీసుకు వెళ్ళాడు విశ్వామిత్రుడు. తన వద్ద ఉన్న శివధనుస్సును రాముడికి చూపించాడు జనకుడు. ఆ శివధనుస్సును ఎక్కుపెట్ట గలిగితే రాముడికి సీతను ఇచ్చి పెళ్లి చేస్తానన్నాడు జనకుడు. రాముడు ఆ శివ ధనుస్సును అవలీలగా ఎక్కుపెట్టడమే కాకుండా అప్రయత్నంగానే నారి సారించాడు. విల్లు ఫెళ్ళున విరిగింది.



జనక మహారాజు చాలా సంతోషించాడు. సంతృప్తి చెందాడు. సీతాదేవి రాముడి కంఠాన్ని వరమాలతో అలంకరించింది. సీతారామ కల్యాణానికి సుముహూర్తం నిశ్చయించారు. అయోధ్య నుంచి దశరథ మహారాజు సకుటుంబంగా కొడుకు పెళ్ళికి తరలి వచ్చాడు. సీతా రాముల కళ్యాణంతో పాటే రామ సహోదరులు భరత లక్ష్మణ శత్రుఘ్నులకు ... సీతాదేవి చెల్లెళ్ళయిన మాండవి, ఊర్మిళ, శ్రుతకీర్తులతో కూడా అదే ముహూర్తాన కళ్యాణాలు జరిగాయి.

***

వృద్ధుడైన దశరథ మహారాజు అయోధ్యా రాజ్యానికి ఉత్తరాధికారిగా పెద్దకొడుకు రాముడికి పట్టాభిషేకం చెయ్యడానికి ముహూర్తం ప్రకటించాడు. ప్రజలంతా సంతోషించారు. కాని దశరథుడి మూడవ భార్య కైకేయి ఒప్పుకోలేదు. తన కొడుకు భరతుడికి పట్టం కట్టమని, రాముడిని పద్నాలుగేళ్ళపాటు వనవాసానికి పంపమని కోరింది. మహారాజు ఒప్పుకోక తప్పలేదు. తండ్రి మాట జవదాటని రాముడు నిర్వికారంగా అడవులకు బయలుదేరాడు. సీతాలక్ష్మణులు రాముడిని అనుసరించారు. పుత్ర



వియోగం భరించలేక దశరథుడు రామా రామా అంటూనే ప్రాణాలు వదిలాడు.

అడవులలో పద్నాలుగేళ్ళ పాటు పడరాని కష్టాలు పడ్డారు సీతా రామ లక్ష్మణులు. అయితే రాముడు అయోధ్యలో తండ్రి చాటు బిడ్డగా ఎంత సుఖంగా ఉన్నాడో అడవులలో కూడా అంత స్థిమితంగా ఉన్నాడు.. పుట్టిన నాటినుంచి రాజ భోగాలలో పెరిగిన రాముడు అడవిలో కందమూలాలు తిని, గడ్డి పాన్పు మీద పడుకోవలసి వచ్చినా కష్ట పెట్టుకోలేదు. తండ్రి మాట నిలపడం కోసం సంతోషంగా అన్ని కష్టాలూ భరించాడు. మునుల సేవ చేస్తూ,వారిని రాక్షసుల బారినుంచి కాపాడుతూ , వారి వల్ల మంచి మాటలు వింటూ గడిపాడు.

సీతాపహరణం



లంకాధిపతి రావణాసురుడు మాయలతో, మోసాలతో సీతాదేవిని ఎత్తుకు పోయి తన లంకా నగరంలో అశోక వనంలో ఉంచాడు. రామ లక్ష్మణులు సీతాదేవిని వెతుకుతూ ఋష్య మూక పర్వతం మీద కపి రాజు సుగ్రీవుడిని కలుసుకుని సఖ్యం చేశారు. రాముడు సుగ్రీవుడి అన్న వాలిని చంపి సుగ్రీవుడిని కిష్కింధా రాజ్యానికి రాజును చేశాడు. సుగ్రీవుడి మంత్రి హనుమంతుడి ప్రయత్నంతో సీతాదేవి లంకలో రావణుడి చెరలో ఉన్నదని తెలుసుకున్నాడు. దక్షిణ సముద్రానికి అవతల ఉన్న లంకకు సైన్యంతో చేరడానికి సముద్రానికి కొండరాళ్ళతో బండరాళ్ళతో వారధి కట్టారు వానరులు.



రావణాసురుడి తమ్ముడు విభీషణుడు అన్నకు హితవు చెప్పబోయాడు గౌరవంగా . సీతను రాముడికి అప్పచెప్పి రాముడిని శరణు కోరి ప్రాణాలు నిలుపుకోమని అన్నను హెచ్చరించాడు విభీషణుడు. రావణుడు వినకపోగా కోపంతో తమ్ముడిని లంకనుంచి వెళ్ళగొట్టాడు. విభీషణుడు రాముడిని శరణు కోరాడు. రావణుడిని చంపి విభీషణుడిని లంకకు రాజుని చేస్తానని మాట ఇచ్చాడు రాముడు. రాక్షసులకూ, రామ లక్ష్మణుల వానర సైన్యానికీ యుద్ధం జరిగింది. రామ రావణ సంగ్రామం భయంకరంగా సాగింది. చివరకు రాముడు బ్రహ్మాస్త్రంతో రావణుడిని సంహరించాడు.

యుద్ధంలో వీరమరణం పొందిన రావణుడికి అతడి తమ్ముడు విభీషణుడు యధావిధిగా అంత్య కర్మలు నిర్వర్తించాడు. మాట ఇచ్చిన ప్రకారం రాముడు విభీషణుడిని లంకా నగరానికి రాజును చేశాడు. విభీషణుడు హనుమంతుడిని వెంటబెట్టుకుని అశోకవనానికి వెళ్ళాడు. సీతాదేవికి రాముడి విజయ వార్త చెప్పి సంతోష పెట్టాడు. ఆమెను గౌరవమర్యాదలతో యుద్ధ భూమిలో ఉన్న రాముడి వద్దకు తీసుకువెళ్ళి అప్పగించాడు. సీత అగ్ని శుద్ధి పొంది తన పాతివ్రత్యం నిరూపించుకుంది. పది నెలల వియోగం అనుభవించిన సీతారాములు ఇప్పుడు సంతోషంతో కలుసుకున్నారు. విభీషణుడు సిద్ధం చేసిన పుష్పక విమానంలో సీతారామ లక్ష్మణులు అయోధ్యకు బయలుదేరారు. విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, సమస్త వానర సైన్యం రాముడితో కూడా పుష్పకంలో బయలు దేరారు.



పట్టాభిరాముడు

అయోధ్యానగరం దగ్గర నంది గ్రామంలో సీతారామ లక్ష్మణుల రాకకై ఎదురు చూస్తున్న భరత శత్రుఘ్నులు, అయోధ్య ప్రజలు వారికి ఘన స్వాగతం చెప్పారు. సీతారామ లక్ష్మణులు తల్లులకు, గురువులకు నమస్కరించారు. కులగురువు వశిష్టమహర్షి నిశ్చయించిన శుభ ముహూర్తంలో శ్రీ రాముడికి అయోధ్యా మహా సామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా జరిగింది. ఆనాడు చైత్రశుద్ధ నవమి. అదే మనకు శ్రీరామనవమి.



– ముళ్లపూడి శ్రీదేవి

హెల్త్



జుట్టు ఊడిపోతున్నప్పుడు జింక్ వంటి పోషకాల లోపం ఏదైనా ఉందేమో చూసుకోవడంతో పాటు ఏవైనా ఆరోగ్య సమస్యల కోసం మనం వాడే మందులు మనకు సరిపడక జుట్టును రాల్చేస్తున్నాయేమో కూడా చూడాలి. అలా కొన్ని రకాల మందులు సరిపడకపోవడం లేదా వాటి దుష్ప్రభావాల వల్ల కూడా కొందరిలో జుట్టు రాలిపోతుంది. అలా జట్టును రాలేలా చేసే మందులేమిటో తెలుసుకోండి.

● హెయిర్
జుట్టును మింగే మందులు

జుట్టు రాలేలా చేసే కొన్ని రకాల మందులేమిటో, అవి ఎందుకు వాడుతుంటారో తెలుసుకుందాం.

జుట్టు రాల్చే మందులివే...

ఇక్కడ పేర్కొన్న ఈ మందులన్నీ జుట్టును రాలిపోయేలా తప్పక చేస్తాయని కాదు. కానీ కొందరిలో అవి సరిపడకపోవడం వల్ల ప్రతికూలంగా పనిచేసి జుట్టును రాల్చేందుకు కారణమవుతుంటాయి. వాటిలో ప్రధానమైన కొన్ని మందులివి...

● ఇన్ఫెక్షన్లకు వాడే కొన్ని యాంటీబయాటిక్స్ ● యాంటీ ఫంగల్ మందులు ● మొటిమలకు వాడే కొన్ని మందులు ● కొన్ని యాంటీ డిప్రెసెంట్స్ ● నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మందులు ● యాంటీకొలెస్ట్రాల్ మందులు ● రక్తాన్ని పలచబార్చేవి ● ఇమ్యునోసప్రెసెంట్స్ ●మూర్ఛ చికిత్సలో వాడే మందులు ● హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీలో వాడే ఈస్ట్రోజెన్, ప్రోజెస్టెరాన్, పురుషులకు వాడే టెస్టోస్టెరాన్, యాండ్రోజెన్ వంటి హార్మోన్‌లు ●ఇంటర్‌ఫెరాన్స్ ● వేగంగా మూడ్స్ మారిపోతున్నప్పుడు నియంత్రణకు వాడే మూడ్ స్టెబిలైజేషన్ మందులు ● నొప్పినివారణకు వాడే ఎన్ఎస్ఏఐడీ తరహా మందులు ● స్టెరాయిడ్స్... వీటితో పాటు వీటన్నింటిలోకీ కీమోథెరపీకి వాడే మందులు జుట్టును రాలేలా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.

వెంట్రుక దశలు

ఈ మందులు వెంట్రుక జీవితచక్రంలోని వివిధ దశల్లోకి జొరబడి అవి జుట్టును రాలేలా చేస్తాయి. ఏయే మందులు ఏయే దశల్లో జొరబడి జుట్టు రాలుస్తాయో తెలుసుకోవడంతో పాటు ఆ దశలేమిటో చూద్దాం. వెంట్రుక పెరుగుదలలో కెటాజెన్, టిలోజెన్, అనాజెన్ అనే దశలు ఉంటాయి.



డా. బి. విజయశ్రీ,
సీనియర్ కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్

టిలోజెన్ : మొత్తం జుట్టులో 10-15 శాతం ఎప్పుడూ ఈ దశలోనే ఉంటుంది. ఈ దశ సాధారణంగా 100 రోజుల పాటు కొనసాగుతుంది. అయితే కనుబొమలు, కనురెప్పలు, బాహుమూలాల్లో ఉండే వెంట్రుకల్లో ఈ దశ మరింత దీర్ఘకాలం ఉంటుంది. ఈ దశలోనే వెంట్రుక తన పూర్తిస్థాయి పొడవులో ఉంటుంది. ఈ దశలో ఉన్నప్పుడు రోమాన్ని పీకితే... వెంట్రుక కింద గసగసాల్లాంటి గుండ్రటి, తెల్లటి భాగం కనిపిస్తుంది.

కెటాజెన్ : మొత్తం జుట్టులో కనీసం మూడు శాతం ఎప్పుడూ ఈ దశలోనే ఉంటుంది. వెంట్రుక పెరుగుదలలో ఇదో సంధి దశ. ఈ దశ 2 నుంచి 3 వారాల పాటు ఉంటుంది. ఈ దశలో వెంట్రుక నిద్రాణంగా ఉండి, రోమాల పెరుగుదల ఏమాత్రం ఉండదు.

అనాజెన్ : వెంట్రుక పెరుగుదల దశలన్నింటిలోనూ అనాజెన్ అనేది చురుకైనది. ఈ దశలో వెంట్రుక మూలంలో కణవిభజన వేగంగా జరుగుతుంటుంది. కింద రోమాంకురంలో కొత్త కణాలు పెరుగుతున్న కొద్దీ పాత కణాలు ముందుకు వెళ్తుంటాయి. ఫలితంగా కింది నుంచి వేగంగా వెంట్రుక పై వైపునకు పెరుగుతూ పోతుంది. (అందుకే జుట్టుకు రంగు వేసుకునేవారిని చూసినప్పుడు జుట్టు కింది భాగంలోని వెంట్రుకలు రంగులేకుండా కనిపిస్తుండటానికి కారణమిదే). ఈ దశలో ప్రతి 28 రోజులకు వెంట్రుక ఒక సెంటీమీటరు పొడవు పెరుగుతుంది. అలా కొంత పొడవు పెరిగి ఆగిపోతుంది. తల మీద ఉన్న వెంట్రుకలు రెండు నుంచి ఆరేళ్ల పాటు పెరుగుతాయి. బాహుమూలాల్లో, కాళ్లపైనా, కనుబొమలు, కనురెప్పపై ఉండే వెంట్రుకల్లో పెరుగుదల వ్యవధి 30-45 రోజులు మాత్రమే ఉండి, ఆ తర్వాత ఆ పెరుగుదల ఆగిపోతుంది. ఈ కారణం వల్లనే ఈ వెంట్రుకలు మాడుపై ఉండే వెంట్రుకలంత పొడవు పెరగవు.

మన ఆరోగ్య సమస్యల కోసం వాడే మందులు జుట్టు పెరుగుదలలో ఉండే అనాజెన్, కెటాజెన్, టిలోజెన్ దశలను ప్రభావితం చేస్తాయి. దాంతో జుట్టు పెరుగుదలలో మార్పు వస్తుంది. ఫలితంగా టిలోజెన్ ఎఫ్లూవియమ్, అనాజెన్ ఎఫ్లూవియమ్ అనే రెండు రకాల మార్పులు వచ్చి అవి జుట్టు రాలేలా చేస్తాయి.

టిలోజెన్ ఎఫ్లూవియమ్ : ఏదైనా ఆరోగ్య సమస్య కోసం మందులు వాడటం మొదలుపెట్టగానే వాటి ప్రభావంతో 2 నుంచి 4 నెలల్లో హెయిర్ ఫాలికిల్ విశ్రాంతి దశలోకి వెళ్తుంది. అంతేకాదు... ఒక్కోసారి మనకు ఉన్న వ్యాధి కూడా టిలోజెన్ ఎఫ్లూవియమ్‌ను కలిగించవచ్చు.

అనాజెన్ ఎఫ్లూవియమ్ : ఈ దశలో వెంట్రుకలు తమ పెరుగుదల దశలోనే రాలిపోతుంటాయి. మందు వాడటం మొదలుపెట్టిన కొద్దిరోజుల్లోనే ఇది కనిపిస్తుంది. ఉదాహరణకు కీమోథెరపీ తీసుకునేవారిలో అనాజెన్ ఎఫ్లూవియమ్ వల్లనే జుట్టురాలిపోతుంది. ఈ మందులు కేవలం తల మీది జుట్టే కాకుండా కనుబొమలు, కనురెప్పల వెంట్రుకలూ రాలిపోయేలా చేస్తాయి.

మందుల వల్లనే జుట్టు రాలుతుంటే... ● సాధారణంగా మందులు మానేయగానే మళ్లీ వచ్చేందుకు అవకాశమెక్కువ ● ఒక మందుతో జుట్టు రాలుతుంటే దానికి ప్రత్యామ్నాయ మందులు వాడటం ● జుట్టు రాలడాన్ని అరికట్టే మందులనూ వాడటం (డాక్టర్ సలహా మేరకు మాత్రమే)● కీమోథెరపీ ఇచ్చే సమయంలో హైపోథెర్మియా అనే ప్రక్రియను ఉపయోగించడం ద్వారా. ఈ ప్రక్రియలో కీమోథెరపీ ఇచ్చే ముందర... ఇచ్చిన అరగంట తర్వాత మాడుపై ఐస్‌తో రుద్దుతారు. ఫలితంగా కీమోథెరపీలో ఇచ్చిన మందు ఫాలికిల్ లోకి అంతగా ప్రవేశించదు. ఇది జుట్టు రాలడాన్ని చాలావరకు నివారిస్తుంది. అయితే ఈ ఫలితం అందరిలోనూ ఒకేలా ఉండకపోవచ్చు. బాధితులకు ఉన్న క్యాన్సర్ ఏమిటన్నదాని మీద ఈ హైపోథెర్మియా ఫలితాలు ఆధారపడి ఉంటాయి. అందుకే ఆ ప్రక్రియను ఉపయోగించే ముందర ఒకసారి చికిత్స చేస్తున్న ఆంకాలజిస్ట్ సలహా తీసుకుని ముందుకు వెళ్లడం మంచిది. ఎవరికైనా తాము వాడుతున్న మందుల వల్ల జుట్టు రాలుతోందనిపిస్తే ఆ విషయాన్ని తమ డాక్టర్‌కు తెలపాలి. అప్పుడు వాళ్లు తగిన ప్రత్యామ్నాయాలను సూచిస్తారు.

● ఎయిర్
సమ్మర్‌లో చల్లని సమస్య

ఎండలు బాగా ముదిరాయి. స్థోమత ఉన్నవారు ఎయిర్ కండిషనర్స్‌నూ, అంతగా స్థోమత లేనివారు ఎయిర్ కూలర్స్‌నూ వాడుతుంటారు. ఏసీల కారణంగా గదిలో ఎప్పుడూ ఒకేలాంటి వాతావరణంలో మెయింటెయిన్ అవుతుండటంతో పాటు అందులోని కొన్ని ఫిల్టర్లు చాలా చాలా చిన్నగా, అత్యంత సూక్ష్మస్థాయిలో ఉండే కాలుష్యాల (మైక్రోస్కోపిక్ పొల్యుటెంట్స్) బారి నుంచీ కాపాడతాయి. శబ్దకాలుష్యాన్నీ నివారించి... చెవి, ఇతరత్రా సమస్యలు రాకుండా చూస్తాయి. కానీ వాటివల్ల కొన్ని ఆరోగ్య సమస్యలూ ఉత్పన్నమవుతాయి. అలాగే ఎయిర్ కూలర్స్‌లో, లీజియొన్నెల్లా అనే బ్యాక్టీరియా పెరిగి 'లీజియొన్నేరిస్ డిసీజ్'కు గురయ్యే ముప్పు ఉంటుంది. ఏసీలూ, కూలర్ల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలూ, అవి రాకుండా నివారించే జాగ్రత్తలను తెలుసుకుందాం.



ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లో ఎక్కువ సేపు గడపడం వల్ల కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అవి...

● **తలనొప్పి, తీవ్రమైన నిస్సత్తువ** చాలాసేపు ఏసీలో గడపడం వల్ల ఆ చల్లదనం మూలాన కొందరిలో ఒళ్లు నొప్పులు, తలనొప్పితో పాటు తీవ్రమైన నీరసం, నిస్సత్తువగా అనిపించవచ్చు.

● **శ్వాస సమస్యలు :** గదిలోని ఏసీగానీ లేదా కారులోని ఏసీగానీ చాలాసేపు ఆన్‌లో ఉండటం, దాంతో గది లేదా కార్ డోర్స్ / గ్లాసెస్ ఎప్పుడూ మూసేసే ఉండటంతో అక్కడి సూక్ష్మజీవులతో పక్కనే ఉన్న ఇతరులకు ఆ సమస్యలు వ్యాపించవచ్చు. కొందరిలో ఆస్తమానూ, పిల్లికూతలనూ ప్రేరేపించవచ్చు. అందువల్ల... ఏసీ గదిలోగానీ లేదా ఏసీ ఆన్ చేసి ఉన్న కారులోగానీ అదేపనిగా చాలాసేపు ఉండటం అంత మంచిది కాదు.

● **తేలిగ్గా వడదెబ్బకు గురికావడం :** ఎప్పుడూ ఏసీలో ఉండేవారు దానికి అలవాటైపోయి తేలిగ్గా వడదెబ్బకు గురవుతుంటారు.

● **చర్మం పొడిబారడం :** చాలాసేపు ఏసీలో గడిపే వారి చర్మంపై తేమ తగ్గి, చర్మం పొడిబారుతుంది. ఫలితంగా దురదలు వచ్చే అవకాశాలెక్కువ. వీళ్లు చర్మంపై మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి.

● **మూత్రపిండాల్లో రాళ్లు :** ఎక్కువ సేపు ఏసీలో ఉండేవారికి అంతగా దాహంగా అనిపించకపోవడంతో నీళ్లు తక్కువగా తాగుతుంటారు. దాంతో ఇలాంటి వాళ్లలో కిడ్నీ స్టోన్స్ వచ్చే అవకాశాలెక్కువ.

● **దీర్ఘకాలిక వ్యాధులు తీవ్రం కావడం :** కొన్ని రకాల దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారిలో... అంటే తక్కువ రక్తపోటు (లో బ్లడ్ ప్రెషర్), ఆర్థరైటిస్, న్యూరైటిస్ (నరాల చివరలు మొద్దుబారినట్లుగా అయిపోయి స్పర్శ అంతగా తెలియకపోవడం లేదా కాళ్లు, చేతులు తిమ్మిర్లు పట్టడం) వంటి జబ్బులు ఉన్నవాళ్లలో ఆ సమస్యలు కాస్త తీవ్రమవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు : ● ఏసీలోని ఫిల్టర్స్ తరచూ శుభ్రపరుస్తూ ఉండటం ● ఏసీలోని ఫిల్టర్స్‌ను సబ్బుతో కడిగినప్పుడు అవి పూర్తిగా ఆరిన తర్వాతే బిగించడం ● ఎప్పుడూ ఏసీలో ఉండేవారు సాయంత్రాలూ లేదా రాత్రిపూట స్వాభావికమైన చల్లగాలికి ఎక్స్‌పోజ్ అవుతూ ఉండటం ● ఏసీ సరిపడక ఏవైనా ఆరోగ్యసమస్యలు వస్తే ఏసీని వాడకపోవడం లేదా గది చల్లబడే వరకు ఉంచి ఆ తర్వాత ఆఫ్ చేసుకుని ఫ్యాన్ వేసుకోవడం.

వాటర్ కూలర్‌తో వచ్చే నిమోనియా నివారణ ఇలా...

కిందటేడాది వాటర్ కూలర్ వాడాక దాన్ని మూల పెట్టేసి ఉంచి, ఇప్పుడు ఎండలు ముదరగానే వాడటానికి తీసేవాళ్లు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. గతంలో మిగిలి ఉన్న నీళ్లలో లీజియోనెల్లా అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియా పెరగవచ్చు.దాంతో 'లీజియోన్నేరిస్ డిసీజ్' అనే ఒక రకం నిమోనియా వచ్చే అవకాశముంది. దీన్నే 'వాటర్‌కూలర్ నిమోనియా' అని కూడా అంటారు. చాలాకాలం వాడని కూలర్స్ తాలూకు పాత తడికల్లోనూ డస్ట్ మైట్స్ ఉండి, నేరుగా ఆన్ చేస్తే అది ఆస్తమా బాధితుల్లో సమస్యను ట్రిగర్ చేయవచ్చు. మామూలు వ్యక్తులకు సైతం దగ్గు, ఆయాసం వచ్చే ముప్పు ఉంటుంది. అందుకే బయటకు తీయగానే వాటర్‌కూలర్ అడుగున ఏమాత్రం చెమ్మలేకుండా చేసేందుకు ఆరుబయట ఆన్ చేసి పెట్టి దాదాపు గంటసేపు అలాగే ఉంచాలి. అడుగున ఒక్క చుక్క నీళ్ల లేకుండా డ్రైగా అయిపోయాకే వాటర్ కూలర్ వాడటం మొదలుపెట్టాలి.

మెడి టిప్
క్యాన్సర్‌ను 'బీట్' చేద్దాం!



బీట్‌రూట్‌కు ఎరుపు రంగును ఇచ్చే బిటాలెయిన్స్ అనే పోషకం చాలా శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్. అది ఫ్రీరాడికల్స్‌ను తొలగించి, అనేక రకాల క్యాన్సర్లను నివారిస్తుంది. ఇందులో ఎక్కువ మోతాదులో ఉండే విటమిన్-సీ కూడా శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్ కావడంతో ఇది కూడా క్యాన్సర్ల నివారణకు తోడ్పడుతుంది. అంతేకాదు... కొలాజెన్ ఉత్పాదన కూడా ఎక్కువగా జరుగుతుండటంతో చర్మం చాలాకాలం పాటు యౌవనంగా ఉండటానికి ఆ కొలాజెన్ సహాయపడుతుంది. బీట్‌రూట్ జ్యూస్ తీసుకునేవారికి అలసిపోకుండా చాలాసేపు పనిచేయగల స్టామినా పెరుగుతుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే... వ్యాయామం చేస్తూ బీట్‌రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకునేవారు అనేక రకాల క్యాన్సర్ల నుంచి రక్షణ పొందుతారు.

రాయల్స్ ఘనవిజయం

50 పరుగులతో పంజాబ్ చిత్తు ● రాణించిన జైస్వాల్, ఆర్చర్



ఆర్చర్ బౌలింగ్‌లో శ్రేయస్ క్లీన్ బౌల్డ్



ముల్లన్‌పూర్: తొలి రెండు మ్యాచ్‌లలో చక్కటి ఆటతో విజయాలు సొంతం చేసుకున్న పంజాబ్ కింగ్స్‌కు సొంత మైదానంలో ఆడిన మొదటి పోరులో ఓటమి ఎదురైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన రాజస్తాన్ రాయల్స్ 50 పరుగుల తేడాతో పంజాబ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (45 బంతుల్లో 67; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... రియాన్ పరాగ్ (25 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ సంజు సామ్సన్ (26 బంతుల్లో 38; 6 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. జైస్వాల్, సామ్సన్ తొలి వికెట్‌కు 62 బంతుల్లోనే 89 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. ఫెర్గూసన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. నేహాల్ వధేరా (41 బంతుల్లో 62; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా, గ్లెన్ మ్యాక్స్‌వెల్ (21 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఆర్చర్ వేసిన తొలి ఓవర్లోనే 2 వికెట్లు సహా 43 పరుగులకే 4 వికెట్లు చేజార్చుకున్న పంజాబ్ ఆ తర్వాత కోలుకోలేకపోయింది. వధేరా, మ్యాక్స్‌వెల్ ఐదో వికెట్‌కు 52 బంతుల్లో 88 పరుగులు జత చేసి ఆశలు రేపినా... విజయానికి అది సరిపోలేదు.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) ఫెర్గూసన్ 67; సామ్సన్ (సి) అయ్యర్ (బి) ఫెర్గూసన్ 38; పరాగ్ (నాటౌట్) 43; నితీశ్ రాణా (సి) మ్యాక్స్‌వెల్ (బి) యాన్సెన్ 12; హెట్‌మైర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) అర్ష్‌దీప్ 20; జురేల్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1–89, 2–123, 3–138, 4–185. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–35–1, యాన్సెన్ 4–0–45–1, ఫెర్గూసన్ 4–0–37–2, మ్యాక్స్‌వెల్ 1–0–6–0, చహల్ 3–0–32–0, స్టొయినిస్ 4–0–48–0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (బి) ఆర్చర్ 0; ప్రభ్‌సిమ్రన్ (సి) హసరంగ (బి) కార్తికేయ 17; శ్రేయస్ అయ్యర్ (బి) ఆర్చర్ 10; స్టొయినిస్ (సి) అండ్ (బి) సందీప్ 1; వధేరా (సి) జురేల్ (బి) హసరంగ 62; మ్యాక్స్‌వెల్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30; శశాంక్ సింగ్ (నాటౌట్) 10; సూర్యాంశ్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ 2; యాన్సెన్ (సి) హెట్‌మైర్ (బి) తీక్షణ 3; అర్ష్‌దీప్ (సి) హసరంగ (బి) ఆర్చర్ 1; ఫెర్గూసన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1–0, 2–11, 3–26, 4–43, 5–131, 6–131, 7–136, 8–145, 9–151. **బౌలింగ్:** ఆర్చర్ 4–0–25–3, యుధ్‌వీర్ 2–0–20–0, సందీప్ శర్మ 4–0–21–2, తీక్షణ 4–0–26–2, కార్తికేయ 2–0–21–1, హసరంగ 4–0–36–1.

చెపాక్ మళ్లీ చేజారె...

ఢిల్లీ చేతిలో ఓడిన చెన్నై
- 25 పరుగులతో క్యాపిటల్స్ గెలుపు
- కేఎల్ రాహుల్ అర్ధసెంచరీ



రాహుల్

చెన్నై: ఐపీఎల్‌లో తమకు కోటలాంటి చెపాక్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ పట్టు చేజారిపోతోంది. 17 ఏళ్ల తర్వాత ఈ మైదానంలో బెంగళూరు చేతిలో ఓడిన సూపర్ కింగ్స్... ఇప్పుడు 15 ఏళ్ల తర్వాత ఢిల్లీ చేతుల్లో పరాజయం పాలైంది. శనివారం జరిగిన పోరులో క్యాపిటల్స్ 25 పరుగుల తేడాతో చెన్నైని ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేఎల్ రాహుల్ (51 బంతుల్లో 77; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీకి తోడు అభిషేక్ పొరేల్ (20 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అనంతరం చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులే చేసింది. విజయ్‌శంకర్ (54 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎమ్మెస్ ధోని (26 బంతుల్లో 30 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. తొలి ఓవర్లోనే జేక్ ఫ్రేజర్ (0) వెనుదిరగ్గా...రాహుల్, పొరేల్ 54 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యంలో ఢిల్లీ కోలుకుంది. ముకేశ్ చౌదరి ఓవర్లో పొరేల్ వరుసగా 4, 6, 4, 4తో చెలరేగిపోగా, పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 51 పరుగులకు చేరింది. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడిన రాహుల్ తొలి 20 బంతుల్లో 25 పరుగులే చేశాడు. ఆ తర్వాత ధాటిగా ఆడిన అతను తర్వాతి 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36 పరుగులు సాధించాడు. పొరేల్ వెనుదిరిగిన తర్వాత అక్షర్ పటేల్ (14 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), సమీర్ రిజ్వీ (15 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్) కొద్ది సేపు రాహుల్‌కు అండగా నిలిచాడు. 33 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఒకే ఓవర్లో రాహుల్, అశుతోష్ (1) అవుటైనా...చివర్లో స్టబ్స్ (12 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు సాధించాడు.


సమష్టి వైఫల్యం...

ఛేదనలో చెన్నై ఆరంభం నుంచే తడబడింది. పిచ్ నెమ్మదిస్తూ పోవడంతో పరుగులు రావడంతో కష్టంగా మారిపోయింది. టాప్‌-6లో విజయ్‌శంకర్ మినహా అంతా విఫలమయ్యారు. ఆరు పరుగుల వ్యవధిలో రచిన్ (3), రుతురాజ్ (5) అవుట్ కాగా, కాన్వే (13) విఫలమయ్యాడు. ఆ తర్వాత 9 పరుగుల తేడాతో శివమ్ దూబే (18), రవీంద్ర జడేజా (2) కూడా వెనుదిరిగారు. ఆ తర్వాత విజయ్ బాగా నెమ్మదిగా ఆడగా, ధోని కూడా ప్రభావం చూపలేదు. తాను ఆడిన తొలి 31 బంతుల్లో విజయ్ ఒక్కటే ఫోర్ కొట్టగలిగాడు! వీరిద్దరు కలిసి ఆరో వికెట్‌కు 57 బంతుల్లో 84 పరుగులు జోడించినా జట్టును గెలిపించలేకపోయారు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: జేక్ ఫ్రేజర్ (సి) అశ్విన్ (బి) అహ్మద్ 0; రాహుల్ (సి) ధోని (బి) పతిరణ 77; పొరేల్ (సి) పతిరణ (బి) జడేజా 33; అక్షర్ (బి) నూర్ 21; రిజ్వీ (సి) జడేజా (బి) అహ్మద్ 20; స్టబ్స్ (నాటౌట్) 24; అశుతోష్ (రనౌట్) 1; నిగమ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 183. వికెట్ల పతనం:** 1–0, 2–54, 3–90, 4–146, 5–179, 6–180. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–25–2, ముకేశ్ చౌదరి 4–0–50–0, అశ్విన్ 3–0–21–0, జడేజా 2–0–19–1, నూర్ అహ్మద్ 3–0–36–1, పతిరణ 4–0–31–1.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ (సి) అండ్ (బి) ముకేశ్ 3; కాన్వే (సి) పటేల్ (బి) నిగమ్ 13; రుతురాజ్ (సి) జేక్ ఫ్రేజర్ (బి) స్టార్క్ 5; విజయ్‌శంకర్ (నాటౌట్) 69; దూబే (సి) స్టబ్స్ (బి) నిగమ్ 18; జడేజా (ఎల్బీ) (బి) కుల్దీప్ 2; ధోని (నాటౌట్) 30; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 158. వికెట్ల పతనం:** 1–14, 2–20, 3–41, 4–65, 5–74. **బౌలింగ్:** స్టార్క్ 4–0–27–1, ముకేశ్ కుమార్ 4–0–36–1, మోహిత్ శర్మ 3–0–27–0, విప్‌రాజ్ నిగమ్ 4–0–27–2, కుల్దీప్ యాదవ్ 4–0–30–1, అక్షర్ పటేల్ 1–0–5–0.



ధోని

ధోని మళ్లీ అలాగే...

'ధోని గతంలోలాగా ఎక్కువ సమయం బ్యాటింగ్ చేయలేడు కాబట్టి కావాలనే ఆలస్యంగా వస్తున్నాడు'...చెన్నై కోచ్ ఫ్లెమింగ్ వివరణ ఇది. శనివారం తప్పనిసరి పరిస్థితుల్లో అతను 74/5 వద్ద 11వ ఓవర్ ఐదో బంతికే బ్యాటింగ్‌కు వచ్చాడు. 56 బంతుల్లో 110 పరుగులు చేయాల్సిన స్థితిలో అతనిపై పెద్ద బాధ్యత కనిపించింది. కానీ అతను భారీ షాట్లు ఆడలేక మళ్లీ అభిమానులను నిరాశపర్చాడు. 16 సింగిల్స్, 2 సార్లు రెండేసి పరుగులు తీసిన అతని బ్యాటింగ్‌లో ఆరు 'డాట్‌బాల్స్' ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేనట్లు అతని తల్లిదండ్రులిద్దరూ ఈ మ్యాచ్‌కు హాజరు కావడం విశేషం! దాంతో అతని కెరీర్ ముగింపుపై మరోసారి చర్చ మొదలైంది.



ధోని కూతురు జీవాతో అతని తల్లిదండ్రులు పాన్ సింగ్, దేవకి

ఐపీఎల్‌-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	3	3	0	6	1.257
బెంగళూరు	3	2	1	4	1.149
గుజరాత్	3	2	1	4	0.807
పంజాబ్	3	2	1	4	0.074
కోల్‌కతా	4	2	2	4	0.070
లక్నో	4	2	2	4	0.048
రాజస్తాన్	4	2	2	4	-0.158
ముంబై	4	1	3	2	0.108
చెన్నై	4	1	3	2	-0.891
హైదరాబాద్	4	1	3	2	-1.612

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X గుజరాత్
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సన్‌రైజర్స్ కోలుకునేనా!

- నేడు ఉప్పల్‌లో హైదరాబాద్ మ్యాచ్
- గుజరాత్ టైటాన్స్‌తో పోరు



సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్‌–2025లో తమ తొలి మ్యాచ్‌లో 286 పరుగులు చేసి రాజస్తాన్‌పై ఘనవిజయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ సీజన్‌ను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత జట్టు ప్రదర్శన ఒక్కసారిగా పడిపోయింది. సొంత మైదానంలో లక్నో చేతిలో ఓడిన టీమ్...ఆపై వరుసగా ఢిల్లీ, కోల్‌కతా చేతుల్లో చిత్తుగా ఓడింది. ఇప్పుడు మళ్లీ హోం గ్రౌండ్‌కు చేరిన జట్టు వరుస ఓటముల నుంచి కోలుకోవాలని పట్టుదలగా ఉంది. నేడు జరిగే పోరులో గుజరాత్ టైటాన్స్‌తో హైదరాబాద్ తలపడుతుంది. ఐపీఎల్‌లో అతి పెద్ద పరాజయాన్ని గత మ్యాచ్‌లో మూటగట్టుకున్న టీమ్‌ను మళ్లీ ముందంజలో నిలిపే బాధ్యత బ్యాటర్లపైనే ఉంది. హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్ చెలరేగితే భారీ స్కోరు సాధించవచ్చు. క్లాసెన్ మెరుగ్గానే ఆడుతున్నా... నితీశ్ రెడ్డి ఇంకా ఫామ్‌ను అందుకోలేదు. కమిందు మెండిస్ ఆల్‌రౌండ్ ఆట సానుకూలాంశం. షమీ, కమిన్స్ బౌలింగ్‌లో మరింత ప్రభావం చూపించాల్సి ఉంది. బెంగళూరుపై చెలరేగిన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ ఇప్పుడు గుజరాత్ తరఫున తన సొంత ఊరిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. సుదర్శన్, గిల్, బట్లర్ తదితరులతో టైటాన్స్ బ్యాటింగ్ కూడా పటిష్టంగా కనిపిస్తోంది.

సాక్షి సినిమా



● రష్మికా మందన్నా

కన్నులలో వెన్నెలలే కురిసే...

రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. శనివారం రష్మికా మందన్నా బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టీజర్ ఆడియో, కొత్త స్టిల్‌ను రిలీజ్ చేశారు. ఈ టీజర్‌లో విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. అలాగే 'రేయి లోలోతుల సితార...' పాట కూడా ఉంది. ''కన్నులలో వెన్నెలలే కురిసే, మది మోసే తల వాకిట తడిసే..' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపరచిన ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యం అందించగా విజయ్ దేవరకొండ, హేషమ్ అబ్దుల్ వాహబ్, చిన్మయి శ్రీ పాద పాడారు.

రామాపురంలో సీతారాముల కథ

రాజేశ్ కొంచాడ, శ్రావణి శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన వింటేజ్ విలేజ్ ఎమోషనల్ లవ్ డ్రామా 'కౌసల్య తనయ రాఘవ'. స్వామి పట్నాయక్ దర్శకత్వంలో ఏఆర్ మూవీ మేకర్స్ పతాకంపై అడపా రత్నాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''ఈ నాటి ప్రసారంలో... రామాపురంలో సీతారాముల కథ..', 'ఈ సీత ప్రేమలో రాముడి పడితే..' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఈ సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ మంచి పేరు వస్తుంది'' అని ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజేశ్ అన్నారు. ''మా సినిమాను థియేటర్స్‌లో చూసి, సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం'' అన్నారు స్వామి పట్నాయక్, రత్నాకర్.



● రత్నాకర్, రాజేశ్ కొంచాడ, స్వామి



● సాయి పల్లవి, రణ్‌బీర్ కపూర్

రామయ్య వస్తున్నాడయ్యా

తండ్రి మాటను జవదాటని తనయుడు... సోదరులను అభిమానించే అన్న... భార్య దూరమైనా ఆమె కోసమే జీవించిన ఏక పత్నీవ్రతుడు... ప్రజల క్షేమం కోరిన రాజు... ధర్మం తప్పని మహనీయుడు... ఇలా అన్నీ సుగుణాలున్నాయి కాబట్టే రాముడు ఆదర్శప్రాయుడు. నేడు శ్రీరామ నవమి సందర్భంగా 'రామాయణం' ఆధారంగా రూపొందుతున్న చిత్రాల గురించి తెలుసుకుందాం...


రామాయణాన్ని ఒక్క సినిమాగా చెప్పడం కష్టం అంటున్నారు బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి. అందుకే రెండు భాగాలుగా ఆయన 'రామాయణ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సుగుణాల సుందరాంగుడు రాముడి పాత్రకు హ్యాండ్‌సమ్ హీరో రణ్‌బీర్ కపూర్‌ని ఎంపిక చేసుకున్నారు. సుగుణవతి, సౌందర్యవతి సీతమ్మ పాత్రకు సాయి పల్లవిని తీసుకున్నారు. రావణుడిగా కన్నడ స్టార్ యశ్ నటిస్తున్నారు. దాదాపు రూ. 800 కోట్ల భారీ బడ్జెట్‌తో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రానికి యశ్ కూడా ఓ నిర్మాత.

రాముడి పాత్ర నాకో కల: రణ్‌బీర్ కపూర్

''ఇలాంటి అద్భుత చిత్రంలో భాగం కావడం గౌరవంలా భావిస్తున్నాను. ఈ చిత్రం తొలి భాగం షూటింగ్ పూర్తి చేశాను. త్వరలో రెండో భాగం చిత్రీకరణ ఆరంభిస్తాం. రాముడి పాత్రను ఎంతో వినయ విధేయతలతో చేస్తున్నాను. ఈ పాత్ర నాకో కలలాంటిది. ఈ సినిమాలో ఎన్నో మంచి విషయాలు ఉన్నాయి. మన భారతీయ సంస్కృతి గురించి చెప్పే సినిమా. అలాగే కుటుంబం, భార్యా–భర్తల అనుబంధాన్ని తెలియజేసే చిత్రం'' అని రణ్‌బీర్ కపూర్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇక నితీష్ తివారీ అయితే ''ఈ అద్భుత ఇతిహాసాన్ని వెండితెరపైకి తీసుకురావడానికి పదేళ్ల క్రితమే అన్వేషణ మొదలుపెట్టాను. మన పవిత్రమైన చరిత్రకు దృశ్యరూపం ఇస్తున్నందుకు హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు. ఈ సినిమాకి సంబంధించిన నటీనటుల ఫొటోలను అధికారికంగా విడుదల చేయలేదు. షూటింగ్ స్పాట్‌లో రణ్‌బీర్–సాయి పల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయి. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి, మలి భాగం 2027 దీపావళికి విడుదలవుతాయి.

ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్'

రాముడికి పరమ భక్తుడు ఆంజనేయుడు. తన జీవితం మొత్తం రాముడి సేవకే అంకితం చేశాడు. శ్రీరాముడు అంటే ఆంజనేయుడికి ఎంత భక్తి అంటే... తన ఛాతీ చీల్చితే అందులో సీతారాములే ఉంటారనేంతగా... రాముడి జీవితంలో ఎంతో కీలకమైన ఆంజనేయుడి పాత్ర కీలకంగా ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'జై హనుమాన్'. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'హను–మాన్'కి ఇది సీక్వెల్. గతేడాది జనవరిలో అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. అదే ఏడాది ఏప్రిల్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు ఆ శ్రీరాముడి ఆశీస్సులతో మాటిస్తున్నా... మీరందరూ జీవితాంతం గుర్తుపెట్టుకునేలా 'జై హనుమాన్'తో అద్భుతమైన అనుభూతిని అందిస్తా'' అని పేర్కొన్నారు ప్రశాంత్ వర్మ. శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన మాటేంటి? అనే ప్రశ్నకు సమాధానంగా 'జై హనుమాన్'ని రూపొందిస్తున్నారని తెలిసింది. ఇక హనుమంతుడి పాత్రను ప్రముఖ కన్నడ స్టార్, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి పోషిస్తున్నారు. గత ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేసిన ఆయన హనుమంతుడి లుక్‌కి మంచి స్పందన లభించింది. తొలి భాగంలో కనిపించిన తేజ సజ్జా ఈ చిత్రంలోనూ నటిస్తున్నారు. కాగా రానా దగ్గుబాటి కూడా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ మధ్య రానా, రిషబ్‌తో కలిసి ఉన్న ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, 'జై జై హనుమాన్' అని పోస్ట్ చేశారు ప్రశాంత్ వర్మ. దాంతో ఈ చిత్రంలో రానా నటిస్తున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. 'హను–మాన్'ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిరంజన్ రెడ్డి నిర్మించారు. 'జై హనుమాన్'ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై యలమంచిలి రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీని భారతీయ భాషలతో పాటు పలు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేయనున్నారు.



● రిషబ్ శెట్టి



● 'శ్రీరామ్ జై హనుమాన్' పోస్టర్

శ్రీరామ్ జై హనుమాన్

'శ్రీరామ్ జై హనుమాన్' పేరిట రామాయణం నేపథ్యంలో ఓ కన్నడ చిత్రం రూపొందుతోంది. ''ఇప్పటి వరకూ రామాయణం ఆధారంగా పలు చిత్రాలు వచ్చాయి. ఆ చిత్రాల్లో చెప్పని కొత్త విషయాలను ఈ చిత్రంలో చెప్పనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. 'రామాయణం గురించి ఎవరికీ తెలియని అంశం' అని అర్థం వచ్చే ట్యాగ్‌లైన్ ఈ చిత్రం పోస్టర్ మీద ఉంది. కాగా అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన ముహూర్తానికి ఈ చిత్రం పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అయితే నటీనటుల గురించి, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. అవధూత్ దర్శకత్వంలో కేఏ సురేష్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో రిలీజ్ కానుంది.

ఈ చిత్రాలే కాదు... ఇంకా తెలుగులో 'జర్నీ టు అయోధ్య' అనే చిత్రం ప్రకటన వెలువడింది. ఇంకా రామాయణం నేపథ్యంలో మరికొన్ని చిత్రాలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

– డీ.జీ. భవాని

ఓటీటీ ఇది చూడొచ్చు

ప్యూర్ అండ్ ఫ్రెష్ లవ్ స్టోరీ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'నిలవక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా అనేది 24 కళలతో రూపొందేది. అంటే 24 కళలకు సంబంధించిన కళాకారులు ఓ సినిమా కోసం పని చేస్తారన్న మాట. కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. మల్టీ టాలెంటెడ్ ఇండస్ట్రీలోకి వస్తున్నారు. 24 కళలలో ఓ మూడు నాలుగు కళలు ఒక్కరే చేసేస్తున్నారు. అలా సినిమాలోని కొన్ని శాఖలను ఒక్కరే చేసి, ఓ సినిమాకి సింగిల్ కార్డుతో 80వ దశకంలోనే ప్రముఖ దర్శకులు దాసరి నారాయణరావుగారు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు మళ్లీ ఆ ట్రెండ్ కొనసాగుతోంది. 'నిలవక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' అనేది ఓ తమిళ సినిమా. 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అన్నది తెలుగు డబ్బింగ్ వెర్షన్. ప్రముఖ హీరో ధనుష్ తాను కీలక విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించి ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. తాను రాసిన కథకు తానే నిర్మాతగా వ్యవహరించడంతో పాటు దర్శకత్వం కూడా చేశారు.



ఇది ఓ రకంగా రిస్క్ అనే చెప్పాలి. అయినా ఈ సినిమాని మాత్రం ఈ తరం యంగ్ జనరేషన్‌తో పాటు నిన్న, మొన్నటి తరాలకు కూడా నచ్చే విధంగా తీర్చిదిద్దారు ధనుష్. సినిమా చూస్తున్నంతసేపూ ప్రేక్షకులను కదలనివ్వదు. అంత ప్లెజెంట్‌గా ఉంటుంది. సినిమా టైటిల్ కూడా కొంటెగా పెట్టడంలోనే తెలిసిపోతుందీ సినిమా విషయం. ఈ చిత్రం తెలుగు వెర్షన్ ప్రైమ్ వీడియోలో లభ్యమవుతోంది. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే... ప్రభు ఓ మంచి చెఫ్. తన గర్ల్‌ఫ్రెండ్ నిలాతో విడిపోయిన తరువాత ప్రభు తల్లిదండ్రులు ప్రీతితో వివాహం నిశ్చయించి, సంబంధం కుదుర్చుకోవడానికి ప్రీతి ఇంటికి వస్తారు. ఆ సమయంలో ప్రీతికి నిలా కథ చెబుతాడు. నిలా, ప్రభు ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన పార్టీలో కలిసి ప్రేమలో పడతారు. ఓ అనుకోని సంఘటన వల్ల నిలాకి దూరమవుతాడు ప్రభు. దాంతో నిలాకి కోపమొచ్చి తండ్రి చూసిన సంబంధానికి తలూపుతుంది. నిలా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని స్నేహితులందరినీ గోవాకి పిలుస్తుంది. నిలా పెళ్లి ఆహ్వానం ప్రభుకి కూడా అందుతుంది. ప్రభు ఫ్రెండ్స్ అందరూ అతన్ని వారించినా నిలా పెళ్లికి వెళతాడు. తన మాజీ ప్రేయసి పెళ్లికి వెళ్లిన ప్రభుకి అక్కడ ఎదురైన పరిస్థితులేంటి? తరువాత ప్రీతి పరిస్థితి ఏంటి? అన్నది మాత్రం సినిమాలోనే చూడాలి. ఇది చాలా సింపుల్ స్టోరీ. స్క్రీన్ ప్లే చక్కగా రాసుకున్నారు ధనుష్. ఈ సినిమాలోని పాత్రధారులంతా ఫ్రెష్‌గా అనిపించడంతో పాటు ప్రతి పాత్ర ప్రేక్షకులను కనువిందు చేస్తుందనే చెప్పాలి. హ్యాట్సాఫ్ టు ధనుష్. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరు

షెడ్యూల్ 9లో చేర్చితేనే బీసీ రిజర్వేషన్లకు రక్షణ

తమిళనాడు రాజ్యసభ సభ్యుడు తిరు.పి.విల్సన్



మాట్లాడుతున్న ఎంపీ విల్సన్ చిత్రంలో జస్టిస్ ఈశ్వరయ్య, చిరంజీవులు

హిమాయత్‌నగర్ : భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పరిరక్షణ ఉంటుందని రాజ్యాంగ నిపుణుడు, తమిళనాడు రాజ్యసభ సభ్యుడు తిరు.పి.విల్సన్ అభిప్రాయపడ్డారు. శనివారం బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయానికి 42 శాతం బీసీ రిజర్వేషన్లు దిక్సూచి'అనే అంశంపై బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ 1994 నుంచే తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. పెరియార్, అన్నాదురై, కరుణానిధి వంటి మహనీయులు రిజర్వేషన్ల కోసం రోడ్ల మీదకు వచ్చి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టు తీర్పులను అధిగమించి రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రధాన కారణం ...ఆనాడు తమిళనాడులోని అన్ని రాజకీయ పక్షాలు ఒకటైనందునే ఇది సాధ్యమైందన్నారు.

- ఓబీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో చట్టం చేయకుండా జీవోల ద్వారా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు తెస్తే.. ఆయా హైకోర్టులు, సుప్రీంకోర్టు కొట్టి వేసిన పలు తీర్పుల వివరాలను వెల్లడించారు. రాజ్యాంగ, చట్టాలు, రిజర్వేషన్ల మీద అవగాహన లేనివారు తమను విమర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్.ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆధారాలతో కూడిన కులగణన లెక్కలు చట్టాలు లేకుండా జీవోలు తెస్తే కోర్టులు కొట్టివేశాయని చెప్పారు.
- బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ తెలంగాణలోని బీసీ ఉద్యమకారులు, సంఘాలు వివిధ రాజకీయ పార్టీల బీసీ నేతలందరూ ఏకమై బీసీల రిజర్వేషన్ల అమలుకై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సంఘాల నేతల మధ్య మనస్పర్థలు వీడి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అందుకు అనుగుణంగా ఉద్యమం చేయాలని కోరారు. డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్, ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ రాజు, దేవరాజు ప్రసంగించగా, చామకూర రాజు, కేవీ.గౌడ్, కోలా జనార్దన్, అవ్వారు వేణు, కొండల్‌గౌడ్, బొమ్మ రఘురాం, ఒంటెద్దు నరేందర్, కిరణ్, వీరస్వామి, శ్రీకాంత్, శ్రీను పాల్గొన్నారు.

దేవాదుల టన్నెల్ లీకేజీ గుర్తింపు

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ సమీపంలో ఇటీవల జరిగిన టన్నెల్ లీకేజీలను ఇంజనీర్లు ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. దేవాదుల పథకంలో భాగంగా 3వ ప్యాకేజీ కింద దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్ సమీపం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి అక్కడినుంచి సుమారు 200 మీటర్లు రిజర్వాయర్ వరకు టన్నెల్ నిర్మించారు. గత నెల 27న దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేశారు. ఆరు రోజుల క్రితం టన్నెల్ లీకేజీ అయింది. దీంతో పంప్‌లు బంద్ చేసి టన్నెల్‌లోనుంచి నీటిని డీ వాటరింగ్ చేశారు. శుక్రవారం సాయంత్రం రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేసే పైప్‌లో నుంచి టన్నెల్ లోపలికి దిగి లీకేజీలను గుర్తించారు. నిపుణుల సలహాలు, సూచనల మేరకు టన్నెల్ మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

కార్యాలయ భవనంపై నుంచి దూకి మహిళా ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య

- అనారోగ్య సమస్యలు.. మానసిక ఒత్తిడితోనే..
- ఆదాయపన్ను శాఖలో పనిచేస్తున్న మృతురాలు



జయలక్ష్మి (ఫైల్)

బన్సీలాల్‌పేట్: అనారోగ్య సమస్యలు..మానసిక ఒత్తిడితో ఆదాయపన్ను శాఖలో పనిచేసే ఓ మహిళా ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ డి. రాజు కథనం ప్రకారం..కవాడిగూడ ప్రధాన రహదారిలోని సీజీఓ టవర్స్‌లోని 6వ అంతస్తులో ఉన్న ఆదాయ పన్నుశాఖ కార్యాలయంలో జయలక్ష్మి (52) ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం కార్యాలయానికి సెలవు. అయినా ఉదయమే జయలక్ష్మి కార్యాలయానికి వచ్చారు. 11-12 గంటల మధ్యలో అదే కార్యాలయంలోకి 8వ అంతస్తుకు వెళ్లి.. అక్కడి నుంచి దూకారు. తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటనతో అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డులు ఉలిక్కిపడ్డారు. వెంటనే గాంధీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జయలక్ష్మిని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. జయలక్ష్మి-రమేష్ దంపతులు ఒకే కార్యాలయంలో పనిచేస్తుండగా, 2016లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి జయలక్ష్మి తన కూతురితో కలిసి ఈసీఐఎల్ ఏరియాలో నివసిస్తున్నారు. జయలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతుండగా, తన తల్లి అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుందని కూతురు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఒంటరితనంతో మనస్తాపం చెంది..

రైలుకింద పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య



కిరణ్‌కుమార్(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: వివాహం కావడం లేదని, ఒంటరితనం భరించలేక ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేగేటు సమీపంలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. జీఆర్పీ హెచ్‌సీ రమణారెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ (45)కు 2010లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. 2011లో అతడికి వివాహం జరగగా వ్యక్తిగత కారణాలతో విడాకులు తీసుకున్నాడు. ప్రస్తుతం జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (బయాలాజికల్ సైన్స్)గా పనిచేస్తున్నాడు. మొదట్లో వరంగల్‌లో ఉండి విధులకు వచ్చే కిరణ్‌కుమార్ ఐదు నెలల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో తల్లి సుశీలతో కలసి ఓ ఇంటిలో అద్దెకు దిగాడు. విడాకుల తర్వాత మళ్లీ వివాహం కాకపోవడంతో కిరణ్ ఒంటరితనంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన తరువాత అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. తెల్లవారుజామున మూడు గంటలకు వరంగల్‌లో ఉండే తన అన్న రవీందర్ సెల్‌ఫోన్‌కు తన ఏటీఎం కార్డు పిన్ నంబర్, పాన్‌కార్డు నంబర్‌తోపాటు గుడ్‌బై అంటూ మెస్సేజ్ పంపాడు. అనంతరం సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తమ్ముడి మెసేజ్ చూసిన రవీందర్ ఆందోళనతో.. కిరణ్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. వెంటనే రవీందర్ ఘన్‌పూర్‌కు వచ్చి వెతికారు. అదే సమయంలో రైల్వే ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న గ్యాంగ్‌మెన్‌లు.. రైలు కింద పడి వ్యక్తి మృతిచెందిన విషయాన్ని జనగామ జీఆర్పీ సిబ్బందికి సమాచారం అందించారు. జీఆర్పీ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతుడిని గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల్లి, సోదరుడు సంఘటనాస్థలానికి చేరుకుని కిరణ్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఈత.. గుండె కోత

చెరువులో ఇద్దరు విద్యార్థుల మృత్యువాత



సంజీవ్



రాహుల్

ఆదిలాబాద్ రూరల్: చెరువులో సరదాగా ఈతకు దిగిన ఇద్దరు విద్యార్థులు గల్లంతై మృతి చెందారు. వివరాలివి. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కాంబ్లే రాహుల్ (9) 4వ తరగతి, చిప్పకుర్తి సంజీవ్ (10) 5వ తరగతి చదువుతున్నారు. సెలవు రోజు కావడంతో వీరిద్దరితో పాటు రాహుల్ సోదరుడు విశాల్ కలిసి చెరువులో ఈతకు వెళ్లారు. వీరిలో విశాల్ అక్కడే ఆడుకుంటూ ఉన్నాడు. మిగిలిన ఇద్దరూ గల్లంతైన విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో మృతదేహాలను వెలికి తీసి.. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిని చంపిన కొడుకు

బీబీనగర్: మద్యం మత్తులో ఆ యువకుడు కన్న తల్లితో గొడవకు దిగి ఇంట్లోని వంట గిన్నెలతో తల్లిని చితకబాదడంతో అక్కడికక్కడే మృతిచెందింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గుర్రాలదండి పరిధిలోని కొత్తతండాకు చెందిన బానోతు మోజి (55) భర్త గతంలోనే చనిపోవడంతో కుమారుడు బానోతు శ్రీను కుటుంబంతో కలిసి ఉంటోంది. మోజీ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా కుమారుడు శ్రీను ఇసుక లారీలపై కూలీగా పనిచేస్తున్నాడు. వారానికోసారి ఇంటికి వస్తూ వెళ్లే శ్రీను శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో తల్లి ఒక్కతే ఉండగా తన భార్య పిల్లలు పుట్టింటికి వెళ్లారు. శ్రీను కొంత కాలంగా మద్యానికి బానిస కావడంతో మానసిక స్థితి బాగా లేదు. మద్యం తాగేందుకు తనకు డబ్బులు కావాలంటూ తల్లి మోజితో గొడవకు దిగాడు. ఇంట్లో వంట గిన్నెలతో ఆమె తలపై, ముఖంపై కొట్టడంతో మోజి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో గొడవను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే మోజి మృతిచెందడంతో మృతదేహాన్ని పోలీసులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు శ్రీనును శనివారం ఉదయం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

వీఐటీలో వర్సిటీ వ్యవస్థాపక, క్రీడా దినోత్సవాలు



సాక్షి, హైదరాబాద్: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో యూనివర్సిటీ వ్యవస్థాపక, క్రీడా దినోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్స్‌లో ప్రతిభ కనబరిచిన, క్రీడలు, అత్యధిక హాజరు శాతం సాధించిన విద్యార్థులకు రూ.1.4 కోట్ల విలువైన బహుమతులను ప్రదానం చేసినట్లు వీఐటీ వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుప్రీం కోర్టు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, లార్సెన్ అండ్ టూబ్రో హెడ్ కార్పొరేట్ సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గణేశన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ విద్య, క్రీడల్లో బహుమతులు పొందిన 3,200 మంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. 40 ఏళ్లలో వీఐటీ ఎంతో అభివృద్ధి చెందిందని జస్టిస్ సుందరేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్స్ శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, ఈడీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

- 16 నెలలుగా జీవో 59 దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- త్వరలోనే పరిష్కరిస్తామన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి
- ఈ జీవో కింద దాదాపు 50 వేల దరఖాస్తులు పెండింగ్
- దరఖాస్తులు పరిష్కరిస్తే ఖజానాకు రూ.6 వేల కోట్ల ఆదాయం



సాక్షి, హైదరాబాద్: 'గత ప్రభుత్వ హయాంలో జీవో 59ని అడ్డం పెట్టుకుని విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులపరం చేశారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అక్రమాలను గుర్తించాం. ఆ క్రమంలోనే జీవో 59 అమలును నిలిపివేసిన మాట వాస్తవమే. ఇప్పుడు జీవో 59 కింద దరఖాస్తులను మళ్లీ పరిష్కరించాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంది. త్వరలోనే ఈ జీవోను అమలు చేస్తాం'... అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది. 16 నెలలుగా తమ దరఖాస్తుల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ఈ ప్రకటనతో ఊపిరి పీల్చుకున్నారు. తమ నివాసాల క్రమబద్ధీకరణ ఇప్పట్లో సాధ్యపడదనే నిరాశలో ఉన్న వారిలో మంత్రి ప్రకటన ఆశలు నింపింది. అయితే, ఈ అంశంపై మంత్రి ప్రకటన తర్వాత మళ్లీ ఎలాంటి కదలిక లేకపోవటంతో తమ దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

సబ్ కమిటీ వద్ద పూర్తి నివేదిక

జీవో 59 అమలులో భాగంగా రెవెన్యూ శాఖ ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ప్రకారం జీవో 59 కింద మొత్తం 57,661 దరఖాస్తులు రాగా, 55,997 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. వీటిలో 2022లో 23,189.. 2023లో 8,771 దరఖాస్తులను ఆమోదించారు. మొత్తం 32,788 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు జారీ చేయగా, 13,726 మంది ప్రభుత్వానికి ఫీజు చెల్లించారు. 10,553 మందికి కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్)లు కూడా జారీ చేశారు. కానీ, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో 2023 నవంబర్ నాటికి జారీచేసిన కన్వేయన్స్ డీడ్‌లను నిలిపివేయాలని.. ఆ డాక్యుమెంట్ల ఆధారంగా ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తర్వులు జారీ చేసింది. వీటితోపాటు చాలా దరఖాస్తులు డిమాండ్ నోటీసుల జారీ కోసం సిద్ధంగా ఉన్నాయి. కొన్ని దరఖాస్తులు కలెక్టర్ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంమీద 47 వేలకు పైగా దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్ ఉన్నాయని తేలింది. వీటిని పరిష్కరిస్తే ప్రభుత్వానికి రూ.500 కోట్లు సమకూరుతాయని, అధిక విలువ కేటగిరీలో నమోదు చేసిన భూములను క్రమబద్ధీకరిస్తే రూ.5,500 కోట్లు వస్తాయని, మొత్తం కలిపి రూ.6 వేల కోట్ల ఆదాయం వస్తుందని రెవెన్యూ శాఖ కేబినెట్ సబ్‌కమిటీకి ఇచ్చిన నివేదికలో వెల్లడించింది.

ఎవరో చేసిన తప్పునకు..

జీవో 59 ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయనేది కాంగ్రెస్ ప్రభుత్వ వాదన. ఈ అక్రమాలు చేసినవారు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే లబ్ధి పొందారని, ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులంతా నాటి ప్రభుత్వంలో పలుకుబడి లేక, దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన చేయించుకోలేకపోయిన వారేనని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఎవరో తప్పు చేశారని రాష్ట్రవ్యాప్తంగా ఆ జీవో అమలును నిలిపివేయడం సరైంది కాదని అంటున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న జీవో 59 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నైజీరియాకు డ్రగ్స్ సొమ్ము

మొదటి పేజీ తరువాయి

పట్టుకున్నారు. ఆమెను విచారించగా ఈ ముఠా డొంకంతా కదిలింది.

- డ్రగ్స్ ఆర్డర్ తీసుకోవడం, డబ్బు అందిన విషయాన్ని నిర్ధారించుకోవడం, ఒక ప్రదేశంలో డ్రగ్స్‌ను వదిలి..వాటి ఫొటో, లొకేషన్‌ను కస్టమర్‌కు చెప్పి.. డ్రగ్స్ వారికి చేరవేయడం వరకు అన్నింటికీ వాట్సాప్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించారు.
- కింగ్‌పిన్ ఎబుకా సుజీ ఆదేశాలతో డ్రగ్స్‌ను స్థానిక కస్టమర్లకు చేర్చడంలో కెలేశీకి ఎమ్మా, బిగ్‌జో సహకరించేవారు. ఎబుకా సుజీ తన డ్రగ్స్ దందాను అమెరికాలోనూ మొదలుపెట్టినట్లు గుర్తించారు.
- యూఎస్ కస్టమర్ల నుంచి డబ్బును నేరుగా తీసుకోకుండా తొలుత ఇండియాకు తరలించి ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు ఈ ముఠా తరలిస్తోంది. యూఎస్ నుంచి డబ్బును భారత్‌కు చేర్చేందుకు పాత మలక్‌పేటకు చెందిన మహ్మద్ మతీన్ సిద్ధిఖీ అనే హైస్ మల్టీ సర్వీసెస్ ప్రొప్రైటర్ సహకారం తీసుకునేవారు.
- మతీన్ తనకున్న పరిచయాలతో గోయమ్ ఫారెక్స్‌కు చెందిన ఆనంద్ జైన్ ద్వారా అమెరికాలోని పలువురు భారతీయుల బ్యాంకు ఖాతాలు సేకరించాడు. డ్రగ్స్ అమ్మగా వచ్చిన సొమ్మును ఆ ఖాతాల్లో వేయించి భారత్‌లోని వారి బంధువుల ద్వారా ఇక్కడ తీసుకునేవారు.
- ఆ డబ్బును ముంబైకి వస్త్ర వ్యాపారం కోసం వచ్చే నైజీరియన్ వ్యాపారులు డానియల్, మాలిక్, స్టాన్లీల ద్వారా నైజీరియాకు తరలించేవారు. ఇలా ప్రతిదశలోనూ ఎవరికి వారు కమీషన్లు తీసుకుంటూ దందా చేస్తున్నారు. ఇలా 40 శాతం వరకు కమీషన్లు తీసుకుని, మిగిలిన మొత్తాన్ని నైజీరియాలోని ఎబుకా సుజీకి చేరవేస్తున్నారు. - ఈ నెల 3న ఏ-1 ఎమ్మా, ఏ-2 బిగ్‌జో, ఏ-3 మతీన్ సిద్దిఖీలను అరెస్టు చేశారు. డివైన్ ఎబుకా సుజీ, కేలేశీతోపాటు సయ్యద్ సోహిల్ అబ్దుల్ అజీజ్, సయ్యద్ నసీర్ అహ్మద్, మహ్మద్ అవైజ్, మహ్మద్ మతీన్, సయ్యద్ యూసుఫ్ హక్, ఆనంద్‌జైన్, శాంతిలాల్ సురేశ్ కుమార్‌జైన్, ఉత్తమ్ జైన్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



మీడియాకు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య

ఆర్థిక మూలాలను దెబ్బతీస్తేనే డ్రగ్స్ కట్టడి

డ్రగ్స్ దందా మొత్తం ఆర్థిక లావాదేవీలతోనే ముడిపడి ఉంది. ఈ ముఠాల ఆర్థిక మూలాలను దెబ్బకొడితేనే డ్రగ్స్ కట్టడి సాధ్యం. డ్రగ్స్ వల్ల భారత యువత బానిసలుగా మారుతున్నారు. చదువుకోసం నైజీరియా సహా పలు దేశాల నుంచి వచ్చే యువత డ్రగ్స్ దందాలోకి దిగి చెడిపోతున్నారు. డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న ధనికులు సైతం డ్రగ్స్ వాడకాన్ని మానుకోవాలి. టీజీఏఎన్‌బీ సాంకేతికంగా, నైపుణ్యం పరంగా ఎంతో పటిష్టంగా మారింది. డ్రగ్స్ దందా చేసేవారిని వదిలే ప్రసక్తే లేదు. 2020 నుంచి 260 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేసి జైలుకు పంపాం. విదేశీయులకు ఇల్లు, అపార్టుమెంట్లు అద్దెకు ఇచ్చేముందు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్స్ (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ)కు ఫామ్-సీలో, అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారి వివరాలు ఇవ్వాలి.


– సందీప్ శాండిల్య, టీజీఏఎన్‌బీ డైరెక్టర్

'అడ'గడుగునా నిర్లక్ష్యం!

వృథాగా 'అడ' ప్రాజెక్టు కాలువ నీళ్లు
కృత్రిమ జలపాతంగా పరవళ్లు

వాంకిడి(ఆసిఫాబాద్): మండుటెండల్లోనూ కళకళలాడుతున్న ఈ కృత్రిమ జలపాతం అధికారుల నిర్లక్ష్యంతో ఏర్పడింది. నాలుగేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో ప్రాజెక్టు నీరు ఇలా వృథాగా పోతోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కొసార గ్రామ సమీపంలోని అడ (కుమురంభీం) ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువ నీళ్లు ఇవి. వాంకిడి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండలాల్లోని పొలాలకు సాగు నీరందించేందుకు నిర్మించిన ఎడమ కాలువ.. నాలుగేళ్ల క్రితం భారీ వరదలకు కొసార గ్రామ శివారులోని వాగు వద్ద దెబ్బ తింది. గతంలో రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినా.. ఇప్పటివరకు ముందడుగు పడలేదు. నిత్యం కాలువ నుంచి జలపాతంలా సాగునీరు వృథాగా పారుతోంది. వేసవి కావడంతో ప్రస్తుతం సమీప గ్రామాల్లోని యువకులు సరదాగా స్నానాలు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పైనున్న సిమెంట్ బల్లలు కూలిపడితే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. వెంటనే కాలువకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కాలువ లీకేజీ నీళ్ల కింద స్నానాలు చేస్తున్న యువకులు



చూడ్డానికి చాలా అందంగా కనిపిస్తోంది కదూ.. కానీ ఈ అందం వెనుక ఆందోళనకు గురి చేసే అంశం దాగుంది. వాతావరణ మార్పుల దుష్ఫలితం ఇది. ఆర్కిటిక్‌లో ఏ ఏడాదికా ఏడాది ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల హిమానీనదం కరిగి.. నదిలా మారి.. ఇలా సముద్రంలో కలుస్తోంది. భవిష్యత్తులో ఇది మానవాళికి పెనుముప్పుగా పరిణమిస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ చిత్రాన్ని రోయి గాలిట్జ్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు.

ట్రంప్ కేరాఫ్ ఖమ్మం..

సోషల్ మీడియాలో వైరల్



ఖమ్మం మయూరిసెంటర్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు, ఖమ్మం అడ్రస్‌తో ఉన్న ఆధార్ కార్డు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అమెరికా అధ్యక్షుడికి ఇక్కడ ఆధార్ కార్డు సృష్టించింది ఎవరా అని పలువురు ఆశ్చర్య పోతున్నారు. ఆధార్ కార్డులో డొనాల్డ్ ట్రంప్ పేరుతోపాటు డేటాఫ్ బర్త్, అమెరికా ప్రెసిడెంట్, ఇంటినంబర్, మామిళ్లగూడెం, ఖమ్మం, తెలంగాణ అని ఉంది. అయితే దీన్ని ఎవరో ఆకతాయిలు సృష్టించారని, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో ఆధార్ కార్డు తయారు చేసి ఉంటారనే చర్చ జరుగుతోంది. సోషల్ మీడియాలో చూసిన కొందరు ట్రంప్‌ది ఖమ్మమా అంటూ మీమ్స్ పెడుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే ఆరోగ్యానికి రక్ష

ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలి: కేంద్రమంత్రి జితేందర్‌సింగ్


స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జితేందర్‌సింగ్

చేవెళ్ల/శంకర్‌పల్లి: సేంద్రియ వ్యవసాయంతోనే ప్రజల ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేందర్‌సింగ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణం ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రకృతి సేంద్రియ రైతు సమ్మేళనానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంటలపై రసాయన ఎరువులు, మందుల వినియోగం పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు సేంద్రియ సాగువైపు దృష్టి సారించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రసాయన ఎరువుల వాడకం పెరిగి భూసారం పూర్తిగా దెబ్బతింటోందని తెలిపారు. దీనిని అధిగమించేందుకు పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. ఇందుకోసం ఏకలవ్య ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. వ్యవసాయంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సేంద్రియ సాగుతో రైతులకు అధిక దిగుబడులు వచ్చేలా చూస్తే ఆసక్తి చూపుతారన్నారు.

చర్లపల్లి–తిరుపతి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: వేసవి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి నుంచి తిరుపతికి బై వీక్లీ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు చర్లపల్లి–తిరుపతి (07017/07018) రైలు ఈ నెల 6, 11, 13, 18, 20, 25, 27, మే 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30 తేదీల్లో రాత్రి 9.35 గంటలకు బయలుదేరి.. మర్నాడు ఉదయం 10.10 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7, 12, 14, 19, 21, 26, 28, మే, 3, 5, 10, 12, 17, 19, 24, 26, 31 తేదీల్లో సాయంత్రం 4.40 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి.. మర్నాడు ఉదయం 7.10 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

మినీ ఏరోప్లేన్ ట్రయల్ సక్సెస్

మినియేచర్ మోడల్ తయారు చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి




సిద్దిపేట అర్బన్: మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితో మినియేచర్ మోడల్‌లో విమానం తయారు చేసి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రతిభ చాటాడు. సిద్దిపేటలోని గాంధీనగర్‌కు చెందిన బాసంగారి భాస్కర్ కుమారుడు లక్ష్మీనరసింహ.. వీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నా డు. ఇతనికి చిన్నప్పటి నుంచి మినియేచర్ మోడల్ ఏరోప్లేన్ తయారుచేయాలనే కోరిక బలంగా ఉండేది. అదే ఇష్టంతో సీ130 హెర్కులస్ మినియేచర్ విమానం తయారీ కోసం రూ.1.5 లక్షలు వెచ్చించి సంవత్సరం పాటు శ్రమించాడు.ఇందులో 4400 ఎంఏహెచ్5ఎస్ బ్యాటరీలు, 7 సర్వో మోటార్స్‌ను ఉపయోగించాడు. శనివారం ఈ విమానాన్ని మొదటిసారి పరీక్షించగా సత్ఫలితాలు వచ్చాయని, మరోసారి పరీక్షలు చేయాల్సి ఉందని ఆయన చెప్పాడు.

పురుషుల రక్షణ కోసం హీ టీమ్స్ ఏర్పాటు చేయాలి

రేడియో జాకీ శేఖర్ బాషా డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

కవాడిగూడ (హైదరాబాద్): షీ టీమ్స్ ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పిస్తున్న మాదిరిగా.. పురుషుల రక్షణ కోసం హీ టీమ్స్ నియమించాలని ప్రముఖ రేడియో జాకీ, సోషల్ యాక్టివిస్ట్ శేఖర్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్త్రీలకు అన్యాయం జరిగితే వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, పురుషులకు అన్యాయం జరిగినప్పుడు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా అమాయక పురుషులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో లా స్టూడెంట్స్ సోషల్ యాక్టివిస్ట్స్ ఆధ్వర్యంలో అందరికీ ఒకే న్యాయం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ బాషా మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త న్యాయమూర్తుల పదవులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ శాంతియుత నిరసన కార్యక్రమంలో పలువురు లా విద్యార్థులు, న్యాయవాదులు, సామాజిక వేత్తలు పాల్గొన్నారు.

నెక్స్ట్ సీతాఫలం, పసుపు

బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపునకు జీఐ ట్యాగ్ కోసం కసరత్తు
అధ్యయనానికి ఉద్యాన వర్సిటీ ప్రత్యేక బృందం
మరో 20 రోజుల్లో దరఖాస్తు
జీఐ ట్యాగ్ లభిస్తే రైతులకు అధిక ఆదాయం



బాలానగర్ సీతాఫలాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు


ఆర్మూర్‌లో పసుపును పరిశీలిస్తున్న ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తలు

సాక్షి, సిద్దిపేట: చపాటా మిర్చి బాటలో మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ (భౌగోళిక గుర్తింపు) తెచ్చేందుకు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ కసరత్తు ముమ్మరం చేసింది. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల్లో ఇదివరకే తాండూరు కంది పప్పునకు జీఐ గుర్తింపు రాగా, తాజాగా వరంగల్ చపాటా మిర్చి చేరింది. ఈ నేపథ్యంలో నాబార్డు సహకారంతో బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపునకు జీఐ ట్యాగ్ కోసం ఉద్యాన వర్సిటీ త్వరలో దరఖాస్తు చేయనుంది. దేశవ్యాప్తంగా 697 ఐటమ్స్‌కు జీఐ ట్యాగ్ ఉండగా.. అందులో 198 వ్యవసాయ ఉత్పత్తులున్నాయి. వాటిలో పది రకాల మిర్చీలకు జీఐ ట్యాగ్ ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులకు జీఐ సాధించేందుకు ఉద్యాన వర్సిటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలతో ప్రత్యేక బృందాన్ని నియమించింది.

అధ్యయనం మరింత ముమ్మరం

చపాటా మిర్చికి జీఐ నంబర్ కేటాయించడంతో బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపుపై అధ్యయనాన్ని మరింత ముమ్మరం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ సీతాఫలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రుచి, నాణ్యతకు పేరొందిన ఆ సీతాఫలాలు ఇక్కడి నుంచి ఇతర జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు, ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తుంటారు. బాలానగర్ అడవుల్లో పుట్టిన సీతాఫలం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు విస్తరించింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పోమల్ గ్రామంలోని పోమల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో మరో 20 రోజుల్లో జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు చేయనున్నారు.

ఆర్మూర్ పసుపు కోసం..

ఆర్మూరు పసుపునకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నిజామాబాద్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన పంటగా పసుపు సాగుచేస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా మొక్క ప్రత్యేక లక్షణాలు, సాగు విస్తీర్ణం, ఆ ప్రాంత భౌగోళిక, వాతావరణ పరిస్థితులపై సమాచారం సేకరిస్తున్నారు. జీఐ ట్యాగ్ పొందితే ఎగుమతులు పెరిగే అవకాశముంది. ఈ రెండు ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ కోసం నియమించిన బృందంలో ముఖ్యంగా ప్రధాన పరిశోధకులు డాక్టర్ పిడిగం సైదయ్య, శాస్త్రవేత్త మహేందర్ ఉన్నారు. త్వరలో కొల్లాపూర్ మామిడి, జగిత్యాల పొడుగు బీరకాయలు, నల్లగొండ పచ్చడి దోసకాయలు, నిజామాబాద్ గుత్తి బీరకాయలకు సైతం జీఐ ట్యాగ్ కోసం కసరత్తు ప్రారంభించనున్నారు.

ఇప్పటివరకు జీఐ ట్యాగ్ లభించిన మిర్చి రకాలు

మిర్చి రకం	రాష్ట్రం
బ్యాడగి	కర్ణాటక
గుంటూరు సన్న మిర్చి	ఆంధ్రప్రదేశ్
మిజో మిర్చి	మిజోరం
భివాపూర్ మిర్చి	మహారాష్ట్ర
ఖోలా మిర్చి	గోవా
హర్మల్ మిర్చి	గోవా
ఎడ్యూర్ మిర్చి	కేరళ
రామనాథపురం మిర్చి	తమిళనాడు
బనారస్ మిర్చి	ఉత్తరప్రదేశ్
వరంగల్ చపాటా మిర్చి	తెలంగాణ




జీఐతో అనేక లాభాలు

"భౌగోళిక గుర్తింపు వస్తే ఆయా ఉత్పత్తులకు న్యాయపరమైన రక్షణ ఉంటుంది. జీఐ లభిస్తే మార్కెట్‌లో ఆ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. పండించే రైతులకు కూడా అధిక ఆదాయం వస్తుంది.
– డాక్టర్ దండా రాజిరెడ్డి, వైస్‌చాన్స్‌లర్, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన వర్సిటీ

మహా సపోటాకు 'వంద'నం

సపోటా చెట్టుకు వందేళ్లు
ఎత్తు 50 అడుగులు
ఏటా 10 క్వింటాళ్ల కాపు
కాశీంపూర్‌లో ప్రత్యేక ఆకర్షణగా చెట్టు



బషీరాబాద్: సాధారణంగా సపోటా చెట్టు 15 అడుగుల ఎత్తు పెరిగి.. 70 నుంచి 80 ఏళ్ల పాటు జీవిస్తుంది. కానీ వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఏకంగా 50 అడుగుల ఎత్తు పెరిగింది. వందేళ్ల నాటి ఈ మహా వృక్షం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామానికి చెందిన పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఈ చెట్టు ఉంది. మూడు తరాల నుంచి ఫలాలు ఇస్తోందని యజమాని తెలిపారు. ఏటా 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందన్నారు. సపోటా కాయలు పెద్ద పరిమాణంలో ఉంటాయని పేర్కొ న్నారు. చుట్టుపక్కల వారు, బంధువులు, గ్రామస్తులు ఉచితంగా తీ సుకెళ్తారని చెప్పారు. కొండముచ్చులు, కోతులు ఎక్కువగా తింటా యని తెలిపారు. ఇలాంటి భారీ సపోటా ఫల వృక్షాలు దేశంలో చాలా అరుదుగా ఉంటాయని హార్టికల్చర్ శాస్త్రవేత్తలు అంటున్నారు. కళావతి అనే దేశీయరకం ఇలా పెరిగే అవకాశం ఉందని వారు వెల్లడించారు.

నేడు ఉత్తరాఖండ్‌కు మంత్రులు పొన్నం, సీతక్క

సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయం సాధికారతపై కేంద్ర సామాజిక న్యాయ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షతన ఈనెల 7, 8 తేదీల్లో డెహ్రాడూన్‌లో జరగనున్న చింతన్ శిబిర్ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరు కానున్నారు. ఇందులో భాగంగా మంత్రులు ఆదివారం మధ్యాహ్నం ఉత్తరాఖండ్‌కు బయలుదేరనున్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, దేశానికి దిక్సూచిగా నిలిచిన కులగణన, బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సదస్సులో ప్రసంగిస్తారు. అదేవిధంగా రాష్ట్రంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, అమలవుతున్న పథకాలను మంత్రి సీతక్క ఈ సందర్భంగా వివరించనున్నారు.

వాస్తవాలు నిర్ధారించుకున్నాకే సమాచారం ఫార్వర్డ్ చేయండి

ప్రజలకు మహేశ్ భగవత్ సూచన



సాక్షి, హైదరాబాద్: తప్పుడు సమాచారం, మోసాలపై అప్రమత్తంగా ఉండాలని శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ కోరారు. నకిలీ వార్తలు, తప్పుదారి పట్టించే సమాచారవ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో ఆయన శనివారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తప్పుడు సమాచారం ప్రజా జీవనానికి, వ్యక్తిగత భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని మహేశ్ భగవత్ నొక్కిచెప్పారు. 'ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మడంతో ఆర్థికంగా, వ్యక్తిగతంగా కూడా నష్టపోవాల్సి వస్తోంది. అవగాహన మొదటి, బలమైన రక్షణ మార్గం' అని ఆయన పేర్కొన్నారు. ఏదైనా సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకునే ముందు తప్పక నిర్ధారించుకోవాలని, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. తప్పుడు సమాచారాన్ని ఎదుర్కొనేందుకు ఫ్యాక్ట్ చెక్ వంటి టూల్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఏదైనా తప్పుడు సమాచారం, కొన్ని వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తేలా ఉన్నా.. వెంటనే తెలంగాణ పోలీసులకు లేదా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో సమాచారం ఇవ్వాలని ప్రజలకు మహేశ్ భగవత్ సూచించారు.

ఐదు గంటలు.. పది కిలోమీటర్లు

'కిన్నెరసాని'లో ఖమ్మం అదనపు కలెక్టర్ నడక


కిన్నెరసాని అభయారణ్యంలో అదనపు కలెక్టర్ శ్రీజ

పాల్వంచ రూరల్: నిత్యం విధుల్లో తలమునకలయ్యే ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీజ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని అభయారణ్యంలో పర్యటించారు. ఐదు గంటల పాటు.. సుమారు పది కిలోమీటర్లు కాలినడకన తిరిగారు. ఉదయం ఆరు గంటలకే కిన్నెరసానికి చేరుకున్న ఆమె.. డీర్ పార్కులోని దుప్పులను వీక్షించడంతో పాటు వాచ్‌టవర్ పైకెక్కి పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి అభయారణ్యంలో నడుచుకుంటూ కారెగట్టు, సారెకల్లు మీదుగా మామిళ్లవాయి వరకు వెళ్లారు. సుమారు ఐదు గంటలపాటు కాలినడకన తిరుగుతూ ట్రెక్కింగ్ చేశారు. వన్యమృగాల సంరక్షణ, అటవీ సంరక్షణపై వైల్డ్‌లైఫ్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట వైల్డ్‌లైఫ్ రేంజర్ కవిత మాధురి, ఎఫ్‌బీవో రాములు ఉన్నారు.

కలుషిత నీటితో కేన్సర్ ముప్పు

మురుగు నీటిలోని భార లోహాల వల్ల ప్రమాదమని హెచ్చరిస్తున్న ఐసీఎంఆర్
కలుషిత నీటితో పండించిన పంటలు కూడా కేన్సర్ కారకాలేనని వెల్లడి


మానేరు డ్యాంలో కలుస్తున్న కరీంనగర్ పట్టణ వ్యర్థాలు

సాక్షి, హైదరాబాద్: తాగునీటి జలాశయాల్లో కలుస్తున్న మురుగునీటి తో ప్రజల్లో కేన్సర్ ముప్పు పెరుగుతోందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తాజా నివేదికలో హెచ్చ రించింది. మురికి కాలు వలు, కలుషిత చెరువుల సమీపంలో నివసించే వారిలో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉందని వెల్లడించింది. పారిశ్రామిక, మున్సిపల్ వ్యర్థాలతో కూడిన మురుగునీటిలో ఆర్సెనిక్, లెడ్, అల్యూమి నియం వంటి ప్రమాదకర భార లోహాలు అధిక స్థాయిల్లో ఉంటున్నాయని పేర్కొంది. మురుగునీటిలోని భార లోహాలు తాగునీటిని, వ్యవసాయానికి ఉపయోగించే నీటిని కూడా కలుషితం చేస్తున్నాయని.. ఈ నీటితో పండించిన పంటలు కూడా కేన్సర్ కారకాలుగా మారుతున్నాయని వివరించింది.

నివేదికలోని అంశాలు ఇలా..

ఐసీఎంఆర్ తాజా నివేదిక ప్రకారం చర్మ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్‌కు ఆర్సెనిక్ కారణం అవుతుండగా నాడీ వ్యవస్థను లెడ్ దెబ్బతీస్తూ కిడ్నీ సమస్యలను తెస్తోంది. అలాగే మూత్రపిండాలు, ఎముకలపై కాడ్మియం ప్రభావం చూపుతోంది. క్రోమియం కూడా కేన్సర్‌కు కారణమవుతోంది. అల్యూమినియం వంటి అధిక సాంద్రతగల లోహాలు కూడా శరీరంలో చేరి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తున్నట్లు పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. భారలోహాలు శరీర కణాలు, డీఎన్ఏను దెబ్బతీస్తున్నాయని.. దీనివల్ల కేన్సర్‌తోపాటు మూత్రపిండాల వైఫల్యం, నాడీ సమస్యలు, రక్తహీనత వంటి రోగాలు వస్తున్నాయని అంటున్నారు.

రాష్ట్ర జలాశయాలు కాలుష్యమయం

రాష్ట్రంలో పట్టణ వ్యర్థాలు, మురుగునీరంతా సమీపంలోని జలాశయాల్లోకే విడుదలవుతోంది. ఇప్పటికే మూసీ నది, హుస్సేన్ సాగర్ వంటి జలాశయాలు తీవ్ర కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుండగా కృష్ణా, గోదావరి నదులకు కూడా ఈ బెడద తప్పడం లేదు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని లక్సెట్టిపేట, మంచిర్యాల, గోదావరిఖని, భద్రాచలం తదితర పట్టణాల నుంచి వచ్చే మురు గునీరంతా నేరుగా నదిలో కలుస్తోంది. అలాగే కరీంనగర్‌లోని మురుగునీరు ఎగువ భాగంలో గోదావరి ఉపనది మానేరులో కలుస్తుండగా దిగువన మానేరు కాలువల గుండా మళ్లీ గోదావరిలో కలుస్తోంది. మరోవైపు కృష్ణా పరీవాహక ప్రాంత పట్టణాల్లోని మురుగునీరు కూడా నదిలోకి చేరుతోంది.

కొనుగోళ్లు కాక.. నిల్వ చేయలేక


ఈ చిత్రాన్ని చూసి.. ఇదేదో ధాన్యం కొనుగోలు కేంద్రమనుకుంటే పొరపాటు. యాసంగి సీజన్‌లో భాగంగా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ రైతులు పండించిన జొన్న పంట ఇది. జొన్న పంట చేతికందినప్పటికీ.. జిల్లాలో ఇంకా కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. దీంతో ఇళ్లల్లో వాటిని నిల్వ చేసుకునే స్థలం లేకపోవడంతో.. ఇలా రైతులంతా గ్రామ సమీపంలోని రామాలయం వద్ద ఆరబెడుతున్నారు. రాత్రింబవళ్లు పంటకు కాపలా కాస్తూ ఇబ్బంది పడుతున్నారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



సీతారాముల కల్యాణము చూతము రారండి!

నేడు భద్రాచలంలో వేడుకగా రాములోరి కల్యాణం ● పల్లకీలో ఆలయం నుంచి మిథిలా స్టేడియానికి వధూవరులు

ఉదయం 10 గంటలవేళ కల్యాణ క్రతువు మొదలు ● సింహాసనంపై శ్రీరాముడు, గజాసనంపై సీతమ్మ

రామదాసు ఆభరణాలతో వధూవరుల అలంకరణ ● మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామ నవమి రోజున ఆగమ శాస్త్ర పద్ధతిని అనుసరిస్తూ భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియంలో నేడు సీతారాముల కల్యాణం జరగనుంది. ఆ వివాహ వేడుక వివరాలు..

భజంత్రీలు, కోలాటాలతో స్వాగతం..

ఉదయం 9:30 గంటల తర్వాత శంఖు, చక్ర, ధనుర్బాణాలను ధరించి సీతమ్మతో కూడిన రాముడి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీలో వెలుపలకు తీసుకొస్తారు. కల్యాణ వేదిక మీదకు వెళ్తున్న సీతారాములకు భజంత్రీలు, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో భక్తజనం స్వాగతం పలుకుతారు. జై శ్రీరామ్ నినాదాల నడుమ మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్లు చేరుకుంటారు.

మండప శుద్ధి

- కల్యాణ మండపానికి చేరుకున్న సీతారాములు, లక్ష్మణుడిని అక్కడ వేంచేపు చేస్తారు. కల్యాణ వేడుకలకు ఎలాంటి విఘ్నాలు రాకుండా ముందుగా విశ్వక్సేన పూజ నిర్వహిస్తారు. పుణ్యాహవచన మంత్రాలతో కల్యాణ వేడుకలకు ఉపయోగించే స్థలం, వస్తువులు, ప్రాంగణం, వేడుకలో పాల్గొనే వారిని మంత్ర జలంతో శుద్ధి చేస్తారు.

రాముడి ఎదురుగా సీతమ్మ..

- శ్రీయోద్వాహము నిర్వహించి అప్పటివరకు మండపంలోనే ఉన్న సీతమ్మను శ్రీరాముడికి ఎదురుగా కూర్చుండబెడతారు. శ్రీరాముడు సింహాసనంపై ఆసీనులు కాగా సీతమ్మ గజాసనంపై ఆసీనులవుతారు. సీతారాముల వంశగోత్రాల ప్రవరలు చెబుతారు.
- సీతారాములు ఎదురెదురుగా కూర్చున్న తర్వాత ద్వాదశ దర్భలతో తయారుచేసిన యోక్త్రంతో సీతమ్మకు యోక్త్రా బంధనం చేస్తారు. ఇలా చేయడం వల్ల గర్భస్థ దశలో కలిగే దోషాలు తొలగిపోతాయని శాస్త్రం చెబుతోంది. మరోవైపు శ్రీరాముడు గృహస్థాశ్రమంలోకి వెళ్తున్నాడనే దానికి సూచనగా యజ్ఞోపవీతధారణ చేస్తారు. యజ్ఞోపవీతధారణ, యోక్త్రాబంధన కార్యక్రమాలు జరిగిన తర్వాత శ్రీరాముడి పాదప్రక్షాళనతో వరపూజ నిర్వహిస్తారు.

అలంకరణలు

- కల్యాణం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలను సీతారాములకు ధరింపజేస్తారు. అనంతరం రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చలహారం రామయ్యకు అలంకరిస్తారు. లక్ష్మణుడికి రామమాడను ధరింపజేస్తారు. సీతారాములకు తేనె, పెరుగు కలిపిన మధుపర్కంతో నివేదన చేస్తారు
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున, శృంగేరీ పీఠంలతో పాటు భక్తరామదాసు, తూము నర్సింహదాసు వంశస్తుల తరఫున వధూవరులకు పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుంది.

కన్యాదానం

వేదమంత్రాలను ఉచ్చరిస్తూ కన్యాదానం సందర్భంగా భూదానం, గోదానం చేస్తారు. అనంతరం మహాసంకల్పం, చూర్ణిక పఠనం గావిస్తారు. మంగళాష్టకాలు జపిస్తూ శ్రీరాముడికి సంబంధించి ఎనిమిది శ్లోకాలను, సీతమ్మకు సంబంధించి ఎనిమిది శ్లోకాలను పఠిస్తారు. ఈ మంగళాష్టకంలో వధూవరులకు సంబంధించిన ఏడు తరాల వివరాలను, ఘనతలను తెలియజేస్తారు.

అభిజిత్ లగ్నంలో..

చైత్రశుద్ధ నవమి నాడు అభిజిత్ లగ్నంలో శ్రీరాముడి కల్యాణం నిర్వహించడం ఆచారంగా వస్తోంది, సాధారణంగా నవమి రోజున అభిజిత్ లగ్నం మధ్యాహ్నం 12 గంటలకు కాస్త అటుఇటుగా రావడం పరిపాటి. ముహూర్త లగ్నం రాగానే వధూవరులైన సీతారాముల తలలపై జీలకర్ర, బెల్లం ఉంచుతారు.

- ఆ తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు తాళిబొట్లు ఉన్న మంగళసూత్రానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం మూడు బొట్లు ఉన్న తాళిని సీతమ్మ వారి మెడలో కట్టడంతో కల్యాణ వేడుకలో కీలక ఘట్టం ముగుస్తుంది.

తలంబ్రాలు..

- ముత్యాలు కలిపిన, గోటితో ఒలిచిన తలంబ్రాలను వధూవరులైన సీతారాములపై పోస్తారు. సాధారణంగా తలంబ్రాలు పసుపురంగులో ఉంటాయి. కానీ భద్రాచల రామయ్య కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు గులాబీ రంగులో ఉంటాయి. ఇక్కడ తలంబ్రాల తయారీలో పసుపుతో పాటు గులాల్‌ను కూడా ఉపయోగించడం తానీషా కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది.

భద్రాచల వీధుల్లో వధూవరుల ఊరేగింపు..

- తలంబ్రాల కార్యక్రమం ముగిసిన సీతారాములకు తర్వాత తాత్కాలిక నివేదన చేయిస్తారు. నివేదన అనంతరం సీతమ్మ చీరకు, రామయ్య పంచె/ధోతితో కలుపుతూ బ్రహ్మముడి వేస్తారు. అనంతరం మంగళ హారతి అందిస్తారు. బ్రహ్మముడి అనంతరం కల్యాణం ముగించుకున్న సీతారాములను వేడుకగా పల్లకీలో భద్రాచల వీధుల్లో ఊరేగిస్తూ ఆలయంలోనికి తీసుకెళ్తారు.


బంగారు కిరీటం


పచ్చల పతకం


కలికితురాయి


సీతపల్లకి


చింతాకు పతకం


వజ్రాల హారం


సీతమ్మ మంగళసూత్రం


సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకమ్ము!

ఆలయ నిర్మాణం సహా సీతారాములకు ఆభరణాల తయారీ

మ్యూజియంలో కంచర్ల గోపన్న ఆభరణాలు

భద్రాచలం: హస్నాబాద్ (పాల్వంచ) తహసీల్దార్‌గా పని చేసిన కంచర్ల గోపన్న భద్రాచలంలో శ్రీసీతారాముల ఆలయం నిర్మించాడని తెలిసిందే. అయితే, ఆయన ఆలయాన్ని నిర్మించడమే కాకుండా.. సీతారామ లక్ష్మణులకు పలు ఆభరణాలను ఆ సమయంలోనే తయారు చేయించాడు. వీటిని ఆలయ ప్రాంగణంలోని మ్యూజియంలో భక్తులకు అందుబాటులో ఉంచారు. ప్రధాన ఉత్సవాలైన ముక్కోటి, శ్రీరామనవమి రోజుల్లో ఈ ఆభరణాలను మూలవరులు, ఉత్సవ విగ్రహాలకు అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది.

భద్రుడి ఆలయం వద్ద పాదముద్రలు



భద్రుడి శిల వద్ద భక్తుల పూజలు



భద్రశిల మహత్మ్యం

భద్రగిరిపై శ్రీ సీతారామచంద్రస్వామి వారి కరుణా కటాక్షాల కోసం భద్ర మహర్షి కఠోర తపస్సు చేశాడు. రామాలయం ప్రాంగణంలో గర్భగుడి వెనుక ఇప్పటికీ భద్రుని శిల.. చరిత్రకు నిదర్శనంగా దర్శనమిస్తోంది. ఆ మహర్షి కఠోర తపస్సుకు సంతుష్టుడైన శ్రీరామన్నారాయణుడు.. శంఖుచక్రాలతో సీతాలక్ష్మణ సమేతంగా శ్రీరామచంద్రుడి అవతారంలో సాక్షాత్కరించిన తపో భూమి భద్రాచలమని భక్తులు భావిస్తారు. ఇంతటి చారిత్రక నేపథ్యం గల ఈ శిలను తాకేందుకు భక్తులు ఆసక్తి కనబరుస్తారు. భద్రుడికి గుడి కట్టించి పూజలు సైతం నిర్వహిస్తున్నారు. అందుకే ఈ క్షేత్రం తొలుత భద్రగిరి, అనంతరం భద్రాచలంగా ప్రఖ్యాతి గాంచింది.

అదరహో... శిల్పకళా నైపుణ్యం

జగదభిరాముడికి భద్రాచలంలో జరిగే కల్యాణం ఎంతో ప్రత్యేకమైంది. ఈ కల్యాణం నిర్వహించే మండపం మొత్తాన్ని శిలతోనే నిర్మించారు. దీనిపై రామాయణ ఇతివృత్తాలకు చెందిన అనేక అపురూప శిల్పాలను చెక్కారు. ఈ శిల్పాలను నాటి మద్రాస్, ప్రస్తుత చెన్నైకి చెందిన గణపతి స్థపతి నేతృత్వంలో చెక్కారు. శ్రీరామనవమి రోజు ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని ఇదే వేదికపై జరుపుతారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణాన్ని.. మొదట్లో ఆలయంలోని పొగడ చెట్టు ముందున్న రామకోటి స్తూపం వద్ద నిర్వహించేవారు. ఆ తర్వాత చిత్రకూట మండపంలో వేదిక నిర్మించి కల్యాణం జరిపేవారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరగడంతో.. రామాలయానికి సమీపంలో 1960 మే 30న ప్రస్తుత కల్యాణ మండపానికి అప్పటి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళితో శంకుస్థాపన జరిగింది. దీన్ని 1964 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డితో ప్రారంభించి.. అదే రోజు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఆ తర్వాత మహాసామ్రాజ్య పట్టాభిషేకం సందర్భంలో.. 1988లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కల్యాణ మండపం ప్రాంగణంలో.. స్టేడియం మాదిరిగా గ్యాలరీలు ఏర్పాటు చేసి మిథిలా స్టేడియంగా నామకరణం చేశారు. ఈ స్టేడియంలో ప్రస్తుతం 35 వేలమంది భక్తులు కూర్చుని స్వామి వారి కల్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించే అవకాశం ఉంది.







సుదర్శన చక్ర దర్శనం.. సర్వ పాపహరణం

భద్రగిరిపై కొలువుదీరిన మూలమూర్తులకు ఎంతటి ప్రత్యేకత ఉందో.. ప్రధాన ఆలయం పైనున్న గోపురంపై సుదర్శన చక్రానికీ అంతే ప్రత్యేకత ఉంటుంది. భక్త రామదాసు రామాలయాన్ని ప్రత్యేక రాతి శిల్పాలతో నిర్మించాక.. ఆలయ శిఖరంపై విమాన ప్రతిష్ఠ కోసం సుదర్శన చక్రం తయారు చేయించాలని నిర్ణయించారు. ఇలా సుదర్శన చక్రాన్ని ఎంతమందితో తయారు చేయించినప్పటికీ అది భిన్నం (ముక్కలు) అయిపోయేదట. భక్త రామదాసు చివరకు రామయ్య తండ్రిని ప్రార్థించగా.. స్వామివారు స్వప్నంలో కనిపించి మానవుడు నిర్మించిన ఏదీ ఇందుకు పనికిరాదని, గోదావరి నదిలో సుదర్శన చక్రం ఆవిర్భవించి ఉందని చెప్పినట్లు పురాణం చెబుతోంది. దీంతో నాలుగు వందల మంది గోదావరి నదిలో దానికోసం వెతికినా.. కనిపించలేదు. రామదాసు భక్తి శ్రద్ధలతో సీతారామచంద్రస్వామి వారిపై కీర్తనలు ఆలపించగా.. సుదర్శన చక్రం గోదావరి నదిలో దొరికిందట. ఇలా గోదావరి నదిలో దొరికిన సుదర్శన చక్రాన్ని ఆలయ గర్భగుడిపై భక్త రామదాసు ప్రతిష్ఠించారు.



రాములోరి మొదటి కల్యాణం గర్భగుడిలోనే..

నేడు తెల్లవారుజామున రెండు గంటలకే పూజలు మొదలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సాధారణ రోజుల్లో తెల్లవారుజామున నాలుగు గంటల తర్వాత సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పుతారు. ఆ తర్వాత తిరువారాధన, మంగళాశాసనం, అభిషేకం తదితర పూజలు నిర్వహిస్తారు. కానీ శ్రీరామనవమిని పురస్కరించుకుని గర్భగుడిలో ఉన్న సీతారాములను రాత్రి రెండు గంటల సమయంలోనే మేల్కొల్పుతారు. ఆ తర్వాత నిత్యం నిర్వహించే పూజా కార్యక్రమాలు చేపడతారు. అనంతరం ఉదయం ఎనిమిది గంటల సమయంలో భద్రాచలం ఆలయం గర్భగుడిలో ఉన్న మూల విరాట్‌లకు శాస్త్రోక్తంగా లఘు కల్యాణం జరుపుతారు. 40 నిమిషాల వ్యవధిలోనే ఈ తంతును ముగిస్తారు.

ఆ రోజుల్లో పొగడ చెట్టు నీడలో..

శ్రీరామదాసు కాలంలో భద్రాచలం ఆలయ ప్రాంగణంలో ఉన్న పొగడ చెట్టు నీడలో సీతారాముల కల్యాణం నిర్వహించేవారు. ఆ తర్వాత భక్తుల సంఖ్య పెరగడంతో పొగడ చెట్టు నుంచి బేడా మండపంలోకి పెళ్లి వేదికను మార్చారు. గోదావరిపై వంతెన నిర్మాణం పూర్తయ్యాక భద్రాచలం వచ్చే భక్తుల సంఖ్య వేలల్లోకి చేరుకుంది. బేడా మండపంలో అంతమంది వీక్షించే పరిస్థితి లేకపోవడంతో ఆలయ ప్రాంగణం నుంచి బయట కల్యాణం జరిపించాలని నిర్ణయించారు. దీంతో ఉత్తర ద్వారానికి ఎదురుగా నవమి కల్యాణం కోసం ప్రత్యేకంగా మండపాన్ని 1964లో నిర్మించారు. సుమారు రెండు దశాబ్దాలపాటు ఎత్తైన కల్యాణ మండపంలో పెళ్లి తంతు జరుగుతుండగా చుట్టూరా భక్తులు చేరి చూసేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1988లో కల్యాణ మండపం చుట్టూ భక్తులు కూర్చుని చూసేందుకు వీలుగా మిథిలా స్టేడియాన్ని నిర్మించారు.

పెళ్లి పెద్దలుగా..

శ్రీరామదాసు కాలం నుంచి భద్రాచలంలో నిత్య పూజలు, శ్రీరామనవమి, పట్టాభిషేకం తదితర వేడుకలు నిర్వహించేందుకు తమిళనాడులోని శ్రీరంగానికి చెందిన వేద పండితులను భద్రాచలం తీసుకువచ్చారు. ఇలా తీసుకువచ్చిన వారిలో కోటి, అమరవాది, పొడిచేటి, గొట్టుపుళ్ల, తూరుబోటి ఇంటిపేర్లు గల కుటుంబాలు ఉన్నాయి. అప్పటి నుంచి ఆ కుటుంబాలే వంశపారంపర్యంగా, వంతుల వారీగా నవమి వేడుకల బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయి. శ్రీరామ నవమికి మిథిలా స్టేడియంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలలో కీలక పాత్ర పోషించేది ఆచార్య. ఇతని చేతుల మీదుగానే కల్యాణం మొత్తం జరుగుతుంది. ఆయనకు సూచనలను అందించే వ్యక్తిని బ్రహ్మగా పేర్కొంటారు. వీరిద్దరికి సహాయకులుగా ఇద్దరు చొప్పున నలుగురు రుత్వికులు ఉంటారు. పూజా సామగ్రి అందించేందుకు నలుగురు పరిచారకులు ఉంటారు. ప్రస్తుతం ఆలయంలో ప్రధాన అర్చకులైన ఇద్దరు వీరందరికీ అధర్వులుగా వ్యవహరిస్తారు. మొత్తంగా 12 మంది సీతారాముల పెళ్లి వేడుకలో కీలకంగా వ్యవహరిస్తారు. వీరందరిని ఉత్సవాలలో భాగస్వామ్యం చేస్తూ కల్యాణ తంతు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా జరిగేలా స్థానాచార్యులు స్థలశాయి పెద్దన్న పాత్రను నిర్వర్తిస్తారు.

దక్షిణ అయోధ్యలో 'పంచారామ క్షేత్రాలు'

రాముడు నడయాడిన చరిత్ర ఆనవాళ్లు ● భక్తులు చూడదగిన పర్యాటక కేంద్రాలు

భద్రాచలం: దేశంలో దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం.. భద్రుని తపో ఫలంతో ఆవిర్భావమైన పుణ్యక్షేత్రం. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఉన్న పంచారామ క్షేత్రాల వివరాలు..

వైకుంఠ రాముడు (భద్రాచలం)

పంచారామ క్షేత్రాలలో మొదటిది భద్రాచలంలో ఉన్న సీతారామచంద్రస్వామి దేవస్థానం. దక్షిణ అయోధ్యగా పిలుచుకునే ఈ క్షేత్రంలోని శ్రీరాముడిని భోగరాముడుగానూ పిలుస్తారు. చతుర్భుజాలతో శ్రీరాముడు దర్శనమిచ్చే ఏకైక క్షేత్రం ఇది. భక్త రామదాసుగా పేరు తెచ్చుకున్న కంచర్ల గోపన్న ఈ ఆలయాన్ని నిర్మించడంతో పాటు పూజాధికాలను ఏర్పాటు చేశారు. నేటికీ ఈ క్షేత్రంలో ఇంచుమించుగా అవే పూజలు కొనసాగుతున్నాయి.

శోకవిరాముడు (పర్ణశాల)

తులసీదాసు రచించిన రామచరిత మానస్‌లో సీతారాములు వనవాసం (11మాసాల 10 రోజులు) చేసిన ప్రదేశాన్ని పర్ణశాలగా పేర్కొంటారు. ఇక్కడ పంచవటి కుటీరం, సీతమ్మను అపహరించిన ప్రాంతం, మాయ లేడి పాదముద్రలు, శూర్పణఖ దాగి.. వేషాన్ని మార్చుకున్న చుప్పనాతి చెట్టు గల ప్రాంతం, సీతమ్మ పసుపు కుంకుమలుగా వాడుకున్న పసుపురాళ్లు, కుంకుమరాళ్లు, నారచీరలు ఆరవేసుకున్న చారబండలు, సీతారాములు ఆడుకున్న వామనగుంటలు, కందమూలాలను ఆరగించిన రాతి కంచాలు, సీతమ్మ ప్రత్యేక దినములలో స్నానం చేసిన పద్మసరస్సు (సీత వాగు) ఆమెకు రక్షణగా శ్రీరాముడు కూర్చున్న రాతి సింహాసనం వంటి గుర్తులు కనిపిస్తాయి. సీతాపహరణం తర్వాత శ్రీరాముడు శోకించిన ప్రాంతం కావడంతో ఇక్కడున్న రాముడిని శోకవిరాముడిగా పేర్కొంటారు.


ఆత్మారాముడు (దుమ్ముగూడెం)

ముక్కు, చెవులు కోసిన తర్వాత తన అన్నదమ్ములైన ఖర–దూషణ, త్రిశిర తదితర 14 వేలమంది రాక్షసులతో శూర్పణఖ మొరపెట్టుకుంది. దీంతో వారంతా రాముడిపైకి యుద్ధానికి వచ్చారు. ఈ యుద్ధంలో వారంతా రాముడి చేతిలో అంతమయ్యారు. 14 వేలమందితో రాముడొక్కడే యుద్ధం చేస్తున్నా... రాక్షసులకు ఒక్కొక్కరితో ఒక్కో రాముడు తలపడినట్లుగా యుద్ధం సాగిందని, రాముడొక్కడే అంతమందిగా ఆత్మస్వరూపంతో యుద్ధం చేసినందున ఇక్కడి రాముడిని ఆత్మారాముడని అంటారు. ఇక్కడే రాక్షసులకు రాముడికి దొమ్మి (యుద్ధం) జరిగిన ప్రాంతం కావడం వల్ల దొమ్మిగూడెం గాను, క్రమేణా దుమ్ముగూడెం గానూ మారినట్లు స్థానిక చరిత్ర చెబుతోంది.


యోగరాముడు (శ్రీరామగిరి క్షేత్రం)

ఇది గోదావరి, శబరి నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రాంతం. నిండుగా ప్రవహించే గోదావరి నదీతీరాన ఎత్తయిన కొండపై నెలకొన్న క్షేత్రానికి శ్రీరామగిరి అని పేరు. రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాంతం ఏపీలోకి వెళ్లింది. ఈ కొండపై శ్రీరాముడు లక్ష్మణ సమేతుడై చాతుర్మాస్యవ్రతాన్ని ఆచరించాడని స్థలపురాణం. పర్ణశాలలో సీతాపహరణం తర్వాత శ్రీరాముడు సీతాన్వేషణ చేస్తూ వనక్షేత్రం చేరి, సేదతీరి మళ్లీ సీతమ్మను వెదుకుతూ ఈప్రాంతానికి చేరుకున్నారు. ఇది అప్పుడు మాతంగముని ఆశ్రమ ప్రాంతం. ఇక్కడే శబరిని కలసి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించి, ఆ తల్లికి ముక్తిని ప్రసాదించాడని పురాణ కథనం. ఈ విధంగా శ్రీరామాయణ కథకు సన్నిహిత సంబంధం గల పవిత్ర ప్రాంతమిది. ఈ ప్రాంతానికి సమీపంలో రేఖపల్లిలో (రెక్కపల్లి) (జటాయువు యొక్క రెండో రెక్క పడిపోయిన చోటు) జటాయువును చూశారు. రామలక్ష్మణులు జటాయువు ద్వారా సీత వృత్తాంతాన్ని తెలుసుకుని, మరణించిన జటాయువుకు శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు చేశారు. గోదావరి తీరంలో ఓ పెద్దశిలపై దానికి పిండ ప్రదానం చేసినట్లు స్థల చరిత్ర చెబుతోంది. ఈ కొండపై శ్రీరాముడు యోగం చేయడం వల్ల ఇక్కడి రాముడిని ఈ ప్రాంతవాసులు యోగరాముడుగా పిలుస్తారు. జటావల్కలధారిగా ఉండే ఈ స్వామికి సుందరరాముడు అని కూడాపేరు. ఎక్కడా లేనివిధంగా ఇక్కడ లక్ష్మణస్వామి అంజలి ఘటిస్తూ ఉంటాడు. తొలుత ఈ కొండపై రామలక్ష్మణుల విగ్రహాలు, ఆ తరువాత మాతంగి మహర్షి వంశీయ మహర్షులు సీతమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు స్థల చరిత్ర చెబుతోంది


భద్రాచలంలో శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య


పర్ణశాల శోకవిరాముడి క్షేత్రం

వనరాముడి క్షేత్రంలో శ్రీరామ, లక్ష్మణ చెట్లు



వన రాముడు (దండకారణ్య భాగం)

దండకారణ్య భాగం భద్రాచలం క్షేత్రానికి తూర్పు ఆగ్నేయ దిశలో శబరి నది దాటగానే ఉన్న వరరామచంద్రపురానికి (వీఆర్‌పురం) 23 కి.మీ. దూరంలో ఉంది (ప్రస్తుతం ఇది ఏపీలో ఉంది). ఇక్కడికి కాలిబాట తప్ప మరో మార్గం లేదు. సీతాపహరణం జరిగిన తర్వాత బాధలో ఉన్న శ్రీరాముడిని లక్ష్మణుడు ఓదార్చిన ప్రాంతమని భక్తుల విశ్వాసం. ఇక్కడి రాముడిని ఒక వృక్షరూపంలో ఆరాధిస్తారు. కొన్ని వందల ఏళ్లకు ముందు నుంచి ఇక్కడున్న రెండు భారీ టేకు, మద్ది చెట్లను ఆ ప్రాంత గిరిజనులు కొలుస్తున్నారు. అటవీశాఖ వారు కూడా చాలాకాలం క్రితమే వాటిని పురాతన వృక్షాలుగా గుర్తించి, ఆ రెండు చెట్లకు రామ, లక్ష్మణ వృక్షాలని పేరు పెట్టారు. ఆ రెండింటినీ దండకారణ్య వృక్షాల ప్రతినిధులుగా భావిస్తారు. ఆ ప్రాంతాన్ని వన రామక్షేత్రంగా సంబోధిస్తున్నారు.

రాజన్నతో ముడి.. హిజ్రాల సందడి

- రాజన్నతో హిజ్రాల పెళ్లిమహోత్సవం
- సీతారాముల కల్యాణంలో శివుడితో వివాహం
- రాజన్నే వరుడుగా భావించి వివాహం
- వేములవాడలో ఏళ్లుగా కొనసాగుతున్న ఆచారం


రాజన్నను వివాహమాడుతున్న శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు


స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జోగిని వైష్ణవి


ముత్యాల తలంబ్రాలు, ఒడి బియ్యం సమర్పిస్తూ..


స్వామివారి రథోత్సవంలో హిజ్రాల నృత్యం

వేములవాడ: రాజన్నను వరుడిగా భావించి వివాహమాడటం.. వేములవాడలో ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ. ఏటా శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణోత్సవానికి సామాన్య భక్తులతోపాటు అధిక సంఖ్యలో హిజ్రాలు, జోగినులు హాజరవుతుంటారు. కానీ కల్యాణోత్సవానికి హాజరైన హిజ్రాలు, జోగినులు శివుడినే వరుడిగా భావించి వివాహమాడుతుంటారు. మంగళసూత్రం ధరించి, తలంబ్రాలు పోసుకుంటూ సంతోషంగా గడుపుతారు. రాష్ట్రంలో వేములవాడ రాజన్న సన్నిధిలో మాత్రమే శ్రీరామనవమి సందర్భంగా ఆవిష్కృతమయ్యే ఈ ఆచార, వ్యవహారాలపై ప్రత్యేక కథనమిది.

నవమి రోజే ఏడడుగులు

ఏటా శ్రీరామ నవమి రోజు జరిగే శ్రీసీతారాముల కల్యాణంలో శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు పాల్గొంటారు. వీరంతా సంప్రదాయబద్ధంగా పట్టుచీరలు, ఆభరణాలు ధరించి అందంగా ముస్తాబై కల్యాణానికి హాజరవుతారు. తమను తాము.. రాజరాజేశ్వరస్వామికి భార్యలుగా భావించి.. వివాహ బంధంలోకి ప్రవేశిస్తారు. నెత్తిన జీలకర్ర బెల్లం, చేతిలో త్రిశూలం, మెడలో మంగళసూత్రం ధరించి పెళ్లి వేడుకలు జరుపుకోవడం విశేషం. ఆలయ ఆవరణలో జరిగే ఈ ప్రక్రియను.. ఆత్మవివాహం(స్వయంపరిత్యాగం)గా పరిగణిస్తుంటారు.

వేడుక వెనుక భక్తి భావన

ఈ వేడుక ద్వారా శివపార్వతులు, జోగినులు, హిజ్రా సమాజం భగవంతుని ఆశీస్సులను కోరుకుంటారు. హిజ్రాలను సమాజంలో ఒంటరిగా కాకుండా సమానంగా చూడాలనే ఆలోచన ఈ ఉత్సవానికి ప్రధాన సంకేతంగా నిలుస్తోందని భావిస్తుంటారు. వారి ఆత్మాభిమానం పెంచేందుకు, భగవంతుని కటాక్షానికి హిజ్రాలు కూడా పాత్రులనే భావనను చాటి చెప్పేలా ఈ ఉత్సవం సాగుతోంది. భక్తికి లింగ భేదం లేదని, దేవునికి ప్రతి ఒక్కరూ సమానమేనని ఈ వేడుకలు నిరూపిస్తున్నాయి. వారం రోజులపాటు వేములవాడలో వేడుకగా జరిగే ఈ తంతును చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు.

సమాజంలో మార్పుకిది సంకేతం

హిజ్రాలను అనాదిగా సమాజం అంగీకరించక, వారిని అటకెక్కించిన తీరు తెలిసిందే. కానీ వేములవాడ రాజన్న ఆలయంలో హిజ్రాలకు ప్రత్యేక గౌరవం కల్పించడం విశేషంగా భావిస్తారు. ఇక్కడ హిజ్రాలు దేవునితో ఆత్మీయబంధం కలిగి, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం పొందుతున్నారు. హిజ్రాలకు దేవతల మన్నింపు, ఆశీస్సులు లభిస్తున్నాయని భావించడంతో.. భక్తుల మధ్య వారికి గుర్తింపు పెరుగుతోంది. సామాజికంగా హిజ్రాలు ఎన్నో అవమానాలు ఎదుర్కొంటారు. కానీ ఈ కల్యాణోత్సవం ద్వారా వారికి భక్తిపూర్వకమైన గుర్తింపు లభిస్తోంది. తాము సమాజంలో ఒంటరి కామని, గుర్తింపు ఉందని హిజ్రాలు స్వయంగా అర్థం చేసుకునేలా చేస్తుంది. ఇటీవల హిజ్రాలకు ప్రభుత్వం కొన్ని హక్కులు, వసతులు కల్పించినా, సాధారణ ప్రజానీకంలో ఇప్పటికీ వారిపై వ్యతిరేక అభిప్రాయాలు ఉన్నాయి.

తోడూ నీడగా..



ఎండలు మండిపోతుండటంతో ఎడ్ల బండిపై ఉప్పు అమ్ముకుని జీవనం సాగించే ఈ వ్యక్తి బండిపైన ఇలా టార్పాలిన్ ఏర్పాటుచేసుకున్నాడు. ఏళ్ల తరబడి తన జీవనానికి అండగా నిలుస్తున్న ఎద్దుకు కూడా ఎండ నుంచి ఉపశమనం కలిగించేలా ఈ విధంగా ఏర్పాటు చేశాడు. కడపలోని మహావీర్ సర్కిల్ వద్ద ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

కోతుల నుంచి రక్షణ కోసం..



కోతికి కొండముచ్చు అంటే మహా భయం. దాన్ని ఉపయోగించుకుని గుంటూరు జిల్లా మున్నంగి వద్ద ఈ రైతు తన మొక్క జొన్న చేను ముందు ఇలా కొండముచ్చుల ఫొటోలు ఏర్పాటు చేశాడు. ఈ ఫొటోలు చూసి కోతులు ఆ పరిసరాలకు రాకపోవడంతో రైతు సంతోషిస్తున్నాడు – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తీరం..పదిలం



సాగర తీరాన్ని సముద్రపు కోత నుంచి నివారించేందుకు ఏటా జరిగే డ్రెడ్జింగ్ ప్రక్రియ విశాఖ ఆర్కే బీచ్ వద్ద కొనసాగుతోంది. విశాఖ పోర్ట్ అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. సముద్రం లోపలి నుంచి ఇసుకను తోడి తీరంలో పోస్తున్నారు – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

యూత్ పార్లమెంట్‌లో విజేతగా ఏపీ విద్యార్థిని

ఏయూక్యాంపస్: జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌లో రాష్ట్రానికి చెందిన వి.లాస్యప్రియ విజేతగా నిలిచింది. ఉత్తమ జవాబు విభాగంలో ఈమె విజేతగా నిలిచారు. ఈ నెల 2,3 తేదీల్లో పార్లమెంట్ లైబ్రరీ హాల్‌లో జరిగిన జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి లాస్య, శివానీ, జ్యోత్స్న పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 110 మంది పాల్గొనగా ఒక్కో రాష్ట్రం నుంచి ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు విద్యార్థులు విశాఖ నోడల్ ఏరియావారు కావడం గమనార్హం. వీరికి కేంద్ర సహాయ మంత్రి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

అందరి అభిప్రాయాల తర్వాతే వక్ఫ్ బిల్లుకు ఆమోదం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, అమరావతి: వక్ఫ్‌బిల్లు వ్యవహారంలో కాంగ్రెస్ అవాకులు, చవాకులు పేలితే ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. అన్ని పార్టీల నాయకులు వారి అభిప్రాయాలు చెప్పాక లోక్‌సభ, రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించాయని చెప్పారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు చట్టమైన తరువాత ఫలితాలను అందరూ చూస్తారని ఆమె పేర్కొన్నారు.

విమానంలో చైన్ స్నాచింగ్

దొడ్డబళ్లాపురం: ఎగురుతున్న విమానంలో చైన్ స్నాచింగ్ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు ఈ నెల ఒకటోతేదీన బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. ప్రియాంక ముఖర్జీ అనే మహిళ తిరువనంతపురం నుంచి తన ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి బెంగళూరుకు ఇండిగో విమానంలో వచ్చింది. విమానంలో ఐదేళ్ల పాప ఏడుస్తుండటంతో ఓ ఎయిర్ హోస్టెస్ బుజ్జగిస్తానని పాపను ఎత్తుకుంది. విమానంలోనే అటూఇటూ తిప్పి తల్లికి తిరిగి ఇచ్చింది. తల్లి విమానం దిగాక చూస్తే పాప మెడలో బంగారు గొలుసు కనబడలేదు. దీంతో ప్రియాంక ముఖర్జీ ఎయిర్‌పోర్టు పోలీసులకు ఇండిగో విమానం సిబ్బందిపై ఫిర్యాదు చేస్తూ ఎయిర్ హోస్టెస్ మీద అనుమానం వ్యక్తం చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఐదేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

పోక్సో కేసు నమోదు

లక్కవరపుకోట: విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలో ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయసుగల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన బాలుడి(15)పై పోక్సో కేసు నమోదు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి చిన్నారి ఆడుకుంటుండగా బాలుడు వారి ఇంటికి వెళ్లాడు. చిన్నారి తల్లి ఇంటి వెనుక భాగంలో వంట చేసుకుంటుండగా బాలికను ఇంటిలోని మంచంపైకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడి అక్కడి నుంచి జారుకున్నాడు. చిన్నారి ఏడుస్తూ తల్లిదగ్గరికి వెళ్లి చెప్పే ప్రయత్నం చేసింది. బాలికను పూర్తిగా పరిశీలించగా రక్తం చారలు ఉండడంతో అత్యాచారయత్నం జరిగినట్టు గుర్తించి ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

దళితులను క్షమాపణ కోరిన జిల్లా కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరులో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో దళితులకు అవమానం జరిగింది. ఈ వేడుకలకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు దళిత సంఘ నాయకులకు ఆహ్వానం ఇవ్వకుండా అవమానించారు. దీంతో పలువురు దళిత సంఘాల నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఎదుటే శనివారం నిరసనకు దిగారు. కూటమి పాలనలో దళితులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కిందిస్థాయి ఉద్యోగులు చేసిన తప్పిదం వాస్తవమేనని..చర్యలు తీసుకుంటానంటూ కలెక్టర్ దళిత సంఘ నాయకులకు క్షమాపణలు కోరారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో దళిత సంఘ నాయకులు శాంతించారు.

ఖైదీ..జే జైలు

ఖైదీలతో వివిధ ఉత్పత్తి విభాగాల నిర్వహణ

- ఏడాదిలో కారాగారం నుంచి రూ 2 కోట్ల విలువైన ఉత్పత్తులు
- జైలు కాలం...నవ జీవన రాగం
- ఖైదీల్లో ఆర్థిక స్వావలంబన
- పలు కర్మాగారాలతో ఉపాధి కల్పిస్తోన్న విశాఖ కేంద్ర కారాగారం

వారంతా ఏదో ఒక సందర్భంలో క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడి శిక్ష పడిన వారే. కొందరికి కారాగారం నెలరోజులైతే.. ఇంకొందరికి ఏడాది..మరికొందరికి మూడేళ్లు...ఇలా అయినవారికి దూరంగా..బాహ్య ప్రపంచానికి నోచుకోక..నాలుగుగోడల మధ్య అపరాధులుగా కాలం వెళ్లదీస్తున్న వారే. ఇలాంటివారిని జీవన స్రవంతిలో శిక్షాకాలం అనంతరం క్రమ శిక్షణ, స్వయం సాధికారత, ఆర్థిక స్వావలంబనతో ముందడుగు వేసేలా తీర్చిదిద్దుతోంది ఆ కారాగారం. వారి కాళ్లమీద వారు నిలబడే రీతిలో నైపుణ్యాలను నేర్పిస్తోంది. పేరుకు జైలైనప్పటికీ..ఖైదీల జీవితాలకు మేలు తలపించే కార్యక్రమాలను చేపడుతూ వారి భావిజీవితానికి బంగారు బాటలు వేస్తోంది. ఇంతకీ ఎక్కడుందీ ఆ జైలు..అక్కడి ఖైదీలకు నేర్పిస్తున్న జీవన పాఠాలేంటీ?



ఆరిలోవ: విశాఖపట్నం.. కేంద్ర కారాగారం..ఖైదీలకు చెరసాలే కాదు...పలు రకాల కర్మాగారాల నిలయం. వీటిలో శ్రమించి, అందుకు తగిన ప్రతిఫలం పొందేది బయటివారు కాదు. ఇక్కడ శిక్షను అనుభవిస్తున్న ఖైదీలే. సత్ప్రవర్తన అలవరిచేలా జైళ్ల శాఖ ఇక్కడి పరిశ్రమల్లో ఖైదీలకు చేతినిండా పని కల్పిస్తోంది. అటు ఖైదీలకు, ఇటు జైళ్ల శాఖ సంక్షేమ నిధికి ఆదాయ మార్గాలుగా ఈ కర్మాగారాలు నిలుస్తున్నాయి.

చీపుళ్ల నుంచి బేకరీ ఉత్పత్తుల దాకా...

ఇక్కడ ఇళ్లు ఊడ్చుకొనే చీపుర్ల నుంచి కుర్చీలు, టేబుళ్ల వరకు తయారవుతున్నాయి. స్టీల్ పరికరాలు, వ్యవసాయం, పాడి పరిశ్రమ, బుక్ బైండింగ్, చేనేత బట్టలు, బేకరీ ఉత్పత్తులను తయారు చేస్తుంటారు. కర్మాగారాల్లో ఖైదీలే కార్మికులుగా కనిపిస్తారు. వారు జైల్లో శిక్ష అనుభవిస్తున్నామనే భావం లేకుండా, ఆడుతూ పాడుతూ పనిచేసుకుపోతున్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండించడం, నాణ్యమైన వస్తువుల రూపకల్పనలో నిమగ్నమవుతారు.

జైల్లో ఉన్న కర్మాగారాలతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2 కోట్ల విలువైన ఉత్పత్తులను ఇక్కడి ఖైదీలు తయారు చేశారు. జైల్‌లో వినియోగించగా మిగిలిన వాటిని బయట విక్రయిస్తున్నారు. అలాగే రాష్ట్రం లోని ఇతర జైళ్లకు సరఫరా చేస్తున్నారు.



ఉత్పత్తులు.. ఆదాయమార్గాలు

ఇక్కడ సుమారు 200 మంది ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నారు. వీరంతా వారి శక్తి సామర్థ్యాల మేరకు పరిశ్రమల్లో పని చేస్తున్నారు. పని ఆధారంగా వేతనాలు చెల్లిస్తారు. విడుదల సమయంలో ఆ నగదును వారికి అందిస్తారు.

- స్టీల్ యూనిట్‌లో బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు, బీరువాలు, ఆస్పత్రుల్లో వినియోగించే పడకలు, ర్యాక్స్, పాఠశాల విద్యార్థులు కూర్చునే బెంచీలను తయారు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు వాటిని ముందుగానే బుక్ చేసుకుంటాయి.
- ఇక్కడ సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తారు. మామిడి, కొబ్బరి ఉత్పత్తవుతోంది. వీటిని ఖైదీలకు వినియోగించగా మిగిలినవి సుధార్ కేంద్రంలో బయటి వ్యక్తులకు విక్రయించడం ద్వారా లాభం చేకూరుతోంది.
- పాడి విషయానికి వస్తే..మేలు జాతి రకాలకు చెందిన 14 ఆవులు, 10 గేదెలున్నాయి. వాటి నుంచి వచ్చిన పాలను ఖైదీలకు వినియోగిస్తున్నారు. –జైల్లో బేకరీ ఉత్పత్తులకు వీటి పాలే వాడతారు.
- చేనేత యూనిట్లో బెడ్ షీట్స్, తువ్వాళ్లు తయారు చేస్తారు. వీటిని ఖైదీలకు వినియోగించగా మిగిలినవి సుధార్ కేంద్రంలో విక్రయిస్తున్నారు.
- టైలరింగ్ యూనిట్‌లో టీ–షర్ట్స్, షార్ట్స్ తయారవుతున్నాయి.
- బుక్ బైండింగ్ యూనిట్‌లో పుస్తకాలకు ఎక్కువగా కోర్టుల నుంచి ఆర్డర్లు వస్తుంటాయి.
- డర్రీ యూనిట్లో తయారైన రగ్గులు, తివాచీలను ఖైదీలకు, గార్డింగ్ సిబ్బందికి సరఫరా చేస్తున్నారు.
- బేకరీ ఉత్పత్తులను ఖైదీలను కలుసుకునేందుకు వచ్చిన వారికి విక్రయిస్తుంటారు.

ఆదాయార్జనలో అంతకుమించి..

జైలులో పలు రంగాల ఉత్పత్తుల ద్వారా ఆదాయార్జనలో ఏటికేడు కేంద్ర కారాగారం తనదైన శైలిలో ముందడుగు వేస్తోంది. 2006 నాటి ఆదాయంతో పోల్చి చూస్తే 19 ఏళ్ల కాలంలో పదిరెట్ల పురోగతితో దూసుకుపోతోంది.

ఆదాయార్జన గణాంకాలివీ..

సంవత్సరం	ఆదాయం (రూ. లలో)
2006	20లక్షలు
2015	40లక్షలు
2016	1.30 కోట్లు
2017	1.40 కోట్లు
2020	1.60 కోట్లు
2024	2.01 కోట్లు

ఈ విభాగాల్లో అత్యధిక ఉత్పత్తి..

కారాగారంలో ఉన్న యూనిట్లలో అత్యధిక ఉత్పత్తిలో స్టీల్ పరికరాల యూనిట్ మొదటి వరసలో ఉంది. తర్వాతి స్థానాల్లో బేకరీ, చేనేత, వ్యవసాయ క్షేత్రాలున్నాయి. ఈ నాలుగు యూనిట్ల ద్వారా 2024–25 సంవత్సరంలో రూ 1.71 కోట్ల విలువైన ఉత్పత్తులు వచ్చాయి. విభాగం వారీ ఉత్పత్తి, వాటి విలువను చూస్తే...(కింది గణాంకాలను పట్టికలో వేసుకోవాలి)

విభాగం	ఉత్పత్తుల విలువ (రూ.లలో)	జైలుకు సమకూరిన ఆదాయం (రూ. లక్షల్లో)
స్టీల్ పరికరాలు	1.35 కోట్లు	17
బేకరీ	15.30 లక్షలు	.20
చేనేత	15 లక్షలు	1.60
వ్యవసాయం	5.80 లక్షలు	1.20
ఇతరములు	28.90 లక్షలు	5.70





జైల్లో ఉన్నా.. కుటుంబాలకు అండగా..

జైల్లో శిక్ష అనుభవిస్తున్న కాలంలో ఖైదీలకు చేతినిండా పని ఉంటుంది. జైల్లో ఉన్నప్పటికీ వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేలా ఆదాయం సమకూరుస్తున్నాం. వారికి ఆదాయ మార్గాలను పెంచుతాం. తయారీ రంగాల్లో ఉత్పత్తులను మరింత పెంచే దిశగా ప్రణాళిక రచిస్తున్నాం.



– ఎం.మహేష్‌బాబు, పర్యవేక్షణాధికారి, విశాఖ కేంద్రకారాగారం

దవనం.. ఇదో సుగంధ మొక్క .. పువ్వులతో పాటే కట్టేటప్పుడు ఈ దవనం రెమ్మల్ని కలుపుతుంటాం. దీనివలన పూలవాసనకు దవనం తోడై మరింత పరిమళం వెదజల్లుతుంది.. ఈ దవనం నుంచి అత్తరు, సెంట్లు, బాడీస్ప్రేలలో వినియోగించడం బాగా ఎక్కువ అయింది..ఫలితంగా దవనం పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది. ఈ స్వల్పకాలిక పంట సాగు చేసి పెద్ద పెట్టుబడులు పెట్టకుండానే రైతులను లాభాల వైపు నడిపిస్తుండడంతో చిత్తూరు జిల్లాలో ఎక్కువ మంది రైతులు దవనం సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

రైతులకు ధ(వ)నం!



బైరెడ్డిపల్లి : పాతపేటలో సాగైన దవనం పంట (ఫైల్), (ఇన్‌సెట్‌లో) పరిశ్రమలో తయారైన దవనం నూనె

- చిత్తూరు జిల్లాలో విభిన్నంగా 'దవనం' సాగు
- ఎర్రటి నేలలు పంట సాగుకు అనుకూలం
- ఆకు కిలో రూ.40 దాకా అమ్మకాలు
- నూనె రూ.45 వేలు పలుకుతున్న వైనం
- అన్నదాతను ఆదుకునే లాభాల పంటగా పేరు

పలమనేరు : చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాల్లో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలైన కూరగాయల వైపు దృష్టి సారించారు. కానీ వాటికి సైతం ఎప్పుడు ధరలుంటాయో? కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.. దీంతో కాస్త విభిన్నంగా ఆలోచించిన కొంత మంది రైతులు సుగంధ పంట అయిన దవనాన్ని సాగు చేయడం కొన్నేళ్లుగా చేస్తున్నారు. పెద్దగా పెట్టుబడి లేకుండా ఎకరానికి నికరంగా రూ.50 వేల దాకా ఆదాయం దక్కుతుండడంతో పలువురు రైతులు దవనం సాగుపై ఆసక్తిని పెంచుకుంటున్నారు. ఇది స్వల్పకాలికంగా మూడు నెలల పంట కావడం, సాగునీరు పెద్దగా అవసరం ఉండదు. పురుగు మందులు, కూలీల సమస్య లేనందున కచ్చితంగా లాభాలు దక్కుతాయనే మాట రైతుల్లో వినిపిస్తోంది.

సాగు ఎలాగంటే..

దవనం ఏకవార్షిక పంట. వృక్షశాస్త్రం ప్రకారం ఆస్టరేసీ కుటుంబానికి చెందిన సువాసన మొక్క. దీని పంట కాలం కేవలం 80 రోజులు మాత్రమే. ఇది ఈ ప్రాంతంలో శీతాకాలంలో సాగు చేస్తుంటారు. తక్కువ ఉష్ణోగ్రత కలిగిన పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లోని ఎర్రమట్టి నేలలు దీనికి అనుకూలం. ముఖ్యంగా అక్టోబరులో దుక్కిళ్లు సిద్ధం చేసుకొని నవంబరులో పంటసాగు చేస్తే ఫిబ్రవరికి పంట చేతికొస్తుంది. ఎకరా పొలానికి 600 గ్రాముల విత్తనాలను కొని దానికి పదిరెట్ల ఇసుకను కలిపి తడి గుడ్డలో మూటకట్టి మూడు రోజుల తర్వాత పొలంలో చల్లాలి. ఎకరానికి రూ.6 వేలు ఖర్చుతో పంట వచ్చాక కిలో ఆకులు రూ.40 నుంచి రూ.50 దాకా పలికినా ఎకరానికి రూ.45 వేల నుంచి రూ.50 వేల దాకా రాబడి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆయిల్ పరిశ్రమలకు భలే డిమాండ్

ఈ ప్రాంతానికి సమీపంలోని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి, సేలం, కర్ణాటకలోని బెంగళూరు, చిక్‌బళ్లాపూర్, దొడ్డనేకుక్కంది, సర్జాపురలో దవనం ఆయిల్ పరిశ్రమలున్నాయి. దీంతో అక్కడి ఏజెంట్లు ఇక్కడి తోటలను పంట మీదుగానే కొని రైతులకు డబ్బు చెల్లించి పరిశ్రమలకు తరలిస్తుంటారు. దీంతో రైతులకు రవాణా చార్జీలు మిగిలినట్టే. ఇక మార్కెటింగ్ సౌకర్యం ఉండడంతో ఆశావాహులైన రైతులు దవనం సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

దవనం సాధారణంగా పూలహారాల మధ్యలో సువాసన కోసం వాడుతుంటారు. దీని నూనెను సుగంధ పరిమళాల కోసం ఉపయోగించే సెంటు, అత్తర్, పలు బాడీ స్ప్రేలకు వాడుతున్నారు. దీంతోపాటు కొన్ని ఔషధాల తయారీకి దవనాన్ని వినియోగిస్తుంటారు. దీంతో అక్కడ నూనెకు డిమాండ్ ఉండడంతో ఇక్కడ రైతులకు దవనం గిట్టుబాటుగా మారింది.


సేంద్రియ పద్ధతిలో సాగు చేశా



నేను ఎకరా పొలంలో గతంలో దవనం పంటను సేంద్రియ పద్ధతిలో సాగు చేశా. ఎలాంటి పురుగు మందులు వాడలేదు. కేవలం దుక్కిలో ఆవు పేడ ఆపై బీజామృతం, వేప నూనె లాంటివి మాత్రమే వాడాను. ఎర్రటి నేలల్లో తక్కువ ఉష్ణోగ్రతలున్న ప్రాంతంలో దవనాన్ని సాగు చేసుకోవచ్చు. సేంద్రియ పద్ధతిలోనే ఎక్కువ పంట ఉత్పత్తిని పెంచి లాభాలు సాధించా.

– ఉమ, మహిళా రైతు, పాతపేట

చల్లటి వాతావరణంలో సాగు చేయవచ్చు



జిల్లాలో చల్లటి ప్రదేశాలైన పలమనేరు, కుప్పం, పుంగనూరులో ఎర్రటినేలలు దవనం సాగుకు అనుకూలంగా ఉంటాయి. శీతాకాలంలో ఈ పంట సాగవుతుంది. పెద్దగా పెట్టుబడి లేకుండా నికర లాభాలు పొందాలనుకునే రైతులు దీన్ని సాగు చేసుకోవచ్చు. అయితే ముందుగా పరిశ్రమ వారితో ఒప్పందం చేసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

– డా.కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు




శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,327 మంది స్వామి వారిని దర్శించుకోగా 26,354 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.73 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బంగారు తిరుచ్చిపై శ్రీనివాసుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, వైఖానస ఆగమోక్తంగా దేవేరుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసులు తన దేవేరులతో కలసి వాహన మండపం వద్దకు చేరుకున్నారు. బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తరలించి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను చేపట్టారు.

రత్నగిరిపై రద్దీ

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సత్యదేవుడిని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి, పూజలు చేశారు. దీంతో రత్నగిరిపై పెద్ద ఎత్తున రద్దీ ఏర్పడింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని మొత్తం 40 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 1,600 నిర్వహించారు.


● అజిత్

అందరి చూపు... టాలీవుడ్ వైపు...

- తెలుగు సినిమాల్లో హీరోలుగా పరభాషల నటులు
- టాలీవుడ్‌పై దృష్టి సారిస్తున్న ఇతర ఇండస్ట్రీ టాప్ హీరోలు

తెలుగు సినిమాల సౌండ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప' వంటి సినిమాల కారణంగా అంతర్జాతీయంగా కూడా తెలుగు సినిమాకు ఆదరణ లభిస్తోంది. దీంతో దేశంలోని అన్ని ఇండస్ట్రీల చూపు ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమవైపే. అందుకే తెలుగు పరిశ్రమ నుంచి అవకాశం వస్తే చాలు, సినిమాకు సై అంటున్నారు కొందరు పరభాషల హీరోలు. ఇటు తెలుగు నిర్మాతలు కూడా పరభాషల హీరోలతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇలా తెలుగు దర్శక-నిర్మాతలతో సినిమాలు చేస్తున్న కొందరు హీరోల గురించి తెలుసుకుందాం.


● ధనుష్


● సూర్య
● కార్తీ

ముందుగా కోలీవుడ్‌లోకి తొంగి చూస్తే...

గుడ్ బ్యాడ్ అగ్లీ

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ లేటెస్ట్ మూవీ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ఈ మాస్ యాక్షన్ ఫిల్మ్‌కు 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించారు. త్రిష హీరోయిన్‌గా, సునీల్, ప్రసన్న, ప్రభు, యోగిబాబు, జాకీ ష్రాఫ్... ఇలా మరికొందరు ప్రముఖ ఆర్టిస్టులు ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఈ నెల 10న విడుదల కానుంది. అజిత్ సినిమాలను తెలుగు ఆడియన్స్ చాలా దగ్గరగా ఫాలో అవుతుంటారు. ఇటీవల వచ్చిన అజిత్ మూవీ 'విడాముయర్చి' ('పట్టుదల') ఆడియన్స్‌ను నిరాశపరిచింది. దీంతో అజిత్ నుంచి రానున్న తాజా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఎలా ఉంటుందనే విషయంపై ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొని ఉంది.

డబుల్ ధమాకా

సూర్య అంటే చాలు... మన తెలుగు హీరోయే అన్నట్లుగా ఉంటుంది. అందుకేనేమో... ఈసారి రెండు స్ట్రయిట్ తెలుగు సినిమాలు చేయాలని సూర్య నిర్ణయించుకున్నట్లున్నారు. సూర్య స్ట్రయిట్ తెలుగు మూవీ చేసి కూడా చాలా కాలం అయ్యింది. దీంతో సూర్య తెలుగులో చేసే డైరెక్ట్ మూవీపై ఆడియన్స్‌లో ఆసక్తి ఉండటం సహజం. కాగా 'సార్, లక్కీ భాస్కర్' వంటి వరుస బ్లాక్ బస్టర్స్ అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి ఇటీవల సూర్యకు ఓ కథను వినిపించగా, ఈ హీరో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఈ మూవీలోని హీరోయిన్ పాత్రకు భాగ్యశ్రీ భోర్సే, మమితా బైజు వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రానుందని, ఇదొక పీరియాడికల్ డ్రామా అని ఫిల్మ్‌నగర్ సమాచారం. వెంకీ అట్లూరి డైరెక్షన్‌లోని 'సార్, లక్కీ భాస్కర్' సినిమాలను నిర్మించిన సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థయే (నాగవంశీ, సాయి సౌజన్య), సూర్య-వెంకీ అట్లూరి కాంబినేషన్‌లోని సినిమానూ నిర్మించనుందని తెలిసింది.

ఇంకా 'కార్తికేయ, కార్తికేయ 2', ఇటీవల 'తండేల్'తో సూపర్ సక్సెస్ అందుకున్న దర్శకుడు చందు మొండేటి ఆ మధ్య సూర్యకు ఓ కథ వినిపించారు. ఈ కథ సూర్యకు నచ్చిందని, భవిష్యత్‌లో సూర్యతో తాను సినిమా చేస్తానని 'తండేల్' సినిమా ప్రమోషన్స్‌లో చందు మొండేటి వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే చందు మొండేటి ప్రస్తుతం నిఖిల్‌తో చేయాల్సిన 'కార్తికేయ 3' స్క్రిప్ట్ వర్క్స్‌పై బిజీగా ఉన్నారట. సో... సూర్య తెలుగు మూవీ ముందుగా వెంకీ అట్లూరితోనే మొదలు కానుందని తెలిసింది. ఈ మూవీ ఈ ఏడాదే ప్రారంభం అవుతుంది. ఇలా సూర్య తెలుగు ఆడియన్స్‌కు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు.

కుబేర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి చేసిన సినిమా 'సార్' (తమిళంలో 'వాత్తి'). సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఆ తర్వాత వెంటనే తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ములతో మూవీ చేసేందుకు ధనుష్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'కుబేర' టైటిల్‌తో రూపొందుతున్న ఈ మూవీలో నాగార్జున మరో లీడ్ రోల్‌లో నటిస్తుండగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా చేస్తున్నారు. ఆల్మోస్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ బాహు భాషా చిత్రం జూన్ 20న విడుదల కానుంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై పుస్కూర్ రామ్మోహన్‌రావు, సునీల్ నారంగ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'కుబేర' తర్వాత మరో తెలుగు సినిమా చేసేందుకు కూడా తెలుగు దర్శక-నిర్మాతల నుంచి ధనుష్‌కు ఫోన్ కాల్స్ వెళ్తున్నాయని సమాచారం.

కార్తీ హిట్ 4

తెలుగు ఆడియన్స్‌లో కార్తీకి మంచి క్రేజ్ ఉంది. కార్తీ తమిళ చిత్రాలు తెలుగులో అనువాదమై, తెలుగు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు కలెక్ట్ చేస్తుంటాయి. కాగా 2016లో నాగార్జునతో కలిసి కార్తీ 'ఊపిరి' అనే ద్విభాషా (తెలుగు, తమిళం) సినిమా చేశారు. ఆ తర్వాత ఎందుకో కానీ స్ట్రయిట్ తెలుగు మూవీ మళ్లీ చేయలేదు. రెండు మూడేళ్ల క్రితం కార్తీకి ఓ కథ వినిపించారట తెలుగు దర్శకుడు పరశురామ్. ఈ సినిమాకు 'రెంచ్ రాజు' అనే టైటిల్ కూడా అనుకున్నారనే ప్రచారం సాగింది. ఎందుకో కానీ ఈ మూవీ సెట్స్‌కు వెళ్లలేదు. కానీ ఇప్పుడు కార్తీ తెలుగు స్ట్రయిట్ మూవీకి సమయం వచ్చింది. తెలుగు హిట్ ఫ్రాంచైజీ 'హిట్' సిరీస్‌లో భాగం కానున్నారు కార్తీ. శైలేష్ కొలను దర్శకత్వంలో కార్తీ హీరోగా 'హిట్ 4' రూపొందనుందని, ఈ మూవీని నాని నిర్మిస్తారని సమాచారం. ఇక నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలోని 'హిట్ 3' మే 1న విడుదల కానుంది. ఈ 'హిట్ 3' క్లైమాక్స్‌లో 'హిట్ 4' సినిమాలో కార్తీ నటించనున్నారన్న విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తారట మేకర్స్. ఇంకా ఓ తెలుగు హారర్ ఫ్రాంచైజీ మూవీలోని కీలక పాత్రకు కార్తీని సంప్రదించగా, ఆయన అంగీకారం తెలిపారని తెలిసింది.

హ్యాట్రిక్ హిట్

తమిళ యువ నటుడు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' మూవీ ఇటీవల విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు ముందు ప్రదీప్ చేసిన మూవీ 'లవ్ టుడే'. ఈ చిత్రం కూడా బ్లాక్‌బస్టర్. 'లవ్ టుడే', 'డ్రాగన్' (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్')... ఈ రెండు చిత్రాలూ తెలుగులో అనువాదమై, ఇక్కడి యూత్ ఆడియన్స్‌ను అలరించాయి. ఇప్పుడు తెలుగు ఆడియన్స్ ముందుకు డైరెక్ట్ తెలుగు మూవీతో వస్తున్నారు ప్రదీప్. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాను తెలుగులో విడుదల చేసిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రదీప్ రంగనాథన్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ ద్విభాషా చిత్రాన్ని నిర్మిస్తోంది. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా చేస్తున్న ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ న్యూజ్ స్టోరీ ఈ ఏడాదే స్క్రీన్‌పైకి రానుంది. ఈ సినిమా కూడా విజయం సాధిస్తే, ప్రదీప్ నటుడిగా హ్యాట్రిక్ హిట్ సాధించినట్లే... ఇలా తెలుగు దర్శక-నిర్మాతలతో సినిమాలు చేయడానికి సిద్ధమైన, ప్రయత్నాలు చేస్తున్న కోలీవుడ్ స్టార్ హీరోలు మరి కొంతమంది ఉన్నారు.


● సన్నీ డియోల్

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమాలు సత్తా చాటుతున్నాయి. బాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డ్స్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్ టెన్ మూవీస్‌లో 'బాహుబలి, పుష్ప, ఆర్‌ఆర్‌ఆర్' వంటి సినిమాలు ఉండటమే ఇందుకు ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. దీంతో బాలీవుడ్ దృష్టి కూడా టాలీవుడ్‌పై ఉంది. బాలీవుడ్ హీరోలు తెలుగు దర్శక-నిర్మాతల అవకాశాలకు నో చెప్పలేకపోతున్నారు. 'గద్దర్ 2' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత సన్నీ డియోల్ తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని డైరెక్షన్‌లోని 'జాట్' సినిమాలో హీరోగా చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఇంకా ప్రభాస్ హీరోగా చేస్తున్న 'కల్కి 2898 ఏడీ' మూవీలో అమితాబ్ బచ్చన్ ఓ లీడ్ రోల్ చేసిన విషయం తెలిసిందే. నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లోని ఈ మూవీని సి. అశ్వనీదత్ నిర్మించారు. కాగా 'కల్కి 2' కూడా ఉందని ఇటీవల స్పష్టం చేశారు నాగ్ అశ్విన్. సో... 'కల్కి 2'లోనూ అమితాబ్ బచ్చన్ రోల్ మంచి ప్రియారిటీతో కొనసాగవచ్చని ఊహించవచ్చు. ఇంకా సల్మాన్ ఖాన్ హీరోగా హరీష్ శంకర్ డైరెక్షన్‌లో ఓ మూవీ రానుందనే టాక్ ఇటీవల వినిపించిన సంగతి తెలిసిందే. ఈ సినిమానూ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అలాగే తెలుగులో సినిమా చేసేందుకు ఆమిర్ ఖాన్ సైతం ఆసక్తి చూపిస్తున్నారని తెలిసింది. ఆమిర్ ఖాన్ హీరోగా లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లో ఓ మూవీ రానుందని, మైత్రీ మేకర్స్ నిర్మించనుందని గతంలో వార్తలొచ్చాయి. ఇంకా దర్శకుడు వంశీ పైడిపల్లి కథతో అమిర్ ఖాన్‌తో ఓ మూవీ చేసేందుకు 'దిల్' రాజు ప్రయత్నాలు చేస్తున్నారని టాక్. అంతేనా... 'గజినీ'కి సీక్వెల్‌గా 'గజినీ 2'ను ఆమిర్ ఖాన్‌తో తీసే ఆలోచనలో అల్లు అరవింద్ ఉన్నారన్న ప్రచారం ఇటీవల తెరపైకి వచ్చింది. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం రావాలి. ఇలా హిందీలో హీరోగా చేస్తూ, తెలుగు సినిమాల్లో హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్న హిందీ నటుల సంఖ్య ఈ ఏడాది ఎక్కువగానే ఉంది.


● ప్రదీప్ రంగనాథన్


● గణేశ్

'కాంతార' సినిమాతో ఒక్కసారిగా పాన్ ఇండియా స్టార్ అయిపోయారు రిషబ్ శెట్టి. ప్రస్తుతం 'కాంతార' ప్రీక్వెల్ పనులతో బిజీగా ఉన్నారు రిషబ్ శెట్టి. అలాగే ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా బ్లాక్‌బస్టర్ మూవీ 'హను-మాన్'కు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ 'జై హనుమాన్' మూవీకి ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తుండగా, రిషబ్ శెట్టి మెయిన్ లీడ్ రోల్ అయిన హనుమాన్‌గా చేస్తున్నారు. భారీ స్థాయిలో ఈ మూవీ రూపొందనుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. 2027 సంక్రాంతికి 'జై హనుమాన్' మూవీ రిలీజ్ ఉండొచ్చు. అలాగే కన్నడ స్టార్ హీరో గణేశ్ తెలుగులో 'పినాక' అనే హారర్ ఫిల్మ్ చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కొరియోగ్రాఫర్ బి. ధనంజయ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అలాగే కన్నడ యువ నటుడు శ్రీమురళి హీరోగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ సినిమాను నిర్మించనుంది. గత ఏడాది శ్రీమురళి బర్త్ డే (డిసెంబరు 17) సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. కన్నడ హీరో ధనంజయ 'పుష్ప'లో ఓ లీడ్ రోల్ చేశారు. అలాగే ఇతను హీరోగా తెలుగు, తమిళ భాషల్లో 'జీబ్రా' అనే మూవీ వచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ 'పెద్ది' మూవీలో ఓ కీలక పాత్ర చేస్తున్నారు. రామ్‌చరణ్ హీరోగా చేస్తున్న ఈ మూవీకి బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఇలా తెలుగులో సినిమాలు చేస్తున్న కన్నడ నటుల జాబితా ఇంకా ఉంది.


● దుల్కర్ సల్మాన్

'మహానటి (కీర్తీ సురేష్ మెయిన్ లీడ్ రోల్), సీతారామం' ఇటీవల 'లక్కీ భాస్కర్'... ఇలా వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరవుతున్నారు దుల్కర్ సల్మాన్. ఈ సినిమాల వరుస విజయాలు చాలు... దుల్కర్‌ను తెలుగు ఆడియన్స్ ఎంత ఓన్ చేసుకున్నారో చెప్పడానికి. ఇప్పుడు దుల్కర్ రెండు తెలుగు సినిమాలు చేస్తున్నారు. అందులో ఒకటి 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వంలోని ఈ మూవీని గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్, లైట్‌బాక్స్ మీడియా సంస్థలు నిర్మిస్తున్నాయి. దుల్కర్ సల్మాన్ రైతుగా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం గోదావరి జిల్లాల పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. అలాగే దుల్కర్ హీరోగా నటించిన మరో మూవీ 'కాంత'. 1950 టైమ్‌లో మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ మూవీకి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. రానా ఈ సినిమాకు ఓ నిర్మాతగా ఉన్నారు. భాగ్యశ్రీ బోర్సే ఓ కథనాయికగా నటించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ పీరియాడికల్ ఫిల్మ్ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఇక అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాతో తెలుగుకి వచ్చారు ఫాహద్ ఫాజిల్. మలయాళంలో హీరోగా చేస్తున్న ఫాహద్ తెలుగులోనూ 'ఆక్సిజన్, డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాల్లో హీరోగా చేస్తున్నారు. 'ఆక్సిజన్' సినిమాకు ఎన్. సిద్ధార్థ్ దర్శకత్వం వహిస్తుండగా, 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'కి శశాంక్ ఏలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను ఆర్కా మీడియాపై రాజమౌళి తనయుడు కార్తికేయ నిర్మిస్తున్నారు. ఇంకా మలయాళ ప్రముఖ దర్శక-నిర్మాత-నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రస్తుతం మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి డైరెక్షన్లోని మూవీలో ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. అలాగే మలయాళ యంగ్ హీరో టొవినో థామస్ కూడా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లోని 'డ్రాగన్' మూవీలో ఓ రోల్ చేస్తున్నారు. ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న ఈ మూవీలో టొవినో విలన్‌గా నటిస్తారని తెలిసింది. ఈ విధంగా మలయాళంలో హీరోగా చేస్తూ, తెలుగులోనూ హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్న మలయాళ హీరోల లిస్ట్ ఇంకా ఉంది.

– ముసిమి శివాంజనేయులు


● ధనుష్

ఇడ్లీ కొట్టు వాయిదా


ధనుష్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు) సినిమా విడుదల వాయిదా పడింది. ఈ చిత్రాన్ని ఈ నెల 10న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం తొలుత ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే అక్టోబర్ 1న విడుదల కానున్నట్లు పేర్కొన్నారు మేకర్స్. ఈ చిత్రంలో ధనుష్‌కి జోడీగా నిత్యా మీనన్ నటించారు. ధనుష్, ఆకాష్ భాస్కరన్ ఈ మూవీ నిర్మించారు. ఈ చిత్రం కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తూ, ధనుష్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఇదిలా ఉంటే.. 'తిరు' (2022) సినిమా తర్వాత ధనుష్-నిత్యా మీనన్ నటించిన రెండో చిత్రం 'ఇడ్లీ కడై'. ఈ సినిమాలో అరుణ్ విజయ్, ప్రకాశ్‌రాజ్, షాలినీ పాండే కీలక పాత్రల్లో నటించారు. కాగా ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కానందునే వాయిదా వేశారని కోలీవుడ్ టాక్.

మహాకాళిలో...

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ)లో భాగంగా వచ్చిన 'హనుమాన్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ యూనివర్స్‌లో రెండో చిత్రంగా 'జై హనుమాన్' రూపొందుతోంది. అలాగే మరో మూవీగా 'మహాకాళి' సినిమా తెరకెక్కనుంది. ఆర్‌కేడీ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా ఓ లీడ్ రోల్ చేయనున్నట్లు శనివారం చిత్రయూనిట్ ప్రకటించింది. ''ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో 'మహాకాళి' సినిమా పౌరాణిక ఇతివృత్తాలను, వినూత్నమైన సూపర్ హీరో కథలను బ్లెండ్ చేస్తుంది. ఈ మూవీకి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.


● అక్షయ్ ఖన్నా

మేలో థ్రిల్


● నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా నటించిన తెలుగు, తమిళ చిత్రం 'హ్యాష్‌ట్యాగ్ లెవెన్'. డైరెక్టర్ సుందర్ సి. వద్ద 'కలకలప్పు 2, వందా రాజావా దాన్ వరువేన్, యాక్షన్' వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా చేసిన లోకేశ్ అజ్లస్ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. రేయా హరి కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అభిరామి, రవి వర్మ, కిరీటి దామరాజు కీలక పాత్రలు పోషించారు. ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన ఈ సినిమాను మే 16న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, నవీన్ చంద్ర పోస్టర్ విడుదల చేశారు. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హ్యాష్‌ట్యాగ్ లెవెన్'. ఈ మూవీ ప్రేక్షకులకు వైవిధ్యమైన అనుభూతిని పంచుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: డి. ఇమ్మాన్, కెమేరా: కార్తీక్ అశోకన్.

బిజినెస్ రీల్

ఐటీసీ ఆశీర్వాద్ మసాలాస్‌కు ప్రచారకర్తగా నాని



హైదరాబాద్: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీకి చెందిన ఆశీర్వాద్ మసాలాస్ బ్రాండ్‌కి ప్రచారకర్తగా ప్రముఖ టాలీవుడ్ నటుడు నాని నియమితులయ్యారు. ఈ సందర్భంగా 'దమ్ము మీదే, స్టార్ మీరే' పేరిట కంపెనీ కొత్త టీవీ ప్రచార ప్రకటనను రూపొందించింది. తెలుగు వారికి మరింత చేరువయ్యేందుకు ఇది తోడ్పడగలదని ఐటీసీ బిజినెస్ హెడ్ (స్పైసెస్) పీయుష్ మిశ్రా తెలిపారు. టీవీతో పాటు యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర డిజిటల్ ప్లాట్‌ఫాంలలో కూడా ఈ ప్రకటనలు ప్రసారమవుతాయని పేర్కొన్నారు. ఆశీర్వాద్ మసాలాస్‌తో జట్టు కట్టడంపై నాని సంతోషం వ్యక్తం చేశారు.

టాన్లో ఇమేజింగ్ రూ. 175 కోట్ల సమీకరణ

బెంగళూరు: డిఫెన్స్ టెక్నాలజీలను రూపొందించే టాన్లో ఇమేజింగ్ తాజాగా రూ. 175 కోట్లు సమీకరించింది. తమ పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో భాగంగా డీ–సిరీస్ కింద ఫ్లోరిన్‌ట్రీ అడ్వైజర్స్, టెనాసిటీ వెంచర్స్, ఎగ్జిమ్ బ్యాంక్ తదితర సంస్థల నుంచి ఈ మొత్తాన్ని సేకరించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు అరవింద్ లక్ష్మీకుమార్ తెలిపారు. ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు, అత్యంత శక్తిమంతమైన మైక్రోవేవ్ టెక్నాలజీస్ మొదలైన వాటిని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే క్వాల్‌కామ్, ఆర్టిమాన్ వంటి ఇన్వెస్టర్ల నుంచి రూ. 300 కోట్లు సమకూర్చుకున్నట్లు వివరించారు. భారత రక్షణ శాఖ, నాటో, అమెరికా నేవీ సీల్స్ సహా 30 దేశాల రక్షణ బలగాలకు సేవలు అందిస్తున్నట్లు అరవింద్ చెప్పారు.

బ్యాటరీ ఎలక్ట్రిక్‌తో ఈవీ91తో జట్టు

చెన్నై: బీ2బీ ద్విచక్ర ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ అందించే బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్, ఫైనాన్సింగ్ సేవల సంస్థ ఈవీపీఈలతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎలక్ట్రిక్ వాహనాల అగ్రిగేటర్ సంస్థ ఈవీ91 టెక్నాలజీస్ తెలిపింది. కార్పొరేట్ క్లయింట్లు తదితర వర్గాలకు 10,000 ఈవీలను అందుబాటులోకి తెచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించింది. ఇప్పటివరకు 1,000 వాహనాలకు ఆర్డర్లు ఇచ్చినట్లు పేర్కొంది. 2023–24లో బెంగళూరు, చెన్నైలో 107 వాహనాలతో ప్రారంభించిన ఈవీ91 టెక్నాలజీస్.. 24–25లో 800 పైగా వాహనాలను ప్రవేశపెట్టింది. బ్యాటరీ ఎలక్ట్రిక్ తోడ్పాటుతో 2025–26లో దీన్ని 10,000కు చేర్చుకోనున్నట్లు సంస్థ తెలిపింది.

ఎన్ఎస్‌డీఎల్ లిస్టింగ్‌కు గడువు పెంపు

జులై 31వరకూ అనుమతించిన సెబీ



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్)కు వెసులుబాటు లభించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా 2025 జులై 31వరకూ గడువు పెంచింది. ఎన్ఎస్‌డీఎల్ అభ్యర్థనమేరకు గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయ్యేందుకు మరింత గడువును సెబీ అనుమతించింది. దీంతో మార్కెట్ల పరిస్థితులు అనుకూలించేటంతవరకూ కంపెనీ లిస్టింగ్‌కు వెసులుబాటు లభించింది. నిజానికి 2024 సెప్టెంబర్‌లోనే ఎన్ఎస్‌డీఎల్ ఐపీవోకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐపీవోలో భాగంగా ఎన్ఎస్‌డీఎల్ ప్రస్తుత వాటాదారులు ఎన్ఎస్ఈ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.72 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. దేశీయంగా తొలి సెక్యూరిటీల డిపాజిటరీగా కార్యకలాపాలు ప్రారంభించిన ఎన్ఎస్‌డీఎల్ 2024 సెప్టెంబర్‌కల్లా 6 ట్రిలియన్ డాలర్ల(సుమారు 500 లక్షల కోట్లు) విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది. కాగా.. 2017లోనే సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్(సీడీఎస్ఎల్) ఎన్ఎస్ఈలో లిస్ట్‌కావడం గమనార్హం!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-4-2025

విశాఖ	440–00
చిత్తూరు	470–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	430–00
విజయవాడ	440–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.99	$	66.95
బ్రెంట్	65.58	$	70.14

ఆఫీస్ స్పేస్‌లో గ్లోబల్ హవా..

లీజింగ్‌లో 62 శాతం వాటా
- 9 నగరాల అధ్యయనంలో వెల్లడి
- సీబీఆర్ఈ నివేదిక



న్యూఢిల్లీ: ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో గ్లోబల్ కార్పొరేట్ల జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి–మార్చి మధ్య కాలంలో విదేశీ సంస్థలు తొమ్మిది నగరాల వ్యాప్తంగా 111.60 లక్షల చ.అ. స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయి. మార్చి క్వార్టర్‌లో నమోదైన 180 లక్షల చ.అ. స్థలంలో ఇది సుమారు 62 శాతం. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం గతేడాది ఇదే వ్యవధిలో 171 లక్షల చ.అ. లీజింగ్ నమోదైంది. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్, కొచ్చి నగరాల్లో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఇటు దేశీ, అటు అంతర్జాతీయ సంస్థలు వ్యాపారాన్ని విస్తరిస్తుండటంతో లీజింగ్ కార్యకలాపాలు మరింతగా పుంజుకునే అవకాశం ఉందని సీబీఆర్ఈ చైర్మన్ (ఇండియా, ఆగ్నేయాసియా) అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, దీర్ఘకాలిక వృద్ధిపై దృష్టితో కంపెనీలు నాణ్యమైన ఆఫీస్ స్పేస్‌లను కోరుకుంటున్నందున, పర్యావరణహిత కార్యాలయాలకు డిమాండ్ పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

తగ్గిన కో-వర్కింగ్ స్పేస్..

జనవరి–మార్చి త్రైమాసికంలో కో–వర్కింగ్ ఆపరేటర్లు.. ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకోవడం 43 శాతం తగ్గింది. తొమ్మిది ప్రధాన నగరాల్లో ఇది 21.6 లక్షల చ.అ.లకు పరిమితమైంది. గతేడాది ఇదే వ్యవధిలో కో–వర్కింగ్ ఆపరేటర్లు 37.6 లక్షల చ.అ. స్పేస్‌ను లీజుకు తీసుకున్నారు. కో–వర్కింగ్ సంస్థలు, ప్రాపర్టీ ఓనర్ల దగ్గర్నుంచి ఆఫీస్ స్పేస్‌ను అద్దెకు తీసుకుని, దాన్ని క్లయింట్లకు సబ్–లీజుకు ఇస్తుంటాయి. ఉయ్‌వర్క్ ఇండియా, స్మార్ట్‌వర్క్స్, ఇన్‌క్యుస్పేజ్, సింప్లీ వర్క్ ఆఫీసెస్, ఇండిక్యూబ్, లిస్టెడ్ సంస్థ ఆఫీస్ మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. కోవిడ్ అనంతరం కో–వర్కింగ్ వర్క్‌స్పేస్‌కు డిమాండ్ గణనీయంగా పెరిగింది.

జీసీసీలకు డిమాండ్..

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు కూడా ఆఫీస్ స్పేస్‌కు దన్నుగా ఉంటోందని అన్షుమన్ తెలిపారు. కొత్త ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తన కోసం బహుళజాతి సంస్థలు స్థానికంగా నిపుణుల సేవలను వినియోగించుకోవడంపై ఆసక్తి కనపరుస్తుండటంతో జీసీసీలకు భారత్ చాలా వేగంగా గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని సీబీఆర్ఈ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రామ్ చంద్నానీ తెలిపారు. 2025లో మొత్తం ఆఫీస్ స్పేస్‌లో జీసీసీల వాటా సుమారు 35–40 శాతానికి చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, వివిధ రాష్ట్రాల్లో సానుకూల విధానాల కారణంగా చిన్న పట్టణాలకు కూడా విస్తరిస్తున్నాయని వివరించారు. జీసీసీల విషయంలో అమెరికన్ కంపెనీలదే ఆధిపత్యం ఉన్నప్పటికీ, యూరప్, ఆసియా కంపెనీలు కూడా ఇక్కడ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నాయని రామ్ చంద్నానీ చెప్పారు. నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉండటం వంటి అంశాలు ఇందుకు కారణమని పేర్కొన్నారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), టెక్నాలజీ రంగాల నుంచి ఇకపైనా డిమాండ్ గణనీయంగా కొనసాగుతుందని వివరించారు.

'అఫోర్డబుల్' అమ్మకాలు డౌన్..



ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో రూ. 50 లక్షల లోపు ధర ఉండే అఫోర్డబుల్ గృహాల అమ్మకాలు 9 శాతం క్షీణించినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ఎనిమిది ప్రధాన నగరాల్లో విక్రయాలు 21,010 యూనిట్లకు పరిమితమైనట్లు పేర్కొంది. ఇళ్ల ధరలు, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉండటం, సరఫరా తగ్గడం తదితర అంశాలు ఇందుకు కారణమని వివరించింది. నివేదిక ప్రకారం రూ. 50 లక్షల నుంచి రూ. 1 కోటి వరకు ఖరీదు చేసే రెసిడెన్షియల్ సెగ్మెంట్లో కూడా విక్రయాలు 6 శాతం తగ్గి 26,832 యూనిట్లకు క్షీణించాయి. మార్చి త్రైమాసికంలో ఎక్కువగా ప్రీమియం కేటగిరీపైనే గృహాల కొనుగోలుదారులు దృష్టి పెట్టినట్లు రిపోర్ట్ పేర్కొంది. రూ. 1 కోటి పైగా ఖరీదు చేసే ఇళ్ల అమ్మకాలు పెరగడం ఇందుకు నిదర్శనంగా వివరించింది. హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, చెన్నై తదితర 8 నగరాల్లో నిర్వహించిన అధ్యయన నివేదిక ప్రకారం ..

- రూ. 1–2 కోట్ల రేటు ఉన్న గృహాల విక్రయాలు 2 శాతం పెరిగి 22,330 యూనిట్లకు చేరాయి. అలాగే రూ. 2–5 కోట్ల కేటగిరీలో 28 శాతం వృద్ధి చెంది 13,735 యూనిట్లు, రూ. 5–10 కోట్ల విభాగంలో విక్రయాలు ఏకంగా 82 శాతం పెరిగి 3,448 యూనిట్లుగా నమోదయ్యాయి.
- రూ. 10–20 కోట్ల కేటగిరీలో అమ్మకాలు రెట్టింపై 658 యూనిట్లకు చేరాయి. రూ. 20–50 కోట్ల విభాగంలోనూ రెండు రెట్లు పెరిగి 92 యూనిట్లుగా నమోదయ్యాయి. రూ. 50 కోట్ల పైగా ఖరీదు చేసే ఇళ్ల అమ్మకాలు అనేక రెట్లు పెరిగి 169 యూనిట్లకు చేరాయి.
- 2 కోట్ల ధర శ్రేణిలోని ఇళ్ల అమ్మకాలు 2 శాతం పెరిగి 22,330 యూనిట్లకు చేరడం.

ఫిన్‌టెక్ సంస్థలకు పెట్టుబడుల జోష్..

2025లో 550 మిలియన్ డాలర్ల సమీకరణ
- భారీగా ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్స్
- లిస్టులో ఎపిస్, యాక్సెల్ తదితర సంస్థలు



ముంబై: దాదాపు రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న ఫిన్‌టెక్ రంగంలోకి పెట్టుబడులు మళ్లీ పుంజుకుంటున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. వెంచర్ ఇంటెలిజెన్స్ డేటా ప్రకారం 2025లో ఇప్పటివరకు వృద్ధి దశలో ఉన్న అంకుర సంస్థలు దాదాపు 550 మిలియన్ డాలర్లు సమీకరించాయి. మరికొన్ని డీల్స్ ముగింపు దశలో ఉన్నాయి. పీక్ ఫిఫ్టీన్ పార్ట్‌నర్స్, ఎపిస్, యాక్సెల్, మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్, ఎస్ఎంబీసీ గ్రూప్ లాంటి భారీ ఫండ్స్, ఫిన్‌టెక్‌లో భాగమైన వివిధ విభాగాల్లోని సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. నియంత్రణ నిబంధనలపరమైన అనిశ్చితి తగ్గడంతో రాబోయే రోజుల్లో ఫిన్‌టెక్ రంగంలో మరిన్ని డీల్స్ నమోదవుతాయని వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ వర్గాలు తెలిపాయి. ఫిన్‌టెక్ రంగంలోకి 2023, 2024లో కేవలం 1.3 బిలియన్ డాలర్లు మాత్రమే రాగా.. తాజాగా ఈ ఏడాది తొలి నాళ్లలోనే అర బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు రావడం సానుకూల పరిస్థితులను సూచిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు వివరించాయి.

వెల్త్‌టెక్‌కు ప్రాధాన్యం..

ఫండ్స్ పెట్టుబడుల్లో వెల్త్‌టెక్ విభాగానికి ఎక్కువగా ప్రాధాన్యం లభిస్తున్నప్పటికీ, పేమెంట్స్, బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లాంటి ఇతరత్రా విభాగాలకు కూడా గత మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో గ్రోత్ స్టేజ్ పెట్టుబడులు మెరుగ్గానే లభిస్తున్నాయి. బెంగళూరుకు చెందిన క్యాష్‌ఫ్రీ సంస్థ ఫిబ్రవరిలో 43 మిలియన్ డాలర్లు సమకూర్చుకుంది. అలాగే, టోన్‌ట్యాగ్ అనే సౌండ్ ఆధారిత పేమెంట్స్ స్టార్టప్ 78 మిలియన్ డాలర్లు అందుకుంది. ఇక ఈజీబజ్ అనే పేమెంట్ అగ్రిగేటర్ సంస్థలో బెస్సీమర్ వెంచర్ పార్ట్‌నర్స్ సారథ్యంలో ఇన్వెస్టర్లు 40 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టారు. టోన్‌ట్యాగ్‌కు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ దన్ను ఉంది. ఈ విభాగంలో వృద్ధి చాలా నెమ్మదిగా ఉండొచ్చు కానీ తాజా పరిణామాలతో వ్యాపారాలకు కాస్త స్థిరత్వం లభిస్తుందని ఓ వెంచర్ క్యాపిటల్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. మరోవైపు, ఫిన్‌టెక్ రంగంలో అంతర్గతంగా వెల్త్‌టెక్ విభాగం విస్తరణకు గణనీయంగా అవకాశాలు కనిపిస్తున్నాయి. కోటక్ చెర్రీ సీఈవో శ్రీకాంత్ సుబ్రమణియన్, ఐఐఎఫ్ఎల్ వెల్త్‌కి చెందిన సందీప్ జెత్వానీ వంటి ప్రముఖ వెల్త్ మేనేజర్ల సారథ్యంలోని సంస్థలపై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. పేటీఎం మనీ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవీణ్ జాదవ్ నెలకొల్పిన ధన్ సుమారు 1.1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో దాదాపు 200 మిలియన్ డాలర్లు సమీకరించే యత్నాల్లో ఉంది. 2022లో ప్రారంభమైన స్టేబుల్ మనీ సంస్థ 130 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో 20 మిలియన్ డాలర్లు సమకూర్చుకుంటోంది. 2024 జూన్‌లో నిధులు సమీకరించినప్పటితో పోలిస్తే వేల్యుయేషన్ మూడు రెట్లు పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ నుంచి నియంత్రణ నిబంధనల విషయంలో స్పష్టత నెలకొనడమే ఈ విభాగంపై వెంచర్ క్యాపిటల్ సంస్థలకు ఆసక్తి పెరగడానికి కారణమని పలువురు ఇన్వెస్టర్లు వెల్లడించారు.

ఏఐలో ప్రయివేట్ పెట్టుబడులు గుడ్

భారత్‌కు టాప్-10 ర్యాంక్



న్యూయార్క్: వర్ధమాన దేశాలలో ఏఐ ప్రయివేట్ పెట్టుబడులకు 2023లో చైనా రెండో ర్యాంకును దక్కించుకోగా.. భారత్ టాప్–10గా నిలిచినట్లు ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ప్రపంచ దేశాలలో ఏఐపై యూఎస్ అత్యధికంగా 67 బిలియన్ డాలర్ల ప్రయివేట్ పెట్టుబడులు వెచ్చించినట్లు వెల్లడించింది. గ్లోబల్ ఏఐ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఇది 70 శాతంకాగా.. తద్వారా యూఎస్ టాప్ ర్యాంకులో నిలిచినట్లు తెలియజేసింది. వర్ధమాన దేశాలలో చైనా 7.8 బిలియన్ డాలర్లు, భారత్ 1.4 బిలియన్ డాలర్ల ప్రయివేట్ పెట్టుబడులు కేటాయించినట్లు తెలియజేసింది. యూఎన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ) విడుదల చేసిన టెక్నాలజీ, ఇన్నోవేషన్ నివేదిక 2025లో ఈ వివరాలు తెలియజేసింది. 2033కల్లా ప్రపంచవ్యాప్తంగా ఏఐ మార్కెట్ విలువ 4.8 ట్రిలియన్ డాలర్లకు చేరనున్నట్లు అంచనా వేసింది. వెరసి డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అభిప్రాయపడింది. అయితే ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నైపుణ్యాలు కొన్ని ఆర్థిక వ్యవస్థలకే పరిమితమవుతున్నట్లు పేర్కొంది. ప్రధానంగా గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేటాయింపుల్లో యూఎస్, చైనా 40 శాతం వాటా ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది.

డెల్హివరీ చేతికి ఈకామ్ ఎక్స్‌ప్రెస్

డీల్ విలువ రూ.1400 కోట్లు



ముంబై: లాజిస్టిక్స్ సర్వీసు ప్రొవైడర్ డెల్హివరీ వ్యాపార విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈకామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌ను సొంతం చేసుకోనుంది. ఇందుకు సుమారు రూ.1400 కోట్లు వెచ్చించనుంది. పూర్తి నగదు రూపంలోనే చెల్లింపు చేసేలా ఒప్పందం ఖరారు చేసుకుంది. ''ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాము. 99.4 శాతం వాటాను రూ.1407 కోట్లకు కొనుగోలు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది'' అని డెల్హివరీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గురుగ్రామ్‌కు చెందిన ఈకామర్స్ ఎక్స్‌ప్రెస్ 2012 ఆగస్టులో ప్రారంభమైంది. అప్పటి నుంచి 200 కోట్ల షిప్‌మెంట్లు డెలివరీ చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,607.3 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ రూ.2,548.1 కోట్లుగా ఉంది. విలీన ప్రక్రియకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ డీల్ ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని డెల్హివరీ అంచనా వేస్తోంది. ఈ విలీనంతో కస్టమర్లకు మరింత మెరుగ్గా సేవలందించే అవకాశం లభిస్తుందని కంపెనీ ఎండీ, సీఈఓ సాహిల్ బారువా తెలిపారు. డెల్హివరీతో భాగస్వామ్యం వల్ల మరింత వృద్ధి చెందేందుకు అవకాశం లభిస్తుందని ఈకామ్ ఎక్స్‌ప్రెస్ వ్యవస్థాపకులు కే సత్యనారాయణ పేర్కొన్నారు.

ఈపీఎఫ్ఓ ప్యానెల్‌లో మరో 15 బ్యాంకులు



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధికి సంబంధించిన చెల్లింపులను స్వీకరించేందుకు కొత్తగా మరో 15 బ్యాంకులను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) తమ ప్యానెల్‌లో చేర్చింది. దీంతో మొత్తం బ్యాంకుల నెట్‌వర్క్ 32కి పెరిగింది. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సమక్షంలో ఈపీఎఫ్‌వో, ప్రభుత్వ.. ప్రైవేట్ రంగ బ్యాంకులు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఫెడరల్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ మొదలైనవి కొత్తగా ప్యానెల్‌లో చేరిన వాటిలో ఉన్నాయి. 78 లక్షల పైచిలుకు పింఛనుదారులు ఏ బ్యాంకు ఖాతా నుంచైనా పింఛన్లను పొందేందుకు కూడా ఇది తోడ్పడుతుందని మంత్రి చెప్పారు. నవ భారత లక్ష్యం దిశగా దేశ పురోగతికి ఈపీఎఫ్ఓలాంటి సంస్థలు దోహదపడుతున్నాయని తెలిపారు. 8 కోట్ల మంది పైగా యాక్టివ్ సభ్యులు, 78 లక్షల మందికి పైగా పెన్షనర్లకు .. సంస్థ సామాజిక భద్రత ప్రయోజనాలను కల్పిస్తోందని ఆయన చెప్పారు. 2024–25లో 6 కోట్ల పైగా క్లెయిమ్‌లను సెటిల్ చేసిందని తెలిపారు. 2023–24లో నమోదైన 4.45 కోట్లతో పోలిస్తే ఇది 35 శాతం అధికమని మాండవీయ వివరించారు.

ఓపెన్ ఆఫర్‌కు మినహాయింపు

వొడాఫోన్ ఐడియాపై ప్రభుత్వానికి సెబీ వెసులుబాటు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించే అంశంలో ప్రభుత్వానికి మినహాయింపు లభించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఇందుకు అనుమతించింది. స్పెక్ట్రమ్ బకాయిలను ఈక్విటీగా మార్పిడి చేసుకునే ప్రతిపాదన నేపథ్యంలో కంపెనీలో ప్రభుత్వ వాటా 34 శాతంపైగా పెరగనుంది. దీంతో ప్రభుత్వ వాటా 22.6 శాతం నుంచి 49 శాతానికి చేరనుంది. అయితే ప్రజా ప్రయోజనార్థమే ప్రభుత్వం వొడాఫోన్ ఐడియాలో వాటాను పెంచుకుంటున్న కారణంగా ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపును ప్రకటించినట్లు సెబీ హోల్‌టైమ్ సభ్యులు అశ్వనీ భాటియా పేర్కొన్నారు. ప్రభుత్వానికి కంపెనీ మేనేజ్‌మెంట్ లేదా బోర్డులో చేరే యోచనలేని నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా యాజమాన్య నియంత్రణలో మార్పులకు చోటులేదని తెలియజేశారు. వెరసి ప్రభుత్వ వాటా పబ్లిక్ హోల్డింగ్‌గా పరిగణనలోకి రానున్నట్లు వెల్లడించారు. గత నెలలో ప్రభుత్వం రుణ సవాళ్లు ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా స్పెక్ట్రమ్ బకాయిలు రూ. 36,950 కోట్లను ఈక్విటీగా మార్పిడి చేసేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. 2021 టెలికం సహాయక ప్యాకేజీలో భాగంగా బకాయిలను ఈక్విటీగా మార్చుకునేందుకు ప్రతిపాదించింది.

విదేశీ బీమా కంపెనీలకు సవాళ్లు

- స్థానిక భాగస్వాములతో సమస్యలు
- జేవీల్లో వాటాలు పెంచుకోవడంలో ఇబ్బందులు
- నెమ్మదిగా నిష్క్రమిస్తున్న సంస్థలు



న్యూఢిల్లీ: విదేశీ బీమా కంపెనీలు దేశీయంగా విస్తరించడానికి వెసులుబాటు కల్పిస్తూ ఇన్సూరెన్స్ రంగంలో పలు సంస్కరణలు ప్రవేశపెడుతున్నప్పటికీ పరిస్థితులు అంత అనుకూలంగా కనిపించడం లేదు. కార్యకలాపాలను విస్తరించడం మాట అటుంచి స్థానిక భాగస్వాములతో సరిగ్గా పొసగక పోతుండటంతో క్రమంగా అవి నిష్క్రమిస్తున్నాయి. ఇటీవలి జర్మనీకి చెందిన అలయంజ్ గ్రూప్..తమ భారత భాగస్వామి బజాజ్ ఫిన్‌సర్వ్‌తో రెండు దశాబ్దాల అనుబంధానికి స్వస్తి చెప్పింది. జాయింట్ వెంచర్‌లో వాటాలను పెంచుకోవడం, మేనేజ్‌మెంట్‌పై నియంత్రణ దక్కించుకోవడం వంటి అంశాలపై వివాదం నెలకొనడమే ఇందుకు కారణం. బజాజ్ ఫిన్‌సర్వ్‌తో తెగదెంపులు చేసుకున్నా, మరో భాగస్వామితో పొత్తు కోసం కసరత్తు చేస్తోంది. న్యూయార్క్ లైఫ్, ఐఎన్‌జీ, ఏఐజీ, ఓల్డ్ మ్యుచువల్ వంటి కంపెనీలు గత దశాబ్దన్నర కాలంలో భారత మార్కెట్ నుంచి నిష్క్రమించాయి. 2011లో దేశీ జీవిత బీమా రంగంలోకి ప్రవేశించిన టోకియో మెరైన్‌లాంటి కొన్ని గ్లోబల్ కంపెనీలు మాత్రమే ప్రస్తుతం దేశీయంగా వ్యాపారం సాగిస్తున్నాయి. కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో 70 శాతం వాటాను కొనుగోలు చేయడం ద్వారా అటు జ్యూరిక్ ఇన్సూరెన్స్ మాత్రం తమ వ్యాపారాన్ని విస్తరించింది. గత దశాబ్దకాలంగా కార్యకలాపాలు ప్రారంభించిన చాలా మటుకు ఇన్సూరెన్స్ సంస్థలకు ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ దన్నుగా నిలుస్తున్నాయి.

ఎఫ్‌డీఐ పరిమితి పెంచినా..

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 100 శాతానికి పెంచాలని బడ్జెట్‌లో ప్రతిపాదించినప్పటికీ, దీనితో పెట్టుబడులు వెల్లువెత్తే అవకాశాలు తక్కువేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత్ మార్కెట్‌పై ఆసక్తిగా ఉన్న కంపెనీలు ఇప్పటికే వచ్చేశాయని విదేశీ ఇన్సూరెన్స్ సంస్థల విస్తరణ వ్యూహాల గురించి అవగాహన ఉన్న వర్గాలు తెలిపాయి. ఎఫ్‌డీఐలపై పరిమితిని 49 శాతం నుంచి 74 శాతం వరకు పెంచినప్పటికీ చాలా మటుకు విదేశీ ఇన్వెస్టర్లు తమ వాటాలను 49 శాతం లేదా అంతకన్నా తక్కువగానే కొనసాగిస్తున్నాయి. పంపిణీ, మార్కెట్‌లో కార్యకలాపాలు సాగించడం కోసం దేశీ భాగస్వాములపై ఆధారపడాల్సి ఉండటమే ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ''ఎఫ్‌డీఐ పరిమితిని పెంచినంత మాత్రాన పెట్టుబడులు ఒక్కసారిగా వెల్లువెత్తబోవు. భారత్‌లో బీమా అంత సులువైన వ్యాపారం కాదు. విస్తరించాలంటే పంపిణీ నెట్‌వర్క్ చాలా పటిష్టంగా ఉండాలి, అపార నిర్వహణ అనుభవం ఉండాలి, స్థానికంగా సత్సంబంధాలు ఉండాలి. ఉద్యోగులను నియమించుకుంటే సరిపోదు. క్షేత్ర స్థాయిలో బాగా కష్టపడాల్సి ఉంటుంది'' అని విశ్లేషకులు తెలిపారు.

బీమా వ్యాపారం లిస్టింగ్ యోచనలో బజాజ్ ఫిన్‌సర్వ్..

అలయంజ్‌తో 24 ఏళ్ల భాగస్వామ్యం ముగిసిన తర్వాత బీమా విభాగాలను స్టాక్ మార్కెట్లలో లిస్ట్ చేయడంపై బజాజ్ ఫిన్‌సర్వ్ కసరత్తు చేస్తోంది. ఈ రెండు కంపెనీలు కలిసి .. బజాజ్ అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్ (బీఏజీఐసీ), బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ (బీఏఎల్ఐసీ) అని రెండు విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహించాయి. జాయింట్ వెంచర్‌లో అలయంజ్‌కి ఉన్న 26 శాతం వాటాల విలువను రూ. 24,180 కోట్లుగా లెక్కగట్టారు. బీఏజీఐసీ విలువ సుమారు రూ. 53,000 కోట్లుగా, బీఏఎల్ఐసీ విలువ రూ. 40,000 కోట్లుగా లెక్కగట్టారు. డీల్ ప్రకారం రెండు బీమా కంపెనీల విలువ రూ. 93,000 కోట్లని, అలయంజ్ వాటాల కొనుగోలు పూర్తయ్యాక లిస్టింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని బజాజ్ ఫిన్‌సర్వ్.. నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐకి సమర్పించిన ప్రణాళికలో పేర్కొంది. చట్టప్రకారం లిస్టింగ్‌కి వెళ్లాల్సిన అవసరం లేకపోయినప్పటికీ, బీమా కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి రావడాన్ని ఐఆర్‌డీఏఐ ప్రోత్సహిస్తోంది.

వినియోగదారుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

- నియంత్రణలను మెరుగ్గా మారుస్తాం
- రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటన



ముంబై: నియంత్రణ కార్యాచరణను మరింత మెరుగ్గా మార్చడం ద్వారా వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఆర్థిక స్థిరత్వం, సామర్థ్యాలను సమతుల్యం చేయడం ద్వారా దీన్ని సాధిస్తామన్నారు. ఆర్‌బీఐ 90వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. ఆరంభం నుంచి చూస్తే ఆర్‌బీఐ పాత్ర ఎంతో విస్తృతమైనట్టు చెప్పారు. ''సంప్రదాయం–మార్పునకు మధ్య మనం నిలబడి ఉన్నాం. ధరల స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, ఆర్థిక వృద్ధి అన్నవి అత్యాధునిక టెక్నాలజీలు, అంతర్జాతీయ అనిశ్చితులు, వాతావరణ మార్పుల సవాళ్లు, పెరుగుతున్న ప్రజల అంచనాలు వేగవంతమైన సాంకేతిక పురోగతితో అనుసంధానమై ఉన్నాయి''అని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థ ఆర్థిక నిర్మాణాన్ని తీర్చిదిద్దడంలో వచ్చే దశాబ్ద కాలం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మరింత మందికి ఆర్థిక సేవలను చేరువ చేసేందుకు ఆర్‌బీఐ కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ''కస్టమర్ల సేవలు, వినియోగదారుల పరిరక్షణ స్థిరంగా మెరుగుపడే సంస్కృతిని పెంపొందించడానికి కృషి చేస్తాం. టెక్నాలజీ ఆవిష్కరణలకు మా మద్దతు కొనసాగుతుంది'' అని ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వం సహా భాగస్వాములు అందరి సహకారాన్ని తీసుకుంటామని ఆర్‌బీఐ గవర్నర్ చెప్పారు.



ఫైనల్లో అభినాశ్

న్యూఢిల్లీ: వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు) పసిడి పతకానికి అడుగు దూరంలో నిలిచాడు. బ్రెజిల్‌లోని ఫాజ్ డు ఇగాకు నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో అభినాశ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో అభినాశ్ 5–0తో ఇటలీ బాక్సర్ మలంగ్‌పై ఏకపక్ష విజయం సాధించాడు. 22 ఏళ్ల అభినాశ్... ఫైనల్లో బ్రెజిల్‌కు చెందిన యూరీ రెయిస్‌తో తలపడతాడు. ఐదుగురు జడ్జీల్లో నలుగురు జమ్వాల్‌కు 'పర్‌ఫెక్ట్ 30' పాయింట్లు ఇచ్చారు. మొదటి, మూడో రౌండ్‌లో అందరూ ఏకగ్రీవంగా అతనికే పాయింట్లు అందించడం విశేషం. మరో సెమీఫైనల్లో మనీశ్ రాథోడ్ ఓటమి పాలై కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. 55 కేజీల సెమీస్‌లో మనీశ్ 0–5తో నూర్‌సుల్తాన్ అల్టిన్‌బెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడాడు. ఈ టోర్నీలో భారత బాక్సర్ హితేశ్ (70 కేజీలు) ఇప్పటికే ఫైనల్‌కు చేరగా... జాదూమణి సింగ్ (50 కేజీలు), విశాల్ (90 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. 19 దేశాలకు చెందిన 130 మంది బాక్సర్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌లో... భారత్ నుంచి 10 మంది బరిలోకి దిగారు. అందులో నలుగురు బాక్సర్లు ఆరంభ రౌండ్లలోనే ఓడిపోగా... మరో నలుగురు కాంస్య పతకాలు సాధించారు.

ఇషా సింగ్ రజత గురి

సిఫ్ట్ కౌర్‌కు స్వర్ణం • మనూ భాకర్ విఫలం • ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో రజత పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా సింగ్ వెండి వెలుగులు విరజిమ్మింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఇషా సింగ్ 35 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా షూటర్లు సున్ యుజీ 28 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా... ఫెంగ్ జియాన్ 30 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో పోటీపడిన భారత మరో షూటర్, 'డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్' మనూ భాకర్ 24 పాయింట్లతో ఆరో స్థానానికి పరిమితమైంది. అంతకుముందు క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మనూ భాకర్ 585 పాయింట్లు సాధించి మూడో స్థానంతో, ఇషా సింగ్ 579 పాయింట్లతో తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.

మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా పసిడి పతకం కైవసం చేసుకుంది. దీంతో సీజన్ ప్రారంభ ప్రపంచకప్ ఈవెంట్‌లో భారత్ ఖాతాలో తొలి పసిడి పతకం చేరింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 23 ఏళ్ల సిఫ్ట్ కౌర్ 458.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అనిట మంగోల్డ్ (జర్మనీ; 455.3 పాయింట్లు), అరినా అటుఖోవా (కజకిస్తాన్; 445.9 పాయింట్లు) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో సిఫ్ట్ కౌర్‌కు ఇదే తొలి పతకం మొత్తం 45 షాట్ల పాటు జరిగిన ఫైనల్లో తొలి 15 షాట్లు ముగిసిన అనంతరం జర్మనీ షూటర్ అనిట మంగోల్డ్ కంటే... 7.2 పాయింట్లు వెనుకబడిన సిఫ్ట్ కౌర్ ఆ తర్వాత అదరగొట్టింది. నీలింగ్ పొజిషన్‌లో సరైన గురి పెట్టలేకపోయిన భారత షూటర్... ఆ తర్వాత ప్రోన్, స్టాండింగ్ పొజిషన్లలో సత్తా చాటింది. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో సిఫ్ట్ కౌర్ 590 పాయింట్లు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది.



'నోట్ బుక్'తో మళ్లీ జరిమానా

దిగ్వేష్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీపై వరుసగా రెండో మ్యాచ్‌లో జరిమానా పడింది. శుక్రవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మరోసారి 'నోట్ బుక్' సెలబ్రేషన్స్ చేసుకున్నందుకు రాఠీ మ్యాచ్ ఫీజులో భారీగా కోత విధించారు. ముంబై బ్యాటర్ నమన్ ధీర్‌ను అవుట్ చేసిన అనంతరం దిగ్వేశ్ 'నోట్ బుక్'లో రాస్తున్నట్లు సంబరాలు చేసుకున్నాడు. ఇది అతడి రెండో తప్పిదం కావడంతో రాఠీ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. 'దిగ్వేశ్ రెండోసారి లెవల్–1 తప్పిదానికి పాల్పడ్డాడు. నియమావళిలోని 2.5 ఆర్టికల్ ప్రకారం అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించాం. దీంతో పాటు 2 డీ మెరిట్ పాయింట్లు కేటాయించాం' అని ఐపీఎల్ పాలక మండలి వెల్లడించింది. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లోనూ ఇలాగే నోట్ బుక్ సంబరాలు చేసుకున్నందుకు అతడికి ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. గత మ్యాచ్‌లో అతని ఫీజులో 25 శాతం కోత పడింది. మరో డీ మెరిట్ వస్తే మొత్తం 4 పాయింట్లతో రాఠీపై ఒక మ్యాచ్ సస్పెన్షన్ విధించే అవకాశం కూడా ఉంది.

రిషబ్ పంత్‌కు రూ. 12 లక్షలు జరిమానా...

ఇక ఇదే మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా పడింది. 90 నిమిషాల్లో 20 ఓవర్లు పూర్తి చేయాల్సి ఉండగా... లక్నో జట్టు నిర్ణీత సమయం ముగిసే సరికి 19 ఓవర్లు మాత్రమే వేసింది. దీంతో ముంబై బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో సర్కిల్ బయట ఒక ఫీల్డర్‌ను తక్కువగా ఉంచాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడటం ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్ తర్వాత స్లో ఓవర్‌రేట్‌కు జరిమానాను ఎదుర్కొన్న మూడో కెప్టెన్‌గా పంత్ నిలిచాడు.



వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

జపాన్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ ఈవెంట్

సుజుకా (జపాన్): ఫార్ములావన్ సీజన్ మూడో రేసు జపాన్ గ్రాండ్ ప్రిలో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్) పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 నిమిషం 26.983 సెకన్లలో ల్యాప్‌ను పూర్తిచేశాడు. చివరి ల్యాప్‌లో అతడు ఈ టైమింగ్ నమోదు చేశాడు. కాగా... వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 41వ పోల్ పొజిషన్. మెక్‌లారెన్ డ్రైవర్లు నోరిస్ (1 నిమిషం 26.995 సెకన్లు), పియాస్ట్రి (1 నిమిషం 27.027 సెకన్లు) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జపాన్ గ్రాండ్‌ప్రిలో నాలుగుసార్లు విజేతగా నిలిచిన వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో దూకుడు కనబర్చలేకపోయాడు. గత 16 రేసుల్లో అతడు కేవలం రెండింట్లో మాత్రమే విజయం సాధించాడు. ఈ నేపథ్యంలో తనకు అచ్చొచ్చిన ట్రాక్‌పై నేడు జరగనున్న ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ నుంచి ప్రారంభించనున్నాడు. ఆదివారం ఇక్కడ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించగా... తడిసిన ట్రాక్‌పై మెరుగైన రికార్డు ఉన్న వెర్‌స్టాపెన్ ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి. వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇప్పటి వరకు 63 ఎఫ్1 రేసులు నెగ్గాడు. ఈ జాబితాలో లూయిస్ హామిల్టన్ (105), షూమాకర్ (91) మాత్రమే అతడికంటే ముందున్నారు. ఈ ఏడాది డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ప్రస్తుతానికి మెక్‌లారెన్ డ్రైవర్ నోరిస్ (44 పాయింట్లు) అగ్ర స్థానంలో ఉండగా... 36 పాయింట్లతో వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో ఉన్నాడు. రసెల్ (మెర్సిడెస్; 35 పాయింట్లు), పియాస్ట్రి (మెక్‌లారెన్; 34 పాయింట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

క్వాలిఫయింగ్ సెషన్ స్టాండింగ్స్

డ్రైవర్	జట్టు	టైమింగ్
వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:16.983 సెకన్లు
నోరిస్	మెక్‌లారెన్	1:26.995 సెకన్లు
పియాస్ట్రి	మెక్‌లారెన్	1:27.027 సెకన్లు
లెక్‌లెర్క్	ఫెరారీ	1:27.299 సెకన్లు
రసెల్	మెర్సిడెస్	1:27.318 సెకన్లు
ఆంటోనెలి	మెర్సిడెస్	1:27.555 సెకన్లు
హాడ్జర్	రేసింగ్‌బుల్స్	1:27.569 సెకన్లు
హామిల్టన్	ఫెరారీ	1:27.610 సెకన్లు
అల్బన్	విలియమ్స్	1:27.615 సెకన్లు
బేర్‌మన్	హాస్ ఫెరారీ	1:27.867 సెకన్లు

శ్రీనిధి డెక్కన్, బెంగళూరు మ్యాచ్ 'డ్రా'



సాక్షి, హైదరాబాద్: ఐ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ లీగ్ దశను శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎస్‌డీఎఫ్‌సీ) 'డ్రా'తో ముగించింది. శనివారం శ్రీనిధి డెక్కన్, బెంగళూరు స్పోర్టింగ్ క్లబ్ మధ్య జరిగిన పోరు 2–2 గోల్స్‌తో 'డ్రా'అయింది. శ్రీనిధి జట్టు తరఫున డేవిడ్ కాస్టానెడా మునోజ్ (47వ, 86వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో చెలరేగాడు. ఒక దశలో శ్రీనిధి విజయం సాధించడం ఖాయంగా కనిపించినా... ఆఖర్లో తేరుకున్న బెంగళూరు జట్టు అదనపు సమయంలో స్కోరు సమం చేసింది. బెంగళూరు జట్టు తరఫున ఇషాన్ రఘునంద (67వ నిమిషంలో), షానిద్ వలన్ (90+5వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. తాజా సీజన్‌లో 22 మ్యాచ్‌లాడిన శ్రీనిధి జట్టు 7 విజయాలు, 8 పరాజయాలు, 7 'డ్రా'లతో 28 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 8వ స్థానంలో నిలిచింది. మరోవైపు బెంగళూరు జట్టు 22 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 11 పరాజయాలు, 5 'డ్రా'లతో 21 పాయింట్లు సాధించి 11వ స్థానంలో ఉంది. తాజా సీజన్‌లో 17 గోల్స్ కొట్టిన శ్రీనిధి స్ట్రయికర్ డేవిడ్ కాస్టానెడా గోల్డెన్ బూట్ రేసులో అగ్ర స్థానంలో ఉన్నాడు.



శ్రీలంక పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ 1996లో వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టు సభ్యులతో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టోర్నీకి సంబంధించి పలు ఆసక్తికర అంశాలు ఆటగాళ్లు ప్రధానితో పంచుకున్నారు. అరవింద డిసిల్వ, సనత్ జయసూర్య, చమిందా వాస్, ధర్మసేన, పుష్పకుమార తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రాండ్‌స్లామ్ విజేతలకు నగదు బహుమతి పెంచాలి

- నిర్వాహకులకు లేఖ రాసిన టెన్నిస్ స్టార్స్
- సంతకాలు చేసిన జొకోవిచ్, సినెర్, సబలెంకా, గాఫ్ తదితరులు

వాషింగ్టన్: ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నీల విజేతలకు నగదు బహుమతిని పెంచాలని కోరుతూ స్టార్ ఆటగాళ్లు... నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల నిర్వాహకులకు లేఖ రాశారు. ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ నిర్వాహకులతో వ్యక్తిగతంగా సమావేశమై ఈ అంశంపై మాట్లాడేందుకు సిద్ధమని ఆ లేఖలో పేర్కొన్నారు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌తో పాటు పురుషుల, మహిళల విభాగాల్లో అగ్రశ్రేణి ప్లేయర్లు ఈ లేఖపై సంతకాలు చేశారు. మార్చి 21వ తేదీతో ఉన్న ఈ లేఖపై పురుషుల ప్రపంచ నంబర్‌వన్ సినెర్ (ఇటలీ), జొకోవిచ్ (సెర్బియా), జ్వెరెవ్ (జర్మనీ), అల్కరాజ్ (స్పెయిన్), టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా), రూడ్ (నార్వే), మెద్వెదెవ్ (రష్యా), రుబ్లెవ్ (రష్యా), సిట్సిపాస్ (గ్రీస్), అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) సంతకాలు ఉన్నాయి. మార్చి తొలివారంలో విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో వీరు టాప్–10లో ఉన్నారు. ఇక మహిళల విభాగంలో టాప్–11 ప్లేయర్లలో పది మంది దీనిపై సంతకాలు చెశారు. కజకిస్తాన్ ప్లేయర్ రిబాకినా మినహా తక్కినవాళ్లంతా ఇందులో ఉన్నారు. మహిళల ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), కోకో గాఫ్ (అమెరికా), స్వియాటెక్ (పోలాండ్), జెస్సికా పెగూలా (అమెరికా), మాడిసన్ కీస్ (అమెరికా), జాస్మిన్ పావోలిని (ఇటలీ), ఎమ్మా నవారో (అమెరికా), జెంగ్ క్విన్‌వెన్ (చైనా), పౌలా బదోసా (స్పెయిన్), మిరా ఆంద్రెయెవా (రష్యా) దీనిపై సంతకాలు చేశారు.

- గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ల ద్వారా నిధులు సమకూర్చి ఆటగాళ్ల సంక్షేమ కార్యక్రమాల కోసం ఆర్థిక సహాయం చేయాలని ఆటగాళ్లు కోరుతున్నారు.
- గ్రాండ్‌స్లామ్ విజయవంతం కావడంలో ఆటగాళ్లదే ప్రధాన పాత్ర కాబట్టి అందుకు తగ్గట్లు నగదు బహుమతి శాతాన్ని పెంచాలని... తద్వారా టోర్నీ విలువ మరింత పెరుగుతుందని ప్లేయర్లు అంటున్నారు.
- ప్లేయర్ల ఆరోగ్యం, సంక్షేమానికి పెద్ద పీట వేయాలని... ఇందులో అత్యధిక వాటా ఆటగాళ్లకే దక్కాలని లేఖలో పేర్కొన్నట్లు ఫ్రెంచ్ పత్రిక వెల్లడించింది.
- జొకోవిచ్ ఆధ్వర్యంలో స్థాపించిన ఆటగాళ్ల సంఘం... పురుషుల, మహిళల ప్రొఫెషనల్ టూర్‌లు, అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య, క్రీడా సమగ్రత సంస్థపై న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో ఇటీవల ఒక దావా వేసింది.
- గ్రాండ్‌స్లామ్ ఆదాయంలో అతి తక్కువ మాత్రమే ఆటగాళ్లకు ఇస్తున్నారని... అందులో ప్లేయర్లకు మరింత వాటా దక్కాలని ఆ దావాలో పేర్కొంది.
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల, మహిళ విజేతలకు కలిపి చెల్లించిన దానికంటే ఒక స్పెషాలిటీ కాక్‌టెయిల్ అమ్మకం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని వాజ్యంలో పేర్కొంది.



తెలంగాణ, ఏపీ జట్ల ఓటమి

జాతీయ హాకీ చాంపియన్‌షిప్

ఝాన్సీ: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌ను తెలంగాణ జట్టు పరాజయంతో ప్రారంభించింది. 'బి' డివిజన్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 1–2 గోల్స్ తేడాతో చండీగఢ్ చేతిలో ఓటమి పాలైంది. తెలంగాణ జట్టు తరఫున వెంకటేశ్ (48వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించగా... చండీగఢ్ తరఫున మోహిత్ (23వ నిమిషంలో), దిలీప్ పాల్ (40వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. ఇదే డివిజన్‌లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 1–5 గోల్స్ తేడాతో గోవా చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో చండీగఢ్ చేతిలో ఓడిన ఆంధ్రప్రదేశ్ జట్టు రెండో మ్యాచ్‌లోనూ ఆకట్టుకోలేకపోయింది. వేణు గోపాల్ (29వ నిమిషంలో) ఆంధ్ర జట్టు తరఫున ఏకైక గోల్ చేశాడు.

న్యూజిలాండ్ క్లీన్‌స్వీప్

- మూడో వన్డేలోనూ ఓడిన పాకిస్తాన్
- బ్రేస్‌వెల్ ఆల్‌రౌండ్ షో

మౌంట్ మాంగనీ (న్యూజిలాండ్): సొంతగడ్డపై సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన న్యూజిలాండ్ జట్టు పాకిస్తాన్‌పై వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. మూడు మ్యాచ్‌ల పోరులో భాగంగా శనివారం జరిగిన చివరి పోరులో ఆతిథ్య న్యూజిలాండ్ 43 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ భారీ విజయాలు నమోదు చేసుకున్న కివీస్ 3–0తో సిరీస్ కైవసం చేసుకుంది. అవుట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండటంతో ఆట నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా ప్రారంభం కాగా... మ్యాచ్‌ను 42 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 42 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. కెప్టెన్ మైకేల్ బ్రేస్‌వెల్ (40 బంతుల్లో 59; 1 ఫోర్, 9 సిక్స్‌లు), రైస్ మారియు (61 బంతుల్లో 58; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలతో మెరిశారు. డారిల్ మిచెల్ (43), హెన్రీ నికోల్స్ (31), సీఫెర్ట్ (26) తలా కొన్ని పరుగులు చేశారు. పాకిస్తాన్ బౌలర్లలో ఆకిఫ్ జావేద్ 4, నసీమ్ షా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 40 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (58 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (37), తయ్యబ్ తాహిర్ (33), అబ్దుల్లా షఫీఖ్ (33) కాస్త పోరాడారు. ఒక దశలో 95/1తో పటిష్ట స్థితిలో నిలిచిన పాకిస్తాన్ ఆ తర్వాత కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయింది. 32 ఓవర్లు ముగిసే సమయానికి పాకిస్తాన్ 167/4తో నిలిచింది... న్యూజిలాండ్ కూడా ఆ దశలో 165/4తోనే ఉంది. అయితే చివరి 10 ఓవర్లలో కివీస్ 99 పరుగులు పిండుకోగా... పాకిస్తాన్ ఆ పని చేయలేక లక్ష్యానికి 43 పరుగుల దూరంలో నిలిచిపోయింది. కివీస్ బౌలర్లలో బెన్ సియర్స్ 5 వికెట్లతో విజృంభించగా... జాకబ్ డఫీ 2, బ్రాస్‌వెల్, అబ్బాస్, మిచెల్ తలా ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నారు. బ్రేస్‌వెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సియర్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. అంతకుముందు ఇరు జట్ల మధ్య జరిగిన టి20 సిరీస్‌ను సైతం న్యూజిలాండ్ 4–1తో కైవసం చేసుకుంది.



కర్వార్ నేవీ బేస్‌లో 'సాగర్' జలప్రవేశం

పలు ప్రాజెక్టులను ప్రారంభించిన రాజ్‌నాథ్





కర్వార్ (కర్నాటక): వ్యూహాత్మకంగా కీలకమైన కర్నాటకలోని కర్వార్ నేవీ బేస్‌లో శనివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియన్ ఓషన్ షిప్ ఐవోఎస్ సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్)ను జెండా ఊపి జల ప్రవేశం చేయించారు. దీంతోపాటు ఆయన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మిలటరీ హెలికాప్టర్‌లో కర్వార్‌కు చేరుకున్న రాజ్‌నాథ్ 'సీబర్డ్'లో భాగమైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారని రక్షణ శాఖ తెలిపింది. జల ప్రవేశం చేయించిన ఐవోఎస్ సాగర్‌లో 9 దేశాల నావికా దళాలకు చెందిన 44 మంది సిబ్బంది ఉంటారని పేర్కొంది. హిందూ మహా సముద్ర ప్రాంత భవిష్యత్తును నిర్ణయించడంలో ఐవోఎస్ సాగర్ కీలకంగా మారనుందని రక్షణ శాఖ 'ఎక్స్'లో తెలిపింది. ఈ ప్రాంత దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్‌కు ఇది ఎంతో సాయపడుతుందని తెలిపింది. సీబర్డ్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన విస్తరణ పనులతో కర్వార్ నేవీ బేస్‌లో 32 యుద్ధ నౌకలు, సబ్‌మెరీన్లను నిలిపేందుకు అవకాశమేర్పడింది.

హ్యాండ్‌షేక్.. షాక్



కరచాలనంతోనూ షాక్ కొడుతుంది

ఛైర్ పట్టుకుంటే చప్పున షాక్ తగులుతుంది

డోర్‌నాబ్ ముట్టుకున్నా చిన్నపాటి షాక్ అనుభూతి



మీరెప్పుడైనా నిలబడి సరదాగా అప్పటి దాకా మాట్లాడుతున్న వ్యక్తితో వీడ్కోలు చెప్పబోతూ కరచాలనం ఇస్తే చేతికి షాక్ కొట్టిందా?. ఎవరో కూర్చున్న కుర్చీని వెనక్కో ముందుకో లాగబోతూ పట్టుకుంటే టప్పున షాక్ కొట్టిందా?. గుండ్రంగా వెండిరంగులో మెరిసే డోర్ నాబ్‌ను పట్టుకోగానే చిన్నపాటి షాక్‌కు గురయ్యారా?. ఈ కరెంట్ ఎక్కడి నుంచి వచ్చిందనే డౌట్ మీలో ఉండిపోతే అలాంటి సైన్స్ ప్రియుల కోసం పరిశోధకులు కొన్ని సమాధానాలను సిద్ధంచేశారు. చదివేద్దామా మరి !!

ఉపరితలం చేసే మేజిక్కు

ప్రతి వస్తువులో కణాలకు విద్యుదావేశశక్తి దాగి ఉంటుంది. అయితే ఆయా వస్తువుల ఉపరితలాల ఎలక్ట్రిక్ స్థిరత్వం అనేది వాతావరణాన్ని తగ్గట్లు మారతుంది. అంటే గాలిలో తేమ పెరగడం, తగ్గడం, ఎండాకాలం, వర్షాకాలం వంటి సందర్భాల్లో వస్తువుల ఉపరితల ఎలక్ట్రిక్ స్థిరత్వం దెబ్బతిని అసమతుల్యత ఏర్పడుతుంది. ఉదాహరణకు ఒక ప్లాస్టిక్ కుర్చీని తీసుకుంటే దాని ఉపరితల ఎలక్ట్రిక్ ఛార్జ్ అనేది ఎండాకాలంలో ఒకలా, చలికాలంలో మరోలా ఉంటుంది. అదే సమయంలో పాలిస్టర్, ఉన్ని ఇలా విభిన్న వస్త్రంతో తయారైన దుస్తులు ధరించి మనిషి శరీర ఉపరితల ఎలక్ట్రిక్ చార్జ్ సైతం భిన్నంగా ఉంటుంది. చలికాలంలో వాతావరణం చల్లబడటంతో గాలిలో తేమ శాతం తగ్గుతుంది. చల్లటి గాలి అధిక తేమను పట్టి ఉంచలేదు. దీంతో చల్లటి గాలి తగిలిన ప్లాస్టిక్ కుర్చీ ఉపరితలంలో అసమాన ఎలక్ట్రిక్ చార్జ్ ఉంటుంది. దీనిని విభిన్న ఎలక్ట్రిక్ ఛార్జ్ ఉన్న మనిషి హఠాత్తుగా పట్టుకుంటే సమస్థాయికి తీసుకొచ్చేందుకు అత్యంత స్వల్పస్థాయిలో విద్యుత్‌కణాలు అటుఇటుగా రెప్పపాటు కాలంలో ప్రయాణిస్తాయి. ఉపరితలంలో కదిలే ఆ విద్యుత్ కణాల ప్రవాహ స్పర్శ తగిలి మనం షాక్ కొట్టిన అనుభూతిని పొందుతాం. మనిషి, ఇంకో మనిషికి షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు కూడా ఇదే భౌతిక శాస్త్ర దృగ్విషయం జరుగుతుంది. అందుకే కొందరు మనుషుల్ని పొరపాటున పట్టుకున్నా మనకు వెంటనే షాక్ కొడుతుంది. అంతసేపు ఒకరు కూర్చున్న ఛైర్‌ను పట్టుకున్నా షాక్ రావడానికి అసలు కారణం ఇదే.

స్టాటిక్ షాక్ ప్రమాదమా?

స్థిర విద్యుత్‌తో మనిషికి దైనందిన జీవితంలో ఎలాంటి ప్రమాదంలేదు. సెకన్ వ్యవధిలో షాక్ అనుభూతి వచ్చి పోతుంది. కానీ మండే స్వభావమున్న వస్తువుల సమీపంలో, అత్యంత సున్నితమైన ఎలక్ట్రానిక్ వస్తువుల వద్ద మనిషికి స్టాటిక్ విద్యుత్ ప్రాణహాని కల్గించే అవకాశాలు చాలా ఎక్కువ. ముఖ్యంగా గ్యాస్ స్టేషన్లు, కంప్యూటర్ చిప్ తయారీ కర్మాగారాల్లో స్టాటిక్ ఎలక్ట్రిసిటీ చాలా ప్రమాదకరం.

చలికాలంలోనే ఎక్కువ!

మిగతా కాలంతో పోలిస్తే చలికాలంలో వాతావరణంలో గాలిలో తేమ మారుతుంది. ముఖ్యంగా మనం కొద్దిసేపు ఆరుబయట గడిపి లోపలికి రాగానే అంతసేపు పాలిస్టర్, నైలాన్ వంటి సింథటిక్ దుస్తుల ధరించిన మన శరీర ఉపరితల చార్జ్ అనేది ధనావేశంతో లేదా రుణావేశంతో ఉంటుంది. గదిలోకి వచ్చి వెంటనే అక్కడి మనుషుల్ని, ఛైర్, డోర్‌నాబ్ వంటి వాటిని పట్టుకుంటే అవి అప్పటికే వేరే గాలి వాతావరణంలో భిన్నమైన ఆవేశంతో ఉంటాయి కాబట్టి మనకు షాక్ కొట్టే అవకాశాలే ఎక్కువ. తేమలేని గాలిలో చలికాలంలో ఈ షాక్ ఘటనలు ఎక్కువగా, తేమ అధికంగా ఉండే ఎండాకాలంలో ఈ షాక్ ఘటనలు తక్కువగా చూస్తుంటాం. దీనిని మనం పట్టుకునే, తగిలి, ముట్టుకునే వస్తువుల ఉపరితల ధనావేశం, రుణావేశమే కారణం.

దీనిని తప్పించుకోలేమా?

ఈ తరహా పరిస్థితుల బారిన పడకుండా తప్పించుకోవచ్చు. మన శరీర ఉపరితల అత్యంత సూక్ష్మస్థాయి విద్యుత్‌స్థాయిలు ఒకేలా ఉండేలా చర్మానికి లోషన్ లాంటివి రాసుకోవచ్చు. సింథటిక్ వస్త్రంతో చేసిన దుస్తులకు బదులు సహజసిద్ధ కాటన్ దుస్తులు ధరించడం మంచిది. నేల, గడ్డిపై నడిచేటప్పుడు స్టాటిక్ విద్యుత్‌కు గురికాకుండా ఉండాలంటే చెప్పులు, షూ లాంటివి ధరించకుండా చెప్పుల్లేకుండా నడవండి. ఇకపై మీరెప్పుడైనా ఇంట్లో సాధారణ పరిస్థితుల్లో ఇలాంటి షాక్‌కు గురైతే సరదాగా తీసుకోండి. అద్భుత, విచిత్ర సైన్స్‌కు మీరూ సాక్షీభూతంగా నిలిచామని సంబరపడండి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్‌తో సైనిక ఒప్పందంపై మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల నిరసన

సంస్థ 50వ వార్షికోత్సవంలో అంతరాయం

వాషింగ్టన్: ఇజ్రాయెల్ సైన్యానికి సాంకేతిక సాయం అందిస్తున్నందుకు మైక్రోసాఫ్ట్‌పై ఉద్యోగులు నిరసన తెలిపారు. సంస్థ 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి పలుమార్లు అంతరాయం కలిగించారు. పాలస్తీనాకు సంఘీభావం తెలిపారు. ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ ప్రసంగిస్తుండగా ఉద్యోగి ఇబ్తిహాల్ అబూస్సాద్ లేచి నినాదాలు చేశారు. 'ముస్తఫా ఇది నీకు సిగ్గు చేటు.. మైక్రోసాఫ్ట్ చేతులకూ రక్తం అంటింది'అంటూ నిరసన తెలిపారు. 'ఏఐని మంచి కోసం ఉపయోగిస్తున్నామని చెబుతున్నారు కానీ.. మైక్రోసాఫ్ట్ ఇజ్రాయెల్ సైన్యానికి కృత్రిమ మేథ ఆయుధాలను అందించింది. 50 వేల మంది ప్రాణాలు తీసిన మారణహోమానికి మైక్రోసాఫ్ట్ సహకరించింది'అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలస్తీనాకు సంఘీభావానికి చిహ్నమైన కెఫియేను వేదికపైకి విసిరారు. అందుకు స్పందించిన సులేమాన్ 'మీ నిరసనకు ధన్యవాదాలు.. నేను మీరు చెప్పింది విన్నాను'అని అన్నారు. సెక్యూరిటీ ఆమెను బయటికి పంపారు. తరువాత రెండో కార్యక్రమంలో నిరసనలు కొనసాగాయి. మాజీ సీఈఓలు బిల్‌గేట్స్, స్టీవ్ బాల్మర్, సత్య నాదెళ్లలు వేదికపై ఉండగా.. మరో ఉద్యోగి వానియా అగర్వాల్ నిరసన తెలిపారు. ఏఐ టూల్ ఉపయోగించి 2023లో లెబనాన్‌లపై చేసిన దాడుల్లో ముగ్గురు యువతులతోపాటు తన నానమ్మను బలిగొందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాలస్తీనాకు సంఘీభావంగా మైక్రోసాఫ్ట్‌లో నిరసన ఇది మొదటిది కాదు. సత్యానాదెళ్ల సమావేశంలో ఇజ్రాయెల్‌తో సైనిక ఒప్పందాలను నిరసించినందుకు ఈ ఏడాది ప్రారంభంలోనే ఐదుగురు ఉద్యోగులను తొలగించారు. అయితే అంతర్గత సమావేశం కావడంతో విషయం బయటికి రాలేదు. వార్షికోత్సవ సమయంలో జరగడంతో సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం నాటి ఘటన వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఉద్యోగులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చేందుకు సంస్థ స్వేచ్ఛనిస్తుందని, అదే సమయంలో అవి సంస్థ కార్యకలాపాలకు అంతరాయం కలిగించకుండా ఉండాలని మైక్రోసాఫ్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే అబూస్సాద్, అగర్వాల్‌లపై చర్యలపై కంపెనీ ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇప్పటికయితే తమ ఐడీలు పని చేయడం లేదని వారిద్దరూ తెలిపారు.

అప్పుడు మనస్పర్థలొచ్చాయి

ఇప్పుడు హాయిగా ఉన్నాం

- మిషెల్‌తో విడాకుల వార్తలను వదంతులుగా కొట్టేసిన ఒబామా

వాషింగ్టన్: రెండు పర్యాయాలు అమెరికా అధ్యక్షునిగా పదవిలో కొనసాగిన కాలంలో పని ఒత్తిడి కారణంగా భార్యతో సఖ్యత చెడిందని బరాక్ ఒబామా ఒప్పుకున్నారు. నాటి మనస్పర్థలను తొలగించుకుంటూ నేడు ఆనందంగా జీవిస్తున్నామన్నారు. భార్య మిషెల్‌తో జీవనప్రయాణంపై ఒబామా మీడియాతో మాట్లాడారు. హాలీవుడ్ నటి జెన్నీఫర్ అనీస్టన్‌తో వివాహేతర సంబంధం వంటి వార్తలను వదంతులుగా కొట్టిపారేశారు. భార్య మిషెల్ నుంచి విడాకులు తీసుకోబోతున్నారనేవి కూడా పూర్తిగా వదంతులేనని స్పష్టంచేశారు. జిమ్మీ కార్టర్ అంత్యక్రియల్లోనూ, ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవంలో భార్య మిషెల్‌తో రాకుండా ఒంటరిగా ఒబామా కనిపించిన నేపథ్యంలో మీడియా ఆయన విడాకుల అంశాన్ని మరోసారి ప్రస్తావించింది. దీంతో తాజాగా హామిల్టన్ కాలేజీలో జరిగిన ఒక కార్యక్రమంలో కాలేజీ అధ్యక్షుడు స్టీవెన్ టెప్పర్ అడిగిన ప్రశ్నలకు ఒబామా సమాధానాలిచ్చారు. ''2020 నవంబర్‌లో నా ఆత్మకథ ఏ ప్రామిస్డ్ ల్యాండ్ మొదటి భాగాన్ని మార్కెట్లోకి తెచ్చాం. ఇప్పుడు రెండో భాగం పూర్తిచేసే పనిలో ఉన్నా. రోజూ పేజీల కొద్దీ రాస్తున్నా'' అని అన్నారు. రాయడం ఇష్టపడతారా అన్న ప్రశ్నకు ''అస్సలు ఇష్టంలేదు. కానీ రాయడం పూర్తయ్యాక మాత్రం రాశానన్న ఆనందంలో మునిగి తేలుతా''అని సరదాగా అన్నారు. ''అధ్యక్షునిగా కొనసాగిన కాలంలో విధి నిర్వహణలో పడిపోయా. దాంతో సతీమణితో మనస్పర్థలొచ్చాయి. ఇప్పుడు పరిస్థితి అంతా కుదుటపడింది. నాటి విబేధాల లోయలోంచి బయటపడ్డా''అని చెప్పారు. 1980వ దశకంలో ఒక న్యాయసేవల సంస్థలో కొన్నాళ్లు కలిసి పని చేసిన కాలంలో మిషెల్‌తో ఒబామాకు పరిచయం ఏర్పడింది. అది తర్వాత ప్రేమగా మారి 1992లో పెళ్లికి దారితీసింది. ఒబామా అధ్యక్షుడయ్యాక కొంతకాలం వాళ్ల మధ్య బేధాభిప్రాయాలు పొడచూపాయి. తమ వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఎదురయ్యాయని మూడేళ్ల క్రితం ఒక ఇంటర్వ్యూలో మిషెల్ చెప్పారు. అప్పట్నుంచి వీళ్ల వివాహబంధంపై మీడియాలో ఎన్నో కథలు షికార్లు చేశాయి. అమెరికాలో ప్రఖ్యాత జ్యోతిష్యురాలు అమీ ట్రిప్ సైతం ఇదే విషయం అంచనావేశారు. ఒబామా దంపతులకు జూలై, ఆగస్ట్ నెలలు అత్యంత విషమకాలమని ఆమె అంచనా వేశారు. అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలుస్తారని అమీ ట్రిప్ చెప్పిన జోశ్యం నిజం కావడం తెల్సిందే. పెళ్లి పెటాకులు అవుతుందన్న పుకార్లు పెరగడంతో ఒబామా జంట ఫిబ్రవరి 14న జంటగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పెట్టింది. వేలంటైన్స్‌డే గ్రీటింగ్స్ చెప్పి విమర్శించే వాళ్ల నోరు మూయించారు.

మణిపూర్ సంక్షోభంపై... మైతేయి-కుకీలతో కేంద్రం చర్చలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల మధ్య హింసకు ఫుల్‌స్టాప్ పెట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శనివారం మైతేయి, కుకీ ప్రతినిధి వర్గాలతో ఢిల్లీలో చర్చలు ప్రారంభించింది. రెండు ప్రధాన వర్గాల మధ్య విశ్వాసాన్ని, సహకారాన్ని పెంచడంతోపాటు మణిపూర్‌లో తిరిగి సాధారణ పరిస్థితులను నెలకొల్పడమే కేంద్రం ఉద్దేశమని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా శాంతి భద్రతలను కాపాడటం, రెండు వర్గాల మధ్య సయోధ్యను కుదర్చడంపైనే ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారని పేర్కొన్నాయి. మైతేయిలకు చెందిన ఆల్ మణిపూర్ యునైటెడ్ క్లబ్స్ ఆర్గనైజేషన్(అముకో), ఫెడరేషన్ ఆఫ్ సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్(ఫాక్స్) సంస్థల ఆరుగురు, కుకీల తరఫున 9 మంది ప్రతినిధులు ఈ చర్చల్లో పాలుపంచుకున్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ స్పెషల్ డైరెక్టర్ ఏకే మిశ్రా అనుసంధాన కర్తగా వ్యవహరించారు. 2023 నుంచి కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో 260 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే.

వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు ఆప్ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లు -2025ను సవాలు చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్ దాఖలు చేశారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 21, 25, 26, 29, 30, 300–ఏ కింద పొందుపరిచిన ప్రాథమిక హక్కులను ఈ బిల్లు ఉల్లంఘిస్తోంది. ఇది ముస్లింల మత, సాంస్కృతిక స్వయంప్రతిపత్తిని తగ్గిస్తుంది, ఏకపక్ష కార్యనిర్వాహక జోక్యాన్ని అనుమతిస్తుంది. మత, ధార్మిక సంస్థలను నిర్వహించే మైనారిటీ హక్కులను బలహీనపరుస్తుంది' అని ఖాన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు 2025 రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తోందంటూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



కాలపు చెక్కిలిపై ఘనీభవించిన కన్నీటి చుక్కగా తాజ్‌మహల్‌ను అభివర్ణించాడు రవీంద్రుడు. ప్రశాంత ప్రత్యూష వేళ ఓ కలువ మొగ్గపై ఇలా సుతారంగా ఘనీభవించిన నీటి బిందువును చూస్తే ఆ విశ్వకవి ఇంకేమని వర్ణించేవాడో! ఎస్టోనియాలోని తలిన్ సిటీ పార్కులో శనివారం ఉదయం కనువిందు చేసిందీ దృశ్యం

భూ వాతావరణంలోకి పోయెమ్-4

సాక్షి, బెంగళూరు: అంతరిక్ష వ్యర్థాల నిర్వహణలో ఇస్రో మరోసారి తన ఘనతను చాటింది. అంతరిక్ష ప్రయోగాల కోసం వినియోగించిన వ్యోమనౌక సంబంధిత భాగాలు అక్కడే అంతరిక్ష చెత్తగా పేరుకుపోకుండా వాటిని సురక్షితంగా భూమి మీదకు తీసుకొచ్చే ప్రక్రియను ఇస్రో మరోసారి విజయవంతంగా పూర్తిచేసింది. అంతరిక్షంలో ఉపగ్రహాల వంటి వస్తువుల అనుసంధానం(డాకింగ్), విడతీత(అన్‌డాకింగ్) కోసం వినియోగించిన పోలార్ శాటిలైట్ లాంఛ్ వెహికల్(పీఎస్‌ఎల్వీ–సీ60)లోని పైభాగం(పీఎల్4) అయిన పీఎస్‌ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్–4)ను విజయవంతంగా తిరిగి భూవాతావరణంలోకి తీసుకొచ్చారు. తర్వాత దానిని ఏప్రిల్ నాలుగో తేదీ ఉదయం 8.03 గంటలకు హిందూమహాసముద్రంలో పడేలాచేశామని ఇస్రో శనివారం వెల్లడించింది. అంతరిక్ష నుంచి జాగ్రత్తగా కక్ష్య తగ్గిస్తూ సముద్రంలో పడేసే పనిని ఇస్రో వారి సిస్టమ్ ఫర్ సేఫ్ అండ్ సస్టేనబుల్ స్పేస్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్(ఐఎస్4ఓఎం) విభాగం పూర్తిచేసింది. గతేడాది డిసెంబర్ 30న రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలను పీఎస్‌ఎల్వీ వ్యోమనౌక ద్వారా 475 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో చేర్చారు. అదే కక్ష్యలోనే పోయెమ్–4ను ప్రవేశపెట్టారు. తర్వాత నెమ్మదిగా 350 కిలోమీటర్ల ఎత్తు కక్ష్యలోకి తీసుకొచ్చారు. పోయెమ్–4 మొత్తంగా 24 పేలోడ్లను వెంట తీసుకెళ్లింది. ఇందులో 14 ఇస్రోకు చెందినవి కాగా, మరో 10 ప్రభుత్వేతర సంస్థలకు చెందినవి. ప్రస్తుతం అన్ని పేలోడ్లు సక్రమంగా పని చేస్తున్నాయి. వాటిని నిర్దేశించిన విధులను నిర్వర్తిస్తూ అంతరిక్ష డేటాను పంపిస్తున్నాయి.

సిరోలి.. మతసామరస్యానికి చిహ్నం

ముస్లిం ప్రాబల్య గ్రామంలో సర్పంచ్‌గా హిందూ మహిళ

గురుగావ్: ఎంతటి విద్వేష పరిస్థితుల్లో ఉన్నా సరే.. దేశంలోని 'భిన్నత్వంలో ఏకత్వం'మళ్లీ మళ్లీ రుజువవుతూనే ఉంది. ఇటీవల హరియాణా పంచాయతీ ఎన్నికల్లోనూ ఈ ప్రత్యేకత మరోసారి ప్రతిబింబించింది. ముస్లింలకు అత్యధిక ఓట్లున్న గ్రామంలో హిందూ మహిళ సర్పంచ్‌గా గెలిచారు. హరియాణాలోని నుహ్ జిల్లాలో ఉంది సిరోలీ గ్రామం. ఇక్కడ ముస్లింల జనాభా ఎక్కువ. గ్రామంలోని 3,296 మంది ఓటర్లలో 250 మంది మాత్రమే హిందువులు. 15 మంది సభ్యులున్న పంచాయతీలో 14 మంది ముస్లింలే. వీరిలో ఎనిమిది మంది మహిళలు కూడా. ఈసారి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిరోలీ సర్పంచ్ పదవి మహిళలకు రిజర్వ్ అయింది. హిందూ మహిళ నిషా చౌహాన్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. తన విజయం హిందూ–ముస్లిం ఐక్యతకు చిహ్నమని కొత్తగా ఎన్నికైన సర్పంచ్ తెలిపారు. 'మా గ్రామంలో ముస్లిం ప్రాబల్యం ఉన్నప్పటికీ హిందూ–ముస్లిం సోదరభావం ఇప్పటికీ ఉంది. మా దగ్గర మతపరమైన వివక్ష లేదు. దీనికి సజీవ ఉదాహరణ నేను సర్పంచ్‌గా ఎన్నిక కావడం. నా విజయం మొత్తం ప్రాంతంలో మత సామరస్యానికి సందేశం'అని చౌహాన్ పేర్కొన్నారు. 'ఇక్కడ హిందువులు, ముస్లింలు తేడాలేకుండా సామరస్యంగా ఉంటాం. ఒకరి సుఖదుఃఖాల్లో మరొకరం పాలు పంచుకుంటాం'సిరోలీ మాజీ సర్పంచ్, ప్రస్తుత వార్డు సభ్యుడు అష్రఫ్ తెలిపారు.

సరిహద్దుల్లో చొరబాటుదారు కాల్చివేత

జమ్మూ: అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి మన భూభాగంలోకి చొరబడేందుకు చేసిన యత్నాన్ని భద్రతా బలగాలు విజయవంతంగా తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన దుండగుడిని కాల్చి చంపాయి. ఆర్‌ఎస్ పురా సెక్టార్‌లోని అబ్దుల్లియన్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఘటన చోటుచేసుకుంది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న ముష్కరుడిని బీఎస్ఎఫ్ బలగాలు గుర్తించాయి. పలుమార్లు చేసిన హెచ్చరికలను లక్ష్యపెట్టక ముందుకు వస్తున్న అతడిపైకి కాల్పులు జరిపి హతమార్చాయి. ఈ ఘటన జరిగిన వెంటనే 1.10 గంటల సమయంలో కొద్దిసేపు జరిగిన ఫ్లాగ్ మీటింగ్‌లో పాకిస్తాన్ రేంజర్లకు బీఎస్ఎఫ్ తీవ్ర నిరసన తెలిపింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు రేంజర్లు నిరాకరించారని బీఎస్ఎఫ్ తెలిపింది.

నాలుగు రాష్ట్రాలకు రూ.1,280 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: గతేడాది ప్రకృతి వైపరీత్యాలకు గురైన బిహార్ సహా నాలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,280.35 కోట్ల అదనపు సాయాన్ని మంజూరు చేసింది. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. ఇందులో బిహార్‌కు రూ.588.73 కోట్లు, హిమాచల్ ప్రదేశ్‌కు రూ.136.22 కోట్లు, తమిళనాడుకు రూ.522.34 కోట్లు, పుదుచ్చేరికి రూ.33.06 కోట్లు అందనున్నాయి. కాగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎస్డీఆర్ఎఫ్ కింద 28 రాష్ట్రాలకు రూ.20,264.40 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్ కింద 19 రాష్ట్రాలకు రూ.5,160.76 కోట్లు విడుదల చేసింది. అదనంగా, రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి 19 రాష్ట్రాలకు రూ.4,984.25 కోట్లు, జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్డీఎంఎఫ్) నుంచి 8 రాష్ట్రాలకు రూ.719.72 కోట్లు కూడా విడుదలయ్యాయి.

ట్రక్కును ఢీకొన్న మినీ బస్సు: ఐదుగురు మృతి

కలబుర్గి: కర్ణాటకలోని కలబుర్గి జిల్లాలో జేవర్గిలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రక్కును ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, 11 మంది గాయపడ్డారు. ట్రక్కు టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి టైర్ మారుస్తున్నారు. ఇక బాగల్‌కోటేకు చెందిన ప్రయాణికులతో నిండిన బస్సు ఓ దర్గాకు వెళ్తోంది. శనివారం వేకువజామున 3.30 గంటల ప్రాంతంలో నిద్రమత్తులో డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో 13 ఏళ్ల బాలిక ఉంది. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

జమిలి ఎన్నికలపై అవన్నీ అసత్యాలు: నిర్మల

చెన్నై: జమిలి ఎన్నికలపై జరుగుతున్నదంతా అసత్య ప్రచారమేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొట్టిపారేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ విధానం అమలయ్యే అవకాశమే లేదని స్పష్టం చేశారు. 2034 తర్వాత మాత్రమే నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి నిర్మల మాట్లాడారు. 2024 ఎన్నికల్లో లక్ష కోట్ల మేర భారీగా ఖర్చయిందంటూ ఆమె..జమిలి ఎన్నికలతో ఈ ఖర్చు తగ్గిపోతుందని వివరించారు. 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' విధానం అమలైతే సుమారు రూ.12 వేల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందన్నారు. ఈ మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాల కోసం వెచ్చించేందుకు వీలవుతుందని వివరించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏక కాలంలో ఎన్నికలు జరిపితే దేశ జీడీపీ 1.5 శాతం మేర పెరుగుతుందని చెప్పారు. రాష్ట్రాల్లో ఓటరు శాతం కూడా పెరుగనుందన్నారు. అయితే, కొన్ని పార్టీలు ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానంపై తప్పుడు ప్రచారం చేస్తూ గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు.

'శీష్ మహల్' వ్యయం నెలకు రూ.31 లక్షలు!

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రిగా అధికార నివాసం శీష్ మహల్ నిర్వహణకు ఆప్ సారథి అరవింద్ కేజ్రీవాల్ నెలకు ఏకంగా రూ.31 లక్షలు ఖర్చు చేసినట్టు బీజేపీ ఆరోపించింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా సేకరించిన వివరాలను ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ శనివారం వెల్లడించారు. బంగ్లా నిర్వహణకు కేజ్రీవాల్ ఏటా రూ.3,69,54,384 ఖర్చు చేశారని తెలిపారు. ''3 కోట్ల 4 కోట్లలో ఢిల్లీలో ఏకంగా 300 గజాల మంచి ఇల్లే కట్టుకోవచ్చు. కానీ కేజ్రీవాల్ మాత్రం తన ముద్దుల బంగ్లా నిర్వహణకే ఏడాదికి రూ.3.69 కోట్లు వెచ్చించారు! దీనిపై ఢిల్లీ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలి'' అని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజ్వల్ రేవణ్ణపై చార్జ్‌షీట్ నమోదు

బెంగళూరు: ఇంటి పనిమనిషిపై అత్యాచారం కేసులో కర్నాటకలో జనతాదళ్(సెక్యులర్) నేత, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) చార్జ్‌షీటు దాఖలుచేసింది. ఈ కేసును ట్రయల్ కోర్టు ఏప్రిల్ 9వ తేదీన విచారించే అవకాశముంది. పనిమనిషిని బంధించి, వేర్వేరు తేదీల్లో పలు మార్లు అత్యాచారం చేయడమేకాక రేప్ ఘటనను వీడియోగా చిత్రించారని ప్రజ్వల్‌పై పలు సెక్షన్ల కింద సిట్ అధికారులు నేరం మోపారు. చార్జ్‌షీట్‌లోని వివరాల ప్రకారం కోవిడ్ సంక్షోభకాలంలో 2021 ఏడాదిలో ప్రజ్వల్ కుటుంబానికి చెందిన హొళెనరసిపురలోని ఫామ్‌హౌస్‌లో బాధితురాలిపై ప్రజ్వల్ తొలిసారిగా అత్యాచారానికి ఒడిగట్టాడు. తర్వాత గన్నికడ ఫామ్‌హౌస్, బెంగళూరులోని వేర్వేరు నివాస స్థలాల్లో బాధితురాలిపై ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారానికి పాల్పడి రేప్ ఘటనలను వీడియోగా చిత్రించారు. ఈ వీడియోలు తర్వాత కర్ణాటకలో బహిర్గతం కావడంతో ఆమె ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేశారు. తర్వాత ఉద్యోగం మానేశారు. కేసు నమోదుచేసి పోలీసులు ప్రజ్వల్‌ను అరెస్ట్‌చేయగా గత 10 నెలలుగా జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా జైళ్లో గడపుతున్నారు.

రష్యా క్షిపణి దాడి..18కు చేరిన మరణాలు


కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రివీరిహ్‌పై శుక్రవారం రష్యా జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడిలో చనిపోయిన వారి సంఖ్య 18కి చేరుకుంది. వీరిలో 9 మంది చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడు నెలల పసికందు నుంచి వృద్ధుల వరకు మరో 61 మంది ఈ దాడిలో గాయపడ్డారని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 41 మందిలోఇద్దరు చిన్నారులు సహా 17 మంది పరిస్థితి సీరియస్‌గా ఉందని వివరించారు. నివాస భవనాలకు అత్యంత సమీపంలోని ఆటస్థలంపై క్షిపణి పడిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ వివరించారు. దాడి కారణంగా 20 అపార్టుమెంట్ భవనాలు, 30కి పైగా వాహనాలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న వాటిలో రెస్టారెంట్, ఒక విద్యా సంస్థ ఉన్నాయన్నారు. ఘటనపై రష్యా రక్షణ శాఖ స్పందించింది. ఉక్రెయిన్ సైనిక కమాండర్లు, పశ్చిమ దేశాల మిలటరీ సలహాదార్లు సమావేశమైన రెస్టారెంట్‌పై శక్తివంతమైన క్షిపణిని ప్రయోగించామని వెల్లడించింది. తమ దాడిలో 85 మంది మిలటరీ సిబ్బంది, విదేశీ అధికారులు చనిపోగా 20 వాహనాలు ధ్వంసమైనట్లు తెలిపింది. ఈ ప్రకటనను ఉక్రెయిన్ ఆర్మీ ఖండించింది.

హైదరాబాద్ రాష్ట్ర ఏకైక స్పీకర్ ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. ఏకీకృత న్యాయవ్యవస్థగా దేన్ని పేర్కొంటారు?
   ఎ) మొత్తం న్యాయ స్థానాలు ఉన్నత న్యాయ స్థానం నియంత్రణలో పనిచేసే విధానం
   బి) ప్రతి న్యాయస్థానం స్వతంత్రంగా పనిచేసే విధానం
   సి) శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలకు బాధ్యత వహించనిది
   డి) పైవన్నీ
2. అమెరికాలో 'సుప్రీం లెజిస్లేచర్'గా దేన్ని పేర్కొంటారు?
   ఎ) కాంగ్రెస్ బి) సెనెట్
   సి) మంత్రి మండలి
   డి) అమెరికా ఫెడరల్ కోర్టు
3. స్వయం ప్రతిపత్తి ఉన్న న్యాయ వ్యవస్థ అంటే ఏమిటి?
   ఎ) స్వతంత్రంగా పనిచేసేది
   బి) రాజ్యాంగ హోదా ఉన్నది
   సి) శాసన, కార్యనిర్వహక శాఖలకు బాధ్యత వహించనిది
   డి) పైవేవీ కాదు
4. న్యాయ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు కారణాలు?
   ఎ) రాజ్యాంగ ఆధిక్యత పరిరక్షణ
   బి) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
   సి) కేంద్ర - రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
   డి) పైవన్నీ
5. 99వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
   ఎ) రాష్ట్రపతి
   బి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
   సి) కేంద్ర న్యాయశాఖ మంత్రి
   డి) అటార్నీ జనరల్
6. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్)ను కేంద్ర ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?
   ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
   సి) పుణే డి) గాంధీనగర్
7. కేంద్ర - రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలో ఉంటుంది?
   ఎ) ప్రారంభ అధికార పరిధి
   బి) అప్పీళ్ల విచారణ అధికార పరిధి
   సి) సలహా రూపక పరిధి
   డి) పైవన్నీ
8. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రస్తావించింది?
   ఎ) గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్ స్టేట్-1967
   బి) కేశవానంద భారతి వర్సెస్ కేరళ స్టేట్-1973
   సి) బేరుబారి వర్సెస్ భారత ప్రభుత్వం - 1960
   డి) ఇంద్రసహాని వర్సెస్ భారత ప్రభుత్వం - 1993
9. సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయ మూర్తి ఎవరు?
   ఎ) లీలాసేథ్ బి) అన్నా చాందీ
   సి) ఫాతిమా బీబీ డి) అమరేశ్వరి దేవి
10. కిందివాటిలో సరైనది?
   ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎక్కువ కాలం జస్టిస్ చంద్రచూడ్ పనిచేశారు
   బి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తక్కువ కాలం జస్టిస్ నాగేంద్రసింగ్ పనిచేశారు
   సి) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 ఏళ్లు
   డి) పైవన్నీ
11. అధికరణ 152 నుంచి ఏ రాష్ట్రానికి మినహాయింపు ఇచ్చారు?
   ఎ) గోవా బి) జమ్మూ కశ్మీర్
   సి) నాగాలాండ్ డి) అరుణాచల్‌ప్రదేశ్
12. గవర్నర్‌ను నియమించేటప్పుడు రాష్ట్రపతిని సంప్రదించాలని ఇందుకు అవసరమైన అధికరణ 155ని సవరించాలని ఏ కమిటీ సూచించింది?
   ఎ) రాజమన్నార్ కమిటీ
   బి) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   సి) సర్కారియా కమిటీ
   డి) సంతానం కమిటీ
13. గవర్నర్ వ్యవస్థకు సంబంధించి సరికానిది?
   ఎ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి గవర్నర్ సి.ఎం. త్రివేది
   బి) గవర్నర్ పదవి చేపట్టిన తొలి తెలుగువ్యక్తి భోగరాజు పట్టాభి సీతారామయ్య
   సి) ఆంధ్రప్రదేశ్ మొదటి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు
   డి) గవర్నర్ పదవి చేపట్టేందుకు కనీస వయసు 35 ఏళ్లు
14. కింది వాటిలో గవర్నర్ విచక్షణాధికారం ఏది?
   ఎ) బిల్లులను రాష్ట్రపతికి నివేదించడం
   బి) రాష్ట్ర పరిస్థితికి సంబంధించి కేంద్రానికి నివేదిక పంపడం
   సి) విధానసభ రద్దు పర్చే విషయం
   డి) పైవన్నీ
15. కింది వాటిలో గవర్నర్ అర్హతకు సంబంధించి సరైంది?
   ఎ) 35 ఏళ్ల నిండి ఉండాలి
   బి) కనీస విద్యార్హత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి
   సి) శాసనసభలో సభ్యుడై ఉండరాదు
   డి) 65 ఏళ్ల నిండి ఉండకూడదు
16. ఈ కింది వాటిలో గవర్నర్‌కు ఏ అధికారాలు లేవు?
   ఎ) ఆర్థిక అధికారాలు
   బి) విచక్షణాధికారాలు
   సి) సైనికాధికారాలు
   డి) కార్య నిర్వాహకాధికారాలు
17. ఏ అధికరణ ప్రకారం నేరస్థులకు క్షమాభిక్ష పెట్టేందుకు, శిక్షను తగ్గించేందుకు గవర్నర్‌కు అధికారం ఉంటుంది?
   ఎ) అధికరణ-153 బి) అధికరణ-161
   సి) అధికరణ-213 డి) పైవేవీ కాదు
18. కిందివాటిలో సరైనది?
   ఎ) 243(i) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులను నియమిస్తారు
   బి) 243(k) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కమిషనర్‌ను నియమిస్తారు
   సి) అధికరణ 165 ప్రకారం గవర్నర్ అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తారు
   డి) పైవన్నీ
19. ముఖ్యమంత్రికి సంబంధించి సరైంది?
   ఎ) ప్రత్యక్షంగా ఎన్నికవుతాడు
   బి) పరోక్షంగా ఎన్నికవుతాడు
   సి) గవర్నర్ నియమిస్తారు
   డి) గవర్నర్ నామ నిర్దేశం చేస్తారు
20. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తక్కువ కాలం పనిచేసిందెవరు?
   ఎ) భవనం వెంకట్రామ్ రెడ్డి
   బి) టి. అంజయ్య
   సి) నాదెండ్ల భాస్కర్‌రావు
   డి) ఎన్. జనార్దన్ రెడ్డి
21. ఆంధ్ర రాష్ట్ర మొదటి ఉప ముఖ్యమంత్రి?
   ఎ) కె.వి.రంగారెడ్డి బి) సుబ్బారెడ్డి
   సి) నీలం సంజీవరెడ్డి డి) కళా వెంకట్రావ్
22. కింది వారిలో ఎవరిని గవర్నర్ నియమించరు?
   ఎ) రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్
   బి) రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్
   సి) రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్
   డి) అడ్వకేట్ జనరల్
23. రాష్ట్ర మంత్రివర్గ ఏర్పాటు, శాఖల కేటాయింపు గురించి తెలిపే అధికరణ?
   ఎ) అధికరణ - 74 బి) అధికరణ - 164
   సి) అధికరణ -165 డి) పైవేవీ కాదు
24. రాష్ట్ర మంత్రి మండలికి సంబంధించినది?
   ఎ) కనీస సభ్యుల సంఖ్య 10, గరిష్ఠం 30
   బి) కనీసం-12 మంది, గరిష్ఠం- ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం
   సి) ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మించరాదు
   డి) పైవన్నీ
25. ఎవరి విశ్వాసం కోల్పోయినప్పుడు ఒక రాష్ట్ర మంత్రిని రాజీనామా చేయమని కోరవచ్చు?
   ఎ) రాష్ట్ర శాసనసభ బి) గవర్నర్
   సి) ముఖ్యమంత్రి డి) ప్రధాన కార్యదర్శి
26. రాష్ట్ర సచివాలయ అధిపతి ఎవరు?
   ఎ) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
   బి) గవర్నర్
   సి) ముఖ్యమంత్రి డి) పై ఎవరూ కాదు
27. విధాన పరిషత్ రద్దు, తిరిగి ఏర్పాటు గురించి ఏ అధికరణ తెలుపుతుంది?
   ఎ) అధికరణ-167 బి) అధికరణ - 169
   సి) అధికరణ-170 డి) అధికరణ - 175
28. ప్రస్తుతం ద్విసభ విధానం ఉన్న రాష్ట్రాల సంఖ్య?
   ఎ) ఐదు బి) ఆరు
   సి) ఏడు డి) ఎనిమిది
29. విధాన పరిషత్‌కు సంబంధించి సరైంది?
   ఎ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ విరామకాలం 25 ఏళ్లు
   బి) ప్రస్తుత తెలంగాణ విధాన పరిషత్ సభ్యుల సంఖ్య - 40
   సి) ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుల సంఖ్య - 58
   డి) పైవన్నీ
30. అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో విధానసభ సభ్యుల సంఖ్య?
   ఎ) 233 బి) 243 సి) 245 డి) 292
31. ఇంటర్నెట్ వినియోగంలో మొదటిస్థానం ఆక్రమించిన దేశం?
   ఎ) భారత్ బి) అమెరికా
   సి) బ్రిటన్ డి) చైనా
32. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విధానసభకు మధ్యంతర ఎన్నికలు ఎన్నిసార్లు జరిగాయి?
   ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
33. ఆంధ్రప్రదేశ్ మొదటి మహిళా స్పీకర్?
   ఎ) శమంతకమణి బి) కల్పనాదేవి
   సి) ప్రతిభా భారతి
   డి) పద్మా దేవేందర్ రెడ్డి
34. హైదరాబాద్ రాష్ట్ర ఏకైక స్పీకర్ ఎవరు?
   ఎ) మాడపాటి హన్మంతరావు
   బి) సరోజిని పుల్లారెడ్డి
   సి) కాశీనాథరావు వైద్య
   డి) కొండా లక్ష్మణ్ బాపూజీ
35. కింది వాటిలో రాష్ట్ర శాసనసభకు లేని అధికారం ఏది?
   ఎ) శాసన అధికారం
   బి) కార్య నిర్వాహక అధికారం
   సి) రాజ్యాంగ అధికారం
   డి) న్యాయ అధికారం
36. దేశంలో మొదటిసారిగా ఏ రాష్ట్ర శాసనసభను 'పేపర్‌లెస్' కార్యాలయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది?
   ఎ) గుజరాత్ బి) ఆంధ్రప్రదేశ్
   సి) మధ్యప్రదేశ్ డి) ఉత్తరప్రదేశ్
37. కిందివాటిలో ఏది సుప్రీంకోర్టు, హైకోర్టుల అధికార పరిధిలోకి వస్తుంది?
   ఎ) కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
   బి) రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
   సి) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
   డి) ఆదేశిక సూత్రాల పరిరక్షణ
38. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎవరు నియమిస్తారు?
   ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
   బి) న్యాయశాఖ మంత్రి
   సి) రాష్ట్రపతి డి) గవర్నర్
39. హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించేది?
   ఎ) గవర్నర్ బి) పార్లమెంట్
   సి) రాష్ట్ర ప్రభుత్వం డి) భారత రాష్ట్రపతి
40. షాబానో కేసు దేనికి సంబంధించింది?
   ఎ) జీవించే హక్కు
   బి) ఉమ్మడి పౌరస్మృతి
   సి) ఆస్తి హక్కు
   డి) నిర్బంధ విద్య
41. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన న్యాయ సలహాదారు ఎవరు?
   ఎ) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
   బి) గవర్నర్ సి) అడ్వకేట్ జనరల్
   డి) న్యాయశాఖ మంత్రి
42. హైకోర్టు న్యాయమూర్తుల పెన్షన్ ఎక్కడి నుంచి చెల్లిస్తారు?
   ఎ) కేంద్ర సంఘటిత నిధి
   బి) రాష్ట్ర సంఘటిత నిధి
   సి) రాష్ట్ర ఆగంతుక నిధి డి) పైవేవీకావు
43. కిందివాటిలో సరైంది?
   ఎ) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొదటి ప్రధానన్యాయమూర్తి - కె.సుబ్బారావు
   బి) దేశంలో హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి - లీలాసేథ్
   సి) దేశంలో స్థాపించిన మొదటి హైకోర్టు - కలకత్తా హైకోర్టు
   డి) పైవన్నీ
44. హైకోర్టులకు సంబంధించి సరికానిది?
   ఎ) రాజస్థాన్ హైకోర్టు జోధ్‌పూర్‌లో ఉంది
   బి) ఉత్తరప్రదేశ్ హైకోర్టు లక్నోలో ఉంది
   సి) ఉత్తరాఖండ్ హైకోర్టు నైనిటాల్‌లో ఉంది
   డి) ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ఉంది
45. ఇ-కోర్టులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
   ఎ) గుజరాత్ బి) హిమాచల్ ప్రదేశ్
   సి) కేరళ డి) తెలంగాణ
46. జాతీయ సమాచార కేంద్రాన్ని ఎప్పుడు నెలకొల్పారు?
   ఎ) 1976 బి) 1980 సి) 1984 డి) 2002

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) సి; 4) డి; 5) బి; 6) బి; 7) ఎ; 8) బి; 9) సి; 10) డి; 11) బి; 12) సి; 13) సి; 14) డి; 15) ఎ; 16) సి; 17) బి; 18) డి; 19) సి; 20) సి; 21) సి; 22) సి; 23) బి; 24) బి; 25) సి; 26) ఎ; 27) బి; 28) సి; 29) డి; 30) బి; 31) బి; 32) ఎ; 33) సి; 34) సి; 35) డి; 36) బి; 37) సి; 38) సి; 39) డి; 40) బి; 41) సి; 42) ఎ; 43) డి; 44) బి; 45) ఎ; 46) ఎ;

కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. భారత్‌తో అత్యధిక భూసరిహద్దును పంచుకుంటున్న దేశం ఏది?
   1) చైనా 2) నేపాల్
   3) పాకిస్తాన్ 4) బంగ్లాదేశ్
2. కర్కాటక రేఖ (23½° ఉత్తర అక్షాంశం) కింద పేర్కొన్న ఏ రాష్ట్రం ద్వారా వెళ్లదు?
   1) మిజోరాం 2) త్రిపుర
   3) మేఘాలయ 4) జార్ఖండ్
3. సింధూనదిని 'ఇండస్' అని ఎవరు పిలిచారు?
   1) పర్షియన్లు 2) గ్రీకులు
   3) డచ్‌వారు 4) ఫ్రెంచ్‌వారు
4. భారతదేశ ఉత్తర, దక్షిణ చివరల మధ్య దూరం ఎంత?
   1) 3,214 కి.మీ. 2) 2,933 కి.మీ.
   3) 1,324 కి.మీ. 4) 3,514 కి.మీ.
5. 82½° తూర్పు రేఖాంశం ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళుతోంది?
   1) 6 2) 7 3) 8 4) 5
6. రాడ్‌క్లిఫ్ రేఖ ఏ దేశాల మధ్య సరిహద్దుగా ఉంది?
   1) భారత్ - పాకిస్తాన్
   2) భారత్ - చైనా
   3) భారత్ - మయన్మార్
   4) భారత్ - బంగ్లాదేశ్
7. పాంబన్ దీవి వేటి మధ్య ఉంది?
   1) భారత్ - శ్రీలంక
   2) భారత్ - మాల్దీవులు
   3) భారత్ - ఇండోనేషియా
   4) భారత్ - మారిషస్
8. కింద పేర్కొన్న ఏ రాష్ట్రాలకు తీరరేఖ, విదేశాలతో భూ సరిహద్దు ఉన్నాయి?
   1) గుజరాత్, మహారాష్ట్ర
   2) గుజరాత్, పశ్చిమబెంగాల్
   3) పశ్చిమబెంగాల్, త్రిపుర
   4) పశ్చిమబెంగాల్, తమిళనాడు
9. లక్షదీవుల రాజధాని ఏది?
   1) సిల్వస్సా 2) పోర్ట్‌బ్లెయిర్
   3) కవరత్తి 4) పాండిచ్చేరి
10. మలబార్ తీరం ఏ రాష్ట్రానికి ఉంది?
   1) గోవా 2) మహారాష్ట్ర
   3) కేరళ 4) ఒడిశా
11. 'డంకన్ పాస్' వేటి మధ్య ఉంది?
   1) ఉత్తర అండమాన్, తూర్పు అండమాన్
   2) అండమాన్, నికోబార్ దీవులు
   3) ఉత్తర అండమాన్, దక్షిణ అండమాన్
   4) గ్రేట్ అండమాన్, లిటిల్ అండమాన్
12. భారతదేశంలోని మొత్తం దీవుల (Distant Islands) సంఖ్య?
   1) 240 2) 247 3) 204 4) 194
13. ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
   1) జోంగ్‌మా 2) కోమలాంగిని
   3) సాగరమాత 4) చోగారీ
14. మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) ఉత్తరాఖండ్ 2) నాగాలాండ్
   3) అరుణాచల్ ప్రదేశ్ 4) బీహార్
15. భారతదేశంలో ఎత్తైన కనుమ ఏది?
   1) బుర్జిలా 2) కారకోరం
   3) ఖార్దుంగ్లా 4) జోజిలా
16. పీర్ పంజాల్, దౌలాధార్ పర్వత శ్రేణులు ఎక్కడ ఉన్నాయి?
   1) హిమాద్రి హిమాలయాలు
   2) హిమాచల్ హిమాలయాలు
   3) శివాలిక్ కొండలు
   4) ట్రాన్స్ హిమాలయాలు
17. భారతదేశంలో అతిపెద్ద నదీ ఆధారిత దీవి ఏది?
   1) గోవిందసాగర్ 2) మజులీ
   3) బైసాలా 4) ఏదీకాదు
18. సాత్పురా పర్వతాల్లో ఎత్తైన శిఖరం ఏది?
   1) అమర్ కంటక్ 2) మైకుల
   3) పంచమర్హి 4) ధవళగిరి
19. హిమాలయాలు ఏ యుగంలో ఆవిర్భవించాయి?
   1) ప్లిస్టోసీన్ 2) టెర్షియోరరీ
   3) కేంబ్రియన్ 4) ఏదీకాదు
20. సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) అమృత్‌సర్ 2) సిమ్లా
   3) డెహ్రాడూన్ 4) త్రివేండ్రం
21. కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?
   1) యాలకుల కొండలు
   2) పళని కొండలు
   3) బాబా బుడాన్ గిరికొండలు
   4) తమిళనాడు కొండలు
22. మహేంద్రగిరి శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
   1) వింధ్య 2) సాత్పురా
   3) పశ్చిమ కనుమలు
   4) తూర్పు కనుమలు
23. ముంబై - నాసిక్‌ను కలిపే కనుమ ఏది?
   1) థాల్‌ఘాట్ 2) బోర్‌ఘాట్
   3) పాల్‌ఘాట్ 4) కలహట్టి
24. సాడిల్ పీక్ ఎక్కడ ఉంది?
   1) నికోబార్ దీవులు
   2) అండమాన్ దీవులు
   3) సుహేలి దీవులు
   4) మినికాయ్ దీవులు
25. 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ' ఎక్కడ ఉంది?
   1) చెన్నై 2) పనాజీ
   3) బెంగళూరు 4) కొచ్చిన్
26. 'గ్రీష్మ రుతువు' కాలం ఏది?
   1) మార్చి, ఏప్రిల్ 2) మే, జూన్
   3) జూలై, ఆగస్టు
   4) సెప్టెంబర్, అక్టోబర్
27. భారత వాతావరణ పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?
   1) కోల్‌కతా 2) హైదరాబాద్
   3) పుణే 4) బెంగళూరు
28. అధిక వర్షపాతం సంభవించే 'మాసిన్ రామ్' ఏ రాష్ట్రంలో ఉంది?
   1) మణిపూర్ 2) అసోం
   3) నాగాలాండ్ 4) మేఘాలయ
29. జాతీయ వరద నియంత్రణ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1956 2) 1975
   3) 1954 4) 1974
30. భారతదేశంలో ఎత్తైన జలపాతం ఏది?
   1) దూద్‌సాగర్ 2) జోగ్
   3) రకిమ్‌కుండ్ 4) కుంతల
31. కాలబైశాఖీలు అనే రుతుపవన ఆరంభ జల్లులు ఏ రాష్ట్రంలో కురుస్తాయి?
   1) ఉత్తరప్రదేశ్ 2) పశ్చిమబెంగాల్
   3) అసోం 4) కేరళ
32. లానినో, ఎల్‌నినోలు ఎక్కడ సంభవిస్తాయి?
   1) హిందూ మహాసముద్రం
   2) పసిఫిక్ మహాసముద్రం
   3) అట్లాంటిక్ మహాసముద్రం
   4) బంగాళాఖాతం
33. భారతదేశంలో అత్యధికంగా వర్షపాతాన్నిచ్చే రుతుపవనాలు ఏవి?
   1) ఆగ్నేయ రుతుపవనాలు
   2) వాయువ్య రుతుపవనాలు
   3) నైరుతి రుతుపవనాలు
   4) ఈశాన్య రుతుపవనాలు
34. ఈశాన్య రుతుపవనాల వల్ల అధికంగా వర్షపాతం పొందే రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు
35. విస్తీర్ణపరంగా అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
   1) మధ్యప్రదేశ్ 2) ఛత్తీస్‌గఢ్
   3) మిజోరాం 4) ఉత్తరప్రదేశ్
36. తీర ప్రాంతాల్లో అత్యధికంగా తుపాన్లకు గురయ్యే రాష్ట్రం ఏది?
   1) తమిళనాడు 2) ఒడిశా
   3) గోవా 4) అసోం
37. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఏది?
   1) లఢక్ 2) బికనీర్
   3) లే 4) జైసల్మీర్
38. మనదేశంలో అధిక విస్తీర్ణంలో ఉన్న అడవులు ఏవి?
   1) క్షారజల అరణ్యాలు
   2) సతతహరిత అరణ్యాలు
   3) ఆకురాల్చే అడవులు 4) చిట్టడవులు
39. దచిగామ్ దుప్పి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తరాంచల్ 2) జమ్ము-కశ్మీర్
   3) బీహార్ 4) హిమాచల్ ప్రదేశ్
40. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
   1) మార్చి 21 2) మార్చి 22
   3) మార్చి 29 4) మార్చి 24
41. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1992 2) 1991 3) 1990 4) 1994
42. మనదేశంలో మొదటి టైగర్ రిజర్వ్ కేంద్రం ఏది?
   1) కజిరంగా 2) బందీపూర్
   3) నామ్‌దఫా 4) సిమిపాల్
43. భారతదేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఉన్న నేలలేవి?
   1) చిత్తడి నేలలు 2) ఒండలి నేలలు
   3) నల్ల నేలలు 4) ఎర్ర నేలలు
44. సాయిల్ అండ్ ల్యాండ్ యూజ్ సర్వే ఆఫ్ ఇండియాను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1951 2) 1954
   3) 1958 4) 1960
45. కేంద్రీయ అటవీ నేలల పరిశోధన సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) బళ్లారి 2) కోటా
   3) పసద్ 4) ఊటీ
46. చేతివేళ్ల ఆకారంలో జరిగే క్రమక్షయాన్ని ఏమంటారు?
   1) పట క్రమక్షయం 2) వంక క్రమక్షయం
   3) అవనాళికా క్రమక్షయం
   4) వాలు క్రమక్షయం
47. వరి పంటను ఏ మృత్తికల్లో అత్యధికంగా పండిస్తారు?
   1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
   3) నల్లరేగడి నేలలు 4) జేగురు నేలలు
48. వేదకాలంలో 'చంద్రభాగ'గా పేర్కొన్న నది ఏది?
   1) రావి 2) చినాబ్
   3) బియాస్ 4) సట్లేజ్
49. బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
   1) మజిలీ 2) పద్మా
   3) మేఘన 4) ఐరావతి
50. 'దక్షిణ గంగ' అని ఏ నదిని పిలుస్తారు?
   1) నర్మద 2) తపతి
   3) గోదావరి 4) కృష్ణా
51. రామ్‌గంగ తీరంలో ఉన్న కాంస్య నగరం ఏది?
   1) ఉజ్జయినీ 2) రూర్కెలా
   3) మొరాదాబాద్ 4) ఫిరోజ్‌పూర్
52. 'కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
   1) రాజస్థాన్ 2) గుజరాత్
   3) ఉత్తరప్రదేశ్ 4) తమిళనాడు
53. దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
   1) సాంబర్ 2) ఊలార్
   3) చిల్కా 4) లోక్‌తక్
54. బాగ్లీహార్ ప్రాజెక్ట్ విషయంలో భారత్‌కు ఏ దేశంతో వివాదం ఉంది?
   1) నేపాల్ 2) చైనా
   3) బంగ్లాదేశ్ 4) పాకిస్తాన్
55. బాబ్లీ ప్రాజెక్టు ఏ రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైంది?
   1) కర్ణాటక -ఆంధ్రప్రదేశ్
   2) మహారాష్ట్ర - తెలంగాణ
   3) తమిళనాడు -కర్ణాటక
   4) కేరళ - తమిళనాడు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 1; 5) 4; 6) 1; 7) 1; 8) 2; 9) 3; 10) 3; 11) 4; 12) 2; 13) 3; 14) 3; 15) 3; 16) 2; 17) 2; 18) 3; 19) 2; 20) 3; 21) 2; 22) 4; 23) 2; 24) 2; 25) 2; 26) 2; 27) 3; 28) 4; 29) 3; 30) 2; 31) 2; 32) 2; 33) 3; 34) 4; 35) 1; 36) 2; 37) 4; 38) 3; 39) 2; 40) 1; 41) 1; 42) 2; 43) 4; 44) 3; 45) 4; 46) 2; 47) 2; 48) 2; 49) 3; 50) 3; 51) 3; 52) 4; 53) 2; 54) 4; 55) 2.

నిజాం దానంగా ఇచ్చిన భూములే జాగీర్లు..

భూసంస్కరణల ఆవశ్యకత - కారణాలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం, రాష్ట్రంలోనూ వ్యవసాయ రంగంలో భూ సంస్కరణల పేరుతో భూ సంబంధాలు, వ్యవసాయక నిర్మాణంలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి అనేక కారణాలున్నాయి.

రాష్ట్రంలో భూ సంస్కరణలను ప్రధానంగా రెండు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటి దశ 1947 నుంచి 1970 వరకు, రెండోదశ 1970 తర్వాత వచ్చిన భూ సంస్కరణలుగా పేర్కొనవచ్చు.

మొదటిదశ (1947–1970): భూ సంస్కరణలు రావడానికి మూడు అంశాలు ప్రధాన పాత్ర వహించాయని చెప్పొచ్చు.

1. **వ్యవస్థాపూర్వక అంశాలు:** ఇందులో భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ కేంద్రీకరణ మొదలైనవి ఉన్నాయి.
2. **రాజకీయ అంశాలు:** జాతీయస్థాయిలో అఖిల భారత కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానాలు, విధానాలు.
3. **రైతాంగ ఉద్యమాలు:** ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం పోరా టం చేసింది. ఉదా: 1920లో విస్నూరు దేశ్ ముఖ్‌కు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటం.

భారతదేశ రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైతాంగ పోరాటాలే విప్లవాత్మకమైనవని కొందరు భావి స్తే, మరికొందరు తెలంగాణ పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందిగా పేర్కొంటారు.

I. వ్యవస్థాపూర్వక అంశాలు

రాష్ట్రంలో వ్యవస్థాపూర్వకమైన అంశాల్లో భూస్వామ్య వ్యవస్థలు, కౌలు విధానాలు, భూమి కేంద్రీకరణ మొదలైనవన్నీ వ్యవసాయ రంగం అభివృద్ధికి నిరోధంగా ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ (1956) కు ముందు తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రా ప్రాంతం 1953 అక్టోబర్ 1 వరకు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని భూస్వామ్య పద్ధతుల్లో కొంత సారూప్యం ఉన్నప్పటికీ వీటిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వేర్వేరుగా అధ్యయనం చేయడం ఉత్తమం.

- భారతదేశంలో బ్రిటిష్, నైజాం ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన భూస్వామ్య పద్ధతులు రెండూ అభివృద్ధి నిరోధకాలే.
- తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన జాగీర్దారీ లేదా జమీందారీ, రైత్వారీ మొదలైన పద్ధతులు వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడకపోగా స్తబ్ధతకు దారితీశాయి.





గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఎకానమీ

- జమీందారీ, రైత్వారీ పద్ధతులు రెండూ బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయక విప్లవ రూపాలు. ఇవి ఒకదానికొకటి విరుద్ధమైనవిగా కార్ల్ మార్క్స్ గుర్తించారు. జమీందారీ విధానం పెత్తందారీ వ్యవస్థ కాగా, రైత్వారీ విధానాన్ని ప్రజాతంత్ర వ్యవస్థగా పేర్కొన్నారు.
- జమీందారీ విధానం బ్రిటిష్ భూస్వామ్య వ్యవస్థకు, రైత్వారీ విధానం ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు. కానీ ఈ రెండు పద్ధతులు హానికరమైనవేనని గుర్తించాలి. ఇవి రెండూ పరస్పర విరుద్ధ అంశాల మేళవింపుతో రూపొందాయి.
- ఈ పద్ధతులు భూమిని దున్నే రైతు, భూయజమానుల ప్రయోజనాలకు ఉద్దేశించినవి కావు. భూములపై పన్ను వేసి, ప్రభుత్వానికి ఉపయోగపడే సాధనాలుగా గుర్తించారు.

హైదరాబాద్ రాష్ట్రంలో భూస్వామ్య విధానాలు

- హైదరాబాద్ రాష్ట్రం నిజాం పరిపాలనలో ఉండేది. వీరి కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలుండేవి. అవి సంస్థానాలు, జాగీర్లు, ఇనాంలు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ విధానాలు ముఖ్యమైనవి.

1. జాగీర్లు

నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి లేదా ఆ వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టడానికి దానపూర్వకంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు. వీటిలో అనేక రకాలైన జాగీర్లుండేవి. కొన్ని నిజాంకు కొంత బాటకం చెల్లించాల్సినవి. కొన్ని భాటకం చెల్లించనవసరం లేని జాగీర్లు.

2. ఇనాందారులు

- హైదరాబాద్ ప్రాంతంలో కొన్ని విధులను నిర్వహించినందుకు పారితోషికంగా ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇనాం భూములంటారు.
- ఈ భూముల నుంచి వచ్చే భూమి శిస్తును పొందే హక్కు పూర్తిగానో, పాక్షికంగానో ఇనాందారుడికి సంక్రమిస్తుంది.
- ఉద్యోగులు, సమాజానికి సేవలు అందించిన వారికి కూడా ఇనాం భూములు ఇచ్చేవారు.
- దేవాలయాలు, ధర్మాలయాల నిర్వహణ కూ ఇనాంలు ఇచ్చేవారు.
- హైదరాబాద్ సంస్థానంలో మొత్తం ఇనాందారుల సంఖ్య 82,000 కాగా వీరిలో 57,000 మంది దివానీప్రాంతంలో ఉండగా 26000 మంది జాగీరు ప్రాంతంలో ఉండే వారు. వీరి ఆధీనంలో సుమారు 8 లక్షల ఎకరాల భూమి ఉండేది. వీటిలో కూడా అనేక రకాలైన ఇనాంలు ఉండేవి.

ఉదా: అరాజమక్తా, అరాజ అగ్రహార్, మజరాను బేసరి ఇనాం, బలవతా ఇనాం, నీరడి ఇనాం, చిధుమతి ఇనాం మొదలైనవి.

3. సర్ఫేఖాస్

- సర్ఫేఖాస్ భూములు నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. వీటి నుంచి వచ్చే ఆదాయం లేదా భాటకం నిజాం ఖజానాకు వెళ్లేది. ఈ భూములు 5,682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1,374 గ్రామాల్లో వ్యాపించి ఉండేవి.

4. ఖల్సా/దివానీ/రైత్వారీ పద్ధతి

- ఈ పద్ధతి హైదరాబాద్ ప్రాంతంలోని 60 శాతం విస్తీర్ణంలో ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద ఉండేది. ప్రభుత్వ యంత్రాంగమే శిస్తు వసూలు చేసేది.
- ప్రభుత్వ యంత్రాంగమే శిస్తును వసూలు చేసే ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో ఉండే భూమిని ఖలీసా భూమి అంటారు.
- దివానీ భూములు సర్ఫేఖాస్ భూముల్లో భాగాలే.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ పద్ధతిని మొదటి సాలార్‌జంగ్ 1875లో ప్రవేశపెట్టారు.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి (1875) ముందు ఖల్సా/దివానీ భూముల్లో దళారీలు ఉండేవారు.

పామిగా జమీయత్

- పామిగా అంటే గుర్రాలను కట్టేసే స్థలం
- సైన్యానికి అవసరమైన గుర్రాలను పోషించడానికి ప్రతిఫలంగా ఇచ్చే జాగీర్లు.

జాత్

- విస్తృతమైన ప్రాంతాల్లో సేవ చేసినందుకు ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చిన జాగీర్లు

అవతమామ్

- శిస్తు చెల్లించకుండానే వంశ పారంపర్యం గా వచ్చే హక్కులు ఉన్న జాగీర్లు

తనఖా

- జీతానికి బదులుగా ఇచ్చే జాగీర్లు

మాదద్ మాష్

- ఉద్యోగుల పోషణకు జీతానికి తోడుగా ఇచ్చే జాగీర్లు

మసురూది

- మత, సైనిక, పౌర సంబంధమైన సేవ చేసే షరతులపై ఇచ్చే జాగీర్లు
- పై విధంగా అనేక రకాలైన జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్లు హైదరాబాద్‌లో 6535 గ్రామాల్లో 40,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. 1922లో జాగీర్ల సంఖ్య 1,167 కాగా, 1949 నాటికి 1500 వరకు పెరిగింది.

5. సంస్థానాలు

- హైదరాబాద్ ప్రాంతంలో మొదటి నుంచి అనేక చిన్న చిన్న ప్రాంతాలకు హిందూ రాజులు అధిపతులుగా ఉండేవారు. నిజాం వీరి హక్కులను అంగీకరించడానికి వీరు ఏటా నిజాంకు 'పేష్కష్' పేరుతో నిర్ణీతమైన డబ్బు చెల్లించాలి. వీరికి ఆయా ప్రాంతాల్లో విస్తృతమైన పరిపాలనా అధికారాలుండేవి.
- హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 14 సంస్థానాలు ఉన్నప్పటికీ, వీటిలో ఐదు ప్రధానమైనవి. అవి
  1) గద్వాల్ (అతి పెద్దది)
  2) వనపర్తి 3) జటప్రోలు
  4) అమరచింత 5) పాల్వంచ.
- ఈ ఐదు సంస్థానాల్లో పరిపాలన అంతా సంస్థానాధీశులదే. వీరి ఆధీనంలో 497 గ్రామాలు, 5,030 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. వీరికి సర్‌బస్తా, పాన్‌మక్తా, ఇజారా అనే మధ్యవర్తులుండేవారు.

సర్‌బస్తా: వేలంపాట ద్వారా శిస్తు వసూలు చేసుకునే హక్కును పొందినవారు.

పాన్‌మక్తా: స్థిరమైన కౌలును చెల్లించేవారు.

ఇజారా భూములు: నిర్మానుష్యమైన గ్రామాల్లోని భూములు. ఇక్కడ పునరావాసం ఉండే వారికి తక్కువ కౌలు చెల్లించే వెసులుబాటు ఉండేది.

- ప్రాంతీయంగా ఉండే వీరినే దేశ్‌ముఖ్, సర్ దేశ్‌ముఖ్, దేశాయ్, సర్‌దేశాయ్, దేశ్‌పాండేలుగా పిలిచేవారు. వీరికి శిస్తు వసూలు చేసే అధికారం ఉండటం వల్ల అనేక మార్గాల ద్వారా వేల ఎకరాలు తమ పేరున రాసుకొని 1875 తర్వాత ఖల్సా / దివానీ ప్రాంతాల్లో అతిపెద్ద భూస్వామ్యులుగా చెలామణి అయ్యారు.
- పై భూస్వామ్య విధానాలన్నింటిలోనూ జాగీర్దార్లు, ఇనాందార్లు, సంస్థానాధీశులు చివరకు భాటకాన్ని పొందే ఖల్సా ప్రాంతంలోని పెద్ద భూస్వాములందరూ భాటకాన్ని పొందే అనుపస్థితి (అబ్సెంటీ ల్యాండ్‌లార్డ్స్) భూస్వాములుగా మారారు. వీరి సంఖ్య 1891లో లక్ష ఉండగా 1921 నాటికి 7.6 లక్షలకు పెరిగింది.
- ఈ ప్రాంతంలో భాటకం వసూలు చేసేవారు వ్యవసాయాభివృద్ధి కంటే కౌలును పెంచుకునే మార్గాలను అన్వేషించేవారు.
- భూమి శిస్తును ఉత్పత్తితో సంబంధం లేకుండా పెంచడం, కౌలు గడువు పెంచుకోవాలన్నా కొత్తగా సేద్యం చేసుకోవడానికి భూమిని తీసుకోవాలన్నా వీరికి 'నజరానాలు' (బహుమతులు) చెల్లించాల్సి వచ్చేది.
- భూమిశిస్తుతోపాటు ఇంటి పన్ను, వృత్తిపన్ను, మగ్గపు పన్ను..ఇలా అనేక అక్రమ పన్నులు నిర్బంధంగా వసూలు చేసేవారు.
- వీరి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా రైతులు, కౌలుదారులు విధిగా చేసే వెట్టి చాకిరీ తోపాటు కట్నాలు, కానుకలు చెల్లించేవారు.
- ఫలవృక్షాలు, చింతచెట్లు మొదలైనవి జాగీర్దార్ల ఆస్తిగా భావించేవారు.
- వీరి దోపిడీ హైదరాబాద్ ప్రాంతంలో చాలా ఎక్కువగా ఉండేది. హైదరాబాద్ సంస్థాన రెవెన్యూ ఆదాయం రూ. 8 కోట్లు కాగా హైదరాబాద్ ప్రాంతంలోని 110 మంది జమీందార్ల ఆదాయం రూ. 10 కోట్లు ఉండేది.
- నిజాం జారీ చేసిన ఫర్మానాలో 82 రకాలైన అక్రమ నిర్బంధ వసూళ్లు ఉండేవని తెలుస్తుంది.
- కులమతాలు, వయసు, లింగ భేదాలతో సంబంధం లేకుండా అందరూ వెట్టి చాకిరీ చేయడం ఈ ప్రాంతం అంతటా ఉండేది.
- అత్యధికమైన భూ కేంద్రీకరణ, అధికార బలం, ఆర్థికబలం, అంగబలం వల్ల ఫ్యూడల్ దోపిడీ నిరాటంకంగా కొనసాగింది. దీంతో పాటు వడ్డీవ్యాపారం, నిర్బంధ లేవీ పద్ధతి, ఆర్థికమాంద్యం మొదలైనవాటితో రైతాంగం పూర్తిగా కుంగిపోయింది. రైతాంగం కౌలుదారులు, వ్యవసాయ కూలీలు మారడమో, వలస వెళ్లడమో జరిగింది.

కౌలుదారీ విధానాలు

- హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతంలోనూ భూస్వామ్య పద్ధతుల్లో ఉండే లోపాల వల్ల భాటకం వసూలు చేసేవారి సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల కౌలుదారీ సంబంధాలు ఉండడం సర్వ సాధారణ విషయంగా మారింది.

హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు విధానాలు

- హైదరాబాద్ సంస్థానంలో 1354 ఫసలీ (1944)లో ఆసామీ షక్మీ చట్టం అమలులోకి వచ్చే నాటికి రెండు రకాలైన కౌలుదార్లు ఉండే వారు.

షక్మీదారులు: వీరే శాశ్వత కౌలుదారులు. కౌలుదారునికి రక్షణ, భూమిని సాగు చేసుకునే హక్కులు ఉన్న వారే షక్మీదారులు.

ఆసామీ షక్మీదారులు: వీరు ఏ హక్కులు లేని కౌలుదారులు. ఆసామీ షక్మీదారులు కౌలుభూమిని 12 ఏళ్ల తన స్వాధీనంలో ఉంచుకోగలిగినప్పుడు షక్మీదారులుగా గుర్తింపు లభించేది. కానీ హైదరాబాద్ సంస్థానం వంటి ఫ్యూడల్ వ్యవస్థలో ఏ హక్కులు లేని కౌలుదారుడు పన్నెండేళ్లు కౌలు భూమిని తన స్వాధీనంలో ఉంచుకోవడం జరగదు. ఒకవేళ పన్నెండేళ్లు ఒకే భూమిని కౌలు పద్ధతిలో సాగు చేస్తున్నప్పటికీ దాన్ని రుజువు చేసుకోవడం అంత సులభం కాదు. దీంతో కౌలుదారులందరూ ఆసామి షక్మీదారులు (రక్షణలేని కౌలుదారులు)గానే ఉండేవారు.

Who amongst the five types the fastest?

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "β64@%". How is "DELAY" written in that code?
   1) β4H2% 2) β4@2%
   3) %42@β 4) %4@2β
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin 2) Nephew 3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:

394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783 3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394 3) 576
   4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79 3) 77
   4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger



BANK EXAMS

REASONING

9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
    1) M is the brother-in-law of Q
    2) M is the uncle of Q
    3) M is the son-in-law of Q
    4) Q is the mother-in-law of M
    5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

R D A K 5 B I 2 M J E N 9 7
U Z V 1 W 3 H 4 F Y 8 P 6 T G

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
    1) M 2) J 3) 8
    4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
    1) E 9 J 2) Z 1 U 3) H W 4
    4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
    1) 5 2) Z 3) V
    4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
    I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
    II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
    I) P is heavier than M and T.
    II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
    I) "5 $ # 3" means "flowers are really good".
    II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
    I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
    II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	*	©	β	6	4	%

∴ DELAY ⇒ %4@2β

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 ⇒ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.

```
                Q
                |
M(+) ⇔ N(–)<—>P(–)
```

11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
    Mohan = 17^{th} from right
    ∴ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్, బెంగళూరులో 43 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

బెంగళూరులోని సీఎస్ఐఆర్-నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్(ఎన్ఏఎల్) టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 43.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, మెకానికల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, సివిల్, మెటలర్జీ), బీఎస్సీ (మల్టీ మీడియా యానిమేషన్, ఫిజిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 11.04.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2025.
» **వెబ్‌సైట్:** https://-www.nal.res.in/

ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్‌లో పైలట్ పోస్టులు

నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) ఒప్పంద ప్రాతిపదికన పైలట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 35 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
» **వెబ్‌సైట్:** https://www.nhsrcl.in/

నిట్ వరంగల్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **అర్హత:** బీటెక్(ఈసీఈ), ఎంటెక్(ఆర్ఎఫ్) ఉత్తీర్ణతతో పాటు గేట్ క్వాలిఫికేషన్ ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా
» **ఈమెయిల్:** g.arun@nitw.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.04.2025.
» **వెబ్‌సైట్:** https://nitw.ac.in/